
C

# విజ్ఞాన నేపథ్య గాథలు

డా॥ వక్కలంక వెంకటరమణ



Blank page

# విజ్ఞాన నేపథ్య గాథలు

అపారమైన జ్ఞానసంపదను తనలో
ఇముడ్చుకున్నా, నిగర్విగా, శ్రీకృష్ణపరమాత్మకే
తన జీవితం అంకితం చేసుకుని, నాట్యశాస్త్రపు
పుటలను, లేక చలనచిత్ర చరిత్రను, ఇట్టే
క్షణాల మీద వల్లించగలిగిన ప్రతిభామంతులు,
ఆంగ్ల భాష, తెలుగు భాషలలో తన
ప్రావీణ్యత, ప్రత్యేకతను అడుగడుగునా
దేశవిదేశ పత్రికలలో

**డా॥ వక్కలంక వెంకటరమణ**

పలువురు అనవరతంగా, వ్రాయగలిగిన

శ్రీ వి.ఎ.కె. రంగారావు గారికి,

కీ॥ శే॥ నా తల్లిదండ్రులకు ప్రీతిపాత్రులైన వారు
పూజ్యులు... తడుముకోకుండా
ఒప్పుకుని, 'బయదీపం' రాసిచ్చిన భాగవతోత్తముల్ని
మా కుటుంబసభ్యులలో ఎన్నటికీ
ఒకరిగా భావిస్తూ, వారికి నా హృదయ
పూర్వక ధన్యవాదములర్పిస్తూ, పాదాభి-
వందనములతో-

**సాహితి**

ఈ పుస్తకం సమర్పిస్తూ..

October 25, 2015

# విజ్ఞాన నేపథ్య గాధలు

**డా॥ వక్కలంక వెంకటరమణ**
బెంగుళూరు
సెల్ : 094812 42701

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2015

మూల్యం : **60/-**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ కర్త :
**సాహితి ప్రచురణలు**
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట,
విజయవాడ - 520 002.
ఫోన్ : 0866-2436642/43, 8121098500
e-mail: sahithi.vja@gmail.com

# అంకితం

అనుక్షణం నన్ను కంటికి రెప్పలా కాపాడుతూ సహధర్మచారిణిగానే కాకుండా, ఒక డాక్టరుగా, ఒక భార్యగా, స్నేహితురాలిగా, నన్నే నమ్ముకుని జీవితం సాఫీగా వెళ్ళబుచ్చుతున్న **డా॥సీత** MBBS కు, "మా ప్రేమకు ముగింపు ఎన్నడూలేదని" గాఢంగా నమ్ముతూ త్రికరణ శుద్ధిగా, మనసా, వాచా, కర్మేణః అని అగ్నిచుట్టూ ప్రదక్షిణలు చేసి ఆమెకి నాచేయూతనిచ్చి చేసిన పెళ్ళినాటి ప్రమాణాలు ప్రతిక్షణం ఆచరిస్తూ నేను, వైద్యురాలైన నా భార్యకు మరియు మేమిద్దరం తల్లిదండ్రులుగా ప్రాణాతిప్రాణంగా ప్రేమిస్తున్న మా సుపుత్రిక చి॥ **లలిత సుహాసినీ**లకు ఈ పుస్తకం అంకితం చేస్తున్నాను.

**డా॥ వక్కలంక వెంకటరమణ**

# పాఠకులకో మనవి

ఈ విజ్ఞాననేపథ్య కథల సంపుటి వైజ్ఞానికులకై వ్రాసినది కాదు. కనుక, విజ్ఞానాలకు యుగాలుగా అంతుపట్టని, నిరూపణలు కాని, శాస్త్ర చట్టాలు బొత్తిగా ఏకీభవించని అతీతమైన విషయాలు కొన్ని వ్రాశాను. ఒక శాస్త్రజ్ఞుడిగా, వారి దృష్టి వైపునుంచి లేదా వారి కోణం నుంచి ఆలోచిస్తే నేను కూడా వారితో పూర్తిగా ఏకీభవిస్తాను.

కానీ, ఈ అతీతమైన విషయాలు, శాస్త్రానికి అంతుపట్టని విషయాలు లోకంలో పలుచోట్ల ఇంకా జరుగుతూనే ఉన్నాయి. విమర్శలతో నవ్వుకుని, శాస్త్రజ్ఞులమైన వేము మొదట త్రోసిపుచ్చినా, ఏ పరదేశవెూ వాటిని నిరూపించగానే ఏకీభవించటమేకాక, వారిని ఆకాశానికి ఎత్తుతాము. మనిషిని చంద్రుడి మీద నడిపిస్తాము అని మొదట 'నాసా' వారు అమెరికాలో ఏనాడో బల్లగుద్ది మరీ మరీ చెప్పినా, లోకంలో వారి మాట మొదట ఎవ్వరూ నమ్మలేదు సరికదా త్రోసిపుచ్చి 'ఇదెలా సాధ్యం?' అని పదే పదే వాదించుకున్నారు. అదే రీతిలో అమెరికా అంగారక గ్రహం మీదికి మరో పదేళ్ళలో పంపగలమని ఇపుడు అంటున్నారు. 'చంద్రుడి మీదికి పంపగల్గినపుడు, అదే రీతిలో అంగారక గ్రహం మీదికి పంపలేమా?' అని ఇప్పుడు అందరు శాస్త్రజ్ఞులు ఏకీభవిస్తున్నారు. విష్ణుశర్మ రాజనీతిని కథారూపంలో రాజకుమారులకు చెప్పి వారిని తీర్చిదిద్దినట్లు (పంచతంత్రం) మన తెలుగువారికి కూడా శాస్త్రపు పుటలు, కొన్ని అర్థంకానివీ, అతీతమైనవి, నా శక్తిమేరకు కథా రూపంలో చెప్పాలని చేసిన నా ఈ ప్రయత్నాన్ని పాఠకులూ సహృదయంతో స్వీకరిస్తారని విశ్వసిస్తున్నాను.

ఈ కథల సంపుటిలో ఉన్న సన్నివేశాలు, ప్రదేశాలు సందర్భాలు, మనుష్యుల పేర్లు కేవలం కల్పితాలు. ఎవ్వరినీ ఉద్దేశించి వ్రాసినవి కావు. అదే ప్రకారం విజ్ఞానానికి అందని, నిరూపింపబడని కొన్ని గమ్మత్తులు, అర్థం అంతుపట్టనివీ అతీతమైనవీ కూడా వ్రాశాను. ఇవి కూడా ఒక కథా వస్తువులో భాగంగా ఆదరిస్తూ పాఠకులు సహృదయంతో స్వీకరింప ప్రార్థన.

**డా॥ వక్కలంక వెంకటరమణ**

# సైన్స్ సాహితీ నలభీములు

**- డా॥ నాగసూరి వేణుగోపాలరావు**

మనం చేసే ప్రతి కొత్తపనిలో కొంతమంది కొత్త మిత్రులు లభ్యమవుతారు. సాహిత్య అకాడమివారు తెలుగులో సైన్స్‌ఫిక్షన్ కథాసాహిత్యానికి సంబంధించి ఒక సంకలనం వెలువరించడానికి దోహదపడమన్నారు. ఆ పనిలో దిగినప్పుడు సుమారు యాభైమంది తెలుగు రచయితలు దాదాపు పాతిక పత్రికల్లో సుమారు నూటయాభై మంచి వైజ్ఞానిక కథలు రాశారని మా ప్రాథమిక పరిశోధనలో తేలింది. పాతికకు తక్కువ కాకుండా కథలను ఎంపిక చేయాలని ప్రయత్నించాం. ఈ ప్రక్రియలో డా॥ వక్కలంక వెంకటరమణగారు ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో రాసిన కొన్ని కథలు చదివాం - కథలను ఖరారు చేశాక, కథారచయితల చిరునామాలు సాధించడం పెద్దపని అయ్యింది. పత్రికా ప్రకటన ద్వారా కొందరు రచయితలను సంప్రదించగలిగాం. అలా లభించిన సన్మిత్రులు డా.వక్కలంక వెంకట రమణగారు. ఇంతవరకు వారిని ముఖాముఖి కలువలేదు. కేవలం కర్ణాకర్ణిగానే (సెల్లుఫోన్ సంభాషణ ద్వారానే) వారు పరిచయం. వారు నాకంటే వయసులో పెద్దవారు. అమితమైన ప్రేమతో వారి కథలు - సైన్స్‌ఫిక్షన్ నాకు పరిశీలించమని పంపారు. అందులో వారు రాసిన వైజ్ఞానిక కథలతోపాటు కార్టూన్లు, చిరువ్యాసాలు కూడా ఉన్నాయి. అన్నీ కూడా 1990కి కాస్త అటూ, మిగతావి ఇటూ రాసినవే! భావుకత కలిగిన రచయిత వైద్యవిద్యను అధ్యయనం చేయడమేకాక, బొమ్మలు కూడా చిత్రించగలగడం విశేషం. 1992-95 మధ్యకాలంలో ప్రచురింపబడిన వారి ఐదు సైన్స్‌ఫిక్షన్ కథలను పరిశీలిస్తే, చాలా విషయాలు బోధపడ్డాయి.

❖ ❖ ❖

ఇప్పుడు మీ చేతిలో ఉండే సైన్స్‌ఫిక్షన్ కథల సంపుటి తెలుగులో మూడవది. ఒక తెలుగు రచయిత తన సైన్స్‌ఫిక్షన్ కథలను ప్రత్యేకంగా సంకలనంగా వెలువరించడమన్నది ఇంతవరకు రెండుసార్లే జరిగింది. 2001లో కె.ఆర్.కె.మోహన్, 2010లో కస్తూరి మురళీకృష్ణ ఇలా తమ కథా సంకలనాలు వెలువరించారు. ఈ రెండు సంకలనాలకు పేరు మాత్రం ఒకటే - సైన్స్ ఫిక్షన్ కథలు. వివిధ రచయితలు

రాసిన తెలుగు సైన్స్ ఫిక్షన్ సంకలనం ఇంతవరకు వెలువడలేదు. ఆ కారణంతోనే అటువంటి పనిని మాకు (భవదీయుడితోపాటు నామిని సుధాకరనాయుడు) అప్పచెప్పారు. మేము పూర్తి చేశాం, ఇప్పుడు పుస్తకం ప్రచురణలో ఉంది. నిజానికి ఎన్.ఆర్. నంది, పురాణపండ రంగనాథ్ వంటి వారు ఎక్కువ సంఖ్యలో సైన్స్‌ఫిక్షన్ కథలు రాశారు. అయితే ఆయా రచయితల సైన్స్‌ఫిక్షన్ కథలు సంకలనాలుగా రాలేదు. ఆ రచయితలుండగా ఆ పని జరుగలేదు, ఇపుడు అటువంటి కార్యాలు ఎప్పుడు సాధ్యమవుతాయో తెలీదు. కనుక డా. వక్కలంక వెంకటరమణగారి - సైన్స్‌ఫిక్షన్ కథల సంపుటం వెలువరిస్తున్నందుకు అభినందించాలి.

❖ ❖ ❖

మహిళా రచయితల నవలల ప్రభంజనం తర్వాత సంభవించిన పరిణామంలో కొత్తరకం అంశాలతో నవలలు చాలా వచ్చాయి. వీటిలో సైన్స్‌ఫిక్షన్ వస్తువుతో కొన్ని నవలలు వచ్చాయి. అయితే వాటిని సైన్స్‌ఫిక్షన్ నవలలు అని పేర్కొన్న దాఖలాలు పెద్దగా లేవు. అలా ప్రకటించుకుంటే పాఠకాదరణ తగ్గుతుందని రచయితలుగానీ, సంపాదకులుగానీ భావించి ఉండాలి. కారణం ఏదైనా ఈ పోకడ ఒక వాస్తవం. గత శతాబ్ది చివరి రెండు దశాబ్దాలలో ఈ ధోరణి కనబడింది. తర్వాత టీవీ మాధ్యమం వెల్లువలా రావడంతో నవలల ప్రాధాన్యం తగ్గింది, పత్రికల్లో పాపులర్ సైన్స్ కూడా తగ్గింది.

ఇక కథల విషయానికి వస్తే తెలుగులో సైన్స్ ఫిక్షన్ 1927లో సిరుగూరి జయరావు 'సుజాత' పత్రికలో రాసిన 'పరమాణువులో మేజువాని'తో మొదలైందని చెప్పవచ్చు. ప్రపంచ దేశాల్లో కూడా దాదాపు అదే సమయంలో ఇటువంటి సైన్స్‌ఫిక్షన్ సాహిత్యం గురించి చర్చించడంగానీ, నామకరణం చేయడంగానీ జరిగింది. కనుక తెలుగులో సైన్స్‌ఫిక్షన్ కథా సాహిత్యం ఎంతమాత్రం ఆలస్యంగా మొదలు కాలేదు. చాలా పత్రికలు వేర్వేరు పేర్లతో పిలిచి ఉండవచ్చుగానీ సైన్స్ ఫిక్షన్ ప్రచురించి ప్రోత్సహించాయి. డెబ్బయ్యవ దశకంలో అమెరికా మిత్రులు కొందరు తెలుగు భాషాపత్రిక ద్వారా మూడుసార్లు సైన్స్ ఫిక్షన్ కథల పోటీ నిర్వహించారు. 1983లో ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక ఇటువంటి కథల పోటీ పెట్టింది. పిమ్మట ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, ఆంధ్రభూమి మాసపత్రిక ప్రత్యేక శ్రద్ధతో సైన్స్ కథా సాహిత్యాన్ని ప్రచురించాయి. విపుల మాసపత్రిక కొన్ని సంవత్సరాలపాటు సైన్స్ ఫిక్షన్ కథలను అనువదింపచేసింది.

ఈ విషయాలు గమనిస్తే బోధపడేది ఏమంటే పత్రికలు ప్రోత్సహిస్తే రచయితలు సైన్స్‌ఫిక్షన్ రాయడానికి ఉత్సాహం చూపుతారని. ఇటీవల కాలంలో సైన్స్ ఆధారంగా రూపొందిన టెక్నాలజి (పరికరాలను) వాడకం పెరిగింది కానీ, వాటి గురించి తెలుసుకోవడం బాగా తగ్గింది. జీవితంలో లాలసత పెరగడంతో సౌఖ్యం తప్ప శ్రమించే గుణం (శారీరకంగానే కాదు, మానసికంగా కూడా) వృద్ధి కావడం లేదు. నిజానికి ఈ దృష్టి కేవలం ఇప్పటికే పరిమితం అయ్యిందని కూడా చెప్పలేం. సంస్కృతంలో విజ్ఞాన సంబంధమైన గ్రంథాలున్నా కూడా, వాటిని కాకుండా ప్రేమ వ్యవహారాలతో రంజుగా సాగే ప్రబంధాలు వంటి వాటినే అనువాదం చేశారనే అభిప్రాయం కూడా వుంది. కనుక వైయుక్తికమైన ధోరణితోపాటు, సామాజికమైన పోకడలు కూడా కొన్ని రీతులను స్థిరపరుస్తాయి. సామాజిక పోకడలు కూడా పెద్దసంఖ్యలో కలసిపోయిన వైయుక్తిక ధోరణుల సముదాయాలే కదా! పలురకాలుగా శ్రమిస్తే గానీ సైన్స్ ఫిక్షన్ సృజన సాధ్యం కాదు. ఆ మేరకు డా. వక్కలంక వెంకటరమణగారిని సైన్స్ ఫిక్షన్ సాహిత్యం కొంతైనా రూపొందించారని మనం అభినందించాలి.

❖ ❖ ❖

"సైన్స్‌లో రాయడానికి అపారమైన అవకాశం ఉంది. ఏ చిన్న అంశం మీదనైనా అద్భుతంగా రాయవచ్చు. శాస్త్ర విషయాల్లో మంచి పరిచయం ఉండాలి. ఆ విషయంలో గతంలో ఏ జరిగింది, ప్రస్తుతం ఏం జరుగుతున్నదీ బాగా తెలిస్తే భవిష్యత్తులో ఏం జరుగవచ్చో ఊహించడం అసాధ్యం కాదు" - అని డా. రావూరి భరద్వాజ 1980లో 'అభ్యుదయ' పత్రికలో పేర్కొన్నారు. భరద్వాజ చాలా సరళంగా మొత్తం ప్రక్రియను తేల్చివేశారు. కానీ మంచి పరిచయం సాధించాలంటే ఎంతో అధ్యయనం ఉండాలి. గతం, వర్తమానం బోధపడితే భవిష్యత్తును ఊహించవచ్చు. అయితే ఈ ఊహ మామూలు ఊహ కానే కాదు, దీనికి సైన్స్ నియమాలు పునాది. ఈ పునాది ఆధారంగా సాగే భావనలు కూడా సైన్స్‌బద్ధంగానే ఉండాలి. ఈ స్థాయిలో సృజన ఎంత బాగా పండితే ఫలితం అంత బాగా లభిస్తుంది. అదే సమయంలో అర్థం చేసుకోవడం, పునర్వ్యక్తీకరించడం అనేవి రెండు భాషల ద్వారా జరుగుతాయని కూడా గుర్తించాలి. కనుక మన వరకు ఇంగ్లీషు, తెలుగు భాషలలో నైపుణ్యంతోపాటు, సరైన పదాల ఎంపిక లేదా పదనిర్మాణం అవసరం. పైపెచ్చు కథాశిల్పం, పఠనీయత తప్పనిసరి. ఇవన్నీ సవ్యంగా సాగితే కానీ సైన్స్‌ఫిక్షన్ కథా సాహిత్యం సరిగా పుష్పించదు. ఇందులో రచయిత వైయుక్తికమైన కృషి వందశాతం ఉంటుంది. ప్రచురణ విషయంలో

పత్రికలుగానీ, పుస్తకాల కొనుగోలులో పాఠకులుగానీ వ్యక్తపరిచే ఉత్సాహం రచయితలకు మరింత కృషి చేయడానికి ప్రోత్సాహమిస్తుంది. కానీ ఏ రకంగానూ రచయిత శ్రమను ఎవరూ తగ్గించలేరు. అందుకే సైన్స్ ఫిక్షన్ కథల రచయితగా డా.వక్కలంక రమణగారిని అభినందించడం!

❖ ❖ ❖

సైన్స్‌ఫిక్షన్ సంబంధించి నిర్వచనాలు కూడా విభిన్నంగా కనబడతాయి. ఆ వివరాలలోకి వెళ్ళనక్కరలేదు గానీ, సైన్స్ నియమాల చట్రం ఆధారంగా జరిగే కల్పన కూడా సైన్స్ అంగీకరించేలా ఉండాలి. అలా సైన్స్ ఫిక్షన్ ద్వారా చేసిన భావనలు లేదా ఊహలు నిజంగా మారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. రచయిత సైన్స్ అవగాహన కుండే లోతునుబట్టి ఇది సాధ్యమవుతుంది. అలాగే సైన్స్‌ఫిక్షన్‌లో కూడా చాలా రకాల వర్గీకరణలున్నాయి. అదే సమయంలో ఆశ్చర్యపరిచే స్థాయిలో అపోహలు కూడా ఉండటం విశేషం. ఖగోళం, విశ్వాంతరాళం సంబంధించినదే సైన్స్‌ఫిక్షన్ అని కొందరు భావించడం తమాషాగా అనిపిస్తుంది. మిగతా సైన్స్ విభాగాల్లో సైన్స్ ఫిక్షన్ ఉండే అవకాశం లేదని ఇంకొందరు పరిగణించడం ఇంకా ఆశ్చర్యకరం.

ప్రస్తుత సైన్స్‌ఫిక్షన్ రచయిత డా. వక్కలంక వెంకట రమణగారు జీవశాస్త్ర పార్శ్వంలో అధ్యయనం, పరిశోధన చేసిన వారు. అలాగే జీవనశాస్త్రంలో కూడా మంచి అవగాహన ఉన్నవారు. తనకు ప్రవేశమున్న పార్శ్వంలోనే దృష్టి పెట్టి కల్పన జోడించి చక్కని సైన్స్‌ఫిక్షన్ సృజించారు. ఈ రకంగా వెంకట రమణగారి సైన్స్ ఫిక్షన్ కథలలో ఏకసూత్రత ఉంది.

❖ ❖ ❖

"....పచ్చటి దీపం.... అంతే మెల్లిగా నారింజ రంగులోకి మారసాగింది. నాలో మేల్కొన్న విజ్ఞానం, ఇన్నాళ్ళు నేను అర్థాలు వెతుకుతున్నా ఆ అర్థం కాని ఫెనామినా, నా థీసిస్‌లో రాసిన ఎన్నో విషయాలకు కొంత వరకు ప్రత్యక్ష సాక్ష్యం! నా కారుపై పదడుగుల ఎత్తులో గుడిగంట ఆకారంలో ముప్పై మీటర్ల విస్తారం కల అనేక రకాల రంగులు కలిగిన లైట్లు ఉన్న ఒక నౌక తాండవం చేస్తోంది. గాల్లోనే అలానే నిలిచి ఉంది. చడీ చప్పుడూ లేదు!..."

**"పున్నమినాటికి మళ్ళీ వస్తా"** - అనే కథ మధ్యలో కొన్ని వాక్యాలు ఇవి. అలా రాయగలిగితేనే కథ రక్తి కడుతుంది. ఒక వైపు సైన్స్ విషయమూ, మరోవైపు ఆసక్తి కలిగించే కథనమూ, ఇంకోవైపు కొనసాగే కథ, దానితో పెనవేసుకుని సాగే కల్పనా - అంత సులువు కాదనిపిస్తుంది. ఈ వాక్యాలు చూడండి (అదే కథలో)-

"..... ఇందులో నేను చదివిన దాన్ని బట్టి మనుష్యులకు ఈ గుర్తు తెలియని మానవాతీతులకు మధ్య మూడు రకాల 'కలుసుకోవడాలు' జరుగుతున్నట్లుగానూ యథార్థ వృత్తాంతం వివరించబడింది. అందులో మొదటి రకం 'కలుసుకోవడం' దగ్గరగా వాళ్ళని చూడటమే తప్పా ఎటువంటి పరస్పర పరిచయాలు లేనివిగానూ, రెండవరకమైన 'కలుసుకోవడం' అంటే మన అంతరిక్ష అతిథులకు మన చుట్టూ ఉండే వాతావరణంలో వాళ్ళు చేసిన గందరగోళం వాళ్ళ ఉనికి తెలిపేవిగానూ, మనకు గమ్మత్తుగానూ, ఊహకందని నిజాలుగానూ కనబడే మార్పులనూ, మూడవ రకమైన 'కలుసుకోవడం' నిజమైన పరస్పర పరిచయాలుగాను రోనాల్డ్ స్టోరే పేర్కొన్నారు..."

ఈ విషయాలను రచయిత పాత్రగా మారి ఆధారాలను (1983 జూలై 18న హిందూ ఆంగ్ల దినపత్రికలో ప్రచురింపబడిన వార్త వివరాలు) కూడా ఇస్తారు. ఇలా సైన్స్ కథనాలను కథలో ఇమడ్చడం అంత సులువు కాదు. కానీ వెంకటరమణగారికి ఈ రచనా రసాయనశాస్త్రం బాగా పట్టుబడింది. "పున్నమినాటికి మళ్ళీ వస్తా, జహన్నారా, నన్నెందుకు ప్రేమించావు. ఓ జాజిపువ్వు కథ, నా ప్రేమకు ముగింపు లేదు" - ఇవి వెంకట రమణగారి కథల పేర్లు. ఈ ఐదు పేర్లలో రెండింటిలో ప్రేమ ఉండగా, పున్నమి, పువ్వు మరో రెండింటిలో ఉంది. ఈ నాలుగింటికి మించిన రొమాంటిక్ నేమ్ 'జహన్నారా'! చాలా చాకచక్యంగా చరిత్రనూ, సైన్స్‌నూ కలిపి ఫిక్షన్‌ను సిద్ధం చేయగల సైన్స్ సాహితీ నలభీముడు వక్కలంక గారు!

నిజానికి ఈ కథలలో ఏ కథ కూడా పాఠకుడి పఠనాన్ని అడ్డగించదు. ఇంకా చెప్పాలంటే 'జహన్నారా' వంటి వస్తువు పాఠకులను ఉద్రూతలూపగల సీరియల్‌గా మారదగింది, చలనచిత్రంగా ఆకట్టుకోగలదీ! ఇంత చక్కని ఫలితాల సాధన వెనుక ఎంతో కృషి ఉంది. అది లేకపోతే ఇటువంటి కథలు ఎలా పండుతాయి? ఇటువంటి ఆనందంతోపాటు గత రెండు దశాబ్దాలుగా వెంకట రమణగారు సైన్స్ ఫిక్షన్ కలాన్ని ఎందుకు దాచిపెట్టారో బోధపడకపోవడమే కాదు, కించిత్ అసంతృప్తినీ (బాధనూ) కలిగిస్తోంది!

నిజానికి నా ముందుమాట ఇక్కడితో ఆగిపోవాలి. 1992 జనవరి – 1995 ఆగస్టు మధ్య కాలంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురింపబడిన ఐదు (జహన్నారా, నన్నెందుకు ప్రేమించావు, ఓ జాజి పువ్వు కథ, నా ప్రేమకు ముగింపు లేదు, పున్నమి నాటికి మళ్ళీ వస్తా) కథలతో పాటు ఈ పుస్తకం కోసం మరో 15 కథలు ఉన్నపళంగా, తక్కువ వ్యవధిలో రాశారు. దీనికి కారణం ప్రస్తుత సంకలన ప్రచురణ కర్త సాహితి ప్రచురణలు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత, వయస్సు పైబడిన తర్వాత వక్కలంక వెంకటరమణగారు ఇంత వేగంగా రాయడాన్ని మనం అభినందించాలి. తగిన ప్రోత్సాహం ఉంటే రచయితలు సైన్స్ ఫిక్షన్‌ను సైతం అలవోకగా రాస్తారని గుర్తించాలి. కనుక రచయితను, ప్రచురణకర్తను అభినందిస్తూ మన రచనల ప్రచురణతో ముడిపడిన ప్రతి వ్యక్తినీ, సంస్థనూ ఆలోచింపమని చెప్పాలి.

ఇక్కడ అసలు కన్నా కొసరు ఎక్కువ! సంఖ్యాపరంగా ఎక్కువ ఉండటంతో కథా వస్తువులో మరింత విస్తృతి వచ్చి చేరింది. తనకు ప్రవేశం, అధికారం ఉన్న అంశాలలోనే ఎక్కువ కథలున్నాయి. హ్యూమన్ క్లోనింగ్, జెనెటికల్లి మోడిఫైడ్, క్రాప్స్ వగైరా అధునాతన విషయాలు ఈ కథల్లో వచ్చి చేరాయి. ఈ కథలు చదవడంతో వైజ్ఞానిక విషయాలు బోధపడటమే కాదు, ప్రయోగాలు ఎలా జరుగుతాయి, అక్కడి పరిస్థితులు ఏమిటి, శాస్త్ర పరిభాష ఏమిటి అనే పార్శ్వాలు కూడా సులువుగా బోధపడతాయి.

ఈ అభిప్రాయాలు పరిశీలించండి :

– ... కుక్క పాలు త్రాగే కోతిపిల్లలనూ, పులిపాలు త్రాగే కుక్కపిల్లలనూ మాతృత్వం పెల్లుబికే ఆ తల్లి ఏమీ చేయదు. ఏ హానీ తలపెట్టదు. ఇటువంటి జాతి, మత భేద భావాలు లేని కల్తీ లేనిదే విజ్ఞానశాస్త్రం...

( నీ నీడకు నువ్వే తోడు)

– .... పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి ఐకమత్యం, ఏకాగ్రత, పట్టుదల, నిజాయితీ ఉండబట్టే చకచకా ఏ శాస్త్రపు ప్రాజెక్టు ఆరంభించినా ఫలితాలు చక్కగా వస్తాయి. ఏ మాత్రం కల్మషం, రాజకీయాలు శాస్త్రజ్ఞుల మధ్య ఉండదు. అందరూ ఒక్కుమ్మడిగా ఒక కుటుంబంలా మెలుగుతూ, ఒకరికొకరు సాయపడుతూ, సాధించాలనే ఒకే ధ్యేయంతో రాత్రింబవళ్ళు తమకి కేటాయించిన పనులు అతి జాగ్రత్తగా, నిజాయితీతో చేస్తారు. అందుకే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. మన దేశం ఈ విషయాలలో

ఇంకా చాలా శ్రద్ధ వహించాల్సి ఉన్నది. మరి వారందరితో పోటీ చేయాలనే కుతూహలం ఉంటే....

(క్రాప్ సర్కిల్స్)

– .... ఆంధ్ర మెడికల్ కాలేజి, విశాఖపట్నంలో చదివిన డా॥ ఎల్లా ప్రగడ సుబ్బారావుగారు మొట్టమొదటిసారిగా చెవిలో నెప్పి తెచ్చే బాక్టీరియాను అంతం చేసేందుకు కనుగొన్న బాక్టీరియా పేరు 'సుబ్బామైసిన్' అన్న, అటు పిమ్మట అమెరికావారు క్లోరాంఫెవికాల్ అని, అదే మందుని, క్లోరా మైసిటిన్ గా ఫైజరువారు మెడికల్ షాపులలో అమ్మసాగారు లోకమంతటా. మన ఎల్లా ప్రగడవారికి దక్కవలసిన ఖ్యాతి చేయి జారిపోయింది ఈ విధంగా...

(తెలివిగల వృక్షాలు)

– .... వేరే వేరే లాబోరేటరీల్లో మొదట వేర్వేరు విధాలైన కనుగోలులన్నా, ఒక కొలిక్కి ఆఖరున వస్తే, అలా ఎంత వరకూ, ఎన్ని ప్రయోగశాలల్లో వివిధ దేశాల్లో ఒకే విధమైన ఫలితాలు వస్తే, విజ్ఞానం వాటి ఫలితాలు ఆమోదిస్తుంది.....

(పైకథలోనే)

మచ్చుకు నాలుగు అభిప్రాయాలను ఇక్కడ పట్టి చూపాను. సైన్స్ రచన పరమ లక్ష్యం సైన్స్‌కు ఆధారమైన తాత్విక నేపథ్యాన్నీ, సైన్స్ ఆలోచనా క్రమాన్నీ, సైన్స్ ఎలా పని చేస్తుందీ, మనం ఈ రంగంలో చేయాల్సిందేమిటీ – అనే విషయాలకు వెంకటరమణగారి కథలులో స్పష్టం చేయడం. వారి రచనాశైలిలోని ఆకర్షణ గురించి ఈ అభిప్రాయం తొలి దశలో పేర్కొన్నాను. సైన్స్ ఫిలాసఫిని కూడా పఠనీయ గుణంతో, చక్కని కథని మేళమించి చెప్పడం ఇక్కడ రచయిత సాధించిన విజయం. అందుకే వీరిని – సైన్స్ సాహితీ నలభీములని అభినందించాను.

❖ ❖ ❖

"... ఇలాంటి పూర్వజన్మ జ్ఞాపకాలు కలవారు పిచ్చివాళ్ళు కాదు. కనుక వాళ్ళని పిచ్చివాళ్ళుగా పరిగణించి అలాంటి కొందరిని పిచ్చాసుపత్రిలో చేర్పించటం ఆత్మహత్యతో సమానం...." అని ఒక కథలో రచయిత అంటారు. ఇందులో తొలి వాక్యంలో తొలి పదాలు అందరికీ ఆమోదం కాకపోవచ్చు. అందుకే రచయిత తన మాటలో అంటారు. "అంతుపట్టని, నిరూపణలు కాని, శాస్త్ర చట్రాలు బొత్తిగా నాతో ఏకీభవించని అతీతమైన విషయాలు రాశాను. ఒక శాస్త్ర ప్రగతిగా వారి దృష్టి వైపు

నుంచి లేదా వారి కోణం నుంచి ఆలోచిస్తే నేను కూడా వారితో పూర్తిగా ఏకీభవిస్తాను...."

చివరగా – మరోసారి తెలుగు సైన్స్ సాహితికి తన కథా సంకలనం ద్వారా కొత్త వెలుగును ఇస్తున్న రచయిత డా।। వక్కలంక వెంకటరమణగారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ వారి సైన్స్ రచనా లక్ష్యాన్ని మరింత బిగ్గరగా ప్రస్తావిస్తున్నాను. వారి అభిప్రాయంతో నా విశ్లేషణ ముగుస్తోంది.

".... విష్ణు శర్మ రాజనీతిని కథా రూపంలో రాజకుమారులకు చెప్పి, తీర్చిదిద్దినట్లు మన తెలుగు వారికి కూడా శాస్త్రపు పుటలు, కొన్ని అర్థం కాని అతీతమైనవి, నా శక్తి మేరకు కథ రూపంలో చెప్పాలని చేసిన నా ఈ ప్రయత్నాన్ని అందరు పాఠకులు సహృదయంతో స్వీకరిస్తారని విశ్వసిస్తున్నాను."

vennugasuri@gmail.com
Ph : 080-56242890
Cell : 94441 50969

❖ ❖ ❖

# ధన్యవాదములు

ఈ విజ్ఞాన నేపథ్య గాథల పుస్తకం వెలువడటానికి దోహదపడిన వారిలో అతి ముఖ్యులు ఇరువురు. వారిలో మొదటివారు డా॥ నాగసూరి వేణుగోపాలరావుగారు, రెండవవారు శ్రీమతి లక్ష్మిగారు ఈ పుస్తకానికి ప్రచురణకర్తలు. తుదిమాట అడగగానే ఒప్పుకున్న శ్రీ వివికెగారికి నా ప్రత్యేక ధన్యవాదములు. వారిని మా కుటుంబ సభ్యులలో ఒకరిగా భావిస్తాను.

ఎక్కడో ఒక మారుమూలన ఉన్న నన్ను తట్టిలేపి, ఏనాడో సరదాకని వ్రాసిన ఐదు విజ్ఞాన నేపథ్యగాథలలో (ఆంధ్రప్రభలో 1991-92) ఒకటి 'పున్నమి నాటికి మళ్లీ వస్తా!" అనే నా కథను, National Searchలో ఓపికగా ఎన్నో తక్కిన కథల నుండి ఎంచుకుని, కేంద్రీయ సాహిత్య అకాడమీ వారు ప్రచురించపోతున్న వారి సంకలనంలో కలుపుకోవాలని తెలుపుతూ నా చిరునామా కావాలని ఆంధ్రజ్యోతిలో ప్రకటన ఇచ్చారు డా॥ నాగసూరిగారు. అలా నన్ను ప్రోత్సహించిన వారికి నా మనఃపూర్వక ధన్యవాదములు.

ఇకపోతే సాహితి ప్రచురణకర్త శ్రీమతి లక్ష్మిగారిని నేనే మొదట కొన్ని విచిత్ర పరిస్థితులలో టెలిఫోన్‌లో పరిచయం చేసుకున్నాను. ఆ విచిత్ర పరిస్థితేమిటంటే, మా అమ్మాయి చి॥ లలిత నా 64వ సంవత్సరం పుట్టినరోజుకై బొంబాయి నుంచి 'FLIPKART' వారి ద్వారా నాకు కొన్ని మంచి తెలుగు సాహిత్యం ఎంచి, పుట్టినరోజు కానుకగా పంపమని వారిని అర్థించింది (ఆమెకి తెలుగు చదవడం, రాయటం రాదు కనుక) వారు వెంటనే నాకు స్పీడ్ పోస్ట్‌లో సాహితీ ప్రచురణల వారి 5-పుస్తకాలు వేర్వేరు రచయితలవి పంపారు. నాకు అందులో 'అరణ్యకాండ' 'సైన్స్‌ఫిక్షన్' శ్రీ కొమ్మనాపల్లి గణపతిరావుగారు రాసిన నవల విపరీతంగా నచ్చింది. వెంటనే పుస్తకంలో తెలిపిన సాహితీ ప్రచురణలకు ప్రశంశిస్తూ ఫోన్ చేయగా శ్రీమతి లక్ష్మిగారి పరిచయం కలగటమేకాక, నేను కూడ విజ్ఞాన నేపథ్యం లోగడ రాశాననీను, మళ్ళీ ప్రత్యేకంగా వారి సాహితీ ప్రచురణలకి, వారు అంగీకరిస్తే పంపగలననీను అభ్యర్థించాను. అందులో వారి ఐదు పుస్తకాల Computer Font చాలా బాగుందనీను, ఇలా తెలుగులో Computer Font నేను మొట్టమొదటిసారిగా చూశాననీను, ఒక తప్పులేకుండా వారు ప్రచురించిన తీరు చాలా ప్రశంసనీయమైనదనీను వారికి చెప్పాను.

కేవలం ఫోన్ ద్వారా పరిచయమైన నా మీద వారికి కలిగిన నమ్మకం, విశ్వాసం వలన వారు వెనువెంటనే కథలు పంపమని నాకు ఆదేశం ఇవ్వటం, నా అదృష్టంగా భావిస్తూ, వారికి నా హృదయపూర్వక ధన్యవాదములు సమర్పిస్తున్నాను.

-రచయిత

# విషయసూచిక


| | |
|---|---|
| జహన్నారా | 15 |
| నన్నెందుకు ప్రేమించావు? | 20 |
| ఓ జాజిపువ్వు కథ | 27 |
| నా ప్రేమకు ముగింపు లేదు | 32 |
| నీ నీడకు నువ్వే తోడు | 45 |
| డ్యాడీ వెన్‌డూ వి గో హెూమ్? | 52 |
| డార్లింగ్! వేర్ ఆర్ యూ? | 56 |
| అదృశ్యమైతే ఆలస్యం కూడదు | 61 |
| 'దెయ్యాలను మించిన మానవుడు!' | 70 |
| 'తలమార్పిడి' | 87 |
| రూపం దాల్చిన కలలు | 98 |
| పొలాల్లో కత్తిరింపు వృత్తాకారాలు | 105 |
| నీళ్ళ మీద నడిచిన మనిషి | 118 |
| తెలివిగల వృక్షాలు | 123 |
| లెవిటేషన్ | 128 |
| మృత్యుంజయుడు | 134 |
| పున్నమినాటికి మళ్ళీ వస్తా | 137 |
| చకితుల్ని చేసిన శస్త్ర చికిత్స | 145 |
| దేవుడు ఉన్నాడా? | 149 |
| ప్రపంచాన్నాక్రమించిన సూపర్ కంప్యూటర్లు | 154 |


16

# జహన్నారా

రాత్రి ఎనిమిదిన్నర కావొస్తోంది. తుంపరగా ప్రారంభించిన వర్షం మంచి హోరునందుకుంది. అమెరికా నుంచి నేనొచ్చేటప్పుడు తెచ్చుకున్న లెఫ్ట్ హాండ్ డ్రైవ్ 'పాంటియాక్' కారు వైపర్లు విరామం లేకుండా పని చేస్తున్నాయి. కర్ణాటకలో సిమెంట్ రోడ్ల హైవేలు ఎక్కువ. బెంగుళూరు నుండి బీజాపూర్ ట్రంకు రూట్ అది.

"అలసటగా ఉంటే నేను కాసేపు డ్రైవ్ చేయనా?" అంతదాకా మౌనంగా కూర్చున్న డా. ముంతాజ్ అడిగింది.

డాక్టర్ ముంతాజ్, నేను కలసి అమెరికా రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఫెలోషిప్‌తో న్యూరోసైన్స్‌లో డాక్టరేట్ చేసి, అక్కడే రెండవ పి. హెచ్‌డి. పారా నార్మల్ ఫినామెనాలో న్యూయార్క్ మెడికల్ స్కూల్‌లో తెచ్చుకున్నాము.

నాకు బెంగుళూరులో కొత్తగా స్థాపించిన 'పారా నార్మల్ డివిజన్ ఆఫ్ న్యూరో సైన్స్ ఇన్‌స్టిట్యూట్'లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం రాగానే వచ్చి చేరాను. ముంతాజ్ వాళ్లది హైదరాబాద్. నేను స్వచ్ఛమైన ఆంధ్ర బ్రాహ్మణ కుటుంబీకుణ్ణి. మాది మద్రాసు. తనకీ స్వదేశం రావాలని ఉన్నందువల్ల అదే ఇన్‌స్టిట్యూట్‌లో రాక్‌ఫెల్లర్ మూడేళ్ల ప్రాజెక్టు ఒకటి శాంక్షన్ చేయించుకుని తనూ వచ్చి జేరింది. ఆ ప్రాజెక్టుకి నేను చీఫ్ ఇన్వెస్టిగేటర్ని. ఆ ప్రాజెక్టు తాలూకు కొన్ని వివరాల కోసం బీజాపూర్ సుల్తాన్ కోట శిథిలాలు, గోరీలు మొదలగు వాటి మీద సేకరించవలసిన ఫోటోలు గట్రా ఉన్నాయి. దానికే ఈ ప్రయాణం.

"అవును. కాసేపు నువ్వు వీల్ అందుకో... ఐ కెన్ స్మోక్ మై పైప్ ఫ రేవైల్" అని కారు నెమ్మదిగా స్లో డౌన్ చేసి, రోడ్డు వారగా ఆపి మాతో తెచ్చుకున్న రైన్ కోట్ తొడుక్కుని కుడివైపుగా బయట నుంచి మారాను. ఇంకా రెండు వందల యాభై కిలోమీటర్లని సూచించే మైలు రాయి హెడ్‌లైట్ కాంతిలో కనపడింది.

పైప్ అంటించి "మున్నీ! (తనని అలాగే పిలవమంటుంది ముంతాజ్) నే చెప్పిన విషయాలు మీ వాళ్లతో మాట్లాడావా?" ప్రశ్నార్థకంగా చూశాను.

ఇరవై ఆరేళ్ల అసాధారణ అందం, యౌవనం ఉట్టిపడే శరీర సౌష్టవం. ఇట్టే ఆకట్టుకొనే స్నేహశీలత్వం, నెమ్మదస్తురాలైన, ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే ముగ్ధ డాక్టర్ ముంతాజ్. ఒకే దేశస్థులవటం మూలాన సహజంగానే పరదేశంలో దగ్గరవుతాం. (ఈ దేశంలో ఉన్నప్పుడు కనిపించదు ఆ ఐక్యత) రీసెర్చి మూలంగా మరీ దగ్గరైన మా స్నేహం ఒకర్ని విడిచి ఒకరు ఉండలేని పరిస్థితి ఏర్పడింది.

కానీ సంప్రదాయాలు వేర్వేరు కావటం మూలాన, ఎన్నడూ కట్టుబాట్లను దాటకుండా జాగ్రత్త పడుతూ అప్పటికే ఇరువురి కుటుంబాలు ఒప్పుకోవటం మూలాన, ఇక పెళ్లి ముహూర్తమే తరువాయి.

ముంతాజ్ తండ్రి ఇంటర్నేషనల్ ఫేమ్ ఉన్న న్యూక్లియర్ ఫిజిసిస్టు. ఆయన హైదరాబాద్‌లో ఒక పెద్ద రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కి డైరెక్టర్. నెలకి సగం రోజులు కాన్ఫరెన్సెస్ కని జర్మనీ, ఇంగ్లండ్, అమెరికా, జపాన్‌లకి వెడుతూ ఉంటాడు. ఈ వేసవికి ఎలాగన్నా రెండు కుటుంబాలకి సరిపడే తేదీ నిర్ణయించాలని ముంతాజ్ వాళ్ల వాళ్లతో సంప్రదింపులు జరుపుతోంది. దాని సారాంశమే నా ప్రశ్నకి మూలం.

"అబ్బా... ప్లీజ్... మూర్తీ... యూ కెన్ బిలీవ్ మీ... అయినా అంత తొందరా నీకు?!" నవ్వుతూ తన చేత్తో నా చేతిని మెల్లగా నొక్కి "సరేలే గానీ, మన బసకు అక్కడ గవర్నమెంట్ గెస్ట్‌హౌస్ ఉన్నది. చాలా చక్కటి ఏర్పాట్లు చేశామని మన ఇన్‌స్టిట్యూట్ వారు నిన్న మీటింగులో చెప్పారు. మనం చేరేసరికి తెల్లవారుఝామున రెండు గంటలవుతుందేమో!" అని మళ్లీ దృష్టి రోడ్డు మీదకి కేంద్రీకరించింది.

గెస్ట్‌హౌస్ నాకు పరిచయమే. రెండు నెలలకి పూర్వం ఫీల్డ్ స్పాట్సు చూడడానికి ఒక్కణ్ణే వెళ్ళినపుడు ఒక్క రోజు ఉన్నాను. చాలా సౌకర్యమైన అటాచ్‌డ్‌బాత్, అధునాతన సౌకర్యాలతో ఈ మధ్యనే కట్టిన గెస్ట్‌హౌస్ అది.

వాన పూర్తిగా తగ్గింది. రాత్రి పదకొండున్నర కావొస్తోంది. "మున్నీ! నీ సీట్లో కాసేపు పడుకో, నేను డ్రైవ్ చేస్తాను" అని నేను డ్రైవింగ్ సీట్‌కి మారాను.

తను వెనక సీట్‌కి మారి మేను వాల్చింది.

గెస్ట్‌హౌస్ చేరేసరికి అర్థరాత్రి ఒంటిగంటన్నర దాటింది. వేర్వేరు గదులు తీసుకున్నాము. మగతగా పట్టిన నిద్ర, తెల్లారి సూర్య కిరణాల వేడికి తేలిపోయింది. ఒళ్లు విరుచుకుని టైమ్ చూశాను. ఎనిమిదిన్నర! గెస్ట్‌హౌస్‌లో భోజన వసతులున్నాయి. బెల్ కొట్టి కుర్రాణ్ణి పిలిచి ఇద్దరికీ టీ, టిఫిన్ చెప్పాను.

వాడొచ్చేలోపున స్నానం చేసి, తయారై బయటి కొచ్చేసరికి ముంతాజ్ మేం తెచ్చుకున్న రీసెర్చి మెటీరియల్ చదువుతోంది.

"రెడీయా! ఇవ్వాళ స్పాట్ ఇవాల్యూయేషన్ చేద్దాం... పద పోదాం" ఆమె భుజం చుట్టూ చేతులేసి కారు దగ్గరికి నడిచాను.

మెడికల్ సైన్సులో రక్తస్రావం మెదడుకి ఆగిపోయిన తక్షణం మనిషి చనిపోయినట్లే లెక్క. కొన్ని సమయాల్లో గుండె ఇంకా కొట్టుకుంటూనే వుంటుంది, మెదడు పనిచేయటం నిల్చిపోయినా కూడా. అయినా 'క్లినికల్ డెత్ ఈస్ బేస్డ్ ఆన్ ఓన్లీ బ్రెయిన్ డెత్'. మేము ఈ నార్మల్‌గా జరిగే పనులుకాక, మనిషికి అతీతమైన అబ్నార్మాలిటీస్ మీద పరిశోధనలు చేశాము.

అందులో పునర్జన్మ ఒకటి. ఎలా? బ్రెయిన్ (మెదడు) చనిపోయి, గుండె ఆగిపోయి చితిమీద భస్మం అయిపోయిన కళేబరం నుంచి ఏ విధంగా గతజన్మ స్మృతులు రాగలవు?

రిసెర్చి వలన తెలిసిన దేమిటంటే– అతి సూక్ష్మమైన బీజాలు (జీవరాసులలో సూక్ష్మాతి సూక్ష్మమైన అంతిమ భాగాలు) మట్టుకు ఉంటాయనీ, అవి కంటికి ఆనని విధంగా గాలిలో, పైన ఒక పొరలో ఇమిడి ఉంటాయనీ, మరీను తన జాతికి చెందిన మనిషి పీల్చే గాలి ద్వారా, నీటి ద్వారా, చర్మ రంధ్రాల ద్వారా మళ్లీ ప్రవేశించి బీజకణాలలో చోటు చేసుకుని తమ ఉనికిని ఆ బీజాలవల్ల పుట్టిన వారిపై చూపుతాయనీ అలా పుట్టినవారిలో కొందరికి ఆ 'డిఎన్ఏ' వల్ల కలిగిన 'జ్ఞాపకశక్తి'తో పూర్వజన్మ జ్ఞాపకాలు మిగుల్తాయి.

మేము ఇటువంటి మానవాతీతమైన అంశాలపై పి.హెచ్‌డి. చెయ్యటం కోసం ఈ పునర్జన్మల ఇతివృత్తం సంబంధమై బీజాపూర్ ఎన్నుకున్నాము కనుక పురాతన వస్తు సంబంధ శాఖ (ఆర్కియాలజీ) వారికి తటస్థపడిన ఒక ముస్లిం పేటిక– దానిపై ఉర్దూలో చెక్కి ఉన్న కథను విని పరిశోధించటానికి వారి సహకారం, డిఎన్ఏ రీకాంబినెంట్ కావల్సిన ఎముకలు (పేటిక తెరవటానికి వారి అనుమతి) అన్నీ ఏర్పాటు చేసుకున్న తర్వాత ఈ ప్రాజెక్టుకి తలపెట్టాము. పేటికపై ఉర్దూ నుండి తెలిసిన దేమంటే, అది 'జహన్నారా' అనే ఒక ఇరవై సంవత్సరాల వయసున్న స్త్రీది. ఆమె ముంతాజ్, షాజహాన్‌ల అమర ప్రేమగాథకు మల్లే, సుల్తాన్ ఏలిన పరిధిలో ఒక సామంతుడి భార్య.

అతని పేరు గులామ్. తన భార్య జ్ఞాపకార్థంగా అతను యావత్ చరిత్ర ఆమె పుట్టుపూర్వోత్తరాలు, ఇరవయ్యో శతాబ్దంలో ఆమె తిరిగి తన భార్యగా పునర్జన్మ ఎత్తబోతున్నట్లు తనతో మరణిస్తూ పలికిన విషయం చెక్కి ఉంచాడు.

ఇపుడు మాకు ఎముకలను పరీక్ష చేసే అవకాశం మొదటి మెట్టు.

'డిఎన్ఏ' సేకరణ మా దగ్గర ఈ విధంగా ఉంచుకుంటే, 'జహన్నారా' జ్ఞాపకాలను ఉంచుకుని పునర్జన్మ ఎత్తిన మనిషి మాకు తటస్థపడితే ఆ మనిషి 'డిఎన్ఏ', మాదగ్గర ఉన్నవి జతపరిస్తే– రెండూ ఒకటైతే తప్పక ఆ మనిషే ఈ మనిషని విజ్ఞాన శాస్త్రం ఆమోదిస్తుంది. 'పూర్వజన్మ' జ్ఞానం ఉన్నవాళ్లు మా ఇన్‌స్టిట్యూట్‌కి పరిశోధన సంబంధమై రమ్మని ఆహ్వానిస్తూ మేం పత్రికలలో ప్రకటనలు వెయ్యటం, పలువురు తరచూ రావటం, మాకు మామూలుగా జరిగే పనే కావటంవలన అదే ప్రాంతాల్లో అటువంటి మనిషి తటస్థ పడేందుకు అవకాశం ఉండవచ్చని మా ఆశ.

ఆర్కియాలజీ వాళ్లని కలసి వారి సహాయ సహకారాలతో పేటిక తెరచి మాకు కావలసిన ఒక చిన్న పై చేతి ఎముక 'హ్యూమరస్' ముట్టుకు తీసుకున్నాము. ఇలా ఆరు రోజులు పట్టింది మొత్తం విషయ సేకరణకి, రిపోర్టు వ్రాయటానికి. ఏడవ రోజు పనంతా పూర్తి చేసుకుని, సాయంకాలం ఏడున్నర ప్రాంతాల్లో పున్నమి చంద్రుడు వెలిగిపోతూంటే, చెట్ల క్రీనీడలు మాపై పడుతూంటే నా బాల్కనీలో చల్లగాలిలో ఇద్దరం కూర్చున్నాము.

ముంతాజ్ మల్లెలు తురుముకుని మామూలు పంజాబీ డ్రెస్‌లో, రెట్టింపు అందంతో ఉన్నట్లనిపించిందా రోజు.

'ఏమిటలా చూస్తున్నారు?' నవ్వుతూ అడిగింది–ఆమెనే తదేకంగా చూస్తున్న నన్ను.

"ఏం లేదు... ఈ లోకంలో ఉన్న అందం అంతా నీ స్వంతమేనేమో అని ఆలోచిస్తున్నాను" చిరునవ్వుతో బదులిచ్చాను.

"పొగడ్తలకేం గానీ... మరీ అంత ఆపేక్ష పనికిరాదు సుమా! ఒకవేళ నాకేమైనా అయితే మీరు తట్టుకోలేరు ఇలా ఉంటే!" అంటూ నన్నల్లుకుపోయి గాఢంగా ఒక ముద్దిచ్చి, సుతారంగా విడిపించుకుని "ఇక గుడ్‌నైట్! రే ప్పొద్దుటే ప్రయాణం కదా!" అని తన గదికెళ్ళిపోయింది, నేను నా తన్మయత్వంలోంచి తేరుకునే లోపలనే.

మర్నాడు అయిదున్నరకే మెలకువ వచ్చింది. స్నానాదులు త్వరగా కానిచ్చి, తయారయ్యేసరికి ఏడయింది. ఏడున్నరకి గెస్ట్‌హౌస్ కుర్రాడు ఇడ్లీ, కాఫీ పెట్టి వెళ్ళిపోయాడు.

ఎదురు గదే కనుక వెళ్లి తట్టాను. పది నిముషాలైనా జవాబు రాకపోయేసరికి స్నానం చేస్తోందేమోనని మరో పది నిముషాలాగి మళ్లీ తట్టాను. ఈసారీ బదులు రాకపోగా, కాస్త గట్టిగా తట్టేనేమో తలుపు గడియ లోపల వెయ్యనందున మెల్లిగా

తెరుచుకుంది. నేరుగా తన గదికి వెళ్ళి చూసేసరికి చకితుడినైన నా నోట 'మున్నీ' అన్నమాట రాబోయింది కాని మాట పెగల్లేదు.

నేను చూసిన దృశ్యం విజ్ఞానవేత్తలనే ఆశ్చర్యంలో ముంచి వేయగలదు. అదే పంజాబీ డ్రెస్, అవే మల్లెలు, కానీ... కానీ... ముంతాజ్‌కి బదులు... ఒట్టి ఎముకలూ... పుర్రెకి తొడిగిన ఆ పంజాబీ డ్రెస్!

'నమ్మశక్యం కాని ఈ నిజాన్ని ఎలా నమ్మటం? పక్కనే టేబుల్‌పైన రెపరెప లాడుతోందొక ఉత్తరం. నిస్సందేహంగా డా. ముంతాజ్ దస్తూరితో. వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ చదవసాగాను.

డియరెస్ట్ మూర్తీ!

ఈ నిజాన్ని నువ్వు నమ్మలేవు. కానీ, ఇది నిజం. పూర్వజన్మ జ్ఞానం గల నేను అమెరికా వచ్చింది ఎందుకో తెలుసా? నిన్ను నా గులామ్‌గా, నన్ను జహన్నారాగా ఎరిగిన నేను... నీతో మళ్లీ ఈ జీవితంలో నీ భార్య నవాలనీ. కానీ, నాలో ముంతాజ్‌గా జన్మ నెత్తిన ఆత్మ ఇది విజ్ఞాన పరంగా ఎంత వాస్తవం కాగలదో అని ఉవ్విళ్లూరింది. అక్కడే నాలో ఉన్న జహన్నారా ఇప్పటి నా ముంతాజ్ అంతరాత్మతో సహకరించలేదు. అంతిమ పోరాటంలో ఓడిపోయింది ముంతాజ్. ఇక జహన్నారా నీకు కనిపించదు. నా కృషి విజ్ఞాన పరంగా సఫలీకృతమైనది. జహన్నారా అతీతశక్తుల వలన వట్టి బొమికలే మిగుల్తాయి. వాటి 'డిఎన్ఏ'లు రీకాంబినెంట్ టెక్నిక్‌తో జతపర్చి చూడు. ఇది విజ్ఞానపరంగా నిజమని నీకు తెలుస్తుంది. నిరూపిస్తుంది. ఇది నా ఆఖరి కోరిక. మన్నిస్తావని తలుస్తాను. ఇన్నాళ్లూ ఈ విషయం నీ వద్ద గుప్తంగా ఉంచింది నిన్ను కలవరపెట్టకూడదనే. మా నాన్నకి ఈ ఉత్తరం, ఎముకలు అందచేయ ప్రార్థన. నీ పరిశోధనకు, నా జ్ఞాపకార్థం ఒక్క 'హ్యూమరస్' ఉంచుకో. ఇక ఉంటా... మరో జన్మలో... జన్మ జన్మలకీ నీకే భార్యనవాలనే నా కోరిక నాలో ప్రబలంగా ఉండిపోయింది.

శెలవు

నీ ముంతాజ్"

ఆమె కోరిన ప్రకారము ఆమె తండ్రికి ఫోన్ చేసి పిలిపించి కార్యక్రమం అంతా ముగించాను. 'డిఎన్ఏ' టైపింగ్‌లో ఆమె చెప్పింది అక్షరాలా నిజమని రుజువైంది. మరో జన్మ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాను.

# నన్నెందుకు ప్రేమించావు?

ఆఖరి దమ్ము లాగి పైప్ ఖాళీ చేసి యాష్ ట్రేలో బూడిద గుమ్మరించాను. ఎడ్మాంటన్, ఆల్బర్టా, కెనడా. అతి సుందర ప్రదేశం. చలి, ముద్దలు ముద్దలుగా కురిసే మంచు. పెద్ద గ్లాస్ పిక్చర్ విండో తెర లాగి ఆ సుందర దృశ్యం కాసేపు అలాగే చూస్తూ నన్ను నేనే మరిచి పోయాను. స్వదేశం వదిలి పదేళ్ళయుంటుందేమో?! కానీ, ఆ పదేళ్ల క్రితం సర్జరీ ఎం.ఎస్. పూర్తి కాగానే మొదటిసారి మారుమూల కోనసీమలో కొండల అంచుల్లో, పచ్చటి పైర్లు వంకరటింకరగా కొండను ఆనుకుని ఉన్న ఆ పల్లెటూళ్లలో – అందరు పల్లెటూళ్లు వెళ్లాలంటేనే వెగటుగా మొహం పెట్టే రోజుల్లో నేనుగా కోరిన ఊరది.

నాలోని భావుకత, నాలోని కవి, నాలోని రసికత్వం ప్రోద్భలించిన ఉద్రేకం.

శాశ్వతమైన, సహజమైన ఉద్రేకం అది.

ఏదో పొడిచేయాలని ఉవ్విళ్లూరే మనస్తత్వం కాదు నాది. ఏది చేసినా త్రికరణ శుద్ధిగా, మనస్ఫూర్తిగా చేయాలనే సంకల్పంతో చేసినవే. కొంతవరకు జీవితం వడ్డించిన విస్తరనే చెప్పొచ్చు. పరిమితి లేని పరంపరగా ఆస్తిపాస్తులు. తల్లిదండ్రుల్ని చిన్ననాడే కోల్పోయినా కంటికి రెప్పలా చూశాడు మా మేనమామ. నా కోసం ఆ చిన్న పల్లెలో తల్లిదండ్రులు వదలిపోయిన డబ్బును సక్రమంగా నాకు చెందేటట్లు చేయటమే కాకుండా నర్సింగ్ హోం కూడా కట్టించి ఇచ్చాడు.

శ్వేతని, కేవలం సహాధ్యాయినిగా చూశానే తప్ప ఎన్నటికీ పెళ్లాడే తలంపు లేకపోవటం వలన నన్ను ప్రాణ ప్రదంగా ప్రేమించిన ఆమెకు సున్నితంగా, ఆమె గాయపడకుండా, మేనమామ కూతురైన ఆ విధంగా నొప్పించకుండా నచ్చచెప్పాను.

అర్థం చేసుకున్న తను (అప్పటికే తనకు ఎం.ఆర్.సి.ఓ.జి) లండన్‌కి వెళ్ళిపోయి అక్కడే ఈనాటి వరకు స్థిరపడిపోయింది. పెళ్ళి చేసుకోలేదు. నర్సింగ్‌హోం తెరిచిన రెండేళ్లకు మేనమామ పోయాడు. మేనత్త ఏనాడో పోయింది. శ్వేత ఒకతే కూతురు. నేను మా తల్లిదండ్రులకు ఏకైక కుమారుణ్ణి. ఇద్దరి గమ్యాలు వేరయ్యాయి.

మంచి కీర్తి, పేదలకు ఉచితంగా వైద్యం చేయటం, ప్రేమాభిమానాలతో ఎంతిస్తే అంతే పుచ్చుకోవటం వల్ల ఆ చిన్న పల్లెటూరికి, చుట్టూ ఉన్న గ్రామాలకీ ఆఖరికి కొండజాతి గూడేనికి దగ్గరగా కొండ అంచుల్లో, పల్లాల్లో నా నర్సింగ్ హోం ఉండటం వలన అతి ప్రీతిపాత్రుడనయ్యాను. అటువంటి ఆ రోజుల్లో ఒక్క సంఘటన

నన్ను పూర్తిగా కదిలించి వేసింది. పదేళ్ల నాటి పాత స్మృతులను గుర్తు చేసింది. ఎన్నిసార్లు మరిచిపోదా మన్నా మరువలేని జీవితపు గీటు రాళ్లవి.

చెంచి నా జీవితంలో చెరగని ముద్ర వేసింది. ఆమె అమాయకపు సహజత్వం ఉట్టిపడే సొట్ట బుగ్గల నవ్వు. పరిపూర్ణమైన ఆరోగ్యం, మిసమిసలాడే యవ్వన తారళ్యం. అంతులేని అందం, చక్కటి పలువరస, రంగు రంగుల దుస్తులు, మాటి మాటికీ మొహం పైన పడే ముంగురులను సుతారంగా వెనక్కి తోసే ఆమె అందమైన చేతులు, ఆ రంగు దుస్తుల మాటున దాగలేని ఆమె బలిష్టమైన వక్షోజాలు, సన్నని నడుము- ఆమె అందచందాలు ఇలా చెప్తూ పోవచ్చు ఎన్ని యుగాలైనా. మా కలయిక విచిత్ర పరిస్థితులలో జరిగింది.

కోయ జాతి వాళ్లలో ఇంత అందం ఉంటుందని నాకు ఆమెను మొదటిసారి చూసినపుడు కానీ అనిపించలేదు. ప్రతి శని, ఆది వారాలు పూర్తిగా విశ్రాంతి తీసుకునేవాణ్ణి. అంటే ఇంట్లో పడుకోవటం కాదు. ప్రకృతి అందాలను తిలకించడానికి నా జీప్‌లో కొండ అంచునుంచి అడవుల్లో, కొండ జాతి గూడేల దగ్గరగా ఉండే చిట్టడవుల్లో, కొండ చిగురుల్లో బండలపై కూర్చొని బైనాక్యులర్స్‌తో కొంగల బారును, లోయలోకి పారే సెలయేటిని, పచ్చని పైర్లను, గాలికి నాట్యమాడే వాటి ఊపులను, రంగురంగుల విరగపూసిన అడవి పూలను తిలకిస్తూ, తీపి పండ్లను కోసుకు తింటూ రోజంతా గడిపేవాణ్ణి. మధ్యాహ్నానికి చెట్టు నీడలో రెండు చెట్లకి మధ్య 'హమక్', చేదుకుని కునుకు తీసేవాణ్ణి. క్రూరమృగాలు లేని చిట్టడవి అది. కృష్ణశాస్త్రి కన్నా మల్లెపూలు, గోదావరి గురించి రసికంగా రాయగలిగినవారెవరు అనిపిస్తుంది. ఇంకా పాలగుమ్మి వారి పాలనురుగులాంటి పాటలను కృష్ణశాస్త్రి రాయగా, సరళగారు సరళంగా పాడగా, నలుగురిలో వింటూ ఆనందించేదే నాకు జీవిత పరమార్థం. ఇదే నాకు నచ్చే జీవితం. 'చలం, బుచ్చిబాబు, మధురాంతకం రాజారాం. హవిస్, ఆదివిష్ణు, సింగరాజు లింగమూర్తి' ఇవీ కథలంటే, కథలు చెప్పగలగటమంటే. తుచ్ఛమైన బూతు సాహిత్యం, కాలుష్యం, పాశ్చాత్య వాసనలేని రోజులు. ఆ రోజు మధ్యాహ్నం యథాప్రకారం శనివారం నా హమక్‌లో విశ్రమించి నాలుగ్గంటలకు నేలమీద కాలు మోపాను.

ఎండుటాకులపై జరజర చప్పుడు, చురుక్కుమని కాటు. ఏమైందో తెలుసు నాకు- నాగరాజు సరసరమని అయిదడుగుల తన పొడుగుని చెట్ల మాటుకు తప్పించినపుడే. చప్పున నా చొక్కా చింపి కాటుకు రెండు వైపులా గట్టిగా కట్టు కట్టి పండు కొయ్యటానికి తెచ్చుకున్న చిన్న కత్తితో కాటుని గీరాను.

అబ్బ! నొప్పి! అయినా లాభం లేదు.

ఎంత త్వరగా విషం బయటకు పొయ్యేట్టు చెయ్యగలనో అంత ప్రాణాపాయం తక్కువ.

నోటితో ఆ గీరిన చోట రక్తాన్ని పీల్చి ఉమ్మేయాలి. నోరు నీటితో పుక్కిలించి మళ్లీ మళ్లీ రక్తస్రావం ఉన్న చోట ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ ప్రథమ చికిత్స చేయాలి. కానీ నా కాలికి నా నోరందదు. నీరసం ఒక్కసారిగా ఆవహించింది.

శక్తి అంతా కూడగట్టుకుని, "అబ్బా! అమ్మా!" అని అరిచాను.

స్పృహ తప్పిపోతున్నానని తెలుసు.

మసకలో ఎవరో రావటం, రెండు మెత్తటి చేతుల్లో నేను వాలటం నాకు మగతగా గుర్తు.

❖ ❖ ❖

నేను కళ్లు తెరిచేసరికి కాగడాలు పెట్టిన ఒక విశాలమైన వెదురు బొంగులతో కట్టిన పర్ణశాలలో ఉన్నాను. పక్కనే బుర్ర మీసాలూ, మొహానికి రకరకాల రంగుల చారలతో, తాటాకుల కిరీటంతో భయంకరంగా కనిపిస్తూ ఒక స్థూలకాయుడు, అతని పక్కనే ఓ జవ్వని!

"అయ్య! లేచిండు." ఆమె పలికింది.

స్థూలకాయుడు సూటిగా కళ్లలోకి చూసి "అయ్యా! నాగుపాము కాటేసి ప్రాణాపాయంలో ఉంటిరి. పసరు పూసి కట్టు కట్టినాది. ఇంకో రెండ్రోజుల్లో ఆరిపోద్ది. ఇది నా కూతురు చెంచి, తల్లి లేని పిల్ల. గారాబంగా పెంచినాను. నే నీడ గూడేనికి కోయ దొరను. బాగా అలసినట్టుండారు. కాస్త ఈ తేనె, పండ్లు తీసుకోండి. మల్ల రేపు నయమయినాక పోదురుగాని. కొండంచున ఆస్పత్రి మీదే ననుకుంటాను. మీలాంటి గొప్పోళ్ళకి ఈడ కాస్త కట్టంగానే ఉంటది. మన్నించాల" అని చెంచి కేసి తిరిగి "బాబు గోరికి ఏం కావాలో అదిచ్చి నయమయ్యేదాక సూసుకో!" అని, "వత్తా బాబూ! ఆకలవుతే సెప్పండి. మా కాడ ఉన్నంతలో మీ ఆకలి తీరుత్తాం. దండాలు!" అని వెళ్లిపోయాడు.

కాలికి కట్టు.

లేవబోతే జివ్వుమంది.

"నే నాడడవికి పువ్వులు కోయటాని కొస్తిని దొరా! నీ వరచిన అరుపు విని వచ్చి సూసిన. గిలగిల లాడ్తా ఉంటివి. ఆడనే ఉన్న కొన్నాకుల పసరు పూసి కట్టు గట్టిన. పాము కాటుకి మా గూడెంలో ఆ యాకు పసరే ఏత్తరు!" అమాయకమైన కళ్లు తిప్పుతూ గుక్క తిప్పుకోకుండా చెప్పింది చెంచి.

"మరి... నా జీపు... అదే బండి?"

"ఆడనే ఉండది దొరా! మా గూడెం సుట్టుపక్కల ఎవురూ పరాయోల్ల సొత్తు తాకరు. ఇయిగో ఈ పాలు, పండు తినండి దొరా!"

కాళ్ళ గజ్జెలు ఘల్లు ఘల్లు మని చప్పుడు చేసుకుంటూ ఒక అరటి ఆకులో రకరకాల తీపి పళ్లు, వెదురుబొంగు లోటాలో చిక్కటి పాలు ఇచ్చింది. ఈ ఆతిథ్యం, వారి అమాయకత్వం, తోటి వారి మీద ఆపేక్ష, ఆదుర్దా నన్ను మురిపించాయి. ఇలా మొదలైన మా స్నేహం మూడు రోజులలోనే మొలకెత్తి చిగుళ్లు తొడిగింది. మూడో రోజు కోయ దొర నన్ను మరొక రెండ్రోజులుండి పొమ్మన్నాడు. గూడెం అంతా తిప్పి చూపించాడు. అందరికీ 'డాక్టరు బాబుగోరు'గా పరిచయమయ్యాను. చెంచిని నా జీపు దాకా వదలి రమ్మని పంపాడు. ఈ ఆతిథ్యానికి ముగ్ధుడనయ్యాను. నాలో నాకే తెలియకుండా చెంచి పట్ల ఒక రకమైన అనురాగం మొదలైంది. అన్నిటికంటే ఆమె అమాయకత్వం, స్వచ్ఛత నన్ను ఇట్టే ఆకట్టుకున్నాయి.

ఆనాడు మొదలు ప్రతి శని, ఆదివారాలు అదే చోట అంటే, నన్ను పాము కాటేసిన స్థలంలో మేం కలుసుకోవటం– ముచ్చట్లు, నవ్వులాటలు, అడవంతా కొట్టిన పిండిగా తెలిసిన చెంచి నాకు తిప్పి చూపించటం, ఏనాడైనా ఆమె కాలు జారి పడబోతే నడుమో, భుజమో పట్టి ఆపటం, ఆ తర్వాత ఆమే అప్పుడప్పుడు కావాలని నామీద వాలటం, చేయి చేయి కలిపి నడిచి పోవటం, చీకటి పడి వెన్నెల వచ్చేవరకు జీపులోనే ఒకరి కళ్ళల్లోకి ఒకరు మత్తుగా చూసుకోవటం, మెత్తని మల్లెలు నా మెడని రాసుకుంటుంటే ఆర్తిగా ఆమె దొండపండంటి పెదాల్ని ముద్దెట్టుకోవడం, ఆమె నా జుట్టు సవరించడం – ఇవన్నీ ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత దూరం వచ్చింది.

ఒకనాడు నన్ను గాఢంగా చుంబించి, "దొరా! ఇక మనం మనువాడాల. నే నిన్నొది లుండలేనయ్యా!" అని మత్తుగా నా కళ్ళలోకి చూస్తూ అంది. నేను ఆమెనే పెళ్లాడతానని దృఢంగా నిశ్చయించుకోవటం వల్ల ఆ మర్నాడే కోయదొర కొండయ్య, ఆమె తండ్రితో ఈ విషయం చెప్పాము.

మొదట అతను ఆశ్చర్యపోయినా, తేరుకుని – "దొరా! గూడెంలో మనువాడాలంటే ఈడ నే నెంత జెప్తే అంతే! నీవు సదూకున్న పట్నపోడివి. ఒయసు వేడి తగ్గాక మనువాడిన నా చిట్టి తల్లిని ఒగ్గేయకు బాబూ! పట్నపోల్ల దరికి అందుకే మేము పోము. కానీ మా చెంచి మీ మీద విపరీతంగా ఆశ పెంచుకుంది. మాలో ఆసారం.. జాతరమ్మ ఇగ్రహం గూడెం నడిమద్దె నున్నది. ఆ ఇగ్రహం కాడనే దండలు మార్చుకోవాల. పన్నెండు కోళ్లని బలీయాల. తేనె, పాలు గూడెపోల్లందరికీ పొయ్యాల.

ఈ ఆసారం తరతరాలుగా ఒత్తున్నది. పిల్ల, మనువాడినోడు మాకాడనే ఉంటారు. కానీ మీరు పెద్దోల్లు. ఆస్పత్రి డాట్టరు. మీ ఇసయంలో చెంచి మీ కాడనే తొంగుంటాది."

అన్న ప్రకారమే పది రోజుల్లో వినోదాలు, వేడుకలు, కోయజాతి నృత్యాలతో జాతరమ్మ తల్లి విగ్రహం ముందు మా పెళ్లి జరిగింది.

గూడెం నాయకుడి కూతురవటం వల్ల గూడెం మొత్తం గుమిగూడింది. నాకూ వాళ్లు కట్టే కట్టుగుడ్డలు, తాటాకులు తొడిగి రంగులు పులిమారు. వేడుకలన్నీ అయ్యాక మా కని ఏర్పాటు చేసిన వెదురు ఇల్లు ఏడడుగుల ఎత్తులో చెట్టుకొమ్మల నడి మధ్యన అందంగా కట్టారు.

తాడుతో చేసిన నిచ్చెన ఎక్కి నేనూ, చెంచి వెళ్లాము. ఆ వెన్నెల, మా ఏకాంతం, యవ్వనపు ఉద్రేకం. చెంచి నన్ను మాట్లాడనీయలేదు. ముద్దులతో మా వయసు వరదలో అర్ధరాత్రి దాకా మా తొలి రాత్రి ప్రణయం.

మత్తుగా నన్ను హత్తుకుపోయిన చెంచి చెవిలో "నన్నెందుకింత పిచ్చి ప్రేమలో పడేశావు చెంచీ! నిన్నెన్నడైనా వదలి ఉండగలనా? నన్నెందుకు ప్రేమించావు?" అంటూ ఆమెను దగ్గరకు లాక్కున్నాను.

నన్నల్లుకుపోతూ "నా రాజా! నా దొరా! నిన్ను, నీ నీడను నాలో చూసుకోవాలి, దొరా!" అంటూ, నా తలని తన హృదయానికి హత్తుకుంది.

కానీ కథ అలా సుఖాంత మయ్యుంటే నేనిలా దేశాన్ని, ఆ మారుమూల సుందర ప్రదేశాన్ని వదిలేవాణ్ణి కానేమో?

ఎనిమిదో నెల చెంచికి. మా ప్రేమజీవితం సుఖశాంతులతో ఉండటం వలన, నర్సింగ్ హోం పక్కనే ఇల్లుండటం వలన ఏ కష్టం లేకుండా గడచిపోయింది. నేనే ఆమెను పరీక్ష చేసి, నేనే ప్రసవం చేయాలనుకున్నాను. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలూ ఉండటంవల్ల అక్కడే పురుడు పోయాలని అనుకున్నాను. కానీ చెంచి అందుకు ఒప్పుకోలేదు. వాళ్ల ఆచారం ప్రకారం జాతరమ్మ విగ్రహం పక్కనే ఉన్న పర్ణ కుటీరంలోనే – నాయకుడి కూతురవటం వలన వాళ్ల మంత్రసాని పోయాలని! నేనక్కడే ఉంటే అభ్యంతరం లేదట. డాక్టర్నవటం వలన ఎందుకైనా మంచిదని పోర్టబుల్ స్టెరిలైజింగ్ కిట్, చిన్న పోర్టబుల్ ఆటో క్లేవ్ (బాటరీతో పనిచేసేది) సర్దుకుని నా జీపులో తొమ్మిదో నెల నెప్పులు ప్రారంభమవగానే తీసుకువెళ్లాను అన్నమాట ప్రకారమే.

అదే కుటీరంలో ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకుని ఆమె తండ్రి మంత్రసానితో సహా కాచుకుని ఉన్నాడు. నేను ప్రసవ సమయంలో పక్కన ఉండి

మంత్రసానికి సాయం చేశాను. చెంచి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ బాగానే ఉన్నారు.

కానీ... కానీ...

ఉన్నట్లుండి పదవరోజున పట్ట పగలు...

చుట్టూ ఆమె తండ్రి నేను అంతా ఉన్నాము.

"దొరా! జాతరమ్మ పిలుత్తున్నది. మే మిద్దరం ఎల్లిపోవాల!" ఆదుర్దాగా చెప్పి నన్ను దగ్గరకు రమ్మని సైగ చేసింది.

చెవిలో "నా రాజా! దిగులెట్టుకోక. జాతరమ్మ మా ఇద్దర్నీ రమ్మన్నది. మా గడువు తీరిపోయింది. ఇప్పుడు జరగబోయేది ఎట్టసెప్పేది? నాకోసం, బిడ్డ కోసం బెంగెట్టుకోక, రాజా! దూరంగా జరగండి!" నన్ను దూరంగా నెట్టేసి బిడ్డను హత్తుకుని దగ్గరగా తీసుకుంది.

కోయదొర ఖ్రమాన్నడి నోట మాటరాక చూస్తున్నాడు.

అంతే!

సెగ.

వేడి లేని భగ్గుమని ఒక నీలంరంగు మంట.

గుప్పెడు బూడిద కూడా మిగలని మంట.

విజ్ఞానానికి అందని కనీవినీ ఎరగని వింత.

ఎస్!

ఎక్కడో నేను చదివాను.

జ్ఞాపకం వచ్చింది. 'నేచర్' అనే ఒక పాశ్చాత్య విజ్ఞాన శాస్త్ర పత్రికలో ఇటీవలి సంచికలోనే! బదులు దొరకని అతి వింతైన ఫెనామినా! పారానార్మల్! నా చెంచిని దక్కించుకునే మార్గం లేదు.

ఇది కచ్చితంగా అదే!

స్పాంటేనియస్ హ్యూమన్ కంబశ్చన్ (తక్షణ మనుష్య భస్మీకరణమని అనొచ్చేమో)

మన శరీర రసాయనాల అర్థం కాని రాపిడికి కలిగే వేడి!

సెగ లేని వేడితో చెలరేగే సంహార జ్వాల!

మై గాడ్!

నా జీవితానికే అవ్వాలా?

అయిపోయింది. తల్లీ, బిడ్డా- ఇద్దరూ భస్మమైపోయారు. కోయ దొరని ఓదార్చలేకపోయాను. ఇద్దరం కలిసి మిగిలిన పిడికెడు బూడిదతో వారి ఆచారం ప్రకారం చేయవలసినదంతా చేశాము. మనసు విరిగిన నేను ఆ అంశం మీద రిసెర్చి స్కాలర్‌షిప్ సంపాదించుకుని కెనడా వెళ్ళిపోయాను. ఒక ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్నిపుడు. అదే అంశం మీద రెండు వందల పేపర్లు... పదేళ్లలో దేశ విదేశాలలో సదస్సులు.

కానీ మళ్లీ పెళ్ళి తలపెట్టలేదు. ఈనాటి వరకు ఆ జ్వాలకి వేడిలేని స్పాంటెనిటీ, నా హృదయ రాణిని పొట్టన పెట్టుకున్న ఆ పారా నార్మల్ ఫెనామినాకి అర్థాలు వెతుకుతూ నా ఒంటరి ప్రయాణం.

లోకానికి దీని లోతు విడమరిచి చెప్పిగానీ ఆఖరి శ్వాస విడవరాదనే మొండి పట్టుదలతో

"నన్నెందుకు ప్రేమించావు చెంచీ?" అని కన్నీటితో నిట్టూరుస్తూ...

అదే... అదే...

ఒంటరి ప్రయాణం!

# ఓ జాజి పువ్వు కథ

అది ఒక అతిసుందరమైన పల్లె. కర్ణాటకలో బెంగుళూరికి మరీ దగ్గరకాని, కొండల మధ్య చల్లని వాతావరణంలో పచ్చటి అందమైన పైర్లతో, పిల్లగాలులతో రకరకాల ఫలవృక్షాలుండే కొండ అంచున చిట్టడవికి దగ్గరగా, రంగురంగుల గుల్‌మొహర్, గులాబీ మందారాలు విరగబూసే చోట ఇరవై గుడిసెలు, మూడు పెద్ద ఇళ్లూ గల అందాల చిన్ని పల్లె. ఆ మూడు భవనాలలో ఒకటి అధునాతన సౌకర్యాలుండే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చి వారి ప్రయోగశాల, ఆఫీసు, విసిరేసినట్లుండే మూడు చిన్న క్వార్టర్సు అన్నీ ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. బయట 'ఐసిఎమ్ఆర్ ఫీల్డ్ రీసెర్చి సెంటర్' అనే బోర్డు మట్టుకే ఉన్నది.

కానీ అక్కడ పనిచేసే వైజ్ఞానికులు మొత్తం ముగ్గురే అయినా, అపారమైన అనుభవం, తెలివితేటలు, ఒక్కొక్కరికి రెండు వందలపైగా రీసెర్చి పబ్లికేషన్లు ఉన్నాయి. ఇద్దరు వైజ్ఞానికులందులో అమెరికాలో బ్రూక్లిన్ మెడికల్ స్కూల్ డివిజన్ ఆఫ్ సైకియాట్రీలో పిహెచ్‌డిలు చేసి తర్ఫీదు పొందిన వారైతే, ఒకామె న్యూజిలాండ్ ఒటాగో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ మెడిసిన్‌లో డివిజన్ ఆఫ్ బయోటెక్నాలజీ, డ్యూనడిన్ అనే చోట పి.హెచ్.డి., తర్ఫీదు పొందిన వెటర్నరీ సర్జన్. డాక్టర్ అమరేంద్ర ఉత్తర దేశస్థుడు. మెడిసిన్, సైకియాట్రీలలో తర్ఫీదు పొందిన ఉద్దండుడు. యాభై ఐదేళ్లుంటాయి. బ్రహ్మచారి, నెరసిన సైడ్‌బర్న్సు. ఎప్పుడూ ఏ లోకంలోనో ఉంటూ లేబొరేటరీనే కోవెలగా తలచే జ్ఞాని, ఆ యూనిట్‌కి అధిపతి. మరొకాయన డాక్టర్ శ్రీవాస్తవ డెంటల్ సర్జన్, న్యూరో సైన్స్‌లో పిహెచ్.డి., ముప్ఫై ఐదేళ్ల చలాకీ మనిషి. ఈ మధ్యనే ప్రేమ వివాహం, అమెరికాలో తన సహ ఉద్యోగిని, ప్రస్తుత తన సహచరిణి. ఈ ప్రాజెక్టులో ఆరితేరిన పారా సైకాలజిస్టు, పిహెచ్.డి., బేసిక్‌గా వెటర్నరీ సర్జను లీల.

ముప్ఫై ఏళ్ల డాక్టర్ లీల అసమాన జ్ఞానమూ రెండు వేర్వేరు సబ్జెక్టుల్లో పిహెచ్‌డీలూ, రెండవ సబ్జెక్ట్ పారాసైకాలజీ పిహెచ్‌డి అమెరికాలో చేస్తున్నప్పుడు కలిగిన శ్రీవాస్తవ పరిచయం ప్రేమగా మొలకెత్తి పరిణయమాడిన చాలా అందమైన తెలుగు పడతి లీల. వీరు ముగ్గురూ స్వదేశానికి రాగానే ఫుల్ ఆఫీసర్లుగా కొన్నాళ్లు పనిచేశాక వారి ప్రతిభను గుర్తించిన ఐసిఎంఆర్ ఉద్యోగాలకు మారుమూల రీసెర్చి సెంటర్ నెలకొల్పడానికి వెంటనే ఉత్సాహంగా ఒప్పుకున్న వైజ్ఞానికులు. ఈ

మారుమూల ఒక వంద సంవత్సరాల క్రితం జరిగిన వైజ్ఞానికపరమైన యథార్థ సంఘటనే వారి పరిశోధనకి మూలం. ఈ సుందర ప్రదేశంలో ఒక నూరు ఏళ్లు వెనక్కి వెళ్లి చూస్తే...

మల్లిక పుట్టినప్పట్నుంచే జాజిమల్లెలంటే ఇష్టమా అన్నట్లుండే ఇరవైయేళ్ల అందాల జవ్వని. పాలేరు ఈరయ్యా, రత్తికి కలిగిన ఒకే ఒక సంతానం. మల్లికి పెళ్లీడు రాగానే దాని మామ పాలేరు రంగయ్యనిచ్చి పెళ్లి చేశాడు ఈరయ్య. ఆ పచ్చటి పైర్లలో పనిచేసే ఈ నలుగురి ముచ్చట సంసారంలో మూడేళ్లలో ఏడుగురయ్యారు. కొండ అంచున పచ్చటిపైర్ల పక్కనే ఈరయ్య సంసారం. ముళ్ల కంచెతో అందంగా చుట్టూ ప్రహారీగోడలా కట్టారు. మధ్యలో రెండు గుడిశెలు. ముందు మల్లె పందిరి. మరో పందిరిపై అల్లుకున్న కాకర, గుమ్మడి తీగలు, మందార, బంతిపువ్వులు విరగబూసే చిన్నతోట, వెనకవైపు దొడ్డిలో అరటి, బెండ, వంకాయ, పొట్లకాయ పాదులు, రెండు కొబ్బరి చెట్లు, కారట్‌లూ ఇంకా ఏది వేసినా పండే బంగారపు నేల అది. కొత్తిమీర, కందగడ్డలూ; ఒకటేమిటి– కంచె వారగా చల్లటి నీడ నిచ్చే చింతమాను, దానికి కొబ్బరి తాడుతో మల్లి కట్టిన ఊయల. పెద్దకామందు ఆ ఊరి పెద్ద. ఈ మధ్యనే కరణీకం చేపట్టిన యాభై యేళ్ల బుర్ర మీసాల నర్సింగులు సొంతదారైన పొలాల్లో, ఈరయ్య రంగయ్య పాలేర్లయితే ఆ ఊరి మూడిళ్లలో ఒక భవంతిలో ఎనిమిది మంది పిల్లలూ, భార్య, తల్లిదండ్రులతో నివసించే నర్సింగులు ఇంట్లో రత్తి, పాచి పనులు చేస్తే, గుడిశెలోనే ముగ్గురు పిల్లల్ని చూసుకుంటూ ఉన్న ఆరు గొర్రెల్నీ కొండంచులో మేపుకుంటూ, వంటా వార్పు చేసుకుంటూ తీయని కోయిల కంఠంతో పాడుకుంటూ ఏ బాదరబందీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా సంసారం చేసుకుంటూ ఉండే మల్లికి, రత్తికి మశూచికం వచ్చిపోవటంతో రత్తి చేసే పాచి పని అంతా నెత్తిన పడింది. రత్తి పోవటంతో పిచ్చెత్తిపోయిన ఈరయ్య ఆర్నెల్లలో దివంగతు డయ్యాడు.

ఇక మల్లి, రంగయ్య మొదట్లో బెంబేలెత్తిపోయినా నెమ్మదిగా అలవాటుపడ్డారు. రంగయ్య పొలం పనులకి సాయపడే ఈరయ్య లేకపోవటంతో రంగయ్యకి పనులతో రోజంతా తలమునకలయ్యేది. రోజుకి రెండుసార్లు, అంటే ప్రొద్దుటే పిల్లలు లేవకమునుపే సూర్యోదయానికి ముందే చిట్టడవి పక్కనే కొండ అంచు నుండి ధారగా ఎవరో కడవలతో పంపినట్లు పడే తీయటి నీళ్ల ధార క్రింద (జలపాతం) రాళ్లపై ఇద్దరూ స్నానం చేసేవారు. సాయంకాలం మళ్లీ విడివిడిగా వేర్వేరు సమయాల్లో పనులు ముగించుకున్నాక చీకట్లు అలుముకునే వేళల్లో ఆరున్నర ఆ ప్రాంతాల్లో మళ్లీ – ఇదే దినచర్య వారిద్దరికీ. మధ్యాహ్నం సంకటి పొలానికి మల్లి కట్టుకెళ్తే చెట్టు నీడన

పరాచికాలతో, నవ్వులతో ఆ అమాయక కష్టజీవులు, ప్రేమికులు ఉన్నది తినేవాళ్లు. రాత్రి జాజి పందిరి క్రింద మంచం, వెన్నెల. పిల్లల్ని జోకొట్టాక, ఆ వెన్నెల్లో చంద్రుణ్ణే మైమరపించే వారి ప్రణయం యవ్వనానికి సేద. కానీ విధి ఎప్పుడూ ఒకేలా ఉండదేమో?

ఆ రోజు, రంగయ్య ఏదో పట్నం పనికై ఊరెళ్లాడు సాయం సంధ్యవేళ. పడమటి దిక్కున కొండలమాటున ఎర్రటి సూర్యుడు తన కోపాన్ని కాస్త కాస్తగా తగ్గించుకుంటూ జారుకుంటున్నాడు. ఆరున్నర, ఏడు, ముసురు చీకట్లు అప్పుడే అలముకుంటున్నాయి. మల్లి చెంగు చెంగున పరిగెత్తుతూ వచ్చింది. పిల్లలు ఆడుకుంటున్నారు, ఆమడ దూరంలో ఉన్నా తమ గుడిశె దగ్గర. ఎందుకో మల్లికి ఆ రోజు విపరీతమైన సంతోషంగా ఉన్నది. అల్ప సంతోషి మల్లెమ్మ. అవును మరి, మరో రెండ్రోజుల్లో మావ పట్నం నుంచి జాకెట్టూ, చీర, పోయినమారు తెచ్చిన వాసన సబ్బూ అన్నీ తెస్తానన్నాడు. సబ్బు అప్పుడే సగం అరిగిపోయింది. ఇలా అనుకుంటూ చీర విప్పి ఎత్తైన బండపై ఉండచుట్టి పెట్టింది. పక్షులు కొమ్మలపై పకపకలాడాయి. ఒట్టి లంగా, జాకెట్టుతో పరిగెట్టి జలధార జలాశయం (వాటర్ ఫాల్స్) కింద నిలబడింది. కాసేపు విడదీసిన జుట్టు బాగా తడుపుకుంది. పక్కనే మరో బండపై పెట్టిన సువాసన గల సబ్బు తీసి మొహానికి రుద్దుకుంది. మొహం బడాబడ పడే నీళ్ల క్రింద కడుక్కుంది.

ఎవ్వరూ లేని ఏకాంతం. పక్షుల సందడి. సాయం సమయం, పిల్లగాలులు. బడలిక తీరేదాక తృప్తిగా స్నానం చేసి జాకెట్టు, లంగా పిండేసింది. జుట్టు చీరతో తుడిచి మారు తెచ్చుకున్న పొడి బట్టలు నింపాదిగా తొడుక్కుంటుండగా చాలా దగ్గరలో వినపడ్డాయి ఆమెకు రహస్యంగా ఆ బొంగురు మాటలు.

"నేను తొడిగిపెట్టనా పోనీ?!..." ఒక వెకిలినవ్వు, ఆమె ఉలిక్కిపడి తేరుకునే లోపల వెనుక నుంచి రెండు పెద్ద చేతులు ఆమెను బిగించేశాయి. గిలగిల లాడింది, అరిచింది. గీరింది. వినే నాథుడెవ్వడూ లేడక్కడ. అపుడు చూసింది కామంతో మత్తెక్కి మదపుటేనుగులా తనను ఆక్రమించి, తోసినా లెక్కచేయక శబ్దంతో ముద్దులెడుతున్న ఆ కొండచిలువ కరణం నర్సింగులు మొహాన్ని. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. చంద్రుడు ఈ ఘోరాన్ని చూడలేక మబ్బుల చాటుకి తప్పుకున్నాడు. మల్లి జాజిమల్లిలా నలిగిపోయింది ఆ కామాంధుడి క్రింద.

మల్లి నర్సింగు లింట్లో పని మానేసి, ముభావంగా అయిపోయింది. ఈ పరాభవం గురించి ఎలాగో మొగుడికి తెలిసింది. క్రోధంతో రంగయ్య కొడవలి పట్టుకుని నర్సింగుల్ని పొలం దగ్గర కాపు కాసి అంతం చేయాలని వెళ్తే ఎప్పుడూ నర్సింగుల్ని

వెన్నంటి కాపలా ఉండే మనుషులు రంగయ్య అటకాయించే లోపున రంగయ్యను హతమార్చారు. దేనికీ చలించలేదు మల్లి. ఎలా బతుకుతుందో, ఎలా జీవితం లాక్కొస్తోందో ఎవరికీ తెలీదు. పల్లెవాసులు నర్సింగులు అజమాయిషీ, క్రూరత్వం తెలిసిన వాళ్లవటం వలన కిక్కురుమనక ఊరుకున్నారు. నిండా ఇరవై గుడిశెలు కూడా లేని పల్లె మరి. అప్పుడు జరిగిందో విచిత్రం.

రాత్రి పదింటికి దుమ్ము రేపుకుంటూ మల్లి గుడిశ దగ్గర ఆగిందో జీపు. చేతికి మల్లె చెండు, అత్తరు గుబాళింపులతో తమకంగా దిగాడు నర్సింగులు. తలుపు తెరిచే ఉంది. పిల్లలు ఆదమరచి నిదురపోతున్నారు. తిన్నె మీద శోకదేవత మల్లే ముభావంగా కూర్చుని ఉంది మల్లి. తమకంతో తిన్నగా వెళ్లి ఆమె జబ్బ మీద చేయి వేశాడు. "ఆ రోజు తర్వాత... మళ్లీ దొరకలేదు నువ్వు. నీ పొందుకై కాలిపోతున్నానే. రావే" అంతే... ఒక నిముషం ఛీత్కారంతో చూసింది మల్లి ఆ కామాంధుణ్ణి. ఇదేమిటి? చెయ్యి నిప్పులా మండిపోతోంది సెగ లేదు! కానీ చెయ్యి కాలిపోతోంది. 'అమ్మ బాబో' అని మూల్గి చెయ్యి వెనక్కిలాక్కున్నాడు నర్సింగులు. ఆ చూపు? ఇంతకుముందెన్నడూ ఇలా అవ్వలేదు నర్సింగులికి. ఏమిటా తీక్షణమైన చూపు? అలా అలా కడ్డీల లాగ చొచ్చుకొస్తున్నాయా చూపులు! అమ్మో! ఏమిటీ వైపరీత్యం? తనని లేపుతున్నాయి గాల్లోకి? అనుకున్నాడు నర్సింగులు.... అలా అలా ఇరవై... ముప్ఫయి అడుగులు! బయట కొచ్చి తీక్ష్ణంగా తనని చూపులబాణాలతో అలా... అలా... గాల్లోకి యాభై అడుగులు లేపాక ఒక్కసారిగా చూపు మరల్చుకొంది. లేచి ఒక్కసారిగా బియ్యం మూట ఆకాశాన్ని వదిలి, నేలకు ఒరిగినట్లుగా నేరుగా జెండా తగిలించడానికి కారు బానిట్‌పై అమర్చిన పదునైన కత్తిలాంటి ఇనప కడ్డీపై దభీమని పడటం, ఆ కడ్డీ గుండెల్లో చొచ్చుకుపోవటం... అన్నీ చకచకా జరిగిపోయాయి. పోలీసులు, కోర్టు, ఎంక్వైరీ అన్నీ యథావిధిగా జరిగిపోయాయి. మల్లి నిరపరాధనీనూ... (సరైన ఆధారాలు లేకపోవటం మూలాని) కేసు కొట్టేశారు. క్రమక్రమంగా మల్లి గుడిశ ఒక ఆశ్రమమైంది. కొన్ని అతీత శక్తులు మల్లిని ఆవహించాయనీ, కంటి చూపుల బాణాలతో బక్కెట్ నీళ్లని గాల్లోకి లేపగలిగిందని. ఆ తర్వాత మల్లి కథ అలా మరుగైపోయింది. ఈ అతీతశక్తులు, చూపుల పరమైన వేమిటని ఎవరూ పరిశోధించలేదు.

డాక్టర్ అమరేంద్ర గొంతు సవరించుకుని చెప్పసాగాడు. డాక్టర్ శ్రీవాస్తవ, డాక్టర్ లీల శ్రద్ధగా వినసాగారు. 'మల్లి విషయంలో మనం అర్థం చేసుకున్నది. ఎ ఫెనామెనా ఆఫ్ సైకో కైనసిస్, ఏ పారానార్మల్ ఇన్‌స్టన్స్.... ఇన్ అదర్ వర్డ్స్, మెదడు నుండి వెలువడే ఎలక్ట్రోమాగ్నటిక్ రేస్‌తో రాళ్లని మొదలగు వాటిని చూపుల దృక్కులతోనే కదపగలగటం...' అని పైప్ ముట్టించాడు.

ఈసారి డాక్టర్ శ్రీవాస్తవ అందుకున్నాడు. "ఇప్పుడు చెప్పు లీలా. ఆ తర్వాత.. అంటే నర్సింగులు బలాత్కారం చేసిన తర్వాత నీకు ఎలా ఆ సైకో కైనెటిక్ పవర్ వచ్చిందో?' నౌ వైటెమినిట్!' డాక్టర్ అమరేంద్ర మళ్లీ అందుకున్నాడు. "మీ ఉద్దేశ్యం... డాక్టర్ లీల...

"అవును నేనే అప్పటి మల్లిని, డాక్టర్ శ్రీవాస్తవే అప్పటి రంగయ్య. నర్సింగులు నా జబ్బ మీద చేయి వేసిన క్షణం నుంచే నాలో ఏదో శక్తి ఆవహించినట్లైంది. నర్సింగుల్ని ఛీత్కారంతో చూసి నా చూపు ఎటు తిప్పితే అటు అతను అవలీలగా గాల్లో తేలాడు" డాక్టర్ అమరేంద్ర ఆశ్చర్యపోలేదు.

"ఎస్ డాక్టర్స్! మీకు తెలీని విషయం ఒకటుంది. మీరు ఇద్దరూ 'రీ ఇన్ కార్నేటెడ్ సబ్జెక్ట్స్' అయి ఉంటారని ఎప్పుడో గ్రహించాను. ఆ విషయం నా మనసులో గాఢంగా ముద్రించుకుపోయింది. అందుకే వెతికి వెతికి ఈ ప్రాజెక్టుకి నా సహపరిశోధకులుగా ఐసిఎమ్ఆర్‌తో మొండిగా వాదించి, మీరే కావాలని ఎన్నుకున్నాను. నాకిది ఇప్పుడు సంతోషకరమైనది. మన ముగ్గురిపై ఈ అతీత శక్తిని విడమర్చి లోకానికి చెప్పవల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది. పాశ్చాత్యులు కూడా కనీవినీ ఎరగని వింతలు మన పురాణ ఇతిహాసాల్లోనూ, వేదాలలోనూ, నాడీ గ్రంథాల్లోనూ పేర్కొనబడి ఉన్నాయి.

"లెట్ అజ్ హోప్ వీ మేడ్ ఎ గుడ్ బిగినింగ్" అని సమావేశం ముగించాడు.

# నా ప్రేమకు ముగింపులేదు

లండన్ పొలిమేరలు దాటి విస్తారమైన ఆరు లేన్‌లు గల బాటలో నా 'జాగ్వర్' ఎస్టేట్ వాగన్ దూసుకుపోతోంది. డిసెంబర్ నెల, తొలి ఉదయం, మంచు ముద్దలు ముద్దలుగా కారు అద్దం మీద పడుతోంటే వాటిని అటూ ఇటూ అదే పనిగా ముందరి వైపర్లూ వెనక రియర్ స్క్రీన్ వైపర్లు పోటీపడుతూ తుడుస్తున్నాయి. ఒక అంతర్జాతీయ సదస్సుకీ ప్రయాణం. పడవలాంటి నా జాగ్వర్ లోపల సెంట్రల్ హీటింగ్ వల్ల వెచ్చగా ఉన్నది. డ్రైవ్ చేస్తున్న లిండా స్టీరియో ఆన్ చేసింది. 'ఈనాటి ఈ బంధ మేనాటిదో...' ఘంటసాల కంఠం వినబడగానే ఒక విధమైన ఆనందం నాలో పెల్లుబుకి ఆలోచనల అలల్లో తేలిపోయాను.

నిజమే, విచిత్రం! ఈనాటి నా బంధం లిండాతో ఏనాటిదో? లేకపోతే లిండా ఏమిటి, అందులోనూ వివాహిత, ముగ్గురు పిల్లలు, ముప్పై ఐదేళ్ల ఈ జగదేక సుందరితో పరిచయం. ఎలా జరిగిందీ మాయ? ఆమె నా ప్రేమలో పడేటట్టు నేనెప్పుడూ ప్రవర్తించలేదే? పక్కనే రహదారిపై దీక్షతో కారుని గంటకు నూట ముప్పై మైళ్ళ వేగంతో నడుపుతూ, మధ్య మధ్య మొహంపై పడుతున్న ముంగురులను వెనక్కి నెడుతూ కాస్త అలసినట్లున్న నా భార్య డాక్టర్ లిండా. చూసినకొద్దీ ఇంకా చూడాలనిపించే ఆమె వదనం కేసి ప్రేమతో చూశాను. నా కేసి ఓసారి చూసుకున్నాను. ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది... ఇంకా ఎన్ని యుగాలో ఈ రూపం? రెక్కలు టపటపలాడించి లిండా భుజంపై వాలాను. ఆపేక్షగా నా కేసి చూసి మళ్లీ దృష్టి రోడ్డుపై మళ్ళించింది. నా మది ఐదేళ్లు వెనక్కి మళ్లింది. జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే సినిమా రీలుగా మస్తిష్కంలో కానవచ్చాయి.

ఆరేళ్ల క్రితం నేను హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో వెటర్నరీ సైన్స్‌లో డిగ్రీ తీసుకున్న రోజులవి. మెడిసిన్ సీట్ దొరక్కపోయినా నిరాశపడక ఇంచుమించు పూర్తిగా ఒకే విధమైన 'బివిఎస్‌సి అండ్ ఎ హెచ్ ఉత్తీర్ణుడై, ఫెలో ఆఫ్ రాయల్ కాలేజ్ వెటర్నరీ 'సర్జన్స్' (FRCVS) లండన్‌లో సీటు రాగానే వెళ్లిపోవటం, పిమ్మట ఉద్యోగం – కోర్సు పూర్తి చేశాక దొరకటం జరిగాయి. మాన్‌చెస్టర్ స్కూల్ ఆఫ్ వెటర్నరీ మెడిసిన్‌లో రిజిస్ట్రార్‌లో చేరి అపారమైన అనుభవం ఒక డాక్టరుగా సంపాదించిన రోజుల్లో ఒక విచిత్ర పరిస్థితులలో లిండా నాకు పరిచయం అయింది.

మాన్‌చెస్టర్‌లో మా కాలేజీ హెల్త్‌క్లబ్ మెంబర్ని. ఈతలో మంచి ప్రావీణ్యం ఉన్న నేను స్వల్పకాలంలోనే అక్రోబాటిక్స్‌లోను, డీప్ సీ స్విమ్మింగ్‌లలో ప్రావీణ్యత పొంది, ఎన్నో బహుమతులు, పతకాలూ గెల్చుకున్నాను. ముప్పయి ఏళ్ల వయసు, స్వేచ్ఛా జీవితం, చేతినిండా డబ్బు, మరే చెడ్డ అలవాట్లు లేని నేను స్విమ్మింగ్‌కి మట్టుకు ప్రతి శని, ఆదివారాలు తప్పక హాజరయ్యేవాణ్ణి. ఫేకల్టీ మెంబర్ వాళ్ల తరఫు వాళ్లకి మట్టుకు ప్రత్యేకమయిన పూల్ అది. సుందర ప్రదేశంలో కట్టారు. ఒక శనివారం మధ్యాహ్నం శెలవు రోజవటం మూలాన ఒక రెండు గంటలు ఈది, కుర్చీలో కూర్చుని పైప్ వెలిగించాను.

ఎందుకనో ఆ రోజు అట్టే జనం లేరు. అతి తక్కువమంది – ఇద్దరో, ముగ్గురో ఉన్నారు. తల ఎత్తి డైవింగ్ బోర్డు వైపు చూశాను. తళుకు మెరిసి మాయమైనట్లైంది.

ఎవరా విద్యుల్లత? చెక్కినశిల్పంలా? స్విమ్ డ్రస్‌లో దాచలేని జఘనాల సంపద, బలిష్టమయిన అవయవ సౌష్టవం. సన్నని నడుము. ఉన్నట్లుండి ఆమె వంకరగా డైవ్ చేసిన తీరు నా దృష్టిని ఆవైపు సారించాయి. కానీ... ఈమెని ఎక్కడో చూశాను. కరెక్ట్... కొద్ది రోజుల క్రితమే ట్యూబులతో ఈత నేర్చుకోవటానికి తంటాలుపడుతున్న ఆమెను చూసినట్లు జ్ఞాపకం వచ్చింది. ఈ పాటికే డైవ్ చేసే ధైర్యం వచ్చి ఉంటుందంటే అనుభవజ్ఞుడనైన నా మస్తిష్కంలో ఆలోచనలు రేకెత్తించింది. ఎందుకైనా మంచిదని డైవ్ చేసిన వేపు చూశాను.

ఆశ్చర్యం! ఆమె ఇంకా పైకి తేలలేదు!

బుడగలు మటుకు అప్పుడప్పుడు వస్తున్నాయి నీటిపైకి! ఇంతసేపు ఏం చేస్తోంది లోపల? నిజంగా ఈత రాక మునిగిపోయిందా, లేక కావాలని జలకాలాడుతోందా? ఇంకాసేపు ఆగితే ప్రమాదమేమో! మరో ఆలోచన లేకుండా నా రెఫ్లెక్సెస్ నన్ను నీటి అడుక్కి దుమికించాయి. నా అనుమానం నిజమైంది. అడుగున నీటిలో చేపలా గిలగిలలాడుతూ నీళ్లు మింగుతున్న ఆమె కనపడగానే కసరత్తు చేసే దృఢమైన నా ఒక చేతితోనే సునాయాసంగా ఆమెని ఒడ్డుకి చేర్చాను. సాధారణంగా పరదేశాల్లో మనం అడిగితే తప్ప సాయానికి ఎవరూ రారు. మన విషయాల్లో జోక్యం కలిగించుకోరు. దూరం నించి చూసేవారి కెవరికైనా ఆ క్షణంలో మేము భార్యాభర్తలమో, లేక ప్రేమికులమో అనుకునే అవకాశం ఉన్నది.

ఎందుకంటే ఇలా మగ, ఆడ స్విమ్మింగ్‌పూల్‌లో జలకాలాడటం, కౌగిలించు కోవడాలు, అప్పుడప్పుడు ముద్దులు, గాఢాలింగనాలు, ఇవన్నీ మామూలుగా మనకి కనబడే దృశ్యాలు కనక ఎవరూ పట్టించుకోరు.

అందుకనే నేను ఆమెని పైకి తేవటం, పొట్ట మెల్లగా అదిమి నీరు కక్కించటం, నీరసంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తున్న ఆమెకి 'మౌత్ టు మౌత్ రెస్పిరేషన్' అందించటం వగైరా ప్రథమ చికిత్సలు చకచకా చేస్తున్నా ఒకరిద్దరూ చూసీచూడనట్లు ఊరుకున్నారు. ఆదుర్దాగా ఆమె మొహంలోకి చూస్తున్న నన్ను ఆమె మెల్లమెల్లగా కళ్లు తెరచి చూసింది.

"వేర్ ఆమ్ ఐ? ఆమ్ ఐ స్టిల్ అలైవ్?" అడిగింది.

"యూ ఆర్ రైట్ హియర్ ఆన్ ది పూల్‌సైడ్ ఫ్లాట్‌ఫారమ్ లేడీ! నౌ, టెల్ మీ వాట్ హేపెన్డ్?"

నా గొంతులో నిజమైన ఆదుర్దా, ఆదరాభిమానాలు గమనించినట్లుంది !

నెమ్మదిగా లేచి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది. తుడుచుకోవడానికి నేను తెచ్చుకున్న రెండు తువ్వాళ్లలో ఒకటి అందించాను.

మొహం తుడుచుకుని ఒక చిరునవ్వు నవ్వి "వై డిడ్ యూ బాదర్ టు సేవ్ మీ? ఇట్‌వాస్ ఎ డెలిబరేట్ డూయింగ్ ఆన్ మై పార్ట్! వెల్, యెట్ ఐ ఆమ్ గ్రేట్‌ఫుల్... మెనీ థాంక్స్... ఐయామ్ లిండా... డాక్టర్ లిండా, డెంటల్ సర్జన్!" అని చేయి అందించి కరచాలనం చేసింది.

నన్ను నేను భార్గవగా పరిచయం చేసుకున్నాను. "నౌ టెల్ మీ, ఇఫ్ ఐ మే నో! వాటీస్ ది మాటర్ విత్ యూ?" అని అడిగాను.

ఆమె చెప్పటం ఆరంభించింది. పైప్ ముట్టించి మరో కుర్చీలో వాలి కళ్లు మూసుకుని వినసాగాను.

"తెలుగులో చెప్పనా, ఇంగ్లీషులో చెప్పనా?" స్వచ్ఛమైన తెలుగులో వీణానాదంలో వినబడింది నాకు ఆమె కంఠస్వరం. కళ్లు మూసుకుని ఉన్న నేను ఉలిక్కిపడి లిండా వైపు చూశాను. ఏమి టీ కల? ఆంగ్ల యువతేనా ఇప్పుడు అంత స్వచ్ఛంగా మాట్లాడింది! చిరునవ్వుతో నన్నే చూస్తోంది. "వాట్! కెన్ యూ సేదట్ అగైన్?!" అన్నాను.

"ఎన్ని మార్లైనా అనమంటే అనగలను. అలా ఆశ్చర్యపోకండి! నేనే మీ మాతృ భాషలో మాట్లాడింది. మీ పేరునిబట్టి మీరు ఆంధ్రులని గ్రహించాను. ఏం? మీ భారతీయులు ఆంగ్లంలో మా కన్నా అనర్గళంగా మాట్లాడగలిగినపుడు, కెన్ ఇట్ నాట్ బీ వైసీవర్సా?" కవ్వింపుగా నవ్వుతోంది.

కొన్ని నిముషాల క్రితమే ఆత్మహత్యా ప్రయత్నం చేసిన లలనా ఈమె? పాపం, జీవితంలో ఎక్కడో ఆరని గాయం ఏర్పడిందామెకు. అదేమిటో ఆమే చెప్తానంటోంది.

అలా ఆలోచిస్తుండగానే నేను స్వతహాగా వచ్చిన గంటకు ఆరగించే అల్పాహారం బేరర్ ట్రేలో పట్టుకొచ్చాడు. వేడి వేడి ఆమ్లెట్, టమాటో కెచెప్, ఫింగర్ చిప్స్, ఆపిల్ జూస్ తెచ్చాడు. చెప్పగానే రెండు పళ్ళాలలో తెచ్చిన బేరర్ తెలివికి అతన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. సన్నగా, ఎర్రగా, పొడుగ్గా, ఎప్పుడూ నవ్వుతూ ఉండే బేరర్‌ని చూసి "వెరీ థాట్‌ఫుల్ ఆఫ్ యూ విలియమ్స్! థాంక్స్ ఫర్ యువర్ సర్వీస్!" అంటూ రెండు పౌండ్లు ఇచ్చాను- ఒక పౌను బిల్లైనా. సూర్యోదయం అయినట్లు వికసించిందతని మొహం. "కీప్ ది చేంజ్ విలియమ్స్!" అని లిండాకేసి తిరిగి "ప్లీజ్ హెల్ప్ యువర్సెల్ఫ్!" అంటూ ఆకలి మీద ఉన్నానేమో ఆమ్లెట్ బ్రెడ్ ఆరగించసాగాను.

మళ్లీ ఆమే అందుకుంది. 'థాంక్స్! మీరు నాకీ రెండో జన్మను ప్రసాదించారు.. ఎ సెకండ్ లీజ్ ఆఫ్ లైఫ్!" ఆమ్లెట్‌ను ఫోర్క్‌తో గుచ్చి, నైఫ్‌తో కోసి ఒక ముక్క బంగాళదుంప చిప్స్‌ని టొమేటో సాస్‌లో అద్ది కొద్దిగా తినసాగింది.

"మా నాన్నగారు మీకు స్వతంత్రం రాకముందు అంటే భారతదేశం మా ఆధీనంలో ఉన్నప్పుడు అరకులోయలో ఫారెస్ట్ గార్డ్‌గా పనిచేశారు. వైల్డ్ లైఫ్ బయాలజీలో డాక్టరేటు చేశాక బ్రిటీష్‌వారి రాజ్యపాలనలో మా నాన్నగారి మొదటి పోస్టింగ్ ఇండియాలోనే. నేను అరకులోయలో ఉండగానే పుట్టాను. మీ దేశం, మీ కట్టుబాట్లు ఎంతగానో నచ్చిన మా నాన్న నన్ను ఆరో తరగతి దాకా తెలుగు మీడియంలో చేర్పించి, ఏడో తరగతి నుంచి స్కూల్ ఫైనల్ దాకా తెలుగు సెకండ్ లాంగ్వేజ్ ఉండేట్లు చేయడాన్నిబట్టే, తెలుస్తుంది- ఆయనకు మీ ఆచార వ్యవహారాలు ఎంతగా నచ్చాయో!

"విశాఖపట్నంకి బదిలీ అయింది. అక్కడే నేను ఏడో తరగతిలోనూ, నా ఒకే తమ్ముడు జేమ్స్ డూన్‌స్కూల్‌లోను జేరాము. నేను మట్టుకు నాన్నగారి దగ్గరే ఉండేదాన్ని. తెలుగు వాతావరణంలో పుట్టి పెరగటం, తెలుగు మీడియంలో చదవటం, అటు పిమ్మట తెలుగు సెకండ్ లాంగ్వేజ్ స్టడీ, ఇవన్నీ నాకు తెలుగు సాహిత్యం మీద ఆసక్తిని పుట్టించాయి. సెలవుల్లో మా సీనియర్ కేంబ్రిడ్జికి సమమయిన మీ ఇప్పటి ప్లస్ టూ, అప్పటి పియుసిలో ఉండగానే, కథలు చదవగలిగేంత ప్రావీణ్యం తెలుగులో సంపాదించాను. కృష్ణశాస్త్రి గేయాలన్నా, మధురాంతకం రాజారాం కథలన్నా, ముళ్లపూడి వారి హాస్యభరితమైన రచనలన్నా విపరీతంగా ఇష్టపడతాను."

మరో చిప్ ముక్క ఫోర్క్‌తో తుంచి సాస్‌లో అద్ది నోట్లో పెట్టుకున్నాను. తను అప్పటికే అల్పాహారం ముగించి ఆపిల్ జూస్ చప్పరిస్తోంది.

"మా తమ్ముణ్ణి డూన్ స్కూల్ పూర్తి కాగానే ఇంగ్లండ్‌లో కేంబ్రిడ్జి యూనివర్సిటీకి పంపటం, వాడక్కడే ఇంజనీరింగ్ పూర్తి చేసి రాయల్ ఏర్ ఫోర్సులో జేరటం, నేను మద్రాసు డెంటల్ కాలేజీలో జేరటం అన్నీ చకచకా కాలచక్రంలో జరిగిపోయాయి. స్విమ్మింగ్ తప్ప అన్నీ నేర్పారు మా నాన్న నాకు. 'ఆయనకి 'హైడ్రోఫోబియా' ఉంది. ప్రతి వేసవికి అమ్మా, నాన్నా, నేను మా స్వంత ఊరైన కేంబ్రిడ్జికి వెళ్లి తమ్ముడు చదువుతున్న రోజుల్లో వాడితో రెండు నెలలు గడిపి వచ్చేవాళ్లం. అక్కడ మా స్వంత ఇల్లుంది. అందులో మా తల్లిదండ్రుల ఇరుపక్షాల తాతలు, అవ్వలు ఉండేవాళ్లు. మా అమ్మ నాన్నా అలాంటి ఏర్పాటు చేశారు మీ దేశంలో పెద్దలకిచ్చే గౌరవాన్ని చూసి. సాధారణంగా ఇంగ్లండ్‌లో స్వంత తల్లిదండ్రుల్నే 'ఓల్డేజ్ హోమ్స్'కి తరిమేసేవాళ్లు పిల్లలు.

"అటువంటి ఒక 'సమ్మర్ ఆఫ్ సిక్టీస్' లో పరిచయమైనాడు బ్రిటిష్ మర్చెంట్ నేవీ కెప్టెన్ నరేష్. నరేష్ తండ్రి భారతీయుడు. తల్లి ఇటాలియన్. ఇక్కడే పుట్టి పెరిగి ఈ దేశపు సిటిజెన్‌షిప్ పొంది అచ్చం ఇంగ్లీషువాడిలా ఉన్న నరేష్, నేనూ ఒకరికొకరు ఆకర్షితులయ్యాము ఒక పార్టీలో.

"అన్ని ప్రేమ వివాహాలూ, మతాంతర, కులాంతర వివాహాలూ మూడు పువ్వులూ ఆరు కాయలవుతాయనో, లేక అన్ని పెద్దలు చూసి చేసిన పెళ్ళిళ్లూ స్వర్గతుల్య మవుతాయనో, నేననుకోను" అంది. ఆఖరి ముక్క ఆమ్లెట్ తుంచి నోట్లో పెట్టుకుని ఫోర్కు ప్రక్కన పెట్టాను.

ఆమె తెలుగు భాషా పరిజ్ఞానానికి, వాక్చాతుర్యానికి మనస్సులోనే అభినందించి కుర్చీలో నిటారుగా కూర్చుని కాళ్లు జాపుకున్నాను. ఆమె నల్లటి కళ్లద్దాలు పెట్టుకుని చెప్తూతూపోతోంది.

"ముగ్గురు పిల్లలు పుట్టారు. మా ఇరుపక్షాల తల్లిదండ్రులు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అప్పటికే నేను బిడిఎస్, ఎమ్‌డిఎస్ ముగించి, ఫెలోషిప్ మీద రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్‌లో ఆర్థోడాంషియా స్పెషాలిటీకి లండన్‌కి వెళ్ళిపోయాను.

"క్వార్టర్స్ ఇవ్వటం మూలాని పిల్లలకి నానీని ఒకామెను ఏర్పాటు చేసి ఎఫ్ఆర్‌సిడిఎస్ పూర్తి చేశాను. ఈ మధ్య నా భర్త నరేష్ ఆర్నెల్లు ఇక్కడుంటే ఆర్నెల్లు నౌకాయానంలో ఉండేవాడు. ముగ్గురు పిల్లలు కలిగాక అతని నడతలో, దాంపత్య జీవితంలో క్రమక్రమంగా మార్పు రాసాగింది. అస్తమానం విసుగు, అతిగా తాగటం, మెల్లమెల్లగా నాపై చేయి చేసుకోవటం, పిల్లల్ని కసురుకోటం, ఎప్పుడెప్పుడు నౌకాయాన అవకాశం వస్తుందానని ఆత్రుత. అన్నిటినీ భరిస్తూ భారతదేశపు సంస్కారం నరనరానా

జీర్ణించుకున్న నేను భరతనారిగా మొగుడు చేసే అన్ని అత్యాచారాలను ఓర్పుతో సహించాను.

"కానీ ఐ యామ్ ఎ పాషనేట్ లవర్! నరేష్‌లో భారతీయుడు ఏ కోశానా కనపడలేదు నా ప్రకారం, ఇంగ్లీషు యువతి ఏ కోశానా నాలో అతనికి కనపడలేదేమో!

''ఒకసారి నరేష్ నెల రోజులున్నాడు. పిల్లలతో కాస్త సవ్యంగానే ఉన్నాడనుకున్నాను. విచిత్రంగా నేనెదురుచూడని ఒక సంఘటన జరిగింది.

అదీ ఈ మధ్యనే ఓ రెణ్ణెల్ల క్రిందటి సంఘటన నన్ను కుదిపివేసింది. నా బాధ వర్ణనాతీతం. బాత్‌లో జరిగిన వారం రోజుల అంతర్జాతీయ డెంటల్ సదస్సులో పాల్గొనడానికి పిల్లల్ని తీసుకుని కార్లో వెళ్లాను. తననీ రమ్మంటే ససేమిరా రానన్నాడు. నే నొక్కదాన్నే వెళ్ళాను. మూడో రోజే మా చిన్నమ్మాయికి మీజుల్స్ రావటం మూలాన గమ్యం చేరిన మూడో రోజే అర్థాంతరంగా నా వాక్సాల్ వెలాక్స్ స్టేషన్ వాగన్‌లో వచ్చేసరికి అర్థరాత్రయింది. గరేజ్ నుంచే తలుపు తాళం తీసి అతనికి నిద్రాభంగం కాకూడదని చడీచప్పుడు లేకుండా పిల్లల్ని వాళ్ల రూమ్‌లో పడుకోబెట్టి, నా బెడ్‌రూమ్‌కి మెల్లగా వెళ్లాను.

తలుపు దగ్గరగా వేసి ఉంది.

"లోపల నుంచి మూల్గులు... ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.. నిట్టూర్పులు.. ముద్దుల చప్పరింతలూ... మెల్లగా తలుపు తోసిన నన్ను నీలి రంగు బల్బు కాంతిలో కనపడిన దృశ్యం కుదిపేసింది. నా బెడ్‌పై ఆయన్ను పెనవేసుకున్న మరో యువతి. వారు ఈ లోకంలో లేరు. ఛీత్కారంతో లైట్ వెలిగించాను.

"అంతే! ఉగ్రుడైపోయాడు నా భర్త రెడ్ హాండెడ్‌గా పట్టుపడ్డం వల్ల... ఏమీ చేయలేని పరిస్థితి. నింపాదిగా నైటీ తొడుక్కుని నిదానంగా లేచి నిలబడింది ఆ పొడుగాటి ఆఫ్రికన్ యువతి. నల్లటి – యౌవ్వనభారం... అందగత్తె!

"ఐ యామ్ జానెట్! ఐ వర్క్ ఆన్ ది షిప్! ఆఫ్రికన్ అమెరికన్, అంటూ–

వెల్!" అని ఏదో చెప్పబోయే లోపల, "గెట్ ది హెల్ అవుట్ ఆఫ్ హియర్! దూ యూ హియర్ మీ యూ బిచ్! యూ క్లియర్ ది హెల్ అవుటాఫ్ హియర్ నౌ!" అని – అరిచాను. నా చెంప ఛెళ్లు మనిపించి వెళ్లిపోయాడు నరేష్. నావైపు చూడనైనా చూడకుండా. "కమ్ హానీ! లెట్ అజ్ గో!" అనీ ఆమెను చరాచరా లాక్కుని వెళ్ళిపోయాడు. ఆ పోవటం పోవడం నాకు డైవోర్స్‌కి నోటీస్ పంపాడు.

తల దిమ్మెక్కిపోయింది. ఇంగ్లీషు వనితనా నేను? విచిత్రం! నా నరనరాన విడాకులు ఎలాగైనా ఆపమని నా ఆత్మఘోష. ఈ తర్జన భర్జనలతో ఒక నీరస

క్షణంలో ఓడిపోయాను. ఎటూ నిలకడలేక మనస్సు చలించి, మన పూల్‌లో స్విమ్మింగ్ నేర్చుకోవాలని రావటం... ఇవ్వాళ కావాలని నీళ్లలో మునిగాను. మీరు రక్షించటం! వా టే షేమ్! డిఫిడెంట్ ఆటిట్యూడ్! నేనేనా ఇంతపని చేశాను?" అంటూ కాసేపు మాట్లాడలేదు.

ఇప్పుడు మాట్లాడ్డం నా వంతైంది. పైపు ఒక్క దమ్ము లాగి ఆష్‌ట్రేలో బూడిద పూర్తిగా గుమ్మరించాను. గొంతు సవరించుకుని చెప్పటం మొదలెట్టాను.

"డాక్టర్! మన పరిచయం కేవలం రెండు గంటలు మాత్రమే. అది పురస్కరించుకుని ఓ విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. మరోసారి ఇలాటి ఆత్మహత్యా ప్రయత్నం చేయవద్దు. అపజయాన్ని అంగీకరించిన వారే ఆ పని చేస్తారు. నేను అంతకన్నా ప్రస్తుతం ఏమీ చెప్పలేను. ఇకపోతే విడాకులు నేను కూడా ప్రోత్సహించను. నరేష్ ఏదో ఒక క్షణికమైన ఉద్రేకంలో అలా చేసి ఉండవచ్చును. కనుక మీరు ఇంకొన్నాళ్లు ఓపికతో వేచి చూడండి. భారతీయుడైన నేను మీ కీ విషయంలో పూర్తిగా ఏకీభవిస్తాను, సహకరిస్తాను. మా వ్యవహారాలను ఇంతగా జీర్ణించుకున్న పాశ్చాత్య యువతిని నేను కలలో కూడా చూస్తాననుకోలేదు. మా దేశంపై ఇంతటి ప్రేమ, భక్తి ఉన్నందుకు నా మనఃపూర్వక అభివందనాలు. పాశ్చాత్య ఆచార వ్యవహారాలే మిన్న అనుకునే భారతీయులు కొల్లలైన ఈ రోజుల్లో మా ఆచార వ్యవహారాలను గౌరవించే మీరు పూజ్యులు. ఇప్పటి మా దేశపు పరిస్థితులలో మా పురాణ ఇతిహాసాలను చదివి, వంటబట్టించుకుని వాటిలో నీతిని గ్రహించి ఆచరణలో పెట్టేవాళ్లు కోటికి ఒక్కరుంటారేమో! శాంతి, ప్రేమ, దేశ సమృద్ధికి భద్రతకి తోడ్పడాల్సిన సమయంలో తుపాకులు, బాంబులు ఎక్కడి కక్కడ అల్లకల్లోలాలు, కేవలం నీటికై కాట్ల కుక్కల్లా వీధులలో బిందెలతో ఇరుగు పొరుగుతో తీవ్ర యుద్ధాలు జరిపే రోజుల్లో, కాబరే నృత్యాలలో మీ దేశాలన్నిటినీ మించిపోతున్న మా సంస్కృతి, బూతు సాహిత్యం సినిమా పాటలు, ఆటలు నిండి ఉన్న మా దేశ పరిస్థితిలో మీ మాటలు వింటూంటే అవి నిజంగా పన్నీటి జల్లులు! టేకిట్ ఈజీ... యూ హావె గుడ్ ఫ్రెండ్ ఇన్‌మీ! ఈ రోజు నుంచి నేను మీ శ్రేయోభిలాషిని. యూకెన్ కాంటాక్ట్ మీ వెన్ యూ హావ్ ఎ ప్రాబ్లెమ్! ఒకేచోట ఒకే యూనివర్సిటీలో ఉన్నాం కాబట్టి వియ్ కెన్ సీ మోర్ ఆఫ్ ఈచ్ అదర్! వెల్ నౌ యు బెటర్ గెట్ బాక్ హెూమ్. మళ్లీ వచ్చే శనివారం ఇదే చోట కలుద్దాం." చేయి చాపి కరచాలనం చేశాను. చిరునవ్వుతో నన్ను సాగనంపి, తను లేడీస్ డ్రెస్ ఛేంజికి వెళ్లిపోయింది.

అలా ప్రారంభమైన మా స్నేహం మొదట్లో స్విమ్మింగ్ పూల్‌కే పరిమితమైనా, క్వార్టర్స్‌లో ఉండడం మూలాన అప్పుడప్పుడు ఆమె నా అపార్ట్‌మెంట్‌కి వచ్చి నాతో

చెస్, బాడ్మింటన్ ఆడేది. ఆమెలో ఉత్సాహం, జీవించాలనే కోరిక మళ్లీ చిగురించి దృఢపడ్డాయి. ఆమెకు ఈత బాగా నేర్పాను. డైవింగ్, బాక్ స్ట్రోక్స్, సోమర్ సాల్ట్స్ అన్నిట్లో ప్రావీణ్యం వచ్చేదాకా నేర్పాను. అప్పుడప్పుడు ఆమె పిల్లలతో ఆమెతో లండన్ రీజెంట్ పార్క్‌కో, లేక నాచురల్ హిస్టరీ మ్యూజియమ్‌కో, ఒపేరాలకో వెళ్లేవాడిని. అలా ఒక సంవత్సరం గడిచింది. ఈ ఒక సంవత్సరంలో పరస్పరం ఇంకా సన్నిహితులయ్యాము.

ఈ ఒక్క సంవత్సరంలో ఆమె భర్త కోర్టులో 'డెసర్షన్ అండ్ ఆబ్సెన్స్ ఆఫ్ కాంజుగల్ కంటిన్యూటి...' అనే నెపం మీద కేసు గెలిచి ఆమె సమ్మతించనప్పటికీ చట్టరీత్యా విడాకులు పొందాడు. ఆమెతో తన పిల్లలు ఉండటానికి తనకే అభ్యంతరం లేదని, నెలసరి భత్యం ఇవ్వటానికి తాను తయారనీ స్టేట్‌మెంట్లు రాసి ఇచ్చాడు కోర్టువారికి.

పిల్లలు ముగ్గురూ బోర్డింగ్‌లో చేరారు. పెద్దబ్బాయి మర్చెంట్ నేవీ ట్రైనింగ్‌కని లివర్‌పూల్‌కీనూ, రెండో అమ్మాయి కేంబ్రిడ్జిలోనూ అదే స్కూల్లో ఆఖరి అమ్మాయి టెన్త్ గ్రేడ్‌లోనూ చేరారు. శని, ఆదివారాలు వాళ్లమ్మ దగ్గర కొచ్చేవారు. సంఘంలో పెద్ద పెద్ద గౌరవనీయులైన వారందరి పిల్లలూ చదివే స్కూల్ అది. కనుక పిల్లల క్రమశిక్షణ, విద్యాబోధన బాగుంటుందని వాళ్లని బోర్డింగ్‌లో వేసింది లిండా. వేసవి సెలవుల్లో ముగ్గురూ తల్లి దగ్గరే ఉండేవారు. తల్లి సౌమ్యత, నెమ్మదితనం ముగ్గురికీ వచ్చింది. పోలికలలో ఆడపిల్ల లిద్దరూ తండ్రిలాగనూ, అబ్బాయి లిండా పోలికలతోనూ ఉంటారు. తల్లి మాట ఏనాడూ జవదాటని ఆణిముత్యాలు లిండా పిల్లలు. వద్దనుకున్నా విడాకులు తప్పనిసరిగా ముంచుకురావటంతో పరస్పర సానుభూతి మా మధ్య స్నేహం ఇంకా ఇనుమడింపచేసింది.

ఒకే యూనివర్సిటీలో పని చేస్తూండడం వలననూ, ఈ మధ్యనే తెచ్చుకున్న పిహెచ్‌డితోనూ మా ఇద్దరి సాన్నిహిత్యం మరింత ప్రబలమైంది. ఇద్దరం ఏనాడూ మా సాంఘిక కట్టుబాట్లను దాటలేదు. నూటికి నూరుపాళ్లు భారతదేశపు సాంఘిక కట్టుబాట్లు (దుస్తులు తప్ప) ఆంధ్రుల ఆచార వ్యవహారాలు జీర్ణించుకుని తు.చ. తప్పక పాటించే లిండా నా కెప్పుడూ ఒక అపూర్వ, పూజనీయమైన వనితగా అనిపించేది. ఇద్దరం ఒకే గైడ్ కింద పార్ట్‌టైమ్ పిహెచ్‌డి చేశాము. టాపిక్ కూడా కొంత భేదంతో ఇంచుమించు ఒకే అంశమని చెప్పవచ్చు. ఆ అంశమే నా జీవితాంశం అవుతుందని అప్పట్లో అనుకోలేదు. పరిశోధన నిమిత్తం ఎన్నుకున్న టాపిక్ నా జీవితాంశం ఎందుకైందో చెప్పాలంటే ఇక్కడ కాస్త మా పరిశోధన గురించి, ఏ పరిస్థితులలో నా జీవితం లిండా జీవితంతో ముడిపడి మలుపు తిరిగిందో చెప్పవలసి

వస్తుంది. 'క్రయో ప్రిసర్వేషన్ ఆఫ్ ఎంబ్రియానిక్ స్టెమ్ సెల్స్ ఇన్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రాన్స్‌జెనిక్ మైస్' అని నా థీసిస్ టాపిక్‌నూ, 'క్రయోజెనిక్ ప్రిజర్వేషన్ ఆఫ్ హ్యూమన్ కాడవర్స్– ఎ డెంటల్ అండ్ ఫారెన్సిక్ స్టడీ' అని లిండా టాపిక్‌కూనూ చేసిన రీసెర్చిలో నా థీసిస్‌కై ఒక భాగం నేను ఆరు నెలలు ఇండియాలో అరకువేలిలో ఒక తొంభై ఏళ్ల యోగీశ్వరుడికి శుశ్రూషలు చేసి నేర్చుకున్న పరకాయ ప్రవేశపు విధానాలు అతి ప్రాచీన గ్రంథాల్లోనూ భారత ఇతిహాసాల్లోనూ పేర్కొన్నవే.

మూడేళ్లలో ఇద్దరికీ పిహెచ్‌డి ఇచ్చారు. గాఢంగా ప్రేమించుకున్నాం. ఇద్దరూ వీడలేని పరిస్థితులు ఏర్పడ్డాక వివాహం చేసుకున్నాం. కానీ... కానీ... ఇంత పిచ్చి ప్రేమలో పడ్డ మాకు పెళ్లైన నెల రోజుల్లో ఒక అనుకోని సంఘటనతో... నా జీవితం మలుపు తిరిగింది... నా ఆలోచనల పాత జ్ఞాపకాలు అక్కడి దాక వచ్చి ఆగాయి. మేమిద్దరం విజ్ఞానపరమైన సదస్సుకై మా గమ్యం చేరాము. మర్నాడు..

❖ ❖ ❖

అది ఒక అంతర్జాతీయ సదస్సులో ఆఖరి రోజు. తన పరిశోధనలతో జీవితంలో ముడిపడి ఉన్న అతి ముఖ్యమైన ఘట్టం... విజ్ఞాన లోకంలోనే సంచలనం సృష్టించిన ఆ అద్భుత దుఃఖపూరితమైన ఘట్టం లోకానికి వివరించటానికని పెట్టిన ప్రెస్ కాన్ఫరెన్స్ అది.

ప్రెస్ ఫోటోగ్రాఫర్లు విలేఖరులు కిటకిట లాడిపోతున్నారు. లిండా వారందర్నుద్దే శించి ఇలా అంది.

"మీరందరూ ఇప్పటి నా భర్త డాక్టర్ భార్గవ రూపం, నేను వివరించిన విజ్ఞాన సేకరణ, భావి జీవితంలో (ఫ్యూచర్‌లో) క్రయోప్రిజర్వేషన్ యొక్క ప్రాముఖ్యం, నిజానిజాలు  మా ఇంటిలో రేపు తొమ్మిది గంటలకు సమావేశమైతే వివరిస్తాను" అనగానే చెవులు బ్రద్దలయ్యే చప్పట్లతో, ప్రశంసలతో లిండా భారంగా నాతోబాటు ఇంటికి చేరింది.

విశాలమైన తన ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసింది డాక్టర్ లిండా విలేఖరుల సమావేశం. పంక్చువల్‌గా 9 గంటలకు అందరూ సమావేశమయ్యారు – వివిధ విజ్ఞాన పత్రికల విలేఖరులూ, ఆంగ్ల దినపత్రికలవారూ, టెలివిజన్ కవరేజ్‌వారూ, అందరికీ అల్పాహారం, తేనీరు ఏర్పాటు చేసింది. ఆమె ఒక విజ్ఞానవేత్తగా లోకానికి విడమరిచి అర్థమయ్యేటట్టు చెప్పబోయే ఈ వైజ్ఞానిక విచిత్రం కోసం ఆతృతతో ఎదురుచూస్తున్నారు వాళ్లు.

చల్లటి లండన్ వాతావరణం, పచ్చటి లాన్‌లో వలయాకారంలో వేసిన తెల్ల కుర్చీలు, మధ్యలో ఒక గుండ్రంగా ఉన్న పెద్ద రోజ్‌వుడ్ టేబుల్‌పైన ఆమ్లెట్లు, టమాటో సాస్, సాసెజెస్, చికెన్ ఫ్రై, బిస్కెట్స్, టీ, విడిగా పాలు- టీపాయ్‌మీద అన్నీ అమర్చింది. ఒక పక్కన టెలివిజన్‌వారి సరంజామా, మైకు.

కూర్చున్న విలేఖరులందరూ లేచి నిల్చున్నారు గౌరవసూచకంగా ఆమె రాగానే. మధ్యలో అందరికీ కనబడేటట్టు అమర్చిన ఒక కుర్చీలో కూర్చుంది లిండా. ఆమె భుజంపై నిగనిగలాడుతూ ఒక మైనా పక్షి. దీనంగా ఉన్న ఆమె ముఖంపై ఆ పక్షిని నిమురుతూ ఒక విచిత్రమైన చిద్విలాసం, చిరునవ్వు.

గొంతు సవరించుకుని విలేఖరులను ఉద్దేశించి ఇలా అంది లిండా :

"వెల్‌కమ్ టు ది ప్రెస్‌మీట్! నేను మీకీ రోజు చెప్పబోయే విజ్ఞానాత్మక విషయాలు మిమ్మల్ని ఆశ్చర్యచకితులను చేయవచ్చు. ఇది మీరు కేవలం ఒక భ్రమ, కల్పితం అని అనుకునే అవకాశాలు లేకపోలేదు.

"కానీ నేను వివరించబోయే విషయాలు కేవలం విజ్ఞానాత్మకమైనవే కాక, నా జీవితంతో ముడిపడి ఉన్నాయి. కనుక అవి బూటకాలనో, లేక భ్రమ అనో తోసిపుచ్చడానికి అవకాశం లేదు. అదేకాక, విజ్ఞానపరంగా ఈ సంఘటనలన్నీ టేప్ రికార్డు చేయబడ్డాయి, విజ్ఞానపత్రంగా రూపొందించబడ్డాయి. నిన్ననే ముగిసిన అంతర్జాతీయ సదస్సులో వివరింపబడ్డాయి.

"నా భుజం... మీద ఉన్న దెవరో తెలుసా? కేవలం ఒక పక్షి - మైనా కాదు, నా భర్త డాక్టర్ భార్గవ, ఎఫ్.ఆర్.సి.వి.ఎస్., పిహెచ్‌డి!" అని మైనాకేసి చూసి తిరగ్గానే- "గ్లాడ్ టు మీట్ యు ఫ్రెండ్స్! ఐ షల్ అడ్రస్ యు ఆఫ్టర్ షి ఫినిషెస్ హర్ టాక్!" కెమెరాలు, తళుక్కుమన్నాయి. టెలివిజన్ కెమెరాలు మైనా చెప్పిన ఒక్కో వాక్యం రికార్డు చేశాయి.

లిండా మళ్లీ అందుకుంది- "ఈ వైపరీత్యం మా పెళ్ళైన ఒక నెలరోజులకి జరిగింది- అంటే సుమారు ఆర్నెల్ల క్రితం.

"ఆ రోజు నేనూ, మా ఆయన, ఆయన పెట్ ఈ మైనా. మాంచెస్టర్‌లో ఉన్న క్రయోజెనిక్ ఇన్‌స్టిట్యూట్‌లో కొంత వస్తు సేకరణ మా పరిశోధనకి సంబంధించినవాటి కోసం రాత్రి ఎనిమిది గంటలకి లండన్ నుంచి బయలుదేరాము. మాంచెస్టర్‌కి లండన్‌నుంచి కారులో వెళ్లాలంటే పన్నెండు గంటలు పడుతుంది. ఆ రోజు రాత్రి వర్షం. సంవత్సరంలో ఎక్కువభాగం వర్షాలు మాకు అలవాటే లండన్‌లో. కానీ ఆ కాళరాత్రి భయంకరమైన వర్షం! ఆయనే నా కారు వాక్సాల్ ఎస్టేట్ డ్రైవ్‌చేస్తున్నారు.

సిటీ పొలిమేరలు దాటాక నే నాయన పక్కన కూర్చుని మరునాడు చేయవలసిన సేకరణ గురించి కారు దీపపు కాంతిలో డైరీలో రాస్తున్నాను.

“వెనుక సీటులో ఆయనతో ఎప్పుడు దూరపు ప్రయాణాలకెళ్ళినా తీసుకెళ్లే మైనా పక్షి ఉంది. పంజరం అక్కరలేదు దానికి, కుదురుగా కూర్చుని అప్పుడప్పుడూ సీటులో గెంతుతూ అటూ ఇటూ తిరుగుతూ వెనుక సీట్లో ఉంటుందా మైనా. బయట తిరిగేటప్పుడు 'జానీ! నీ పంజరంలో కెళ్లు!' అంటే తానుగా బుద్ధిగా వెళ్లి కూర్చుంటుంది.

“అర్ధరాత్రి పదకొండున్నర అనుకుంటాను. ఆరు వరుసలు ఉన్న బాటలో హై స్పీడ్‌లోనుంచి కళ్లు మూసి తెరిచేలోపల కంట్రోల్ తప్పి ఒక ఆయిల్ టాంకర్ మా వారున్నవైపు నుంచి ఓవర్ టేక్ చేసి గుద్దేసింది. కారు ఎడమ పక్క ఆఖరి వరుస అవటం మూలాన పల్లంలోకి మూడు పల్టీలు కొట్టింది. డ్రైవర్ సీటు వైపు పూర్తిగా దెబ్బతిన్నది. కానీ గాయం తలపై తగలడంతో ఆయనకి, వెనుక సీటులో ఉన్న పక్షికీ వెంటనే ప్రాణాలు పోయాయి. నా దేహం చెక్కు చెదరలేదు. కారు పల్టీలు కొట్టి మళ్లీ నాలుగు చక్రాల మీద ఆగిపోయింది. ఎడమవైపు ఉన్న నాకు దెబ్బలు తగల్లేదు. ఆయిల్ టాంకర్ భయం గొలిపే వేగంతో రావటం మూలాన మా కారుని గుద్దిన తరువాత డ్రైవర్ కంట్రోల్ తప్పి ప్రక్క గుంటలో ఒక పెద్ద రాయికి తగిలి, ఎలక్ట్రిక్ సర్క్యూట్ అవడంతో వచ్చిన స్పార్క్ వల్ల అర ఫర్లాంగు దూరంలో నిప్పంటుకుని ఒక్కడే ఉన్నాడేమో, టాంకర్ డ్రైవరు మసి బొగ్గైపోయాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపల మరో వింత. నా భర్తవైపు చూసా. కళ్లలో ప్యూపిల్ డైలేట్ అవటం వలన చనిపోవటానికి సూచకం. (ఒకసారి దేహం చెడిపోయాక మళ్లీ ఆ దేహంలోకి పరకాయ ప్రవేశం చేయలేము) ప్యూపిల్ డైలేట్ అయిందని మరోసారి టార్చి వెలుగులో చూసి చనిపోయాడనే దుఃఖంలో నేను ఉండగానే సెకండ్లలో ఈ వైజ్ఞానిక విచిత్రం.

“పక్కకి ఒదిగి పడున్న మైనా వెనక సీట్లో ఒక్కసారిగా మెల్లమెల్లగా కదిలి, వేగంగా ఎగిరి నా భుజం మీదుగా, ఎప్పుడూ అది చేయని తీరులో వాలి, చెవి దగ్గరగా అచ్చం నా భర్త గొంతుతో ఇలా మాట్లాడింది. 'లిండా డార్లింగ్! ఇప్పుడు నా ప్రాణం చనిపోయిన మైనా శరీరంలోకి పరకాయ ప్రవేశం చేసింది. ఒక విధంగా నేను నా పిహెచ్‌డి కోసం యోగీశ్వరుడి వద్ద నేర్చుకున్న విధానం సక్సెస్ అయిందనే చెప్పాలి. కాని విజ్ఞానవేత్తలుగా ఇలా దుఃఖించేందుకు ఇప్పుడు వ్యవధి మనకి లేదు. మనం రేపు వెళ్లబోయే క్రయో ప్రిజర్వేషన్ ఇనిస్టిట్యూట్‌కి 24 గంటలలోగా చేర్చాలి. కాడావర్స్ (చనిపోయిన మృతకళేబరం)ని 600° సెంటీగ్రేడ్‌లో భద్రపరిచేందుకు ఏర్పాట్లకై వెంటనే ఫోన్‌చేసి, జరిగిన విషయం వారికి వివరించి వాళ్లని హెలీ

అంబులెన్స్ సర్వీస్‌గానీ ఏరో అంబులెన్స్ గానీ పంపమను! నా దేహాన్ని అప్పుడు ఆరుగంటలలోపున క్రియో ప్రిజర్వేషన్‌లో భద్రపరచవచ్చు. అలా భద్రపరచి దానికి నెలసరి బాడుగ కడుతూ, ఎప్పటికో సైన్స్ అభివృద్ధి అవగలదనీను మళ్ళీ దానిని 'థాయింగ్' (లేపటం) చేసి, మెదడుని స్మృతికి తేగలిగితే నేను మళ్ళీ నా దేహంలోకి ప్రవేశించే అవకాశం మనకి ఎప్పటికైనా కలగవచ్చు. ఎన్ని ఏళ్ళైనా నేను తిరిగి ప్రాణంపోసి మృతకళేబరాలలో మారుతూ నా దేహం చేరతాను. నీకూ ఈ పద్ధతిలో నీవు ఒకవేళ చనిపోతే నీ దేహం కూడా ఇలాగే భద్రపరుచు!

మన పరిశోధనలకూ, మన గాఢ ప్రేమకు ముగింపు ఎన్నటికీ ఉండదూ, ఉండబోదు! విజ్ఞానం అబద్ధం చెప్పదు డార్లింగ్. ఆక్ట్ ఇమ్మీడియట్లీ! నా ప్రేమకు ముగింపు లేదు!" అంది.

మైనాకు గాఢంగా ఒక ముద్దిచ్చి, "హనీ! నేను జీవిస్తూ జన్మజన్మలకీ నీకు తోడ్పడుతూ ఎన్నటికీ నీ దానిగానే మిగులగలనని నా హృదయం నరనరాలు, ప్రతికణం అదేపనిగా ఘోషిస్తున్నాయి. 'దేరీజ్ నో ఎండ్ టు మై లవ్ టూ? నా ప్రేమకు... ఎన్నటికీ ముగింపు లేదు!' అని కారులోని ఫోన్‌లో క్రయో బయాలజీ ఇన్‌స్టిట్యూట్‌కి వెంటనే ఫోన్ చేసిన గంటన్నరలో హెలికాప్టర్‌లో భార్గవ మృత కళేబరాన్ని నన్నూ, మైనాని ఎక్కించుకోవడం, మరో రెండు గంటల్లో క్రయో ఎంబామింగ్ టెక్నిక్స్‌తో భార్గవ శరీరం భద్రపరచటం- అటు పిమ్మట ఈ ప్రెస్ కాన్ఫరెన్సూ!" అని కన్నీళ్ళతో ముగించింది లిండా.

మైనా రూపంలో ఉన్న డాక్టర్ భార్గవ విలేఖరులను ఉద్దేశించి ఇలా ముగించాడు:

"జంతు జాలాలన్నిటిలోకీ శ్రేష్ఠమైన కణ జంతువు మానవుడు. మన క్రింది జీవాల్లో వెన్నెముకలు గల బల్లుల జాతిలో ఈ క్రయో ప్రిసర్వేషన్ లాంటి చర్యే కొన్ని సందర్భాలలో చూశాం. తొండలలో రక్తస్రావం అతి నెమ్మదిగా జరుగుతూ గుండె అతి నెమ్మదిగా కొట్టుకుంటుంది. ఆకలిదప్పులు లేకుండా, ఎక్కువ ఆమ్లజని పీల్చనవసరం లేకుండా చేసుకోగలిగిన ఈ శక్తిని "హైబర్నేషన్" అంటారు. అవి అతి ఎండాకాలంలోనో లేక అతి చలికాలంలో ఇలా హైబర్నేషన్‌తో ఆహారం, ఆకలిదప్పులు లేకుండా ఉండగలవు. అదేమాదిరీ కిందిజాతి కప్పలలోనూ, వానపాముల్లో, బల్లులలో, (తొండలూ, బల్లుల బంధువులే) ఒక కాలో, తోకో, చెయ్యో తెగితే అవి మళ్ళీ పూర్తిగా మొలకెత్తగలవు. వానపాముని నాలుగు ముక్కలు చేస్తే ఒక్కో ముక్క మళ్ళీ పూర్తి వానపాము అవటం విజ్ఞానానికి బాగా విదితమే. దీనినే రీ జనరేషన్ (పునఃతయారీ అనవచ్చునేమో) అని ఆంగ్లంలో అన్నారు.

"ప్రాణకోటి సముద్రంలో ఆరంభమై చేపలు, కోట్ల సంవత్సరాలలో కప్పలుగా పరిణతి చెంది భూమి మీద నివసించడం అలవాటు చేసుకున్నాయి. కప్పలనుండి తొండలు మరో కోటానుకోటి సంవత్సరానికి ఉద్భవించాయి. ఒక కాలంలో ఈ తొండలు, బల్లులే నూరడుగుల 'డైనసార్లు'గా (రాక్షసి బల్లులు) అభివృద్ధి చెంది, 'మీటియోర్లు' భూమిని ఢీకొనడంతో నశించాయి.

"మిగిలిన చల్లటి రక్తంగల చిన్న బల్లులు రెండు రకాలుగా రూపొందాయి. ఒకటి పాలిచ్చే వెచ్చటి రక్తం గలవిగానూ, మరో తెగ రెక్కలు ఏర్పడి వెచ్చటి రక్తం గల పక్షులుగానూ రూపొందాయి. వెచ్చటి రక్తంగల పాలిచ్చే జంతువులూ అభివృద్ధి చెందుతూ వచ్చే వాటిలో అగ్రశ్రేణి పరిణతి చెందినవాడు ఈ నాటి మానవుడు, క్రమంగా కోతి సంతతి నుండి ఉద్భవించిన మనకి, మెదడు విపరీతంగా ఆలోచించే శక్తిగలదిగా రూపొందినా, తెగిన అవయవాలను తిరిగి పొందే బల్లుల కణశక్తిని, వాటిలా ఆకలిదప్పులు లేక, ఆహారం లేక జీవించగలిగే 'హైబర్నేటింగ్ కెపాసిటీ'ని కోల్పోయాము. గుడ్లు పెట్టే బల్లుల అలవాటుని వాటినుంచి పరిణమించిన పక్షులు ఉంచుకున్నా పాలిచ్చే జంతువులైన మనం పిల్లలను నేరుగా కనగలిగే కణమార్పిడిని ఏర్పరచుకోగలిగాము.

"కొన్ని స్పెషల్ టెక్నిక్స్‌తో అమెరికా, యూరప్, ఇంగ్లండ్‌లలో మైనస్ 600° సెంటీగ్రేడ్‌లో మన మృత కళేబరాన్ని కోటానుకోట్ల సంవత్సరాలు బతికున్నప్పుడున్న తీరులోనే ఆగిపోయిన మెదడు తప్ప, దేహంలోని అన్ని అవయవాలనూ చెడిపోకుండా భద్రపరిచే ఇనిస్టిట్యూట్‌లు ఉన్నాయి. చాలామంది ఐశ్వర్యవంతులు తమ దేహాలను ఇక్కడ నెలసరి బాడుగతో తాము పోయాక భద్రపరచమని వీలునామాలు రాస్తున్నారు. వాళ్ల ఆఖరి ఒకే కోరిక, నమ్మకం. ఎప్పటికైనా విజ్ఞానవేత్తలు ఆ మృతకళేబరాలనీ, మెదడునీ మళ్లీ మామూలు స్థితికి లేపగలరని, వారి నమ్మకం. అదే నమ్మకంతో ఆ పరిస్థితి ఎంతో దూరం లేదని నేనూ నమ్ముతున్నాను కనుకనే 'ముగింపు లేని' మా విజ్ఞాన పరిశోధనలు కొనసాగాలనీ, మా ప్రేమకు ముగింపు లేదని నమ్ముతూ, జన్మజన్మలకీ తిరిగి మేము మా దేహాలని చేరగలమనే గట్టి నమ్మకంతో... మీ అందరికీ నా గుడ్ విషెస్!" అని మైనా ఇంటిలోపలికి ఎగిరిపోయింది.

# నీ నీడకు నువ్వేతోడు

అది 2095వ సంవత్సరం. డాక్టర్ రాబర్ట్ డగ్లస్‌ని చూచిన వారెవ్వరూ అతనికి 95 సంవత్సరాలంటే నమ్మశక్యంకాదు. మంచు కొండల మధ్య అతి సుందర ప్రదేశం స్ట్రాస్‌బర్గ్ ఆస్ట్రియా. పచ్చటి కొండల మధ్యన యూరప్ అంతటికీ సుందరమైన ఆ చిన్న ఊరి చివర ఒక ఆధునికమైన కట్టడం. పెద్ద పెద్ద అద్దాల కిటికీలున్న ఆ కట్టడానికి ప్రహరీగోడ ఎత్తు తక్కువ కానీ, దానిమీద ఆంగ్లంలో అతికించి ఉన్న బంగారు వర్ణంలో "నేషనల్ స్టెమ్‌సెల్ రీసెర్చి లేబొరేటరీ" స్ట్రాస్‌బర్గ్ (Strassburg) అన్న అక్షరాలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఆ కట్టడం చుట్టూ అందమైన రంగురంగుల పూల కుండీలు, మధ్యన పచ్చటి పైరులాంటి కత్తిరించిన లాన్. చాక్లెట్ కలర్‌లో ఉన్న ఆ చిన్న కట్టడం క్రింది భాగంలో ఒక అతి ముఖ్యమైన ప్రయోగశాల. పైనే డాక్టర్ రాబర్ట్ డగ్లస్ నివాసం. ఆయన ఆజన్మ బ్రహ్మచారి. ప్రయోగశాలనే కోవెలగా తలచి అహర్నిశలు ఎన్నో ఏళ్ళగా ఒకే అంశం మీద శ్రమించి, చెమటోడ్చి చిట్టచివరకు ఆయన అనుకున్న ప్రయోగాలు సఫలీకృతం చేసి లోకానికి విడమర్చి చెప్పిన విజ్ఞాని. ఎప్పుడూ చిరునవ్వుతో, క్రమశిక్షణతో కసరత్తు చేసి, కండలు తిరిగిన శరీరంతో మిసమిసలాడే ఆరోగ్యం. ఆరడుగుల రెండు అంగుళాల భారీ శరీరం. ఎప్పుడూ చేతిలో ఒక పైపూ, మితాన్ని మించి ఎప్పుడూ తాగని మద్య ద్రావకం, ఆహారంలో అతిశ్రద్ధ. ఆర్గానిక్ అంటే మామూలుగా రైతులు మట్టిలో కలిసిన జంతు జాలాల మలంతో తయారీ అయిన ఎరువులే వాడతారు కూరగాయలు పండించటానికి. అటువంటి కూరలలో ఏ రకమైన రసాయనాల ప్రభావం ఉండదు. అలాటి కూరలనే మనం 'ఆర్గానికల్లీ గ్రోన్ ఫుడ్' అని ఆంగ్లంలో అంటాము.

మొదట్నుంచి డాక్టర్ రాబర్ట్ అలాంటి కూరలనే వాడటం మూలనూ, మాంసాహారాలను పూర్తిగా విడనాడి, శాకాహారాన్నే ఎన్నుకున్న శాస్త్రజ్ఞుడు. ఆయన పరిసరాలన్నిచోట్లకి గియర్డ్ సైకిల్‌నే వాడతాడు. అదీనూ 'ద్విచక్ర శకటం' కూడా ఆరోగ్యానికి తోడ్పడుతుందనటంలో సందేహం లేని రోజులు మరి. ఇవికాక, యూరప్‌లో చుట్టుప్రక్కల బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, నెథర్‌లాండ్ (హాలండ్) దేశాలకి తరచూ కారులోగానీ లేక స్వంత మినీ హెలీకాప్టర్‌ని తనే నడిపిస్తూ వెళ్ళి వస్తుంటాడాయన. ఈత, విమానం నడపటానికి ఆయన పొందిన తర్ఫీదు అసాధారణం. తలచుకుంటే మనిషి సాధించలేనిది ఏమీ లేవని దృఢంగా నమ్మే జ్ఞాని అతడు.

ఆ సంవత్సరానికి అంగారక గ్రహంలో నెలకొల్పిన ప్రయోగశాల అమెరికా, జపాన్ వాళ్లు పోటీలతో నిర్మించి అయిదేళ్ళపైనే అయ్యింటుంది. అమెరికా జపాన్‌వారు మొత్తం ప్రపంచంలో పదిమంది శాస్త్రజ్ఞులను తరచూ అంగారక గ్రహానికీ సంవత్సరంలో కొన్ని నెలలకు, రెండేళ్లకొకసారి వంతులవారీగా అక్కడ ప్రయోగాలు చేసి రావటానికి ఎంచుకుని, డాక్టర్ రాబర్ట్ డగ్లస్‌ని టీమ్‌లీడర్ (శాస్త్రాధిపతి) గా ఎన్నుకుని కూడా అయిదేళ్ళయింది.

డాక్టర్ రాబర్ట్ డగ్లస్ ఆస్ట్రియాలో ఇద్దరు ఫిజిసిస్టుల ఒకే కుమారుడు. ఆయన మూడు డిగ్రీలూ అనగా ఎమ్.డి. (మన MBBS) ఆ తర్వాత డి.వి.ఎమ్ (మన BVSc) అటుపిమ్మట డిడిఎస్ (మన BDS) ఆ తర్వాత రెండు పిహెచ్.డి.,లు అమెరికాలో ముగించగానే స్వదేశానికి ఆయన వచ్చేలోపున రష్యాలో సదస్సుకై స్వంత విమానంలో వెళ్ళి వస్తున్న అతని తల్లిదండ్రులు విపరీతమైన మంచుకురుస్తున్న కొండల మధ్య విమానం కూలి మరణించారు. వారి మృత కళేబరాలు రెండేళ్ళ తర్వాత మంచులో భద్రపడి దొరికాయి. శాస్త్రజ్ఞుడైన డాక్టర్ రాబర్ట్ వారిద్దరి మృతకళేబరాలని లండన్‌లో ఉన్న 'క్రయో ప్రిసర్వేషన్ సెంటర్'లో భద్రపరిచాడు నెలసరి బాడుగతో ('నా ప్రేమకు ముగింపు లేదులో' క్రయోప్రిసర్వేషన్‌ని వివరించబడింది) ఏనాటికైనా వారిని 'లేపటం' శాస్త్రం చేయగలదనే గట్టి నమ్మకంతో!

ఇప్పటికే రెండు 'నోబెల్ ప్రైజులు' గెలుచుకున్న డాక్టర్ రాబర్ట్ డగ్లస్ మితభాషి. ఆయనవద్ద పనిచేసి పిహెచ్‌డీలు పొందిన వారిలో అయిదుమందినే ఆయన తనతో ప్రయోగాలు చేయటానికి ఎన్నుకున్నాడు వారి పనితనం చూసి. అందులో నలుగురు మగవారు ఒకే ఒక్క ఆమె వనిత. త్రిలోకసుందరి అయిన డాక్టర్ శశిరేఖ ముఖర్జీ. తండ్రి బెంగాలీ, తల్లి జర్మన్. అచ్చు తండ్రి పోలికలతో తల్లి వర్ణంతో బంగారపు రంగు జుట్టుతో, ఎప్పుడూ చిరునవ్వుతో ఏదో ఆలోచిస్తూ, ప్రయోగశాలను ఎన్నడూ రాత్రి 10 గం॥ ముందు విడవని ఆ సౌందర్యవతి వయస్సు ఏభై రెండు సంవత్సరాలు. జవ్వనిలా కనుపించే ఆమె ఇంగ్లండులోనే స్కూల్ ముగించుకుని, అక్కడే వెటర్నరీ సైన్సులో డిగ్రీలు పొంది, అనిమల్ స్టెమ్‌సెల్ రీసెర్చిలో ఒక పి.హెచ్.డి చేసి ఆస్ట్రియాలో మరో పిహెచ్.డి., డాక్టర్ రాబర్ట్ డగ్లస్ గారివద్ద అదే ప్రయోగశాలలో చేసిన తర్వాత ఉద్యోగంలో చేరి అప్పుడే పదేళ్లయింది.

డాక్టర్ రాబర్ట్ డగ్లస్ గారికి ప్రేమ అనేది ఎప్పుడైనా కలిగితే అది డాక్టర్ శశిరేఖ వల్లనే. కానీ పెళ్ళి, పిల్లలూ ప్రయోగాలకి అంతరాయం అని తలిచే వారిద్దరి గమ్యాలూ ఒకటే అవ్వడం మూలాని పాశ్చాత్య దేశాలలో 'విద్దూరం' అని ఎప్పుడూ

అనిపించదు కనుక కలిసే ఉంటారు (లివ్‌ఇన్). కానీ ఒకర్నివిడిచి ఒకరు ఉండలేనంత ప్రేమ వారిమధ్య.

ఇద్దరూ కలిసి సాధించిన విజయమే మానవ 'క్లోనింగ్'. మిగతా సహచరులైన అక్కడ పనిచేసే విజ్ఞానులు, టెక్నీషియన్లూ స్నేహపూర్వకంగా పనులు చేసినా, ప్రయోగాలు విజయాన్ని చేకూర్చడానికే 'అందరూ తోడ్పడ్డారు' అనే బుద్ధిశాలి డాక్టర్ శశిరేఖ. కనుక అందరినీ సమానంగా చూసే ఆమె దగ్గర పనిచేయటానికి ఎప్పుడూ ఇష్టపడతారు అక్కడి శాస్త్రజ్ఞులూ, తదితరులు.

❖ ❖ ❖

ఆరోజు ఆదివారం. విపరీతమైన చలి. అప్పుడే సాయం సంధ్యలు చీకటిని అలముకుంటున్నాయి. స్ట్రాస్‌బర్గ్‌లో చాలా పురాతనమైన కేథేడ్రల్ చర్చి. ప్రతి శని, ఆదివారాలు సాయంకాలం సైకిలు మీద వెళ్ళివస్తూంటాడు డాక్టర్ రాబర్ట్ డగ్లాస్. తన మతంపై, దేవుడిపై విపరీతమైన భక్తిశ్రద్ధలు ఆయనకి.

తను ఇన్నాళ్లూ శ్రమించి సాధించిన విజయాన్ని లోకానికి చాటి చెప్పదల్చుకున్నాడు డాక్టర్ రాబర్ట్ డగ్లస్. సోమవారంనాడు దాని తాలూకు వివరాలు తయారు చేయటంలో రోజంతా మునిగివున్నది డాక్టర్ శశిరేఖ. చర్చివారు వారి చాపెల్‌లో ఆయనకు మర్నాటి సదస్సుకి (కాన్ఫరెన్స్‌కి) వారి హాల్ సంతోషంగా ఇవ్వటానికి ఒప్పుకున్నారు. మామూలుగా అయితే ఆ విశాలమైన హాలుని మతపరమైన విషయాలు మాత్రమే చర్చింటానికి వాడతారు అక్కడి బిషప్‌లు, ఫాదర్లు. కానీ, నోబెల్ గ్రహీత డాక్టర్ డగ్లస్ నిజాయితీ, తమ దేశానికి ఆయన తెచ్చిపెట్టినపేరు ప్రతిష్ఠలు, సౌమ్యుడైన ఆయన అడిగీ అడగగానే ఏది చేయాలన్నా వారి అదృష్టంగా భావిస్తారు ఆస్ట్రియాలో ఆయన ఎక్కడికెళ్ళినా.

ఆలోచిస్తూ మొహం మీద పడుతున్న ముంగురులను సుతారంగా వెనక్కి తోసుకుంటూ, రాసిన ప్రతి పదాన్ని పదేపదే పరీక్షిస్తున్న డాక్టర్ శశిరేఖ వెనుకగా వెళ్ళి సుతారంగా తన బలిష్ఠమైన బాహువులతో బంధించి తనవైపు తిప్పుకున్నాడు. ఆమె ప్రేమతో వారిస్తూ ఆయనను మరింత హత్తుకుపోయి, ఆయన జుత్తును సవరిస్తూ, ఆయన తలను హత్తుకుని 'హనీ! మనం అనుకున్నది సాధించాం! అనుకున్న ప్రకారం పెళ్ళి చేసుకోకుండా, మనం నిరూపించదల్చుకున్నది రేపటి లోకానికి విడమర్చి చెప్తాం! 'ఇటీస్ రియల్లీ ఎన్ ఇన్‌క్రెడిబుల్ ఫీలింగ్!' అంటూ ఆయన్ని అల్లుకు పోయిందామె ఆర్తితో.

❖ ❖ ❖

కొండల మధ్య ఎత్తుపల్లాలలో, ఆస్ట్రియాలో ఉన్న అతిపెద్ద చర్చి అది. విశాలమైన పరిధిలో కొన్ని వందల సంవత్సరాలకి మునుపు కట్టినా, అన్ని ఆధునిక వసతులున్న చర్చి. అక్కడి కాన్వెంట్‌లో నన్నారీ, తర్వాత బిషప్‌లు కాదలుచున్నవారికి విడివిడిగా బసలు, బ్రహ్మాండమైన కాన్ఫరెన్స్‌హాలు మధ్యలో. చర్చి చుట్టూరా చాలా ఎత్తున్న ప్రహరీగోడ- చీమకూడా దూరలేని పకడ్బందీతో ఏనాడో కట్టిన చర్చి. (సౌండ్ ఆఫ్ మ్యూజిక్ అనే ఆంగ్ల చలన చిత్రంలో చూడొచ్చు. ఆ చర్చి అన్ని భాగాలూను)

తొమ్మిది గంటల శుభసమయం. సోమవారంనాడు దేశవిదేశాలనుంచి వచ్చిన వారందరికి బస, భోజన వసతులూ కల్పించారు చర్చివారు. క్రమశిక్షణతో కిటకిటలాడుతున్నా, చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దంలో అందరూ ఆసీనులై ఎదురుచూస్తున్నారు డాక్టర్ డగ్లస్, అతని సహచరిణి డాక్టర్ శశిరేఖ మరియు వారితో కలిసి పనిచేస్తున్నవారి కోసం. ఇంతలో మెత్తగా కారాగిన చప్పుడు. చర్చివారు గౌరవ సూచకంగా (మామూలుగా ఐతే పోప్ వస్తే కానీ వాడని ఆ కారు) ఏర్పాటుచేసిన 'లిమోసీన్' నుంచి దిగి నెమ్మదిగా మెట్లెక్కుతున్న డాక్టర్ డగ్లస్, డాక్టర్ శశిరేఖ. ఇతర సహచరులు వారిని మెల్లగా అనుసరిస్తూ వచ్చి వేదికపై వారికి కేటాయించిన కుర్చీలపై ఆసీనులైనారు.

ఆ చర్చికి అధిపతి అయిన ఫాదర్ సుపీరియర్ ఫ్రాన్సిస్ డెబ్బై అయిదేళ్ళ ఒక పొడుగాటి వ్యక్తి. తెల్లటిగౌనుతో నెరసిన జుట్టుతో, బట్టతలతో, ముఖం మీద చిరునవ్వుతో మైక్ వద్దకు వచ్చి "ఇప్పుడీ కార్యక్రమం ఆరంభించే లోపున కాస్సేపు కారల్స్ పాడతారు అనగానే అందరూ లేచి వినయంగా నిలబడ్డారు. నల్లటి దుస్తులతో ఒక పదిమంది 'నన్స్' ఒకవైపు, తెల్లటి దుస్తులతో ఓ పదిమంది 'బిషప్స్' మరోవైపు నిలబడి, బయటచుట్టూరా ఉన్న ఎత్తైన కొండలలో శ్రావ్యంగా 'ఇకో' (ప్రతిధ్వని) మారుమ్రోగేటట్లు కారల్స్ పాడారు. ఎప్పుడూ చర్చిలో సదస్సు మొదలయ్యే ముందు ప్రార్థన, ఆ తర్వాతే సదస్సు అన్న ఫాదర్ అర్థింపు గుర్తించి మైకు సవరించి గొంతు సర్దుకుని చెప్పసాగాడు నోబెల్ గ్రహీత డాక్టర్ రాబర్ట్ డగ్లస్ :

'జంతుజాలాలలో కణాలకు 'రీజెనెరేటివ్ కెపాసిటీ' (పునః తయారీ అనొచ్చునేమో!) ఉన్నదని వందల సంవత్సరాలక్రితమే కనుక్కున్నారు. ఒక బల్లి తోక చప్పున తెగటానికి కారణం శత్రుబారినుంచి తప్పించుకోవటానికే, కానీ మళ్ళీ అది పూర్తిగా పెరగగలదు. కప్పలకూ, బల్లులకూ ఒక అంగం తెగినా మళ్ళీ సగం వరకో లేక పూర్తిగానో మళ్ళీ మొలవగలగడ మన్నది మనకు విదితమే. ఈ కోణం నుంచి ఆలోచిస్తే, కణాలకు మళ్ళీ మొలవగల శక్తి ఉన్నదనీను, ఆ శక్తి మానవుడిదాకా వచ్చేసరికి పైకి పూర్తిగా కోల్పోయినట్లనిపించినా, అంతర్లీనంగా మానవులకు ఈ

కణశక్తి ఎక్కడో నిగూఢంగా దాగి ఉన్నదనీనూ, అటునుంచి శక్తిని మళ్ళీ మనం పునః ప్రవేశపెట్టడానికి చేసిన ప్రయత్నాలలో ఈ ముఖ్యమైన ఘట్టం 'క్లోనింగ్'. కానీ, లైంగికపరంగా బీజకణాలు కలిసినప్పుడు ఒక 'Y' క్రోమోజోమ్ ఉన్న మగ బీజకణం జతలోని ఒక 'X' ఆడ క్రోమోజోముతో కలిస్తే మగ సంతానమున్నూ లేదా మగబీజకణంలో ఉన్న 'XY' జతలోని ఒకే ఒక్క 'X' క్రోమోజోము ఆడ 'X' క్రోమోజోము జతలో ఉన్న ఒక ఆడబీజకణంలో కలిస్తే, ఆడ సంతానంగా ఉద్భవిస్తాయని కూడా నిరూపింపబడ్డాయి. అదే సహజ కణవిభజన ప్రారంభంకాగానే ప్రయోగశాలలోని వాటిని తారుమారు చేసి మగ సంతానం బదులు ఆడసంతానంగాగానీ, లేక ఆడ సంతానాన్ని మగసంతానంగా మార్చవచ్చని జంతువులు, ముఖ్యంగా మన బంధువులైన కోతులపై నిరూపింపబడినా, వానపాము, కప్పలలాంటి జంతువులలో మగబీజం ప్రమేయం లేకుండానే పూర్తి జంతువు ఉద్భవించగలదని కూడా శాస్త్రజ్ఞులు వాటి సహజ పరిసరాల్లోనేకాక ప్రయోగశాలలో కూడా చేయగలిగారు. దాన్నే 'పార్థెనోజెనెసిస్' అన్నారు.

అటువంటప్పుడు మగ ప్రమేయం లేక ఆడ బీజకణ ప్రమేయం లేకుండానే పూర్తి మనిషిని ఎందుకు తయారుచేయకూడదు? అన్న అంశం మానవ కణాల మీద ప్రయోగాలని ఇరవయ్యో శతాబ్దం మొదట్లో చట్టాలు అంగీకరింపక పోయినా, కొన్ని సంవత్సరాలకు ఈ చట్టాలు మారటమేకాక వివిధ దేశాలలో పోటీపడుతూ ప్రయోగాలు చేయసాగారు. అందులో మొట్టమొదటి మెట్టు మా ప్రయోగశాలలోనే సాధించారు. దానికి నాకు మొదటి నోబెల్ ఇచ్చినా ఆ ధనం మొత్తాన్ని కొంత ఈ 'కేథిడ్రల్' అభివృద్ధికి, ఈ దేశం నాకు ఏర్పరచిన లాబోరేటరీలో మరింత అభివృద్ధికై కావాల్సిన అత్యాధునిక పరికరాలు కొనటానికీనూ, మిగతా ధనం నాతో పనిచేసినవారికి అవార్డులు సరిసమానంగానూ పంచిపెట్టాను. ఆ మొదటి మెట్టు అంశమే నా సహ శాస్త్రజ్ఞురాలు డా॥ శశిరేఖ రెండో పిహెచ్‌డి కి దారితీసింది.

మొదటిమెట్టు సఫలీకృతమవ్వటానికి మేము చాలా పాటుపడ్డాము. ఇంతకు మునుపే పందొమ్మిదొవ శతాబ్దం ఆఖరున మొదటిమెట్టులో 'డాలీ' అనే గొఱ్ఱెని ఏనాడో మగ ప్రమేయం లేకుండానే ఒక గొఱ్ఱె పాలసంచి నుంచి ఒక్క కణంలాగి దాని కణంలోని 'న్యూక్లియస్'ని తీసి దానిని పైన చెప్పిన మరో ఆడ గొఱ్ఱె ఒంటినుంచి లాగిన కణంలోకి సిరింజితో ఎక్కించి కొంతకాలం ప్రయోగశాలలోనే కణవిభజన కానిచ్చి అదే గొర్రె గర్భసంచిలోనికి ఎక్కించారు ఇంగ్లండులో. దీన్ని గురించి తెలిసిందేమంటే మగ ప్రమేయం లేకుండానే తన కణాలనుంచే మళ్ళీ ఇంకో ఆడ సంతానం శాస్త్రజ్ఞులు పుట్టించగలిగారు. చట్టాలు మనుష్యులలో అటువంటి ప్రయోగాలు

చెయ్యొచ్చని ఆదేశాలు ఇచ్చిన తర్వాత ఒక ఆడ జీవం నుంచి ఆడజీవమేకాక మగజీవం నుంచి మగ సంతానం కూడా ఇదే ప్రకారం మగ బీజకణాలు అవసరం లేకుండానే పుట్టించవచ్చని నిరూపించాము. అది మా రెండో మెట్టు. కానీ ఇక్కడ మనం గమనించాల్సింది ఒకటుంది.

తల్లి గర్భకోశంలో ఈ కణాలను కాస్త కణ విభజన ప్రయోగశాలలో పెరిగాక, పెడితేగానీ అవి పూర్తి జీవరాశిగా ఏర్పడవు. అంటే తల్లి గర్భకోశంలో జీవరాశి పెరుగుదలకు కావల్సిన వాతావరణం పాలిచ్చే అన్ని జంతువులలోనూ ఉన్నది. కానీ, పక్షులలో, బల్లులలో ఆ శక్తి వాటి గ్రుడ్లలోనూ, చేపలలో మరియు కప్పలలో నీళ్లలోనే ఆకులను అతుక్కుని ఉండే వాటి టాడ్‌పోల్స్‌లోనూ ఉన్నవి.

ఇక్కడ నేనూ, నా సహశాస్త్రజ్ఞురాలు ఇన్ని ఏళ్ళూ వివాహం చేసుకోకుండా వేచియుంటానికి కారణం కూడా శాస్త్రపరమైన కారణమే! విస్తుపోకండి సుమా!" అని కాస్త మాట్లాడ్డం ఆపి, తొమ్మిదేళ్ళ వయసుగల ఒక మగపిల్లాడినీ, ఒక ఆడపిల్లనూ ప్రవేశపెట్టాడు. అందరూ ఆశ్చర్యంతో చూస్తుండగానే ఓ గ్లాసు మంచినీళ్లు త్రాగి మళ్లీ ఆరంభించాడు డాక్టర్ డగ్లస్.

'ఈ పిల్లలిద్దరూ ఎవరో తెలుసా?' అని ఓ రెండు క్షణాలు ఆగాడు. ఎవరన్నా ఊహిస్తారేమోనని అనుకుని. నిశ్శబ్దం... కిక్కురు మనలేదెవ్వరూ. చిన్నగా నవ్వి ఈ అబ్బాయి పేరు రిచర్డ్. నిశితంగా చూస్తే అచ్చు శశిరేఖ పోలికే. అతి రహస్యంగా ఉంచిన ఈ ప్రయోగం చేసిన మేమిద్దరంకాక మారుమాట్లాడక త్రికరణశుద్ధిగా పాటిస్తారు మా సహచరులు. డా॥ శశిరేఖ తోలునుంచి తీసిన కణంలోని న్యూక్లియస్‌ని లాగేసి, నా తోలు నించి తీసిన కణంలోని న్యూక్లియస్‌ని ఎక్కించి పిల్లలు కావాలనుకునే తల్లులు పత్రికలలో ఇచ్చిన 'రెంట్ అ వూంబ్' (గర్భకోశం అద్దెకు ఇవ్వబడును) ప్రకారం పిల్లలు లేని ఒకామెని వెతికి, ఆమె గర్భకోశంలో ఈ కణమార్పిడిని భద్రంగా పెట్టి, 9 నెలలు ఆమె మోసి కనిన పిల్లాడికిపుడు 9 ఏళ్ళు. అదే విధంగా నా తోలు కణాలలోని న్యూక్లియస్‌ని తొలగించి డా॥ శశిరేఖ తోలుకణాల్లో న్యూక్లియస్‌ని అలాగే ఉంచి రెండు కణాలని జతపరిస్తే వచ్చినదే ఈ అమ్మాయి, కానీ నా పోలికలు కొంతలేకపోలేదు. ఈ పిల్లకూడా పిల్లలులేని మరొక తల్లి ఇచ్చిన ప్రకటన చూసి, కొంత కణవిభజన ప్రయోగశాలలో జరిగాక ఆమె గర్భకోశంలోకి ఈ విభజన చెందిన కణాన్ని ఎక్కిస్తే పుట్టిన ఈ పాప పేరు ఈనాడు 'మార్గరేట్'.

నైతికంగా రిచర్డ్, మార్గరేట్ లైంగిక ప్రమేయం, బీజకణాల ప్రమేయం లేకుండా పుట్టిన మా పిల్లలు. కానీ ఒక్కసారి ఒక తల్లి గర్భం దాలిస్తే, మాతృత్వపు ప్రేమ ఆ పుట్టిన పిల్లలను తనవిగానే భావిస్తుంది. మనుష్యులేకాక మిగతా జంతుజాలాల్లో కూడా అవి గమనిస్తూనే ఉన్నాము. కుక్క పాలు త్రాగే కోతిపిల్లలనూ, పులి పాలు త్రాగే కుక్కపిల్లలనూ మాతృత్వం పెల్లుబికే ఆ తల్లి ఏమీచేయదు. ఏ హానీ తలపెట్టదు. ఇటువంటి జాతిమత భేద భావాలు లేని కల్తీ లేనిదే విజ్ఞాన శాస్త్రం.

కనుక, ఈ పిల్లలను కేవలం ఈ సదస్సులో మా ప్రయోగాలు సఫలీకృత మయినాయని నిరూపింపడానికి జతపరచిన మా (DNA) డిఎన్ఎ టైపింగ్స్ ఉన్నాయి" అంటూ లాప్‌టాప్‌లోకి ఒక పెన్‌డ్రైవ్‌లోని డిఎన్ఏలు తనవీ, శశిరేఖవీ, రిచర్డ్‌వీ, మార్గరేట్‌వీ గోడపై ప్రొజెక్ట్‌చేసి పోల్చి చూపించాడు డాక్టర్ రాబర్ట్ డగ్లస్.

ఇపుడు మా ప్రయోగాలు సఫలీకృతమయ్యాయి. దీన్ని గురించి నిరూపింపబడినదే మంటే మనిషి తన నీడకి తనే తోడయినాడు- అని నవ్వి : 'నీ నీడకు నువ్వే తోడు' అని ఆదరంతో ఈ సదస్సుకి అన్ని సౌకర్యాలు కల్పించిన ఈ 'కేథిడ్రల్' ఫాదర్ సుపీరియర్ మాట్లాడతారు అని తనకు కేటాయించిన కుర్చీలో కూర్చోగానే ఫాదర్ సుపీరియర్ మైకు దగ్గరకొచ్చి 'ఈ అమోఘమైన విజ్ఞాన సంపదను మనకు ఈనాడు విడమర్చి చెప్పిన డా॥ రాబర్ట్ డగ్లస్ మరియు డా॥ శశిరేఖ మీకు చెప్పని మరొక విషయం నేనొకటి చెప్తున్నాను. ఈనాడే, ఈ కేథిడ్రల్‌లోనే, ఈ సదస్సు ముగియగానే మీరందరూ ప్రక్కనే ఉన్న చర్చిలో హాజరుకావ ప్రార్థన. వారిద్దరికీ నేడే నేను పెళ్ళి జరిపిస్తున్నాను. వారి అభ్యర్థన ప్రకారం."

అంతటి శాస్త్రజ్ఞురాలైనా కూడా డా॥ శశిరేఖ బుగ్గలు కెంపులయి ఎర్రబడ్డాయి. ఆమెవైపు ప్రేమగా చూస్తూ ఉన్న డా॥ రాబర్ట్ డగ్లస్ అందరివైపూ చూస్తూ, 'ఆల్ ఆఫ్‌యూ ఆర్ రిక్వెస్టెడ్‌టు బీ విత్ అస్ ఆన్ అవర్ వెడ్డింగ్ ఈవెంట్' అని లేచాడు. పత్రికా విలేఖరులూ, కెమెరాలు క్లిక్ మంటూండగా, ప్రపంచమంతా ఈ సదస్సు వీడియో కాన్ఫరెన్స్‌లో చూస్తుండగా చప్పట్లలో 'స్టాండింగ్' ఒవేషనిచ్చారు, ఆ కాబోయే దంపతులకు.

# డ్యాడీ వెన్ డూ వి గో హోమ్?
# (నాన్నా! ఇంటికెప్పుడెళ్దాం?)

ఆరోజు రాత్రి విపరీతంగా మంచు ముద్దలు ముద్దలుగా కురుస్తోంది. తేదీ జనవరి 20, 1960. చిన్నారి సూసన్ తన తండ్రి ఒళ్ళో కూర్చుని చిన్న చేతులలో ఉన్న 'టెడ్డీబేర్' ను అటూ ఇటూ కదిలిస్తూ, గుండ్రని కళ్ళను త్రిప్పుతూ, తలఎత్తి తన తండ్రి డా॥ జాన్‌కార్టర్‌ని పదకొండోసారి మళ్లీ వేసిందదే ప్రశ్న, గత ఆర్నెల్లలో ఇలా చాలాసార్లు. అది ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్ నగరం. తన చిన్నారి ప్రశ్నకు సమాధానంగా ఆ పాలబుగ్గలపై ఓ ముద్దిచ్చి, విచారంగా తన ప్రక్కనే కూర్చుని ఉన్న తన సతీమణి ఎలైన్ వేపు ఓసారి చూచి! "మై డార్లింగ్ చైల్డ్! రేపు తప్పక వెళ్దాం, సరేనా?" అనగానే అప్పటికి ఊరుకుని బుద్ధిగా తన బొమ్మలతో ఆడుకోసాగింది చిన్నారి సూసన్.

మర్నాడు ప్రొద్దున్నే అన్నమాట తప్పకుండా తండ్రి జాన్‌కార్టర్ భార్యామణి డా॥ ఎలైన్‌తో సహా వాళ్ళ హడ్సన్ కారులో బయలుదేరి సూసన్‌ను జూకి తీసికెళ్ళి అక్కడ కేరింతలతో ఆ పిల్ల చప్పట్లు కొడుతూ, ఒక చేత్తో కోన్ ఐస్‌క్రీమ్ నాకుతూ, పిట్టలనూ, కోతులనూ అన్ని జంతువులను చూపిస్తూ పేరుపేరున తండ్రిని అడుగుతూ వాటి అల్లర్లు చూడసాగింది. దాంతో కార్టర్ దంపతులు నిట్టూర్చారు. 'హమ్మయ్య! ఇప్పటికైనా మనపాప సూసన్ ఆ విషయం కాస్త మరచిపోయింది కదా' అనుకుని.

కానీ వాళ్ళ అంచనాని తారుమారు చేసింది ఆ చిట్టి సూసన్. దారిలో ఆగి, భోజనాదులు ఒక మంచి డౌన్‌టౌన్ రెస్టారెంటులో ముగించుకుని మళ్ళీ కారులో ఇంటికి వస్తోంటే ముందు సీటులో తల్లి ఇలైన్ ఒడిలో కూర్చున్న సూసన్, ఉన్నట్లుండి వాళ్ళమ్మని తట్టుతూ త్రోవలో ఒక పళ్ళ అంగడిని చూపిస్తూ "అదిగో, మమ్మీ! అక్కడే నాన్న పనిచేసేవారు!" అనగానే డెంటల్ సర్జన్స్ అయిన ఆ ఇద్దరూ విస్తుపోయారు. వణుకుతూన్న తన కుడిచేయి మునివేళ్ళతో డ్రైవ్ చేస్తున్న తన భర్త ఎడం చేతిని సుతారంగా తడుతూ అన్నది డా॥ ఎలైన్ భర్తతో "డార్లింగ్! మనం ఇప్పటికిప్పుడే చైల్డ్ సైక్రియాట్రిస్టుని చూడాలి! ఇక ఆలస్యం చేస్తే మన పిల్ల మనకి దక్కదు" అనగానే డా॥ జాన్‌కార్టర్ తల ఆడించి 'ఎస్ హనీ! ఇట్ హేస్ గాట్‌టుబి నౌ!' అని వెంటనే కారుని సైకియాట్రిస్ట్ క్లినిక్ వైపు పోనిచ్చాడు, ఇంటివైపు వెళ్ళాల్సిన ఆ డెంటిస్టు.

ఇది లోకంలో ఒక్క ఉదాహరణ. విపులంగా చెప్పాలంటే మనం ఈ పునర్జన్మల వృత్తాంతం అనాదిగా వస్తున్న ఈ వింత పరిణామాల్ని విజ్ఞానపరంగా పరిశీలించి పరిశోధించాల్సింది ఇంకా చాలానే ఉన్నది. ఇలాంటి పూర్వజన్మ జ్ఞాపకాలు కలవారు పిచ్చివాళ్లు కారు. కనుక వాళ్ళని పిచ్చివాళ్లుగా పరిగణించి అలాంటి కొందరిని పిచ్చాసుపత్రిలో చేర్పించటం ఆత్మహత్యతో సమానం. మరి ఎలా వాళ్లని బాగుచేయటం అన్న విషయానికొద్దాం. పాశ్చాత్య దేశాల్లోనూ కొన్నిచోట్ల మన భారతదేశంలోనూ ఈ 'పారాసైకాలజీ డివిషన్ ఆఫ్ రీ ఇన్‌కార్‌నేటెడ్ సబ్జెక్ట్స్' అనే డిపార్టుమెంటులు రాజస్థాన్ విశ్వవిద్యాలయంలోనూ వాల్తేరులో ఉన్న ఆంధ్రా యూనివర్శిటీలోనూ ఉన్నాయి. డా॥ బెనర్జీ అనే పారాసైకాలజీ ప్రొఫెసర్ విశిష్ఠమైన పరిశోధనలు ఈ అంశంపై చేసి అంతర్జాతీయ ఖ్యాతి రాజస్థాన్ యూనివర్సిటీకి తేవటమే కాక ఇట్టి జ్ఞాపకాలున్న అభాగ్యులను డాక్టర్లతో చేయి కలిపి కేవలం 'కౌన్సెలింగ్' తోనే వారిని పూర్తిగా బాగుచేశారు.

అదే మాదిరి మాజీ వైస్ ఛాన్సలర్ ఆఫ్ ఆంధ్రా యూనివర్సిటీ వాల్తేర్‌లో కూడా డా॥ రావుగారు విపరీతమైన కృషి చేసి ఇందులో కీర్తి సంపాయించటమేకాక, పలువురిని కౌన్సెలింగ్‌తో తిరిగి మామూలు పరిస్థితులతో రాజీపడేట్లు చేశారు. ఇప్పుడు అదే విధంగా మన చిన్నారి సూసన్‌ను ఆ పాప తల్లిదండ్రులు ఎలా మామూలు స్థితికి తెచ్చారో ఆస్ట్రేలియాలో, చూద్దాం.

సైకియాట్రిస్టు డా॥ బార్టన్‌కు సూసన్‌ను చూపించి వివరాలు చెప్పారు ఆ డెంటల్ సర్జన్స్-దంపతులు. ఆయన అన్నీ రాసుకుంటూ టైప్‌కూడా చేసుకున్నాడు. ఆయన ఈ మోస్తరుగా వారితో మాట్లాడేటప్పుడు ఆయన సహచరులైన మరో ఇద్దరు అసోసియేట్ చైల్డ్ సైకాలజిస్టులు (పిహెచ్‌డిలు) డా॥ మెక్‌డొనాల్డ్ మరియు డా॥ ఓహారాలు కూడా శ్రద్ధగా అన్నీ చకచకా తేదీలతో సహా డైరీలో రాసుకున్నారు. ఆరు సంవత్సరాల చిన్నారి సూసన్ చక్కటి వర్ఛస్సుగల ఒకే ఒక సంతానం ఆ దంపతులకు. ఆ డాక్టర్లు అనగా సైకియాట్రిస్టు, ఆయన అనుచరులు పైన చెప్పిన చైల్డ్ సైకాలజిస్టులు, కాస్సేపు ఆ చిన్నపిల్లను ముద్దు మాటలతో మురిపించి చాక్లెట్లు ఇచ్చి మచ్చిక చేసుకున్న తర్వాత మెల్లగా అస్సలు విషయం ఆ పాపదగ్గర్నుంచి మెత్తమెత్తగా అడుగుతూ కూపీ తీయగా పూసగుచ్చినట్లు అమాయకపు కళ్ళు అటూ ఇటూ త్రిప్పుతూ, మధ్యమధ్య వాళ్ళ అమ్మా నాన్నల వైపు చూస్తూ, చాక్లెట్ తింటూ, మొదట సందేహించినా, ఉన్నట్లుండి విపులంగా తన పూర్వజన్మ వృత్తాంతం పెద్దవాళ్ళకు మల్లే కొంచెం కొంచెంగా చెప్పసాగింది. ఈ మొత్తం విషయసేకరణ వారానికి ఒక్కసారి ఆ పాప వాళ్ళ ఇంటికివెళ్ళి కొంచెం కొంచెంగా మొత్తం వృత్తాంతం రెండు నెలల్లో

సేకరించారు. ఆ పాప చెప్పిందాన్ని బట్టి తేలిందేమిటంటే ఆ పాప పూర్వజన్మలో సిడ్నీ అనే మరో ఊరిలో ఆస్ట్రేలియాలోనే తన పూర్వపు తల్లిదండ్రులతో నివసించినట్లూనూ, తన పూర్వపు తండ్రి ఒక పళ్ళ దుకాణాన్ని నడిపేవాడనీ, తనకి ఇద్దరు అన్నలు కూడా ఉండేవారనీ, ఒకరోజు స్కూలునించి ఇంటికి వస్తూ రోడ్డు దాటుతుండగా ఒక లారీ గ్రుద్దేసినట్లునూ, అప్పటికి తనకి పదిహేడో ఏడు అనీ, అంత వరకే జ్ఞాపకం ఉన్నాయనీ చెప్పగలిగింది.

మర్నాడే సూసన్ తల్లిదండ్రులు, సైకియాట్రిస్ట్, ఆయన సహచరులైన మరిద్దరూ చైల్డ్ పారాసైకాలజిస్టులు, అందరూ రెండుకార్లలో సిడ్నీకి శనివారం బయలుదేరి చేరుకున్నారు. అక్కడ సరిగా ఏచోట తనని లారీ గుద్దేసిందో తను పడిపోయిన చోటు చూపించింది సూసన్. తన భుజంపై పడిన గాయం తాలూకు గీత ఇప్పటికీ ఉన్నదని చిన్నగౌను పక్కకి లాగి డాక్టర్లకి చూపించింది. సునాయసంగా తను అప్పట్లో ఉన్న ఇల్లు చూపించగా తలుపు తడితే సూసన్ చెప్పిన పూర్వజన్మలోని తన వృద్ధ తల్లిదండ్రులు ఇంకా అక్కడే ఉన్నారు. 'నాన్నా!' అని ఆర్తిగా సూసన్ ఆ వయోవృద్ధుణ్ణి తండ్రిగా గుర్తించి, పరుగెత్తికెళ్ళి ఆలింగనం చేయగా ఆ వృద్ధుడు తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు. అతని భార్య ఇక చెప్పనే అఖ్ఖర్లేదు. ఆ వృద్ధ దంపతులు ఆశ్చర్యాన్నుంచి తేరుకునే లోపున బరబరా తన ఇప్పటి తల్లిదండ్రులను లాక్కెళ్ళి, తన జ్ఞాపకార్థం గతజన్మపు తల్లిదండ్రులు భద్రంగా పదిలపరచిన 'పియానో'ను చూపించింది. నమ్మశక్యంగాని ఈ నిజాన్ని ఆ పాప గతజన్మ తల్లిదండ్రులు ఆనందభాష్పాలతో ఏం చేయాలో తెలీని పరిస్థితిలో నోటమాటరాక మ్రాన్పడిపోయారు.

అన్ని విషయాలు డాక్టర్లు ఆ వృద్ధ దంపతులకు విడమర్చి చెప్పిన తర్వాత పరిస్థితులను అర్థం చేసుకుని వాళ్ళు పూర్తిగా సహకరించారు.

ఇపుడు ఆలోచించాల్సినది ఇటువంటి వారి పరిస్థితి ఏమవుతుంది? వాళ్ళు మళ్ళీ మామూలు మనుష్యులయి, ఆ పూర్వజన్మ జ్ఞాపకాలను పూర్తిగా మరిచిపోయి పూర్తికాలం సంతోషంగా జీవించగలరా? ది ఆన్సర్ ఈజ్ 'ఎస్' అన్నారు సూసన్‌ని పూర్తిగా నయం చేసి మళ్ళీ చలాకీ పిల్లగా మార్చిన డాక్టర్లు. కౌన్సెలింగూ, సైకోథెరపీల దీర్ఘకాలంలో తప్పక వీరందరిని బాగుచేయగలనని నిరూపించారు ఆ డాక్టర్లు. ఇక సూసన్ తల్లిదండ్రుల సంతోషానికి పట్టపగ్గాలు లేవు మరి! ఆ పాప విషయంలో తగిన సమయంలో తగిన వైద్య సహాయం నిపుణులు ఇవ్వబట్టి మామూలు మనిషి కాగల్గింది. మరి మన దేశంలో అక్కడక్కడ ఉన్న ఇలాంటి అభాగ్యులకేమవు తోంది?

మన భారతదేశంలో విజ్ఞానానికి, నిపుణులకు కొదవలేదు. కానీ నమ్మకం, పూర్తిగా బాగుపడగలమనే ఆత్మస్థైర్యం చాలా ముఖ్యం. పైన చెప్పిన మన దేశపు పారా సైకాలజిస్టులలో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన రాజస్థాన్ యూనివర్శిటీకి చెందిన డా॥ బెనర్జీగారు చేసిన అపారమైన కృషిలో పలురకాల పూర్వజన్మ స్మృతికలవారు ఉన్నారు. కొందరు ఎలా చనిపోయారు మట్టుకు పూర్వజన్మ స్మృతిగా జ్ఞాపకం ఉంటే మరికొందరికి వారు పూర్వజన్మలో ఏం వృత్తి చేసేవారో అదిమట్టుకు జ్ఞాపకం. మరికొందరు ఏ దేశంలో నివసించేవారో జ్ఞాపకం. ఇలా చాలా విషయసేకరణ చేశారు. డా॥ బెనర్జీ రాజస్థాన్ యూనివర్సిటీలోనూ, డా॥ రావు, మాజీవైస్ ఛాన్సలర్, ఆంధ్రా యూనివర్సిటీలోనూ, చేసిన అపారమైన కృషి వందలకొద్దీ వారు చేసిన రీసెర్చి పబ్లికేషన్ల వలన లోకానికంతటికీ విదితమే.

ఈనాడు విపరీతంగా విజ్ఞానం అభివృద్ధి చెంది, అంగారక గ్రహం దాకా వెళ్ళి అక్కడ నాల్గు చక్రాల రోబో బండి తానంతట తనే పరిశోధనలు చేసేంత విజ్ఞానం పెరిగింది. అలాగే పూర్వజన్మల వృత్తాంతాన్ని క్షుణ్ణంగా, వైజ్ఞానికంగా ఎందుకిలా జరుగుతోందో తెలిపే రోజులు చాలా దగ్గరపడ్డాయి మరి!

❀ ❀ ❀

# 'డార్లింగ్! వేర్ ఆర్ యూ?'
# (ప్రియతమా! ఎక్కడున్నావు?)

ఆ రోజు నాకిప్పటికీ జ్ఞాపకం ఉంది. అది 1970 వ సంవత్సరం. నా రెణ్ణెల్ల వేసవి శెలవలకి న్యూయార్కులో స్థిరపడిన మా బాబాయి, ఆయన అమెరికన్ భార్యా జూలియా ముగ్గురు పిల్లలు నన్ను రమ్మని ఆహ్వానించారు. నేనప్పటికి ఇంకా BSc మొదటి సంవత్సరంలో బొంబాయి విల్సన్ కాలేజీలో చదువుతున్న రోజులు. 16 గంటల విమానయానం. మొట్టమొదటిసారిగా దేశం వదిలి పరదేశానికి వెళ్ళిన సందర్భం. కనుక స్వతహాగా ఆ వయస్సులో ఉండే ఉత్సాహం, కుతూహలం నరనరాన వాయువేగంతో పారుతూవుంటే, అమెరికాలో అడుగుపెట్టిన క్షణం నుంచి మళ్ళీ తిరుగు ప్రయాణంకై విమానంలో కాలు మోపేదాక జరిగిన ప్రతి అనుభవం ఒక ఎత్తూనూ, మరోప్రక్క అతి ముఖ్యమైన ఘట్టం మరో ఎత్తు. ఈ విచిత్రమైన స్వానుభవం ఓ వేళ 22 సంవత్సరాల అమెరికన్ జవ్వని కారొలైన్ నా ప్రక్క సీటులో పరిచయం కాకపోయుంటే జరిగేది కాదేమో! కూర్చున్న వెంటనే 'హాయ్! ఐ యామ్ కారొలైన్, హవ్ డు యూ డు?' అని మొదలెట్టి అమెరికాలో విమానం దిగేవరకూ ఆమె చెప్పిన ప్రతి విషయం నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేయటమే కాక విజ్ఞానపరంగా ఆలోచనల్లో మునిగి తేలేటట్లు చేసింది. ఆమె మాటల చాతుర్యం, అవతలి మనిషిని తెలిసినట్లు నవ్వుతూ, తెలివైన కళ్ళు అప్పుడప్పుడు పెద్దవి చేసి, ముఖంపై పడే బంగారువర్ణం కల ముంగురులు వెనక్కి తోసుకుంటూ, చక్కని తెల్లని పలువరస, సొట్టలుపడే ఎర్రటి బుగ్గలు, ఇట్టే ఆకర్షించే బలిష్ఠమైన అవయవ సౌష్ఠవం, మళ్ళీమళ్ళీ చూడాలనిపించే అందం, ఇలా చెప్తూ పోవచ్చు. మాటల్లో నిజాయితీ, అవతలి వాళ్ళ కష్టాలని పంచుకోవాలన్న ఆతురత, నన్ను ఇట్టే ఆకట్టుకున్నాయి.

ఇంతకీ ఆమె చెప్పిన విషయాలని బట్టి నాకు అవగాహనమయిందేమంటే ఒక పెద్ద పారిశ్రామికవేత్త, 'ఆయిల్‌టైకూన్' కి ఆమె ఒక్కగానొక్క సంతానం. తాను చదువుకుంటూ విడిగా ఒక అపార్ట్‌మెంట్‌లో న్యూయార్క్‌లో ఉంటున్నది. తండ్రి ఒక నాలుగు బిల్డింగులు అవతల అదే వీధిలో మరో ఖరీదైన 6 బెడ్‌రూమ్‌ల అపార్ట్‌మెంట్‌లో ఉంటాడు. ముద్దుల కూతురు తను 'స్వతంత్రంగా ఉంటాను' అని అనగానే ఆమెకి వెంటనే విడిగా ఉండేందుకు అన్ని వసతులుండే ఈ అపార్ట్‌మెంటు, ఒక సరికొత్త 'పాంటియాక్' కారు కాలేజీకి వెళ్ళేందుకు కొనిచ్చాడు. ప్రతిరోజూ కాలేజీ వదలగానే

తనే డ్రైవ్ చేసుకుంటూ తండ్రి దగ్గరకి వెళ్ళి ఓ రెండు గంటలు గడిపిన తర్వాత తన బసకి వెళ్లేది. రెండిళ్ళకీ మధ్య మూడు నిమిషాల నడిచే దూరం. తల్లి కారొలీన్ పుట్టిన సంవత్సరానికే కాన్సర్ వ్యాధితో చనిపోవడం మూలాని, ఆమె తండ్రి ఆమెని అల్లారుముద్దుగా పెంచటమేగాక, మళ్ళీ పెళ్ళి చేసుకోలేదట. ఇంతవరకూ విన్నది బాగానే ఉన్నది. కానీ...

అప్పటికే డైరెక్ట్ ఫ్లయిట్ అవటం మూలాన 10 గం॥ సేపు నాన్‌స్టాప్‌గా పోతున్నది గరుడపక్షిలా ఉన్న విశాలమైన బోయింగ్ 747. ఉన్నట్లుండి ఒక కుదుపుతో కిందకి దూకినట్లు ('ఏర్ పాకెట్' లో దూసుకుపోవటంవల్ల) గడగడలాడి మళ్ళీ మెత్తగా పయికి లేచింది విమానం. ఆ కొన్ని సెకన్లలో ఉలిక్కిపడి భయంతో మొహం ఎర్రపడి నా చేతిని గట్టిగా తన చేతిలో తీసుకుని, కొన్ని క్షణాలు నాపైవాలి, మళ్ళీ చేయి వెనక్కి తీసుకుని, ముఖంపై పట్టిన చెమట బిందువులను సుతారంగా తుడుచుకుని: 'సారీ!' అని ఏం జరగనట్లు ఓ చిరునవ్వు నవ్వేసింది. 'నెవర్ మైండ్! ఇటీస్ ఓకే' అన్నాను.

ఆ విమానం కుదుపు తర్వాత, మెదలకుండా శూన్యంలోకి చూస్తూ కూర్చున్నదల్లా మళ్ళీ గబుక్కున నావైపు తిరిగి : 'మీకు విజ్ఞాన శాస్త్రం మీద నమ్మకమెక్కువా, లేక మతం మీదనా?' అనడిగింది. ఒక్కసారిగా అలా అడగటంతో ట్రాన్సుడిపోయి, వెంటనే సర్దుకుని 'ఏం? ఎందుకా సందేహం? తప్పక రెంటిమీదా నమ్మకం బాగా ఉన్నది నాకు, అంతేకాదు. విజ్ఞానం మీదనూ అంతే నమ్మకం!' అన్నాను. అందాకా బిగించి ఉన్న సీట్ బెల్టును వదులుచేసుకుని గొంతు సవరించుకుని మళ్ళీ చెప్పసాగింది. 'మా అమ్మ చనిపోయినప్పట్నుంచి ఏ కొరతా లేకుండా అల్లారు ముద్దుగా పెంచి, చదువు చెప్పిస్తూ నాకడిగిందల్లా లేదనకుండా ఇస్తున్నా, ఒకే ఒక్క విషయంలో మా నాన్నతో నేను బొత్తిగా ఏకీభవించలేకపోతున్నాను" అని కాస్త ఆపి, అప్పుడే 'ఏర్‌హోస్టెస్' తెచ్చిచ్చిన బియర్ చప్పరిస్తూ, 'వోంట్ యూ హావ్ సమ్?' అని నావేపు బియర్ కాన్‌ని చూపిస్తూ అడిగింది. "నో థాంక్స్! ఐయామ్ ఎ టీ టోటలర్!" అన్నాను. (మద్యపానాలు సేవించనని)

'ఓకే' అని మళ్ళీ అందుకుంది. ఏదో ఆలోచనల్లో తేలియాడుతూ నేను మౌనం వహించాను, ఆమె ఏం చెప్తుందా అని 'క్యూరియాసిటి'తో. "మానాన్న రోజూ రాత్రి 9 గం॥ నుంచి 12 గం॥ దాకా చనిపోయిన మా అమ్మ ఆత్మతో 'ప్లాన్‌చెట్' (ఓజా బోర్డ్ అంటారు) అనే పరికరం ముందుంచుకుని మాట్లాడతారు తెలుసా?" అని కళ్ళు పెద్దవి చేసి "అదే నాకు ఇంతవరకూ అంతుపట్టనిదీనూ, నచ్చనిదీన్నూ!" బియర్

త్రాగేసి అప్పుడే ఖాళీ డబ్బాలు వెనక్కి తీసుకోవటానికొచ్చిన ఫ్లయిట్ పర్సర్‌కి ఇచ్చింది. అతను అది బండిలో వేసుకుని వెళ్ళిపోయాడు.

అప్పటికే కెన్నెడీ ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్ న్యూయార్క్ దగ్గర పడుతూండటం వలన, పైలెట్ మైక్‌లో సీట్‌బెల్టులు వేసుకోమన్నట్లు సూచనలిస్తున్నాడు. ఏర్ ఇండియా విమానం అవటం వల్ల మొదట హిందీలోనూ అటు పిమ్మట ఆంగ్ల భాషలలోనూ అనర్గళంగా సూచనలివ్వసాగాడు.

గరుడపక్షికి మల్లే మెత్తగా కొంచెం కొంచెంగా దిగసాగింది విమానం. కారొలైన్ చకచకా ఒక కాగితంపై తన అడ్రస్, తండ్రి అడ్రస్, టెలిఫోన్ నెంబర్లూ వగైరా రాసి నాకిచ్చి కరచాలనం చేస్తూ చెప్పింది "మీరు తప్పక మా నాన్న ఇంటికి డిన్నర్‌కి వచ్చి వింత చూడగలరు కదూ?" అని ఎన్నో ఏళ్ళ పరిచయం ఉన్నట్లు గోముగా అడిగింది. ఏమనుకున్నానో ఏమోగానీ అన్నిటికన్నా ఆమె స్నేహభావం, అతీతమైన సౌందర్యం, మంచితనం నాచేత 'సరే' అనిపించింది. అప్పటికే న్యూయార్క్ చేరటం వలన ఎవరి గమ్యం వారిదయింది. కానీ నేనుకూడా ఆమెకి నా టెలిఫోన్ నెంబరూ, అడ్రసు ఇవ్వటం మూలాని, ఆమె చెప్పిన విషయాలు నేను పూర్తిగా మరచిపోయినా, 15 రోజుల పిమ్మట ఆమె నాకు అకస్మాత్తుగా ఫోన్ చేసి వాళ్ళ తండ్రి ఇంటికి మర్నాడు సరిగ్గా 7-30 సాయంత్రం భోజనానికి రమ్మనడంతో, మళ్ళీ జ్ఞాపకాలు తిరిగొచ్చాయి. వస్తానని చెప్పాను.

మాటిచ్చిన ప్రకారం, సరిగ్గా తు.చ. తప్పకుండా 7-30 సాయంత్రం 'టుక్సెడో' సూట్, బూట్‌లలో తయారయ్యి హాజరయ్యా వాళ్ళ నాన్న ఇంటి వాకిట్లో. పెద్ద పెద్ద బంగారపు వర్ణంలో కొట్టొచ్చినట్లు ఆంగ్లంలో ఉన్న ఆయన నేమ్‌ప్లేట్ చూడగానే ఎవరికన్నా అనిపిస్తుంది, చాలా గొప్పవాడని.

బెల్ నొక్కగానే బట్లర్ వచ్చి తలుపుతీసి, వినయంగా వంగి త్రోవ చూపించాడు లోపలికి. చాలా పెద్ద అపార్ట్‌మెంట్ అది. గోడమీద ఖరీదైన వర్ణచిత్రాలు, కిటికీ ఆ విశాలమైన గదిలో సగంసైజుకి ఉన్నది. కర్టెన్లు ఫ్యాన్ గాలులకు ఎగురుతున్నాయి. దూరంగా ఉన్న సముద్రం కనిపిస్తూండగా, ముప్ఫయి అరవ అంతస్థులో ఉన్న అతిసుందరమైన అపార్ట్‌మెంట్ అది. అడుగు లోపల పెట్టగానే చల్లటి వాతావరణం. ఏర్‌కండిషనర్ వాళ్ళింట్లో ఉన్నదని ఎవరికైనా తెలుస్తుంది. నవ్వుతూ వచ్చి చేయిపట్టుకుని చంద్రుని చూచిన చకోరిలా వికసించిన ముఖంతో కారొలీన్ 'అన్నమాట తప్పని వాళ్ళని నేను విపరీతంగా ఇష్టపడతాను, మరీను గౌరవిస్తాను' అని సోఫా చూపించింది కూర్చోమని. దూదిపింజల్లో ఒరిగిపోయినట్లుంది ఆ సింహాసనంలాంటి

సోఫా. ప్రతి వస్తువు, ప్రతీది చక్కగా అమర్చి ఉన్నాయి, ఆ భూతల స్వర్గంలా ఉన్న వాళ్ళ అపార్ట్‌మెంట్‌లో. ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది ఒక్కసారి లోపల అడుగుపెట్టగానే, వాళ్ళు విపరీతమైన ఐశ్వర్యవంతులని. ఇంతలో వాళ్ళ తండ్రిగారిని పిల్చుకొచ్చింది కారొలీన్ లోపల్నుంచి. లేచి వినయంగా నిలబడి చేతిని చాచాను కరచాలనం చేయటానికన్నట్లు. ఆరడుగుల మూడంగుళాల భారీ ఉక్కులాంటి కండలు తిరిగిన శరీరం, పెద్ద బుర్ర మీసాలు, బట్టతల, ఖరీదైన రిమ్‌లెస్ కళ్ళద్దాలు, తీక్షణమైన కళు ్ళ, స్ఫురద్రూపి నవ్వుతూ అందుకున్నాడు తన పెద్ద చేతిలోకి నా చిన్న చేతిని. కరచాలనం చేసినప్పుడు తెలిసింది ఆయన ఎంత బలవంతుడో!

ఒక్క కరచాలనంతోనే నా శరీరమంతా ఊగిపోయి, నా భుజందాక చేయి ఊడిపోతుందేమో అన్నంత భయం వేసింది నాకు. 'ఐయామ్ కల్నల్ హాఫర్డ్ ఎడ్వర్డ్‌హాఫర్డ్!' అని చేయి మెల్లగా వెనక్కి తీసుకుని వెంటనే అడిగాడు. 'హావ్ దుయూ వాంట్ ఇట్ ఆన్ ది రాక్స్?' అనగానే, ఆయన అడుగుతున్నది నా మద్య ద్రావకం ఏ రూపంలో కావాలని అడుగుతున్నాడని బోధపడింది. 'నో థాంక్స్ కల్నల్! ఓన్లీ కోక్స్! అయామ్ ఎ టీ టోట్లర్!' అన్నాను. తలూపి నాకు కోక్ ఓ గ్లాస్‌లో పోసి, తనకీ, కూతురికీ మరో రెండు గ్లాసులలో 'ఆన్ ది రాక్స్' (సోడా లేకుండా) విస్కీ పోసి, తనోటి తీస్కుని కూతురికి మరోటి అందించి 'ఛియర్స్!' అని చప్పరించసాగాడు. ఒక చేతిలో క్యూబన్ చుట్ట కాలుస్తూ పరుపులా నిటారుగా ఉన్న సోఫాలో ఒరిగి, వెనక్కివాలి చెప్పసాగాడు. "మై డాటర్ కారొలైన్ మైట్ హావ్ బ్రీఫ్డ్ యూ, ఐ థింక్!" అని మళ్ళీ మరో ఐదు నిముషాలు మాట్లాడలేదు. నేనూ కారొలీన్ చెరో కుర్చీలో ఆసీనులైనా, కొంతసేపటికి ఆమె కిటికీ దగ్గరగా వెళ్ళి దూరంగా అలలుపైకి లేస్తున్న సముద్రాన్ని చూడసాగింది విస్కీ సిప్ చేస్తూ.

పూర్తిగా డ్రింక్ ముగించాక లేచి వెళ్ళి ఒక నిటారుగావున్న చెక్క డబ్బా, కొన్ని ఎర్రటి గురిగింజలు తెచ్చాడు. "నౌ వాచ్‌మీ, యంగ్‌మాన్! ఐ యామ్ గోనా కాల్ మై డార్లింగ్ వైఫ్..." అంటూ, ఆ గురిగింజలు గబగబా ఆ డబ్బాలో ఉన్న గుంటలలో ఒక పద్ధతిలో గబగబా వేయసాగాడు. 'డార్లింగ్!' అని పదే పదే అడగసాగాడు. ఆశ్చర్య చకితుణ్ణయ్యాను ఒక్కసారిగా చెమటతో వణికిపోతూ. మెల్లమెల్లగా ఆ డబ్బాలో వేసిన ఎర్రటి గురిగింజలు తామంతట తామే లేచి ప్రక్కనే ఉన్న బల్లపై ఒకటొకటిగా తామంతట తామే ఆంగ్ల అక్షరాల రూపంలో పేరుకోసాగాయి ఎవరి ప్రమేయం లేకుండానే! నా కళ్ళని నేను నమ్మలేకపోయాను. అవాక్కయి చూస్తుండగానే : "హనీ! ఐయామ్ హియర్, రైట్ విత్‌యూ!" అనే అక్షరాలు వచ్చే తీరులో అమర్చబడ్డాయి ఆ ఎర్రటి గురిగింజలు!!

"ఇప్పుడర్థమయిందా నేను ఎందుకింతగా మా నాన్నగురించి బాధపడటమే కాకుండా భయంతో విచారిస్తున్నానో?" అని మర్నాడడిగింది ఫోనులో. నాలోని విజ్ఞానం అప్పటికే మేలుకుంది, ఈ పునర్జన్మలూ ప్రేతాత్మల వృత్తాంతం గురించి ఇంకా తెలుసుకోవాలని. ఆ మర్నాటి నుంచి నాకు మిగిలిన 15 రోజులలో మూడు రోజులకో యూనివర్శిటీ చొప్పున, నేను కారొలైన్ ఆమె 'పాంటియాక్' కారులో ఐదు విశ్వవిద్యాలయాలలో పేరు మోసిన డిపార్టుమెంట్ ఆఫ్ పారాసైకాలజీ అండ్ సూపర్ నాచురల్ ఫెనామెనాల గురించి అనేక ప్రొఫెసర్లనూ, రీసెర్చర్లనూ కలిసాము. కొలరాడో, న్యూయార్క్ సౌత్‌కారోలీనా, వాషింగ్‌టన్, మరియు ఫిలడెల్ఫియా వెళ్లి అనేక విషయాలు తెల్సుకొని రికార్డు చేసుకున్నాము. తెలిసిందేమంటే 'ఎక్స్‌ట్రా సెన్సరీ పెర్‌సెప్షన్ (ESP), దివ్యజ్ఞానం 'సైకోకైనెసిస్' (వస్తువులను దృక్కులతోనే కదపగలగడం) 'క్లేర్ వాయన్స్' (clair voyance) లాంటివి విషయాలు, మానవాతీతమైనవీనూ.

వెళ్ళిపోయేందుకు ముందు రోజు మళ్ళీ వెళ్ళి 'టీ'కి పిలవబడటం మూలాని కారొలైన్ దగ్గర, కల్నల్ దగ్గర శెలవు తీసుకుని తిరుగు ముఖం పట్టాను, ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఏనాటికైనా విజ్ఞానంలో ఒక పిహెచ్.డి., ఇదే అంశంపై రిసెర్చి చేసి, మన భారతదేశవాసులకి విడమర్చి చాటి చెప్పాలని.




# అదృశ్యమైతే ఆలస్యం కూడదు

లాబ్ కిటికీ తెరచి బయటికి చూశాడు డాక్టర్ సూర్యనారాయణ. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనలిటికల్ కెమిస్ట్రీ అతనిది. విపరీతమైన మంచు ముద్దలు ముద్దలుగా పడుతోంది బయట. గంట పదిన్నర రాత్రి. మర్నాటి సదస్సులో తనూ, తన భార్య డాక్టర్ లక్ష్మి లండన్ ప్రయాణం. ఆ తర్వాత భారతదేశానికి తిరుగుప్రయాణం. ఈ పదేళ్ళలో సాధించింది చాలానే ఉంది మరి! 'నోబెల్ ప్రైజ్ ఇన్ కెమిస్ట్రీకి' తన పేరు షార్ట్ లిస్ట్ అయింది. శాశ్వతంగా భారతదేశానికి తరలివెళ్ళి, స్వంత లాబ్ తెరచి, తామిద్దరూ రిసెర్చికే అంకితమవ్వాలని వాళ్ళ నిర్ణయం. ఇంకా ముప్ఫయి ఐదు నిండా దాటని అపురూప సౌందర్యవతి డాక్టర్ లక్ష్మి. మిసమిసలాడే యవ్వన తారళ్యం, మైమరపించే శరీర లావణ్యం, ఇవే తన కాన్సన్‌ట్రేషన్‌ని అప్పుడప్పుడూ చెదిర్చేవి. కానీ ఇద్దరూ కెమిస్ట్రీలో అసాధారణమైన విషయాలు సాధించటం మూలాని ఏనాడు, ఏ విషయం తమ ధ్యేయాన్ని సడల్చలేదు. పిల్లలు కావాలనే కోరిక వద్దనుకుని విజ్ఞానానికే అంకితమయ్యారు ఆ భార్యాభర్తలు మరి!

లండన్ జేరేసరికి సాయంసంధ్యలు అలముకుంటున్నాయి. బస బ్రిటిష్ అసోసియేషన్ ఆఫ్ ఇనార్గానిక్ కెమిస్ట్రివాళ్ళే ఏర్పాటుచేయడం మూలాన ఓ రోజు ముందే బయలుదేరి వెళ్ళారు ఆ దంపతులు. లండన్ పొలిమేరలో ఒక చక్కటి డౌన్‌టౌన్

రెస్టారెంట్‌లో వలయాకారంలో ఉన్న విస్తారమైన 'కార్‌పార్క్'లో కారాపి దిగారు. చల్లటి వాతావరణంలో వేసివున్న తెల్లటికుర్చీలు, బల్లలూ, పచ్చటి లాన్‌లో అమర్చి ఉన్నాయి ఆ రెస్టారెంట్ ఆవరణలో. పదేళ్ళుగా ఇంగ్లండులోనే ఉన్నా పదహారణాల బ్రాహ్మణ కుటుంబాలనుంచి రావటం వలన స్వచ్ఛమైన శాకాహారమే అలవాటు ఇద్దరికీ. మన భారతదేశంలో చేసే శాకాహార వంటలన్నీ మన పద్ధతిలోనే చేస్తారు, శాకాహారం మటుకే అందించే ఆ రెస్టారెంట్‌లో. ఎంచేతనంటే ఆ రెస్టారెంటు అధిపతి, స్వంతదారు అరవబ్రాహ్మడు. మొత్తం ఆయన కుటుంబమంతా కలసి ఏనాడో ఓ ముప్ఫయి ఏండ్ల క్రితం నెలకొల్పిన ఆ 'ఇండియన్ కలినరీస్' అనే పేరుకల వాళ్ళ రెస్టారెంట్‌లో ఎప్పుడూ చిరునవ్వుతో స్వాగతమిచ్చే ఆ రెస్టారెంట్ స్వంతదారు రాఘవన్, అతని భార్య వసంతి, ఇద్దరు కొడుకులు రామస్వామి, కృష్ణస్వామి వారికి తగిన చక్కని చుక్కల్లా ఉన్న వారివారి భార్యలు కమలా, విమలా అనే అక్క చెల్లెండ్లు (ఇద్దరూ కవల లవటం మూలాని అద్దంలోని ప్రతిబింబాల్లా ఉంటారిద్దరూ)

మూడొంతులు భారతీయులే ఆ రెస్టారెంట్‌కి వచ్చినా, కొంతశాతం బ్రిటిషర్లు, అమెరికన్లు ఇంకా తదితర దేశస్థులు కూడా వస్తారు. శాకాహారంలో ఉన్న ఆరోగ్య సంపదల వలన, నెమ్మదినెమ్మదిగా శాకాహారానికి పూర్తిగా మారటమేకాక, భారతదేశపు వంటలతీరు రుచులు విపరీతంగా ఇష్టపడతారు ఆ పాశ్చాత్యులు. అందువలన ఆ రెస్టారెంట్ 'ఇండియన్ కలినరీస్' 30 ఏండ్లుగా మంచి పేరు ప్రతిష్ఠలు సంపాయించటమే కాకుండా, ఇంగ్లండు మొత్తానికి నెంబర్‌వన్ 'ఇండియన్ రెస్టారెంట్' అనే అవార్డుకూడా బ్రిటన్‌ను పరిపాలించే క్వీన్ ఎలిజబెత్ దగ్గర అందుకుంది. క్రమపద్ధతిలో ముందరగానే టేబుల్స్ రిజర్వ్ చేసుకోవాలి. క్రమశిక్షణతో, క్రమపద్ధతిగా నడుపుతారు రాఘవన్‌గారి కుటుంబసభ్యులు. వారే వంటలు చేసి, కుటుంబసభ్యులే వచ్చిన వాళ్ళకి పింగాణీ ప్లేట్లలో సర్వ్ చేస్తారు. అందుకే ఆ హొటలుకి మరో నిక్‌నేమ్ 'హొమ్‌లీ ఇండియన్స్' అని ముద్దుగా అనుకుంటారు వారిలో వారు.

బస ఏర్పాటు చేసిన గెస్ట్‌హౌస్ చేరుకునేసరికి రాత్రి 8 గం|| అయింది. పడవలాంటి వారి 'బియమ్‌డబ్ల్యూ' కారుని మెత్తగా పోర్టికోలో ఆపగానే అక్కడే యూనిఫారమ్‌లో ఉన్న అటెండర్ తాళాలు తీసికొని, కార్‌ని ప్రక్కనే ఉన్న షెడ్డులోకి పోనిచ్చి, రెండు సూట్‌కేసులు తెచ్చేలోపున పైప్ వెలిగించి డా|| సూర్యనారాయణ అతనొచ్చేదాక ఆగాడు, భార్యతో సహా. విడివిడిగా ఉన్న చిన్న చిన్న చక్కటి ఇళ్ళలాంటి గెస్ట్‌హౌస్ తలుపులు అటెండర్ తెరచి, సామాన్లు లోపల పెట్టగానే ఒక పౌండు వాడికి 'టిప్' ఇచ్చాడు, ఇవ్వాల్సిన అవసరం లేనప్పటికీ. వికసించిన మొహంతో ఓసారి వినయంతో వంగి, వెళ్ళిపోయాడు అటెండర్ ఫిలిప్స్.

ఆరుగంటలకే లేచి, స్నానాదులు ముగించుకుని, ఆనాటి సదస్సులో చదవవలసిన పేపర్లు డైనింగ్ టేబుల్ వద్ద కూర్చుని దీక్షగా చదవసాగారు ఆ దంపతులు. చదివి పూర్తి చేసేలోపున వేడివేడిగా బ్రెడ్ బటర్‌జామ్, ఆపిల్సు, ఉడికించి మెత్తగా చిదిపిన బంగాళదుంపలపై కొద్దిగా వెన్న, మిరియాలపొడి, ఉప్పు జల్లిన వంటకం, మరో గిన్నెలో క్వాకర్ ఓట్సు పాలు, కాఫీ, టీ రెండూ వేర్వేరు పింగాణీ టీ పాట్‌లలో, అన్నీ చక్కగా ఒక ట్రేలో తెచ్చిపెట్టాడు గతరాత్రి సాయం చేసిన అటెండర్ ఫిలిప్స్. డైనింగ్ టేబిల్ మీద అమర్చి నిశ్శబ్దంగా నిష్క్రమించాడతను. బ్రిటిష్ వారతనికిచ్చిన క్రమశిక్షణ అలాంటిది మరి. పనిలో ఏమాత్రం అశ్రద్ధ, బద్ధకం, పొగరుమోతుతనం లేవు. అల్పాహారం ముగించగానే, సెంట్రల్ లండన్‌లో ఉన్న బ్రిటిష్ కెమికల్ సొసైటీవారి కాన్ఫరెన్స్‌హాలుకి బయలుదేరారు. మునుపు వేర్వేరు హొటల్సులో సదస్సులు నడిపేవారు (IUC) 'ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ కెమిస్ట్రీ' వారు. ఇలాంటి సదస్సులకోసం ఈ మధ్యనే అన్ని వసతులున్న రాజభవనంలాంటి గెస్ట్‌హౌస్ భవనాన్ని IUC (ఐ.యు.సి) వారు కట్టుకున్నారు.

'స్టాండింగ్ ఓవేషన్' తో తనకి స్వాగతం పలికిన డా॥ అలెగ్జాండర్ ఆ కెమిస్ట్రీ యూనియన్‌కి ప్రెసిడెంటు ఆ సంవత్సరానికి. హాలులో ఒక్కసారిగా అందరూ లేచి నిలబడి సగౌరవంగా స్వాగతం పలికిన తీరు, వారి సంతోషానికి కారణం తెలీక ఉక్కిరిబిక్కిరయ్యారు డా॥ సూర్యనారాయణ దంపతులు. తన పేరు, భార్యపేరు ఉన్న మొదటి వరస సీట్లలో ఆసీనులవ్వగానే భరించలేనంత నిశ్శబ్దం అలుముకుంది. పదివేలమందికిపైగా ఇనుమడించుకోగలిగిన ఆ కాన్ఫరెన్స్ హాలులో, వేదికపైకెక్కి సన్నగా, ఎర్రగా పొడుగ్గా ఉన్నాడు డా॥ అలెగ్జాండర్. మైకు కోటుకే తగిల్చి ఉండటం మూలాన, వయర్లు గట్రా కాళ్ళకి అడ్డంపడే ప్రసక్తే లేకపోగా, చీమ చిటుక్కుమన్నా మారు మ్రోగినట్లు వినిపించగలదు ఆ సౌండ్ ప్రూఫింగ్ సిస్టమ్ కలిగిన ఆడిటోరియమ్‌లో.

'వెల్‌కమ్ టు ఆల్ ఆఫ్ యూ డాక్టర్స్, అండ్ విత్ అవర్ హార్టీ కంగ్రాట్సులేషన్స్ వీ ఆల్సో వెల్‌కమ్ ది నోబెల్ లారియేట్స్ కపుల్ డాక్టర్ సూర్య అండ్ హిస్ వైఫ్ డా॥ లక్ష్మి రిస్పెక్టివ్‌లీ!' అనేసరికి చప్పట్లతో మారుమ్రోగింది ఆడిటోరియం. "డా॥ సూర్య & డా॥ లక్ష్మి వీ కంగ్రాట్యులేట్‌ది కపుల్!" అంటూ.

సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. 11 సం॥ కష్టపడి రాత్రింబవళ్ళు పనిచేసి, రీసెర్చి పేపర్లు వందకి పైగా సబ్మిట్ చేసిన దంపతులు.

అంతవరకూ గుప్తంగా ఉంచిన ఆ సంగతి ఆనాటి అన్ని ఆంగ్లపత్రికలలో హెడ్‌లైన్స్‌లో వచ్చిందట. మరో బ్రిటీష్ సైంటిస్టు డా॥ ఎడ్వర్డ్ అనే ఆయనతో పంచుకుని

నోబెల్‌ప్రైజ్ ఇన్ కెమిస్ట్రీ గెలుచుకున్న ఆ భారతీయ దంపతులు మొట్టమొదటి భారతీయులు. నోబెల్ ప్రైజు అక్టోబర్‌లో స్టాక్‌హమ్, స్వీడన్‌లో ఇస్తారు, స్వీడిష్ క్రోన్స్ డబ్బు ద్వారా. మూడో నోబెల్ గ్రహీత డా॥ ఎడ్వర్డ్ సదస్సుకి రాలేకపోయాడు. అతని భార్య చివరిదశలో క్యాన్సర్ వ్యాధితో హాస్పిటల్‌లో మాన్‌చెస్టర్‌లో ఉండటం మూలాన. వేదిక ఎక్కి ఇద్దరూ ఆసీనులై, ఒక్కొక్కరుగా అందరికీ ధన్యవాదాలు చెప్పగానే చకచకా 'పవర్‌పాయింట్' ప్రెజెంటేషన్స్‌తో వారివారి లాప్‌టాప్‌లలో వివరించిన రీసెర్చి పేపర్లు ఒక్కొక్కరుగా వివరిస్తూ చదవసాగారు అక్కడికొచ్చిన దేశవిదేశాల శాస్త్రజ్ఞులు, వారివారి శాస్త్ర పరిశోధనల ఫలితాల్ని చక్కగా వివరిస్తూ. పత్రికా విలేఖర్లు కిటకిటలాడారు వారి వారి కెమేరాలతో.

మర్నాడు ప్రొద్దుటే ఎయిర్ ఇండియాలో ముందరే ఆర్నెల్ల క్రితమే టిక్కెట్లు బుక్ చేసుకోవటంచేత టాక్సీలో హీత్‌రో ఏర్‌పోర్ట్‌కి బయలు దేరారు, వారి కారు అక్కడే కెమిస్ట్రీ సొసైటీ వారికి కేటాయించిన గారేజ్‌లో వదిలి పెట్టి. ఈసారి అక్టోబరులో తిరిగి స్వీడన్ కొచ్చినప్పుడు, కారు, ఇల్లు అన్నీ అమ్మేసి శాశ్వతంగా వారి ఊరు గుంటూరులో ఉన్న తల్లిదండ్రుల పెద్ద భవంతికి వచ్చేయాలని వారి నిర్ణయం. గుంటూరుకి, బెజవాడకి, తెనాలికి మధ్యభాగంలో ఉండే వారి ఆరెకరాల భూమిలో అతిపెద్ద కెమికల్ లాబ్ కేవలం రీసెర్చికై ఆ నోబెల్ ప్రైజు డబ్బుతో కట్టగా మిగిలిన సగం భాగం ఒక నిధి అమర్చి బీదవారి విద్యకి స్కాలర్‌షిప్ వచ్చేటట్లు ఏర్పాటు చేసుకున్నారు ఆ దంపతులు.

అక్టోబరుకల్లా అనుకున్న ప్రకారం నోబెల్ గ్రహీతలిద్దరూ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ లక్ష్మి చకచకా లండన్ కేంబ్రిడ్జిలలో అన్ని ఫార్మాలిటీసు ముగించుకుని శాశ్వతంగా మాతృదేశంలో గుంటూరుకి చేరుకున్నారు. ఆర్నెల్లలో పూర్తయింది విశాలమైన కెమిస్ట్రీ లాబొరేటరీ. విదేశాలనే ఆశ్చర్యంలో ముంచేటంతటి ఆధునాతన పరికరాలతో చక్కగా కట్టారు. దేశానికి మొదటిసారిగా కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన ఆ దంపతులకి కేంద్ర ప్రభుత్వంగానీ, ఆంధ్రదేశపు ప్రభుత్వంగానీ ఏరకమైన ఇబ్బందులు రాకుండా లాబోరేటరీ నెలకొల్పడానికి పూర్తి సహాయ సహకారాన్ని అందించాయి. ఎక్కడికెళ్ళినా గౌరవమర్యాదలు వాళ్ళని ముంచెత్తాయి. అప్పుడొక వింత జరిగింది.

అనుకున్నది సాధించినా దాన్ని అమలుపెట్టడం అనేది శాస్త్రంలో మొదటిమెట్టు. ఎనిమిది గంటలకల్లా లాబ్‌లో పని మొదలెడతారు నోబెల్ గ్రహీతలైన ఆ దంపతులు. మొదటిసారిగా తను పదేండ్లు సాధించి కనుక్కున్న ద్రవ్యం తనమీద తనే ప్రయోగించు కోదలిచాడు డా॥ సూర్యనారాయణ. శాస్త్రపు శాసనాలన్నిటిలో పూర్తిగా

సహకరిస్తుందతని భార్యామణి. తాము భార్యాభర్తలమనే విషయం మరిచి, పూర్తిగా లీనమైపోతారు ప్రయోగాలు చేసేటప్పుడు. అందుకే మొదటిసారిగా డా॥సూర్య ఏ ప్రయోగం చేసినా భార్యను తనతో ఉండమంటాడు నోట్సు ప్రిపరేషన్‌కి లాప్‌టాప్ లేదా కంప్యూటర్లో ఎక్కించేందుకు.

డా॥ సూర్య తన భార్య రాగానే ఓ ద్రవం చూపించి “లక్ష్మీ డార్లింగ్! ఇవ్వాళ్ళ నేను ఈ ద్రవం నా మీద నేనే ప్రయోగించుకోదల్చాను. ఒకవేళ ఏదైనా జరగకూడని దేమైనా జరిగినా, నువ్వు బెంబేలు పడకుండా, ఎప్పటిలాగే నాతో సహకరించి, దాని ఫలితాలు ఎలా ఉంటాయో, ఏమైనా తారుమారైతే దాన్నెలా సరిచేయాలో నీకు తెలుసుగా!” అనగానే విపరీతమైన ఆత్మవిశ్వాసం, గుండె నిబ్బరంగల అతని భార్య డా॥ లక్ష్మి ‘సరే!’ నన్నట్లు తల ఊపింది.

గోధుమరంగు బుడ్డీలో అతి భద్రంగా తెచ్చిన ఆ సెగలు కక్కే ద్రావకాన్ని మెల్లిమెల్లిగా ఒక 500 మిల్లీలీటర్ల బీకర్‌లో పోయగానే నారింజపండు రసం వర్ణానికి మారిపోవటమేకాక, నారింజ పండు వాసనతో ఘుమఘుమలాడసాగింది. ‘ఛియర్స్’ అని పైకెత్తి తడుముకోకుండా గటగటా ఒక్కసారిగా త్రాగేశాడు డా॥ సూర్యనారాయణ. ధైర్య సాహసాలతో ఊపిరి బిగపట్టి చూస్తున్న డా॥ లక్ష్మికి, ఎంత గుండె నిబ్బరం కలదైనా ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది ఆమె చూసిన ఆ దృశ్యానికి! మెల్లమెల్లగా భర్తరూపం పల్చబడుతూ పూర్తిగా అదృశ్యమైపోయింది! కానీ, అక్కడే బల్లపై ఉన్న తెల్లకాగితంపై ప్రక్కనే పెట్టిన పెన్ను తానంతట తానే లేచి రాయటం మొదలు పెట్టినా, అది కూడా అదృశ్యమై, మళ్ళీ వాటిని బల్లపై ఉంచగానే కనపడ్డాయి. అంటే తన భర్తకి ఆకలి దప్పులు, గొంతు ఉండవు! ఆయన కాగితంపై రాశాడు. “హనీ! మనం మొదటి మెట్టు ఎక్కాం! నిరుత్సాహపడక! త్వరలోనే రెండో మెట్టు ఎక్కాలంటే, వెనక్కి మళ్ళీ మామూలు మనిషవ్వటానికి నువ్వు కనుక్కున్న ద్రవాన్ని భద్రంగా ఉంచు! ఓ పదునైదు రోజులు నేను పరిసరాలలో జరిగే న్యాయాన్యాయాలు ఇలా అదృశ్యం అయిన పరిస్థితిలోనే చూసి తిరిగి వస్తాను! అంతవరకు కాస్త ఓపికపట్టు!” అని ఎటో గాలి వీచినట్లు వెళ్ళిపోయాడు. ‘సరే!’ నని తలఊపినా, నుదుటిమీద పట్టిన చెమట బిందువుల్ని అతికష్టం మీద తుడుచుకుంది రుమాలుతో అతని భార్య డా॥ లక్ష్మి.

డాక్టర్ సూర్యనారాయణ ఆ పదిహేను రోజుల్లో మళ్ళీ మామూలు రూపం వచ్చేందుకు త్రాగిన రెండో ద్రవం 10 ఏండ్లు ఆయన భార్య శాస్త్రపు పుటల ప్రకారం చేసిన పరిశోధనల ఫలితమే. కనుక ఇక్కడ మనం అదృశ్యమవటానికై డా॥ సూర్య కనుక్కొన్న ద్రవం గుణగణాలను గురించి తెలుసుకోవాల్సినవి అవశ్యం. ఆ ద్రవం

మనిషికి మట్టుకే పనిచేస్తుంది. నారింజరసం రుచి, వాసన కలిగి త్రాగినపుడు ఆహ్లాదకరంగా, తీపిగా, శక్తి కలిగించేదిగా ఉంటుందిగానీ మద్యపానాలకి మల్లే ఉత్తేజం ఏమాత్రం కలిగించదు. మెదడుకి విపరీతంగా ఆలోచింపగలిగిన శక్తి కలిగించటమేకాకుండా, అతివేగంతో అనుకున్న గమ్యానికి కేవలం కొన్ని సెకన్లలో చేర్చకలదు. ఈ ద్రవం కొనుగొనడానికి వారిద్దరూ (భార్యాభర్తలు) న్యూరో సైంటిస్టులు, సైకియాట్రిస్టులు, డెంటల్‌సర్జన్లు, వెటర్నరీ డాక్టర్ల సహాయసహకారాలు, సలహాలు అందుకుంటూ, దానిని ఫిజిక్సు, కెమిస్ట్రి చట్టాలకు అన్వయించేటట్లు చేయటంవలన సఫలీకృతమవటమేకాక, ఆ డాక్టర్లు వేర్వేరు డిసిప్లిన్‌లలో ఉండటం మూలాన వారిచ్చిన అతి ముఖ్యమైన సలహాలు ఈ మందు / ద్రవం కనుగొనడానికి చాలానే దోహదపడ్డాయి. అవేమంటే, ముఖ్యంగా ఆ ద్రవం 15 రోజులవరకే ప్రభావితమవుతుంది. మనం ఉత్సాహంగా ఉన్నప్పుడు మన మెదడులో జనితమయ్యే 'ఎండార్ఫిన్' రసాయనాలతోనూ, అలానే భయాందోళనలతో ఉన్న పరిస్థితులలో రక్తంలోకి వదిలే 'ఎడ్రినలీన్' (ఎడ్రిలీన్ గ్లాండ్, రక్తంలోకి అలాటి పరిస్థితులలో ఎడ్రనలీన్‌ని వదులుతుంది) వంటి హార్మోనులతోనూ కలసి వాటిపై వివిధ పరిస్థితులలో ఈ క్రొత్త ద్రవం ప్రభావితమవుతుంది. ఉదా : మంచి ఊహలుండి, మంచినే మెదడుకోరుతూ ఉన్నప్పుడు, ఈ ద్రవ్యం బాగా పనిచేయటమే కాక విపరీతంగా మనిషి చేయదలుచుకున్న ఆ మంచిపనులకు తోడ్పడుతుంది. ఎప్పుడైతే మనిషి మెదడులోని మంచి ఆలోచనలు చెడు ఆలోచనలుగా మారిన వెంటనే వాటి ప్రభావం ఒక్కసారిగా మనిషి మాయమవటమేకాక మనిషిని ఉక్కుమ్మడిగా 'స్పాంటేనియస్ హ్యూమన్ కంబశ్చన్ ("నన్నెందుకు ప్రేమించావు?" లో, స్పాంటేనియస్ హ్యూమన్ కంబశ్చన్' వివరింపబడినది.) అనే సంహారజ్వాలతో సెకన్లలో వేడి, సెగలేని బూడిదగా మారుస్తుంది. దీనితో మనకు అర్థమైనదేమిటంటే, చెడు ఊహలు, చెడ్డ పనులకీ ఈ ద్రవం బొత్తిగా ఉపయోగ పడకపోవటమేకాక, వారిని గుప్పెడు బూడిదగా మార్చి సంహరిస్తుంది. కనుక ద్రవాన్ని రహస్యంగా దుర్వినియోగం లేక నిరుపయోగం చేయాలనుకునేవారికి అస్సలు ఉపయోగపడదు. అలా తయారుచేశారు ఆ దంపతులు. వారి అంతర్లీనమైన ధ్యేయం ఒకటే. ఎప్పటికైనా ఎవ్వరికైనా మన దేశాభివృద్ధికై, దేశ సుఖసంతోషాలకై, శాంతిభద్రతలకై పాటుపడేవారికే ఈ ద్రవం ఉపయోగపడాలని, అల్లకల్లోలంగా ఉన్న మన దేశ పరిస్థితులని శత్రువులబారినుంచి తప్పించగలదనీ మన దేశం శాంతి భద్రతలకై అనేకమంది పోలీసులు, ఆర్మీ, నేవీ ఏర్‌ఫోర్సులలో ఎంతోమంది సైనికులు ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోకుండా, ఈ ద్రవం నిజాయితీగా దేశశాంతి భద్రతలకై పాటుపడే అట్టి సైనికులకు ఉపయోగపడుతుందనే

ఆశతోనే సృష్టించారు ఆ దంపతులు, విపరీతమైన దేశభక్తితో. ఇవన్నీ నిజ రూపం దాల్చాలంటే మొదట ఆ ద్రవం ఎలా పనిచేస్తుందో చూడాలి. ఆత్మవిశ్వాసం, స్థైర్యం, పట్టుదల నిజాయితీనే భగవద్గీతగా తలచే శాస్త్రజ్ఞులు, డా॥ సూర్య డా॥ లక్ష్మి. అందుకే మొదట తమపై తామే ప్రయోగించుకుంటారు, ఏమైతే అయిందని. అలాంటివారు లోకంలో అరుదు. మేడమ్‌క్యూరి, ఆమె భర్త రేడియంతో ఎక్స్‌రేలను, వాటి ఉపయోగాలు కనుగొనే ప్రయోగాలు ఏళ్ళతరబడి చేయటం మూలాన ఎక్స్‌రేలు వారి శరీరాలను విపరీతంగా ప్రభావితం చేయటమేకాక, కడసారిగా మేడమ్‌క్యూరీ చనిపోవటానికి కూడా కారణమైనాయి. కానీ ఆమె, ఆమె భర్త కలిసి కనుగొన్న X-rays (ఎక్స్ కిరణాలు) ఈనాటికి వైద్యవృత్తికి విపరీతంగా ఉపయోగపడడమేకాక ఇతర రూపాలు కలిగిన 'సిటీ' స్కాన్‌లు 'ఎమ్ఆర్‌ఐ' స్కాన్లకు దారిచూపాయి, వంద సంవత్సరాల పిమ్మట!

డా॥ సూర్య అదృశ్యమైన రోజు రాత్రికే తను పకడ్బందీగా మనస్సులో ముద్రించుకున్న ఒక ప్రణాళికను తు.చ. తప్పకుండా, క్రమబద్ధంగా 15 రోజులలో అమలుపరచటంవలన అవి స్వల్పకాలంలోనే అనేకమైన ఆశ్చర్యపరిచే సంఘటనలకు తోద్పడ్డాయి. అవేమిటో చూద్దాం. గోడలు, బురుజులు అడ్డంరావు అదృశ్యం చేయగలిగే ఆ 'అమృత' ద్రవానికి. ('అమృతం' అని తామిద్దరికీ తెలిసే ఆ ముద్దుపేరు ఆ దంపతులు 'కోడ్' గా వాడతారు వాళ్ళిద్దరి మధ్య దాన్ని గురించి చర్చించేటప్పుడు.)

డా॥ సూర్య మొదటి రాత్రి మళ్ళీ లాబ్‌లోకి వెళ్ళి, ఓ ఒంటిగంట ప్రాంతంలో ఒక వంద కాగితాలు, ఒక అరడజను మార్కర్ పెన్నులు, వాటి ఇంకు బాటిల్, ఒక బుడ్డీ 'ఫెవికాల్' అతికించేందుకు అన్ని పరికరాలు ఓ ప్లాస్టిక్ సంచిలో వేసుకున్నాడు. అవి కూడా వాటిని చేతితో ఆ అదృశ్యమైన మనిషి తాకిన తక్షణం కనుపించవు. 'ఇన్ఫ్రారెడ్ రేస్' కి కూడా అందని రీతిలో తయారుచేసారా దంపతులు. మళ్ళీ నేలమీద పెట్టిన తక్షణం స్వరూపం రూపొందుతాయి. ఇలా భౌతిక, రసాయనిక శాస్త్రాలలో ఎన్నో రహస్యాలు పరిశోధనలు చేయగా చేయగా బయటపడతాయి.

అంగారక గ్రహంలో నీటి సముద్రం నిగూఢంగా ఇమిడి ఉందనీ, మరియు 'జూపిటర్'గ్రహంకి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న 'ఐరోపా' అనే ఉపగ్రహంలో పెద్దపెద్ద సముద్రాలే ఉన్నాయని అమెరికన్ 'నాసా' వారు కనుక్కున్నారు. అలాగే శాస్త్ర పరిశోధనలన్నీ దీర్ఘకాలంలో విప్పి చెప్పే నిజాలు మనల్ని విస్తుపోయేటట్లు చేస్తాయి. అవి నిజమైనపుడు, అదృశ్యమయ్యేట్లు  చేసే శక్తి గలిగిన ద్రవ్యం కనుక్కోగలరని మనం ఎందుకనుకోకూడదు? (హేతువాదం)

అంతేకాదు. జీవరాసులు జీవించదగిన పరిస్థితులు ఇక్కడ మన భూగోళం మీదేకాక, వందలాది గోళాలమీద ఖచ్చితంగా జీవనం చేయగలవనీనూ,

చేస్తున్నాయనీను శాస్త్రజ్ఞులు బలంగా నమ్మడానికి కారణం కూడా 'హబుల్ స్పేస్' టెలిస్కోపు అంతరిక్షంలో కొన్ని కోట్ల లైట్ ఇయర్స్ దూరం నుంచి మనకి పంపిన అంగారక మరియు తదితర గోళాల ఫోటోలు స్పష్టంగా చూపిస్తున్న నిజాలు, అంగారకగోళం మీద తనంతట తానే ప్రయోగాలు, విషయసేకరణ చేస్తున్న 'రోబో' కారు ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే.

కిడ్నీలు మార్పిడి, గుండెకాయల మార్పిడి, కాలేయం మార్పిడి శస్త్రచికిత్సలు ఇప్పుడు లోకంలో అన్ని హాస్పిటల్సు సునాయాసంగా చేస్తే మానవ మాత్రుడి జీవితం ఇంకో పదేళ్ళనుంచి ముప్ఫయి ఏళ్ళదాకా బ్రతకగల్గేటట్లు చేయుటం ఒక అరవై ఏళ్ళక్రితం ఊహింపరాని నిజంగా ఉండేది! అదే శాస్త్ర విజ్ఞానం మనకి నేర్పే విధానం.

ఈ పరికరాలను డా॥ సూర్య పొలిమేర్లలో ఉన్న ఒక చిన్న కొండపై ఉన్న నిర్మానుష్యమైన గుహలో దాచి అన్నిటిపై తెల్లకాగితాలు అంటించి రెండు రకాల సంకేతాలు పెద్ద పెద్ద అక్షరాలతో మొదట తెలుగులో దాని క్రింద ఆంగ్లంలో రాశాడు. అవి : మొదటి అట్టమీద : 'దయచేసి వెంటనే ఈ క్రింది చోటికి వెళ్ళి చూడండి–' అని రాయపోయే అడ్రసు, వెనకాల : అటుచూడండి జరిగే అన్యాయం!, అని దాని వెనుకవైపు రాశాడు వంద అట్టలమీద.

అవన్నీ రోజుకు అయిదు అట్టల చొప్పున 15 రోజులలోపున ఎన్ని వీలైతే అన్ని, కనీసం మొదటి 3 రోజులలో ఒక రకం పరిణామాలు ఎలా ఉంటాయో చూసి మిగతావి అటు పిమ్మట వెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఈ మూడు రోజుల్లో అతను చూసిన విషయాలు జుగుప్సాకరంగా ఉన్నాయి. ఒకరేమిటి పైకి మర్యాదస్తులుగా చెలామణీ అయ్యేవారి సంఖ్య కోకొల్లలు. వారు చేసే మానభంగాలు, ఇంట్లో భార్యాపిల్లలున్నా మనవరాలి వయస్సుండే ఆడపిల్లలను తమ బలగం సిబ్బందీ ఉపయోగించి, ఎత్తుకుపోయి మొదట మానభంగాలు చేసి, తర్వాత చంపేవాళ్లు, దొంగనోట్లు అచ్చేసి మంచినోట్లతో మార్పిడీచేసే తుచ్ఛులు, కూతుళ్ళను సైతం తాగిన మత్తులో మానభంగాలు చేసే తండ్రులు రోజూ ఈ విషయాలు దినపత్రికలలో మనం చదివేవే. ఇలాంటి కనీవినీ ఎరగనివన్నీ పోలీసులకి పట్టిచ్చాడు సూర్య. మొదట అడ్రసులు అట్టలపై రాసి, గోడలద్వారా దూసుకుపోయి పోలీస్ కమీషనర్‌కి కనపడేట్లు వారు గదిలో లేని సమయంలో పెట్టేసి, ఇలా పట్టివ్వగలిగాడు.

జనంలో, పోలీసులలో కాస్త కలకలం, భయం మొదలైంది. లంచగొండితనం చేసేవారు భయంతో వణకసాగారు ఏదో అదృశ్యశక్తో, లేక దయ్యమో లేక దైవశక్తో ఒక రూపం దాల్చి అన్యాయాలను అంతం చేస్తోందని.

ఆ పదిహేనురోజుల్లో కొన్ని వందలాది మందిని సునాయాసంగా పట్ట గలగటంతో పోలీసులు ముందు హాయిగా ఊపిరిపీల్చుకున్నా, ఈ అదృశ్యంగా మంచి చేస్తున్న 'శక్తి' ఏమిటో అర్థంకాక, భయం కూడా కలగసాగింది వారికి. తమలో కూడా లంచగొండితనం ఉందేమో అనే అనుమానాలతో!

తను మళ్ళీ అన్న ప్రకారం రహస్యంగా తన ప్రయోగశాలకి చేరుకుని రాత్రి పదిగంటలకు భార్య సమక్షంలో ఆమె తయారుచేసిన 'ద్రాక్షరసం' మల్లే ఉన్న ద్రవం తాగగానే మెల్లిమెల్లిగా తన రూపం రాగానే అతని భార్య డా॥ లక్ష్మి ఆనందంతో అతన్ని అల్లుకుపోయింది.

సరిగ్గా ఆ మర్నాడు నోబెల్ గ్రహీతలైన ఆ దంపతులు, డా॥ సూర్యనారాయణ, డా॥ లక్ష్మి విలేఖరుల సమావేశానికి పోలీసు అధికారులు, జడ్జీలు, డాక్టర్లు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల ఉన్నతాధికారులు, రాష్ట్రముఖ్యమంత్రిగారు ఒకరేమిటి అన్ని వర్గాలు, అందరూ ఒక్క ఫోన్ కాల్‌తోనే సమావేశమయ్యారు. నోబెల్ గ్రహీతలంటే మాటలా మరి!

గొంతు సర్దుకుని వేదికపై ఎక్కిన డా॥ సూర్య అందరికీ నమస్కరించి తను తన భార్య సాధించిన విషయం, ఆ ద్రవం దేశశాంతి భద్రతలూ, దుష్ట శిక్షణ శిష్ఠ రక్షణలకు ఎలా ఉపయోగపడగలదో వివరించి, ఆ ద్రవానికి కావల్సిన గవర్నమెంటువారి పర్మిషన్ లైసెన్సూ, మాస్ ప్రొడక్షన్‌కి (MASS PRODUCTION) కావల్సిన ఫార్మాలిటీస్ అన్నీ వివరంగా రాసి ముఖ్యమంత్రిగారికిచ్చాడు పత్రికా విలేఖరులు, టెలివిజన్ సిబ్బంది, అక్కడున్నవారు ఆశ్చర్యంతో చకితులవుతుండగానే! ఆ తర్వాత విలేఖరులడిగిన అన్ని ప్రశ్నలకూ విసుక్కోకుండా, ఓపిగ్గా ఆ దంపతులు జవాబులిచ్చారు మరో గంటసేపు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అందరినీ తృప్తి పరిచేటట్లు. చీఫ్ పోలీస్ కమీషనర్‌గారు వేదిక ఎక్కి 'అయితే మరి గత పదిహేనురోజులుగా దేశానికి మంచి చేసిన ఆ అజ్ఞాతవ్యక్తి మీరే అనుకోవచ్చా?' అని సంభ్రమాశ్చర్యాలతో ప్రశ్నించారు. వేదికపై ముఖ్యమంత్రి ప్రక్కనే ఆసీనులై ఉన్న ఆ దంపతులు ఒకే కంఠంతో.. 'మీరు ఎలా అనుకుంటే అలా! కానీ ఒక్కటిమాత్రం మేము హెచ్చరిస్తున్నాము. 'అదృశ్యమైతే ఆలస్యం కూడదు' అని, అందరికీ నమస్కరించి నవ్వుతూ భార్యాభర్తలు చేతిలో చేయివేసుకుని చకచకా తమ కారువేపు దూసుకుపోయారు పత్రికావిలేఖరులు, టెలివిజన్ సిబ్బంది బారులు తీరి తమ ఫోటోలు తీస్తుండగా...

❀ ❀ ❀

# 'దెయ్యాలను మించిన మానవుడు!'

దెయ్యాలు ఉన్నాయా, లేవా? దేవుడుఉన్నాడా? ఓవేళ ఉంటే దెయ్యాలు మంచివా లేక హానికరమైనవా? దేవుడైనా, దెయ్యమైనా ఎందుకు కనబడరు? ఇలాంటి తర్కవితర్కాలు వందలాది సంవత్సరాలుగా దేశవిదేశాలలో సైతం ఈనాటివరకూ వాదోపవాదాలుగానే మిగిలిపోయాయి.

ఓవేళ దెయ్యం అనగా మనిషి చనిపోయిన తర్వాత అతని/ఆమె ఆత్మ సంచరిస్తుందనీ, కొంతమందికే కనుపిస్తుందనీ అనుకునే పల్లెలలో అమాయకపు ప్రజలను ఇదే అవకాశంగా తీసుకుని డబ్బు గుంజుకొనే భూతవైద్యులు కొందరైతే, దైవభక్తి, మతం పేరుతో గడ్డాలు మీసాలు పెంచుకుని జనాల్ని ఏమార్చే దొంగస్వామీజీలు కొల్లలుగా తయారవుతున్నారు ఇవే అంశాలను అడ్డం పెట్టుకుని.

వీటన్నిటినీ పటాపంచలు చేయగలిగినదీ, నిజానిజాల్ని అమాయక ప్రజలకు చాటి చెప్పగలిగేది త్రికరణశుద్ధితో, కష్టపడి శాస్త్ర పరిశోధనలు చేస్తున్న శాస్త్రజ్ఞులు మాత్రమే. పదేపదే లోకానికి వారు, అనగా శాస్త్రజ్ఞులు చెప్పగలిగింది తమ అనుభవాల పుటలు, శాస్త్రచట్టాల ప్రకారం పామరులకు చెప్పేది : 'దెయ్యాన్ని మించినవాడు మానవుడు, మరియు మానవులందరినీ మించినవాడు ఆ భగవంతుడొక్కడే!' (ఏ రూపంలో ఉన్నా) అదెలా చెప్తున్నారో పరిశీలిద్దామా?

అప్పుడే ఆర్మీలో మెడికల్ కోర్‌లో రిటైర్ అయిన బ్రిగేడియర్ కృష్ణమూర్తి, అనాటమీ ఎమ్.ఎస్. ఎఫ్, ఆర్.సి. యస్., పిహెచ్.డి. (లండన్) జీపు దూసుకుని ఆ మారుమూల కుగ్రామం వైపు పోతోంది, తను ఓ ఆర్నెల్లక్రితం కట్టుకున్న చక్కటి నర్సింగ్‌హోమ్, ఆ పచ్చటి కొండ అంచుల్లో, పచ్చటిపైర్ల మధ్యన, పళ్ళ చెట్లతో నిండిన సుందరమైన పల్లె. విశాఖపట్నం దగ్గరగా ఉన్న అరకువాలీ కొండల మధ్య ఆ పల్లెకు బస్సు సౌకర్యంగానీ, రైలు సౌకర్యంగానీ లేవు. నాల్గువందల యాభై మైళ్ళ దూరంలో ఉన్న కుగ్రామానికి బస్సులు రెండు గంటలకోసారి విశాఖపట్నం నుంచి వచ్చి, మరల వెనక్కి వెళ్తాయి. కనుక కాలినడకనగానీ, లేక కారులోనో, మరేదన్నా స్కూటరో, మోటారుసైకిలో, ఎద్దుబండో, లేక గుర్రబ్బండో ఉంటేగానీ ఆ పల్లె 'ఎంకిపాడు' కి చేరలేము. అంటే బస్సు 'నారాయణ గూడెం' అనే గ్రామందాకా వస్తే అక్కణ్ణుంచి 'ఎంకిపాడు' ఇంకో 50 కిలోమీటర్లు పోవాలి. పల్లెలో జనం చీకటిపడ్డాక కాలినడకన ఇల్లు జేరుకుంటారుగానీ, పొరపాటున కూడా పల్లె పొలిమేరుదాటి

ధైర్యసాహసాలు కలవారుకూడా వెళ్ళటానికి సాహసించరు. ఎందుకంటే పల్లె సరిహద్దులు దాటగానే దట్టమైన శ్మశానం, దానికి పల్లెజనం పెట్టినపేరు 'దయ్యాలదీవి' అని. అలా ఎందుకనవలసివచ్చిందో పరీక్షిద్దాం.

ఆర్మీ ఆక్షన్‌లో కొన్న పాత లెఫ్ట్‌హాండ్ డ్రైవ్ 'విల్లీస్' జీపు చీకట్లో దూసుకుపోతోంది 'నారాయణగూడెం' నుంచి ఎంకిపాడుకి. గంటకు తొంభై కిలోమీటర్ల వేగంతో దీక్షతో ఒక చేత్తో స్టీరింగ్ పట్టుకుని, మరోచేత్తో అప్పుడప్పుడు పైపు పీల్చుతూ డ్రైవ్ చేస్తున్నాడు బ్రిగేడియర్ డాక్టర్ కృష్ణమూర్తి. పెళ్లి ఇంకా తలపెట్టలేదు. తను ఒక్కడే సంతానం. చిన్ననాడే తల్లిదండ్రులు చనిపోయారు. చిన్నాన్నా, పిన్నమ్మ పెంచి పెద్ద చేశారు. చెన్నపట్నంనుంచి స్కాలర్‌షిప్‌లతో మంచి మార్కులతో ఎప్పుడూ ఉత్తీర్ణుడవటం మూలాన మెడిసిన్ విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో, అటుపిమ్మట స్కాలర్‌షిప్ మీద మెడ్రాసు మెడికల్ కాలేజీలో తనకిష్టమైన సబ్జెక్టు అనాటమీలో ఎమ్.ఎస్. చేసి రాయల్ కాలేజీలో ఫెలోషిప్ రాగానే ఇంగ్లండ్‌కి వెళ్ళి అక్కడ ఎఫ్.ఆర్.సి.యస్. ఆ తర్వాత పిహెచ్‌డి. లు అనాటమీలోనే చేసి, వెంటనే ఇంటర్‌నెట్‌లో పడ్డ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో ఆర్మీ-మెడికల్ కోర్‌కి దరఖాస్తు పెట్టగానే భారతదేశానికి తిరిగి వచ్చేసి సరిగా 15 ఏండ్లు ఆర్మీలో బ్రిగేడియర్ రాంక్ దాకా ఎదిగాక, డిశ్చార్జి తీసికుని నెమ్మదినెమ్మదిగా సేవింగ్స్‌తో కట్టుకున్న తన బుల్లి నర్సింగ్ హెూమ్‌కి ఇదే పయనం. ఆర్మీ ఆక్షన్‌లో మంచి మంచి పాత జీపులు, ఒక్కోసారి కొత్తవి కూడా అతి చవగ్గా దొరకడమేగాక, ఇంజన్ మంచి కండిషన్‌లో ఉంటాయి. అటువంటిది ఒకటి కొనుక్కుని, ఆఖరి పోస్టింగ్ అయిన సెంట్‌తామస్ మౌంట్ మద్రాసులో ఉన్న మిలటరీ హాస్పిటల్ నుంచి కమాండంట్‌గా వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని, జీప్‌లో తనకున్న కొద్ది సామాన్లు సర్దుకుని విశాఖకి బయలుదేరాడు. విశాఖలో ఒక్కరోజు ఆర్మీమెస్‌లో ఇచ్చిన రూమ్‌లో కాస్త విశ్రాంతి తీసుకుని, అరకువేలీ దగ్గరగా, ఎంకిపాడు దగ్గరగా ఉన్న తన నర్సింగ్ హెూమ్‌కి 'నారాయణ గూడెం' మీదుగా ఇప్పుడు ప్రయాణం.

రాత్రి చీకట్లు అలముకుంటున్నాయి. సాయంకాలం 3 గం॥లకు విశాఖ వదలి, 'నారాయణ గూడెం' చేరేసరికి రాత్రి 8.30 అయింది. అక్కణ్ణుంచి 'ఎంకిపాడు'కి దగ్గరగా ఉన్న తన నర్సింగ్‌హెూమ్‌కి ఇంకో రెండు గంటలు పయనించాలి. నిర్మానుష్యమైన రహదారిగుండా. ఊరి పొలిమేరల్లో నారాయణగూడెంలో ఒక చిన్న నాలుగు బల్లలుండే హెూటల్‌లో వేడివేడి దోసెలు, ఉప్మా, పెరుగన్నం సేవించి మళ్లీ జీప్ ఎక్కింతర్వాతనే పైన చెప్పిన సుదీర్ఘ పయనం.

రాత్రి పదిన్నర. దూరంగా జీపు హెడ్‌లైట్ల కాంతిలో, ఎవరో చేయి ఊపుతున్నారు ఆపమని. జీపు దగ్గర కాను కాను అది ఒక తెల్లచీర కట్టుకున్న సుమారు ముప్ఫయ్ ఏళ్ళుండే స్త్రీ మూర్తి అని తెలిసింది. బాగా దగ్గరగా వచ్చాక ఓ అందాలరాశి అయిన యువతి ప్రక్కగా జీపు ఆపాడు. 'ఎవరబ్బా! ఇంత కాళరాత్రి, చీకట్లో ధైర్యంగా, నిలబడి చేయి ఊపుతూ జీపు ఆపింది?' 'ఎండుపుల్లలు ఏరుకోవటానికొచ్చాను స్వామీ! మా ఇల్లు ఇంకో మైలు వెళ్ళాలి! ఇంతరాత్రి వేళ ఒక్కదాన్నే వెళ్ళటం భయమేసి, మిమ్మల్ని కారాపాల్సి వచ్చింది! ఐయామ్ సారీ!' అని ఆంగ్లంలో చివరిమాట అనగానే, కృష్ణమూర్తి 'ఒకే! గెట్‌ఇన్!' అన్నాడు తన కుడిప్రక్క ఉన్న ప్రక్క సీటు చూపిస్తూ! తలుపులు లేని జీపు ఆమె సునాయాసంగా ఎక్కిన తీరు కాస్త చకితుణ్ణిచేసినా, చెప్పగానే ఎక్కికూర్చుంది. 'థాంక్స్‌సార్! ఇక వెళ్దాం!' అనగానే జీపు మళ్ళీ 80 కిలోమీటర్ల వేగం అందుకుంది.

'ఇంకా ఎంతదూరం వెళ్ళాలమ్మా?' ఓ ఐదు నిముషాల తర్వాత ఆమెవైపు చూసి అడిగాడు. 'ఇదుగో! ఆ చింతమాను దగ్గరగా ఆపండి దాని దగ్గరే మా ఇల్లు' అంది. దూరంగా ఓ చింతమాను, దానికి మరికొంత దూరంలో మిణుకు మిణుకు మంటున్న ఓ దీపం అంత చీకటిలోను కనిపించాయి బ్రిగేడియర్ డాక్టర్ కృష్ణమూర్తికి. "నా భర్త చనిపోయిన తర్వాత నేనొక్కదాన్నే ఉంటానక్కడ. ఒకప్పుడు 'ఎంకిపాడు' జనాలకి చెట్టుకింద చదువు చెప్పేదాన్ని. బియస్సీ బిఎడ్ పాసయ్యాను. నా భర్త ఈ ఊరికి ప్రభుత్వం పంపించిన 'రూరల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, ఉండేవారు. మాది ప్రేమవివాహం. బియస్సీ నుంచి బిఎడ్ దాకా కలిసి చదివాం. పెద్దల అనుమతితో ప్రేమ వివాహం చేసుకున్నాం" అంటూ చెప్తున్న ఆమె అంతలో చింతమాను దగ్గరపడడంతో. "ఇంతకీ మీవద్ద శెలవు తీసికోనా మరి?" అని నవ్వుతూ అడిగింది. "పోనీ మీ ఆ కనబడే ఇంటిదగ్గరే దింపనా?" దయగా అడిగాడు డా॥ కృష్ణమూర్తి. "ఆ శ్రమ మీరు తీసికోనక్కరలేదు! సునాయాసంగా ఇట్టే వెళ్ళగలను! నెవర్దలెస్, మెనీ థాంక్స్!" అని వినయంగా నమస్కరించి తేలియాడినట్లు జీప్ దిగింది ఆమె. అంతే! అప్పుడొక విచిత్రం జరిగింది. విపరీతమైన గుండెధైర్యం కలవారిని సైతం కదిలించివేసే భయానక దృశ్యం. కొన్ని క్షణాలు అవాక్కయి, క్షణకాలం నుదిటిమీద పడ్డ చెమట బిందువులని అతికష్టంమీద తుడుచుకుని ప్రతి నమస్కారం చెయ్యటానికని ఎత్తిన రెండు చేతులూ అలాగే అచేతనంగా బిగుసుకుపోయాయి. దిగిన ఆమె నవ్వుతూ నడిచిపోవాల్సిన ఆమె అలా అలా పొడుగెదగసాగింది. 10 అడుగుల ఎత్తులో ఉన్న చింతమాను కొమ్మదాక ఒక పది అడుగులు ఎదిగి ఒక్కుమ్మడిగా ఆ కొమ్మని రెండు చేతులతో పట్టుకోగానే సాగదీసిన రబ్బరుబ్యాండు

ఉన్నట్లుండి వదలినట్లు పైకి వాయువేగంతో దూసుకుపోయి చీకట్లో, ఆ కొమ్మలో ఎక్కడో కలసిపోయింది.

ఓ పది నిముషాలదాక, ఎన్నో మృతకళేబరాలు, డిసెక్ట్ చేసి వైద్య విద్యార్థులకు చావుబతుకుల మర్మం విడదీసి క్షుణ్ణంగా చెప్పగలిగిన ధైర్య సాహసాలు కలిగిన డా॥ కృష్ణమూర్తి, అనాటమిస్టు చకితుడై, మొద్దుబారిన మెదడుతో మెల్లిగా జీపు తన నర్సింగ్ హోమ్ దిశగా పోనిచ్చాడు. రాత్రి పన్నెండున్నర కావొస్తోంది. అప్పుడు అర్థమై జ్ఞాపకం వచ్చిందతనికి తాను జీపు ఆపిన చింతచెట్టు పరిసరాలే 'దెయ్యాలదీవి'గా పల్లె ప్రజలు ఎందుకు పేరుపెట్టారో!

నర్సింగ్‌హోమ్ మిద్దెమీద అన్ని సౌకర్యాలు కలిగిన ఇల్లు. క్రింద నర్సింగ్‌హోమ్. బేస్‌మెంట్‌లో గారేజీ తలుపులు జీపు హెడ్లయిట్ల కాంతిలో షట్టర్స్ తెరచి, జీపు లోపలపెట్టి, లోపల్నుంచే ఉన్న ద్వారం తలుపులు తెరచి, తన సామాన్లతో సహా బెడ్‌రూమ్‌కి దారితీశాడు డా॥ కృష్ణమూర్తి.

❖ ❖ ❖

ప్రొద్దుటే ఆరుగంటలకే లేచి, స్నానాదులు ముగించి, విపరీతమైన దైవభక్తి, దేశభక్తి కల డా॥ కృష్ణమూర్తి పూజగదికెళ్ళి, ఆంజనేయ దండకం, తదితర పూజలు చేసి, డైనింగ్ రూమ్‌కొచ్చేసరికి, వేడివేడిగా పూరీలు బంగాళ దుంపలకూర, కొబ్బరి పచ్చడి, సెగలుకక్కే ఫిల్టర్‌కాఫీ అన్నీ తయారుగా ఉంచాడు అరవై అయిదేళ్ళ ఆజన్మ బ్రహ్మచారి రాములు. రాములు తన చిన్నాన్న ఇంట్లోనే చిన్నప్పట్నుంచి పెరిగాడు. చదువబ్బకపోవటం మూలాన అతని తల్లిదండ్రులు వాణ్ణి తన చిన్నాన్నకి అప్పగించి, వాళ్ళ ఊరెళ్ళిపోయారు. అన్ని పనులు నేర్పాడు కృష్ణమూర్తిబాబాయి రాములకి. పద్దులు రాయగల్గినంతవరకు చదువు నేర్చుకున్నాడు. చిన్నాన్న పోయిం తర్వాత తన పంచన చేరాడు. వారానికొకసారి విశాఖనుంచి అరకువేలీవైపు వెళ్ళే కూరగాయల వ్యాన్ వాళ్ళు వారానికి సరిపడే కూరలు రాముకి ఇచ్చిపోతారు. బిల్లువారికి కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ చేస్తాడు కృష్ణమూర్తి. నర్సింగ్ హోమ్‌ని ఆనుకుని మరోచిన్న అవుట్‌హౌస్‌లాంటిది కట్టాడు కృష్ణమూర్తి. చిన్న వంటఇల్లు, ఒక బెడ్‌రూము, చిన్నహాలు. మంచం, ఫ్యాను బావి నీళ్ళ సౌకర్యం కల అటాచ్‌డ్ బాత్ ఉండేట్లు చేసి రాములుని అందులో ఉంచాడు. ఎప్పుడూ రాములుని తమలో ఒకడుగానే భావిస్తూ నెలకి పదివేల భత్యం అతని పేరుతో పోస్టాఫీసులో కడుతూ అతనికి రిసీప్ట్‌లు పంపేవాడు రాములు వద్దంటున్నా. నర్సింగ్ హోమ్‌ని, ఇంటిని, పరిసరాలను అతిశుభ్రంగా ఉంచుతూ పెరట్లో కాయగూరలూ, పండ్లచెట్లు చక్కగా పండిస్తూ కావల్సిన వాటిని ఫ్రిజ్‌లో

పెట్టుకునేవాడు రాములు. అందుకే కూరల వ్యాన్ వాడికే ఎక్కువగా మిగిలిన వాటిని అమ్మేసి, ఆ ధనం భద్రంగా దాస్తూ లెక్కలు రాసేవాడు. కందిపప్పు, బియ్యం, కారాలు మట్టుకు వ్యాన్‌లో నెలకి ఓ ఐదు, ఆరు కిలోల చొప్పున వ్యాన్‌వాడే తెచ్చిచ్చేవాడు నాణ్యమైన ధరలకి. లేదా పండే కూరలకి ఇవ్వాల్సిన ధనం బియ్యం ధరకి సరిపుచ్చేవాడు. ఎంతో నిజాయితీపరుడైన రాములుపై విపరీతమైన గురి, అపారమైన విశ్వాసం డా॥ కృష్ణమూర్తికి. అందుకే రాములు లెక్కలు చూపిస్తానన్నా వద్దు అని త్రోసిపుచ్చేస్తాడు రాములుపై తనకు గల నమ్మకం వలన.

రాములుని ఒక స్నేహితుడుగా, పెద్ద మనిషిగా గౌరవిస్తాడే తప్ప ఎన్నడూ అతన్ని ఒక నౌకరుగా చూడలేదు. అందుకే అల్పాహారం ముగించి, కాఫీ చప్పరిస్తూ, 'రాములూ! నిన్న రాత్రి ఒక విచిత్రం జరిగింది తెలుసా...?' వాక్యం పూర్తికాక మునుపే రాముడు నిట్టూర్చి "అయితే కిట్టి బాబూ! (చిన్నపుడు తనని స్కూలుకి తీసికెళ్లేటప్పట్నుంచి ఇంట్లో అందరూ పిలిచినట్లే 'కిట్టిబాబూ!' అనే పిలుస్తాడు) మీకు కూడా కనిపించిందన్నమాట, ఆ అభాగ్యురాలు!" అని శూన్యంలోకి చూడసాగాడు. కృష్ణమూర్తి ఆశ్చర్యపోయి 'అయితే నువ్వు కూడా చూశావా, ఆమెను మరి?' అనగానే తల అడ్డంగా తిప్పి, "చూడలేదుకానీ, పల్లెజనం కథలు కథలుగా చెప్పుకుంటారు ఆ అభాగ్యురాలి దీనగాథ!" అని కళ్ళు తుడుచుకున్నాడు మెత్తటి మనస్సు, స్వచ్ఛమైన, నిష్కల్మషమైన మనసున్న రాములు. చలించక, పూసగుచ్చినట్లు చెప్పాడు డా॥ కృష్ణమూర్తి గతరాత్రి జరిగిన వృత్తాంతం. "అయితే ఒకటిమాత్రం చెప్పగలను కిట్టిబాబూ! ఇంత వరకూ ఆమె పలువురికి కనిపించిందే తప్ప, ఏమాత్రం హాని తలపెట్టలేదు. పెట్టబోదు అని పల్లెప్రజల నమ్మకం దానికి బోలెడు కారణాలు వాళ్లలోవాళ్ళు చెప్పుకుంటారు ఈనాటికీ" అని వంటింట్లో గిన్నెలు సర్దటానికి వెళ్లిపోయాడు రాములు.

ఆలోచించగా ఆలోచించగా డా॥ కృష్ణమూర్తి ఒక ధృఢమైన నిర్ణయానికొచ్చాడు. ఆ రాత్రి 7.30 గం॥ కృష్ణమూర్తి చకచకా కొన్ని అత్యాధునిక ఫోటోగ్రాఫిక్ ఎక్విప్‌మెంట్సు అన్నీ రెడీ చేసుకున్నాడు. 'ఇన్ఫ్రారెడ్ బటన్‌సైజు' వీడియో కెమెరా, దాని 'బేకప్ ఎక్విప్‌మెంట్' సిగ్నల్స్ కొన్ని వేలమైళ్ళ దూరమైనా పయనించగల శాటిలైట్ సిగ్నల్స్, ఫస్ట్ ఎయిడ్ సరంజామా, ఇలా ఎన్నో జీపులో పొందికగా సీటుకింద చీమకు కూడా కనపడని రీతిలో అమర్చాడు. శాటిలైట్ ద్వారా ఆర్మీ సిగ్నల్స్‌లో తనతో పనిచేసిన ఇంజనీర్లెందరో స్నేహితులున్నారు. వారందరితో సెల్‌ఫోన్‌లో విడివిడిగా మాట్లాడి, తాను చూడపోయే అద్భుతాలు విడివిడిగా స్టేషన్ కమాండర్‌ల పర్మిషన్లతో రికార్డ్ చేయమన్నాడు. అతని ప్రతిభ తెలిసిన ఆర్మీ సిగ్నల్స్ వాళ్ళు వెంటనే ప్రభుత్వం దగ్గర కావల్సిన అంగీకారపత్రం తీసికొని అతి రహస్యంగా ఉంచమని డా॥ కృష్ణమూర్తి

చేసిన అభ్యర్థనను త్రికరణ శుద్ధిగా ఆచరించారు. ఆర్మీలో మన్నించినంతగా 'అఫీషియల్ సీక్రెట్స్ ఆక్ట్' దేశంలో ఎవ్వరూ పాటించలేరు. ఆ విషయం అందరికీ తెలిసినదే.

మామూలుగా డా॥ కృష్ణమూర్తి ఎక్కడికెళ్ళినా వివరంగా రాములుకి చెప్పేవెడతాడు. కానీ ఆ రోజు రాత్రి 7.30 గం॥లకు జీపులో సామగ్రి అన్నీ అమర్చుకుని, ఎందుకో విడమరచి చెప్పాలనిపించలేదు. అతను అడగనూలేదు. రాములుకి చిన్నాన్న ఇచ్చిన తర్ఫీదు అలాంటిది మరి. అతను చెప్పిందల్లా "రాములూ! తిరిగి రేపు ప్రొద్దున్న 8.30 కల్లా వచ్చేస్తాను. అందాక భద్రంగా ఉండు!" అనగానే 'సరే'నని తలూపి, తలుపు దగ్గరకేసుకుని వెళ్ళిపోయాడు రాములు.

విల్లీస్‌జీపు ఫోర్‌వీల్ డ్రైవ్ కావటం మూలాన ఎలాంటి ఎత్తుపల్లాలైనా కొండలమీదైనా, సునాయసంగా ఎక్కగలదు జీప్‌కి ఉండే ప్రత్యేకమైన టయర్ల మూలాన. ఆ చింతమాను దూరదూరంగా కనిపిస్తోంది, దుమ్ము రేపుకుంటూపోతున్న కృష్ణమూర్తికి. ఏమాత్రం భయాందోళనలులేని డాక్టరు అతను. విక్రమార్కుడు భేతాళున్ని సంధించినట్లు, అతను నిర్భయంగా, నిస్సంకోచంగా తను మునుపటిరోజు రాత్రి చూసిన విస్మయాన్ని మళ్ళీ ఎదుర్కోగలడని ఈ ప్రయాణం. ఎస్! అతను ఊహించినది అక్షరాలా నిజం! మళ్ళీ దూరంగా ఓ యువతి హెడ్‌లైట్ల కాంతిలో తెల్లచీరలో ఈసారి విశాఖ వెళ్ళే దిక్కుగా, సరిగ్గా గతరాత్రి ఆమెని దింపిన చోటే నిలబడి, జీపు ఆపమన్నట్లు చేతిని విపరీతంగా ఊపుతోంది. ఈసారి మళ్ళీ జీపు ఆపగానే "సారీసర్! నేను ఎంకిపాడుకెళ్ళాలి! ఇక్కడే దగ్గర్లో నా స్కూటర్ ఆగిపోయింది! నా భర్త ఆదుర్దాపడుతూంటాడు!"అంది. మనస్సులోనే 'అబ్బ! ఈసారి మరో కథ ఎంత బాగా అల్లుతోంది!' అనుకుంటూ యథాప్రకారం కృష్ణమూర్తి 'ఒకే! గెటిన్ మేడమ్!' అని కుడివేపు చేయి చూపించాడు తన కుడిప్రక్కన. కానీ ఆమె హెడ్‌లైట్లకాంతిలో తేలుతూ వచ్చిన రీతి అతని షర్టు గుండీలలో ఒకటిగా అమర్చిన ఇన్ఫ్రారెడ్ వీడియో కెమెరా నిశ్శబ్దంగా తన పని తను చేసుకోసాగింది. చాలాదూరంలో ఉన్న ఢిల్లీలో సిగ్నల్స్ కమాండర్ కల్నల్ శ్రీవాస్తవ తను టీవి స్క్రీనులో చూస్తున్న ఈ వింత, తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. ఓ వనిత, తెల్ల చీరతో, గాలిలో తేల్తున్నట్లుగా అతివేగంతో జీపు కుడిప్రక్కగా పోవటం స్పష్టంగా తెలుస్తోంది. మొత్తం ఆ రూమ్‌లో ముగ్గురే ఉన్నా శ్రీవాస్తవ సహచరులు కెప్టెన్ రాహుల్, సెకండ్ లెఫ్టినెంట్ మల్హోత్రా నోటమాటరాక చకితులై కళ్ళప్పగించి కొన్ని వందలమైళ్ళలో జరుగుతున్న ఈ వింత మన రాజధాని నగరం న్యూఢిల్లీ ఆర్మీ సిగ్నల్స్ కంట్రోల్స్ కంటోన్‌మెంట్‌లో అతి రహస్యమైన ఆర్మీ హెడ్‌క్వార్టర్ సిగ్నల్స్ భాగం నుంచి రికార్డు చేసుకోసాగారు. వివిధ అత్యాధునిక పరికరాలతో.

జీపు మెల్లగా వేగం అందుకుంటోంది. నవ్వుతూ, "ఏం? మళ్ళీ నేనేనా కాదా అని విస్తుపోతున్నారా?" కిలకిలా నవ్వుతూ చీకట్లో సైతం తళుక్కుమన్న ఆమె తెల్లటి పలువరస ఈసారి డా॥ కృష్ణమూర్తిని చలింపజేయలేదు. "ఈసారి నే చెప్పేదిసైతం కాస్త ఓపిగ్గా వినగలరా బ్రిగడియర్ కృష్ణమూర్తిగారు!" ఉలిక్కిపడటం ఈసారి డా॥ కృష్ణమూర్తి వంతైంది! భయం బొత్తిగా లేదుగానీ, తన ఉనికి, పేరు ఇంతబాగా ఎలా సేకరింపగలిగింది ఈ ప్రేతాత్మ? దానివల్ల ఏం ప్రయోజనం ఈ ఆత్మకు?

మళ్ళీ చెప్పసాగింది! "ఈ దారిగుండా వెళ్ళే ఎందరికో నా వృత్తాంతం తెలుసు, కథలు కథలుగా చెప్పుకుంటారు. మీ పేరు, చిరునామా అన్నీ తెలుసుకున్నా. నేను మీకు ఎటువంటి హానీ తలపెట్టకపోగా. అతి ముఖ్యమైన సహాయం అర్థిస్తున్నాను. ఆ సహాయం మీరొక్కరే చేయగలరని, నేను చనిపోకముందు అరకులోయలో దీర్ఘంగా ఓ పర్ణశాల వేసుకుని తపస్సు చేసుకుంటున్న ఒక మహర్షి 90 ఏళ్ళ వయోవృద్ధుడు, జ్ఞాని చెప్పి మరీ కన్నుమూశాడు. చెప్పిన కొన్ని సంవత్సరాల తర్వాత...." రెప్ప వాల్చకుండా, నిశ్చలంగా డ్రైవ్‌చేస్తూ అతిశ్రద్ధగా వింటున్నాడు డా॥ కృష్ణమూర్తి. మళ్ళీ అందుకుంది ఆమె. "చనిపోయిన ఆత్మలకు కొన్ని అతీతశక్తులు లభిస్తాయి. అందులో ఒకటి ఏ చోటికైనా సెకన్లలో చేరగలగటం, దివ్యదృష్టి, జరగబోయేది కొన్ని సంవత్సరాల మునుపే మాకు తెలుస్తుంది. కానీ మోక్షం కలిగితే గానీ భగవంతుడిని చేరలేము. అందుకే కొన్ని చెడ్డ ప్రేతాత్మలు భగవంతుడి పేరెత్తితేనే విపరీతంగా చలిస్తాయి.

ఇప్పుడు నా కథ వివరంగా చెప్తాను. నేను మోక్షం పొందటానికి మీరు ఎంత ముఖ్యులో మీకు తెలుస్తుంది అంతా విన్న తర్వాత. అంతవరకూ మీరు దయచేసి ఓపిక పట్టండి! ధైర్యసాహసాలు, నిజాయితీ పరులైన డాక్టర్! నేను మళ్ళీ మీకు హామీ ఇస్తున్నాను. మీకు నేను ఎటువంటి హానీ తలపెట్టను." దూరంగా మన రాజధాని నగరంలో ఢిల్లీలో ఆర్మీ సిగ్నల్స్‌వాళ్ళు శిలాప్రతిమలై వింటున్నారు నోటమాటరాక! శాటిలైట్ సిగ్నల్స్‌ద్వారా.

"నేను ఈనాటికి ఒకవేళ జీవించి ఉంటే నా వయస్సు సరిగ్గా డెబ్భై సంవత్సరాలు ఉండేవి" అనిందా ప్రేతాత్మ.

సుమారు ముప్ఫయి సంవత్సరాల వయస్సులోనే కనిపిస్తా అప్పుడప్పుడు శ్మశానంవైపు చింతచెట్టు క్రిందగా వెళ్ళే బాటసారులకు. మీకు అర్థమైయుండాలి. నేను చనిపోయినపుడు నా వయస్సు సుమారు 30 సంవత్సరాలు" జీపు చీకట్లో విశాఖపట్నంవైపు దూసుకుపోతోంది, ఆ కటిక చీకట్లో. ఏ అరగంటకో ఓసారి ఎదురుగా వస్తున్నాయి ఒక లారీయో, లేక కారో. ఆపితే ఆమె అదృశ్యమయిపోవటమే కాక ఈ విస్మయించే నిజాన్ని ఛేదించి, గ్రామస్థులకు భయం పోగొట్టటానికి అవకాశం మళ్ళీ

దొరకదు. రికార్డు అవుతున్న ప్రతిమాటనూ ఆర్మీ సిగ్నల్స్ అధికారులు ఢిల్లీలో వింటూ, పూర్తిగా అతను అభ్యర్థించినట్టు సహకరిస్తున్నారు. ఇలా ఆలోచనల్లో మునిగితేలుతున్న డా॥ కృష్ణమూర్తితో కాస్సేపాగి మళ్ళీ చెప్పసాగింది ఆ ప్రేతాత్మ.

"ఇంతకుమునుపే చెప్పిన విధంగా, మా ఇద్దరిదీ ప్రేమవివాహం. కులమతాల పట్టింపులు విపరీతంగా గల ఈ సంఘంలో, మా అదృష్టం వలన మేమిరువురం ఒకే కులస్థులవటం వల్లనూ, జాతకాలు కూడా జతపరిస్తే బాగా ఏకం అవటం మూలానూ, నా వివాహం చంద్రశేఖర్‌గారితో నా కోరిక ప్రకారం చాలా సింపుల్‌గా విశాఖపట్నంలోనే జరిగింది. మా ఆయన చంద్రశేఖర్‌గారి అదృష్టంకొద్దీ యుపీ.ఎస్.సీ వాళ్ళ పరీక్షలలో ఉత్తీర్ణుడై ఉద్యోగ దరఖాస్తు పెట్టుకుని ఇంటర్వ్యూలలో నెగ్గటం వలన ఆయనకు ఈ మారుమూల 'ఏంకిపాడు' పల్లెలో 'ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్' గా ఉద్యోగం ఇచ్చారు. ఓ చిన్న పెంకుటిల్లే మాకు బస, గవర్నమెంట్ వారిచ్చారు అక్కడే ఆఫీసు పెట్టుకోమని. నెమ్మది నెమ్మదిగా ఆఫీసుకి కావల్సిన బల్లలూ, కుర్చీలు, ప్రభుత్వం ఇంటికి కావల్సిన మంచాలు, కుర్చీలు వగైరా ఓ పదిహేను రోజుల్లో విశాఖనుంచి రప్పించి అమర్చారు. టెలిఫోను త్వరలో లైన్లు వేశాక అందిస్తామని కూడా చెప్పారు.

కనుక అమాయక పల్లె జనాలకు, వారి పిల్లలకు ఇంటికి దగ్గర్లోనే ఉన్న ఓ పెద్ద మర్రిచెట్టూ, దానికింద ఉండే రచ్చబండపై ప్రభుత్వంవారు పంపిన ఒక బ్లాక్‌బోర్డుపై 'అ,ఆ,ఇ,ఈ ల దగ్గర్నుంచి A.B.C.D. లు, ఇంకా ఎన్నో విషయాలగురించి ఆయన బోధిస్తుంటే నేను రాసేదాన్ని ఓ రెండుగంటలు. ప్రతిరోజూ ఉదయం పది నుంచి పన్నెండు గంటలదాకా. ఇలా ఓ సంవత్సరం గడిచింది. ఇంతలో మాకు ఓ చక్కటి ఆడపిల్లగలిగింది ఆ వూరి మంత్రసాని సాయంతో. మా ఇంట్లోనే పురుడు పోసింది సునాయాసంగా. నా పేరు 'సుచిత్ర' కావటంతో మా పాపకు 'సుమతి' అని నామకరణం చేశారు మా ఆయన చంద్రశేఖరం. ఆ పల్లెజనం చూపే అమాయకపు ప్రేమాదరణలు ఉచితంగా చదువు చెప్తున్న మా ఇద్దరినీ వాళ్ళ స్వంత బంధువుల్లాగ తల్చుకుంటూ, వారిస్తున్నా వినక, రోజూ వాళ్ళు పండించుకుంటున్న కాయగూరలూ, పాడి ఉండటం వలన పాలూ, పెరుగూ, బియ్యం అన్నీ తెచ్చివ్వటమేకాక ఏ సాయం అర్థించినా వెనకాడకుండా సాయానికొచ్చేవారు. ఇలా ప్రశాంతంగా గడిచిపోతున్న మా జీవితాలు ఒక్కసారిగా అల్లకల్లోలం అవుతాయని కలలో కూడా అనుకోలేదు మేమిద్దరం.

దగ్గర్లోనే ఉన్న 'నారాయణగూడెం' నుంచి అప్పుడప్పుడు ఓ జీపులోనో లేక మోటారు సైకిలులోనో, వస్తూపోతూ ఆ పల్లెజనాల వద్ద బియ్యంలో కొంత, కూరగాయల్లో కొంత 'సరదాగా' అజమాయిషీ చేస్తూ లాక్కుపోయేవాడు ఓ యువకుడు.

అతనికి పాతికేళ్లు ఉంటాయి. ఎప్పుడూ క్షవరం చేసుకోని గడ్డం, ఎర్రబారి ఉన్న కళ్ళు, బలంగా కండలు తిరిగిన శరీరం. మనం చూసే సినిమాల్లో విలన్లకుమల్లే ఉండేవాడు. అతని తండ్రి విశాఖలో పరపతిగల ఓ పెద్ద రాజకీయ నాయకుడు. ఆ నాయకుడికి ఒక్కగానొక్క పిల్లవాడు. 'నారాయణ గూడెం'లో వాళ్ళకు ఓ పెద్ద భవంతి, నౌకర్లు, జీపులు, బోలెడన్ని భూములు, నోరెత్తని ఆయన భార్య, ఈ పిల్లాడు ఉండేవారు. తరతరాలుగా తరగని ఆస్తి ఉండటంతో, ఏదడిగినా ఇస్తున్న తల్లిదండ్రులు, అతన్ని పూర్తిగా ముద్దుచేసి పాడుచేశారని చెప్పొచ్చు. ఐదో తరగతి కూడా దాటలేకపోయాడు ఆ రాజశేఖరం. (పల్లెజనం 'రాజయ్య' అని అంటారు అతన్ని.) పెళ్ళిచేశారు ఇరవయి ఏళ్ళకే కాస్త బాగుపడగలడని. భార్య అతి సౌమ్యురాలు. ఆమె అతని ఆగడాలకి అడ్డు చెప్పకపోవటమేకాక నోరెత్తదు తన అత్తగారికి మల్లే. ఇద్దరూ అంటే అత్తాకోడళ్ళిద్దరూ అతనికి ఎప్పుడూ ఎదురుచెప్పేవారు కారు. ఇద్దరు మొగపిల్లలు సంతానం కలిగినా ఆ రాజకీయనాయకుడు చాలా మంచివాడైనా, పితృప్రేమతో ఏం అడ్డు చెప్పలేక పోలీసు కేసులొచ్చినా, పితృవాత్సల్యంతో ఆ కేసులు కొట్టించేసేవాడు పరపతితో. దాంతో రాజశేఖరంకు ఎదురు చెప్పేవాళ్ళు లేకపోయారు. ఎప్పుడూ చేతినిండా డబ్బు, పనీపాటా లేకపోవటం మూలాని యవ్వనపు మదం, జీపు, మోటారు సైకిలు అన్నీ ఉండడంతో ఊర్లు తిరగటం, వెళ్ళినచోట్లలో హొటళ్ళలో బసచేసి వెలయాళ్లతో కులకటం, అప్పుడప్పుడు ఈ గ్రామానికొచ్చి పల్లె ప్రజలను ఆజమాయిషీ చేయటం అతనికి సరదాలవటమేకాక దినచర్యలలో ఒకటై పోయినాయి. అందుకే అతను వచ్చిన క్షణం దూరంగా దుమ్మురేపుకుంటూ వస్తున్న అతని జీపో లేక మోటారుసైకిలో చూడగానే, ఆడంగులు ఉన్న నాలుగు పెంకుటిళ్ళు, పూరిగుడిసెలలోకి దూరి తలుపులు బిగించుకునేవారు భయంతో. మాకీవిషయాలు తెలీకపోవటంతో, తెలిసినా నీతినిజాయితీలున్న నా భర్త లొంగిపోయేరకం కాదు. అందుకే రోజూ మా పని మేము చేసుకుపోతూ, ప్రాథమిక విద్యను ఎప్పటిలాగే పల్లె ప్రజలకు బోధిస్తూ పోయేవాళ్ళం శని ఆదివారాలు తప్ప.

ప్రతి శనివారం సైకిలుపై ఓ రెండు మైళ్ళ దూరంలో ఉన్న మరో చిన్న పల్లె వెళ్ళి అక్కడున్న ఒక్కగానొక్క కిరాణాకొట్టులో ఇంటికి కావల్సిన సబ్బులూ చీపుర్లూ ఇలాంటి ఇతర వస్తువులూ కొని తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం భోజనాల వేళ ఒంటిగంట అయ్యేది. అలాంటి ఒక శనివారం ప్రొద్దున్నే ఆయనటు వెళ్ళగానే దుమ్మురేపుకుంటూ మోటారుసైకిల్లో వచ్చాడు రాజయ్య. ఆ ఊరి పెద్దలో ఒకడయిన రంగయ్య వృద్ధుడు వినయంగా అతనికి ఓ దణ్ణం పెట్టి చేతులు కట్టుకుని నిలబడ్డాడు అక్కడున్న పల్లె ప్రజలు ఎప్పుడూ చేసేవిధంగా. వచ్చినవాడు నేరుగా వృద్ధుడైన రంగయ్యను లేకిగా

అడిగాడు నవ్వుతూ. "ఆ పంతులమ్మేది కనపడదు? ఓసారి పిలుస్తావా ఆ జగదేకసుందరిని?" అతని లేకితనం, ఆ వంకర నవ్వు అర్థం చేసుకున్న రంగయ్య నోరు మెదపలేదు సరికదా, నన్ను పిలవనూ లేదు. 'పోనీ నేను పిలవనా?' ఇంకా వెకిలిగా నవ్వుతూ మా యింటివేపు నడవపోతూంటే వంటచేస్తున్న నేను, సుమతికి పాలిచ్చి నిద్రపుచ్చటంతో నిర్మలంగా నిద్రపోతున్నది గనుక చేతులు తుడుచుకుంటూ అక్కడవుతున్న అలికిడికి బయటికొచ్చాను మొహం మీద పడ్డ ముంగురులను ఎగదోసుకుంటూ. కళ్ళార్పకుండా లేకిగా, వెకిలిగా నవ్వుతూ నన్నే చూస్తున్నాడు రాజయ్య. తన అజమాయిషీకి అడ్డు ఎవరు చెప్పినా హతమార్చగలడని ఆ పల్లె ప్రజలకు తెలుసు. నెమ్మదినెమ్మదిగా నావేపు నవ్వుతూ, ఓచేత్తో సిగరెట్టు వెలిగించి రాసాగాడు. నేను చలించలేదు. తీక్షణంగా చూస్తూ, కోపం తమాయించు కుంటూ ధైర్యంగా నిలబడ్డాను అతని గురించి పూర్తిగా తెలీకపోయినా. కాస్తో కూస్తో శాంతంగా అడిగాను అతన్ని 'ఏం కావాలి మీకు?' అని. "అబ్బా! పర్వాలేదే? దేవత మాట్లాడుతోందే?" అని, "జగదేకసుందరిలా ఉన్న నీకన్నా నాకింకేం కావాలే? నువ్వే కావాలి! నిన్ను ఏనాడో దూరంనించి చూసినప్పట్నుంచి, నీ పొందుకై నా దేహం తహతహలాడిపోతోంది!" అని నా చెయ్యి ఒక్కసారి తనవేపు లాక్కోబోయాడు. ఇంకోచేత్తో చెంప ఛెళ్ళుమనిపించాను. దాంతో ఒక్కసారి వెనక్కిపడబోయిన అతను ఎదురు చూడని ఈ సంఘటనకు కాస్త నోటమాటరాక ఓ క్షణం అలాగే శిలా ప్రతిమలాగా నిలబడిపోయాడు. "నీచుడా! ఏమనుకున్నావు నీ మనస్సులో! నీ దురాలోచనలు ఆగడాలు, నాదగ్గర సాగవు!

మా ఆయన రాగానే ఆయనతో చెప్పి నిన్ను జైల్లో పెట్టించగలను. జాగ్రత్త! ఛీ!" అని కాండ్రించి ఉమ్మేశాను. మనస్సులో కాస్త ఆందోళనపడినా మళ్ళీ ఏంచేస్తాడో అనుకుంటూ! 'జైల్లో పెట్టిస్తావా? అబ్బా! ఆడ చిరుతలాగా ఎదురు తిరిగావే?' పకపకానవ్వుతూ, 'నీ ఇష్టం ఏ జైల్లో అన్నా పెట్టించుచూద్దాం? నా సంగతి నీకు తెలీదు లాగుంది పాపం! ఈ రోజు పౌర్ణమి రాత్రి. మళ్ళీ వెన్నెల కాసేటప్పుడు వస్తాగా నా రాణీ!' అని నవ్వుకుంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు రాజయ్య. ఏం చేయలేని నిస్సహాయస్థితి. మా ఆయన వచ్చేదాక నిశ్చలంగా నిద్రపోతున్న మా పాప ప్రక్కనే చతికిలపడిపోయాను, ఆయనకోసం ఎదురు చూస్తూ. ఆయన రాగానే ఆయన్ను అల్లుకుపోయి ఆరోజు జరిగినవన్నీ పూసగుచ్చినట్లు ఆయనకు చెప్పాను. ఎంతో శాంతస్వరూపులైన చంద్రశేఖర్ కూడా కోపంతో మొహం ఎర్రపడిపోయి, "భయపడక! ఇటువంటివారు లోకంలో ఎందరో ఉన్నారు. ప్రతిసారీ భయపడుతూ ఉంటే ఇంకా

ఎక్కువ చేస్తారు. ధైర్యంతో ఎదుర్కొందాం ఈసారి వస్తే" అని తల నిమురుతూ గట్టిగా హత్తుకున్నారు నన్ను. ఎంతో ధైర్యం కలిగింది నాకు.

ఆ రోజు రాత్రి పున్నమి చంద్రుడు మబ్బుల్లోంచి దాగుడుమూతలాడుతూ, కిటికీలోంచి వచ్చే నైట్ క్వీన్ సువాసనలు వెదజిమ్ముతుండగా, సరిగ్గా పన్నెండున్నరకి మగతగా నిద్రలోకి జారుకున్నాను, అలసిన మా దేహాలు విశ్రమిస్తూండగానే అతిమెల్లిగా, తలుపు తోసుకుని పిల్లిలా లోనకొచ్చి, చేతికి చుట్టుకున్న మల్లెచెండుతో, మరోచేత్తో ఉన్న 'తీపివాసన' (సాల్వెంట్ ఈథర్) వచ్చే తెల్లటి రుమాలుతో కామదాహంతో ఎలుగులా వచ్చే రాజయ్యను ఇట్టే గుర్తించాను నేను. భయంతో గొంతు పెగల్లేదు. గట్టిగా అరవబోయిన నా నోరు ఓ చేత్తో నొక్కేసి మరోచేత్తో నిద్రనుంచి మేలుకోబోతున్న నా భర్త చంద్రశేఖరాన్ని రుమాలుతో ఆయన ముక్కుపైగట్టిగా అదిమిపెట్టగానే ఆయన కుప్పగా మత్తులోకి పడిపోయారు. నేను నోటమాటరాక లేచేలోపు తనతో తెచ్చుకున్న ఒక చాంతాడుతో, మా ఆయన కాళ్లూ చేతులు బిగించి, ఆటుపిమ్మట గిలగిలలాడుతూ అరవబోయిన నాపైపడి "అరిచావా! నీ పిల్లను దారుణంగా చంపేస్తాను," అని నేను వదలమని దణ్ణం పెట్టినా వినకుండా నా మీద పడి మానభంగం చేశాడు. ఇంతలో మత్తుపోయి, నోటిలో కుక్కిన గుడ్డలతో, కోపంతో, నిస్సహాయంగా అతన్ని చూస్తూ, నగ్నంగా ఉన్న నన్ను చూడగానే అర్థమైందాయనకి జరిగిందేమిటో. చాలా దూరంలో చప్పుడు కాకుండా ఉండేందుకు ఆపిన జీపువైపు నింపాదిగా వెళ్ళసాగాడు రాజయ్య తనలో తను వెకిలిగా నవ్వుకుంటూ. 'మళ్ళీ వస్తాను!' అనగానే "ఛీ! దుర్మార్గుడా! నీ అంతం చూసిగానీ నేను చావను" అని గబగబా నా భర్తను విడిపించగానే ఉగ్రుడైన నా భర్త చెట్టుకొమ్మలు పొయ్య రాజేసుకోవడానికై కొట్టుకునేందుకని గోడకి తగిలించి ఉన్న కొడవలి తీసుకుని అతనివైపు పరిగెత్తాడు. అట్టి పరిస్థితులలో వేరే మార్గం లేదు మనిషికి. విచక్షణ మనస్సును హెచ్చరిస్తున్నా నేను ఆయనని వారించలేదు. కోపంతో నా నరనరాలు ఛీత్కారంతో కాలిపోతూంటే, సంఘానికి చీడపురుగులైన ఇలాంటివారిని అక్కడికక్కడే అంతంచేస్తేగానీ అబలలకు న్యాయం చిక్కదు, అని నాకు ఆక్షణంలో అనిపించింది. ఆయన రుద్రుడై నింపాదిగా ఈలవేసుకుంటూ ఏమరుపాటుగా వెళ్తున్న రాజయ్య తలమీద ఒకవేటుతో నరికినా అది గురి తప్పి అతని భుజం ఎముకపై తగిలి ఎముక కలుక్కుమని విరిగి నెప్పితో అరుస్తూనే వెనక్కి తిరిగి, ఆయనను ఇంకోచేత్తో క్రిందకి తోసి, ఆంబోతులా ఆయన మీదపడి క్రింద దొర్లుతూ పదేపదే కొడవలిని రాజయ్యపై ప్రయోగింపబోయిన మా ఆయన కొడవలి లాక్కుని అక్కడిక్కడే హతమార్చి రాజయ్య కూడా రక్తసిక్తమై విపరీతంగా రక్తం కారటంవల్ల కన్నుమూశాడు. ఇంత జరుగుతున్నా లాంతర్లతో బయటకొచ్చిన

పల్లెవాసులు వచ్చిన ఆగంతుకుడెవరో తెలియడంతో వారివారి ఆడజనాన్ని ఏం చేస్తాడో అన్నభయంతో గుడ్లప్పగించి చూడసాగాడు. ఏడుస్తూ ఆయన్ని కరచుకుని విలపించిన నాకు తెలిసింది ఆయన గుండెల్లోకి దిగిన కొడవలి వల్ల వెంటనే ప్రాణం పోయిందని. మర్నాడు ప్రొద్దున్నే ఎలా తెలిసిందోమరి, స్థానిక పోలీసులు నలుగురు వచ్చి జరిగింది రాసుకున్నారు. చూశారు. రాజయ్య కూడా చనిపోవటంతో ఇరువురి మృతకళేబరాలు విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజీ కింగ్‌జార్జి హాస్పిటల్‌కి వాళ్ళ వ్యానులో తరలించారు. పోలీసులు, ఎంక్వరీ, కోర్టుకేసు, అన్నీ కొట్టిపారేశారు సరైన సాక్ష్యాధారాలు దొరకలేదని. నేను వాంగ్మూలం రాసి ఇచ్చినా, ఏం కాలేదు. వాళ్ళ కొడుకు ఆగడాలు తెలిసిన అతని తల్లిదండ్రులు కిక్కురుమనకుండా తప్పుకున్నారు.

మూణ్ణెల్లు పట్టింది నాకు ఆ షాక్ నుంచి తేరుకోవటానికి. అందాక విషయం ఎరిగిన పల్లెవాసులు నన్ను, నా పాపను కంటికి రెప్పలా కాపాడారు. మూణ్ణెల్ల తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాను. అప్పుడే క్రొత్తగా 'ఎంకిపాడు' కొచ్చి అందరిచేతా 'అన్నయ్యా!' అని పిలిపించుకుంటూ ఉన్న మీ రాములు, పల్లెవాసుల ద్వారా విషయం తెలుసుకుని నన్ను స్వంత చెల్లెలిలా భావిస్తూ, మిగత పల్లెవాసులకి మల్లే ఆదరిస్తూ, స్కూలు పనులలో, ఏమైనా ఇంటికి కావల్సిన సామాగ్రి తేవాలన్నా సాయపడేవాడు. ఇవన్నీ మీరు ఇక్కడికి వచ్చి అరకువాలీలో స్థిరపడకముందు జరిగిన విషయాలు. మా పాపకు రెండో సంవత్సరం వచ్చేసరికి అతన్ని 'మామయ్యా' అని పిలుస్తూ ముద్దుగా మాట్లాడేది. రాములుతో పాపకి అక్షరాలు దిద్దడం నేర్పించాను. కానీ విరిగిన మనస్సుతో ఓ నిర్ణయానికొచ్చి రాములుతో ఓ మాట ఒట్టేయించుకున్నాను. అది కొంతకాలం పాపను మళ్ళీ నేను తిరిగొచ్చేవరకు కాపాడాలి. అదేమిటని అతను అడగలేదు. పాపకు కూడా త్వరలో తిరిగివస్తానని చెప్పి, వికలమైన మనస్సుతో అందరూ నిద్రలో జారుకున్నాక పౌర్ణమినాడు ఈ చింతమాను దాక మా ఆయన వదిలివెళ్ళిన సైకిలుమీద వచ్చాను. కూడా తెచ్చుకున్న మా ఆయన్ను ఆ దుర్మార్గుడు కట్టేసిన తాడుతోనే ఉరిపోసుకున్నాను!" అని ఆపిందామె.

అంతవరకు శ్రద్ధగా, ఓపిగ్గా విన్న డా॥ కృష్ణమూర్తి అడిగాడు ఆ ప్రేతాత్మని. "ఇవన్నీ నాతో ఎందుకు చెప్తున్నావు? ఎందుకిలా శాంతించని ప్రేతాత్మగా ఎవరికీ హాని తలపెట్టకపోయినా ఈ చెట్టుపై ఎక్కడో దాగి ఉన్నావు?" అని అప్పటికే జీపు తిరిగి ఆ చింతమాను క్రిందకి వెనక్కి తెచ్చేసిన డాక్టరు కృష్ణమూర్తి.

"ఆ విషయం చెప్పటానికే ఇన్నాళ్ళు వేచి ఉన్నాను. నేను మొదట మనం కల్సుకున్న రోజే చెప్పాను మీకు. ఆత్మలకు ప్రాణం పోగానే కొన్ని అతీతశక్తులు లభిస్తాయని. అలాంటి వాటిల్లో దివ్యదృష్టిలాంటిదొకటి. రాబోయే కాలంలో జరగబోయేవి

మేము కొన్ని ఊహించగలం. అందుకే ప్రపంచంలో ఇంగ్లండువంటి చోటకూడా కొన్ని వందల సం॥ పురాతనమైన 'కాసిల్స్' (శిథిలావస్థలో ఉన్న పురాతన కోటల్లో) మోక్షం పొందలేని అసంతృప్తి మిగిలిన ఆత్మలు ఇంకా తిరుగుతూ ఉన్న మాట నిజం. వాటి ఆత్మశాంతి కలిగే రోజు వరకూ వేచి ఉండి తర్వాత భగవత్సన్నిధికి వెళ్ళిపోతాయన్నమాట కూడ అక్షరాల నిజం. నా విషయంలో కూడా అదే జరిగింది.

రాములు మీ దగ్గరకే వస్తాడని తెలిసిన నేను, అతనివద్ద ఉన్న మాపాప 'సుమతి' సురక్షితంగా పెరుగుతుందని నమ్మకంతో ఉంటూ, అప్పుడప్పుడూ వారి ఉనికిని గాలిలో వెళ్లి చూసి వచ్చి తృప్తిపడుతూ, ఇప్పుడు ముప్ఫయి ఏళ్లు పెళ్లీడు వస్తున్న ఆ అమాయకపు అందాలరాసిని మీకు అప్పగించాలనీ, మీకు సమ్మతమైతేనే. ధృఢ మనస్సుతో, ఎంతో సంస్కారవంతులైన మీరు సహృదయులై ఆమెను పరిణయమాడి ఆదరిస్తారని నమ్ముతూ ఇన్నాళ్ళు ఇక్కడ ఈ చెట్టుపై మాతృమూర్తిగా, ప్రేతాత్మగా గడిపాను. నా లక్ష్యం ఒక్కటే. మీరు నా పాప సుమతిని వివాహం చేసుకున్న తక్షణం నేను మోక్షం కలిగి భగవంతుడిని, స్వర్గంలో ఉన్న మా ఆయన ఆత్మతో కలసిపోతాను. బలవంతంలేదు. ఒకవేళ మీరు వివాహం చేసుకోకపోయినా, వృద్ధుడైపోయిన రాములు దగ్గర్నుంచి ఆమెను చేరదీసి మీ సమక్షంలో కాపాడగలరని, ఒక ఇంటిదాన్ని చెయ్యగలరనీ తెలియటం మూలాన నా ఆత్మ శాంతించి మోక్షం చెందుతుంది" భగవద్గీతలో శ్రీ కృష్ణపరమాత్మ అర్జునుడికి అక్షరాలా ఈ నిజమే బోధించాడు రణరంగంలో, అని మనస్సులోనే అనుకుంటూ ఆమె ఆత్మకు జోహార్లర్పించగానే మళ్ళీ చింతమానుపై కెళ్ళిపోయింది ఆమె ఆత్మ.

మర్నాడు ప్రొద్దున్నే రాములుతో, అల్పాహారం తింటూ, తను చెప్పేలోపున రాములే ఇలా చెప్పసాగాడు "అయ్యగోరూ! మీరు మొన్న పనిమీద వెళ్తున్నాను అని చెప్పిన నాడే గుర్తించాను సుచిత్ర ఆత్మ నాతో ఆమె చిట్టిపాప సుమతిని అప్పగించిననాడు చెప్పిన విషయాలు గుర్తుకొచ్చి, ఇక ఆ ఆత్మకు శాంతికలిగే రోజులు దగ్గరపడ్డాయన్న విషయం అవగతమయినది. ఇన్నాళ్లు నేను ఈ విషయం చెప్పకపోవటానికి కారణం కూడా సుచిత్ర ఆత్మ అర్థించిన ప్రకారం ఆమె కూతురి విషయం కూడా గుప్తంగా ఉంచవలసివచ్చినది. ప్లస్ టూ వరకు నారాయణగూడెంలో పాప సుమతిని ఎంతో కష్టపడి చదివించి నేనూ అక్కడే ఉండి ఓ స్వంత మేనమామలా కంటికి రెప్పలా కాపాడాను. స్వతహాగా ఆమె తల్లిదండ్రుల తెలివితేటలు ఆమెకు సంక్రమించటం వలన చాలా మంచి మార్కులతో ఉత్తీర్ణురాలవటమే కాక, ఇంట్లోనే పుస్తకాలతో శ్రావ్యమైన కంఠం గల సుమతి చక్కగా పాడటం నేర్చుకుంది" అని

చెప్పటం కాస్త ఆపాడు. డా॥ కృష్ణమూర్తి కాస్సేపు దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు అతని ముఖకవళికలు చెప్పాయి.

బ్రెడ్డుపై జామ్ పూసుకుని రాములు పెట్టిన టీపాట్‌లోంచి 'టీ' కప్పులో పోసుకుని చప్పరిస్తూ అడిగాడు మెల్లగా "రాములూ! నువ్వు చాలా మెచ్చుకోదగ్గ పనే చేశావు. ఆ పిల్లను కంటికి రెప్పలా కాపాడావు. ఇంతకీ ఆమె తల్లి నీతో చెప్పిన విషయాలన్నీ ఆమెకి తెలుసా?!" "అవును అయ్యగారు! ఆమె తల్లి ఆత్మ సూచించిన ప్రకారం అన్ని విషయాలు చెప్పాను." కాస్త తడబడుతూ అన్నాడు. "మరి, ఆమెను మీకు అప్పగించవలసినదిగా ఆ పిల్ల తల్లి ఆత్మానుసారం మీకు ఇక అప్పగించ వచ్చునా?" అడిగాడు తడుముకోకుండా.

అంతవరకూ సుమతి ఆ వృద్ధుడి వద్దనే పెరిగినదనీ, అతనికిచ్చిన ఇంట్లోనే ఓపిగ్గా, పొందికగా ఉన్నదన్న విషయం ఇప్పుడే తెలిసిన డా॥ కృష్ణమూర్తి అన్నాడు. "తప్పకుండా రాములూ! ఇక ఈ క్షణం నుంచి ఆమె బాగోగులు, సంరక్షణ నా ధర్మకర్తవ్యం. ఎందుకో నీకు చెప్పఖ్ఖరలేదు. మా వివాహం కూడా ఇప్పుడే ఇక్కడే గంధర్వ వివాహం మల్లేనే. వాకిట్లో మఱ్రిచెట్టు క్రిందనే ఉన్న దేవాలయం ప్రాచీన శిథిలావస్థలో ఉన్నా కూడా రోజూ ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేసి దీపం వెలిగిస్తున్న నిన్ను గమనిస్తూనే ఉన్నాను. కనుక అడవి పువ్వులతో ఓ అరగంటలో రెండు దండలు కూడా తయారుచేయి. దైవసన్నిధిలో దండలు మార్చుకుంటాము" అంటూండగానే ప్రవేశించిందా విద్యుల్లత, అపురూప సుందరాంగి, జవ్వని, యవ్వనపు తారళ్యాలు అడుగడుగున పొంగి వస్తున్న బిగువైన చక్కటి అవయవ సౌష్ఠవం, ఎర్రటి దొండపండు లాంటి చిరునవ్వుతో ఉన్న పెదవులూ, సన్నటి నడుము, మంచి పొడగరి అయిన సుమతి పెద్దపెద్ద కనులతో "నమస్కారం డాక్టరుగారూ!" అంది సిగ్గుతో ముఖం ఎర్రపడుతుండగా. ముఖంమీద పడుతూ ఉన్న ముంగురులను సుతారంగా తోసుకుంటూ, డా॥ కృష్ణమూర్తి కాళ్ళకి నమస్కరించబోయింది. వారిస్తూ ఆమె భుజాలు పట్టుకుని ఎత్తి, 'అప్పుడే అంత సిగ్గయితే ఎలా?' అని నవ్వాడు హాయిగా.

"ఇంతకూ ఈ విషయాలన్నీ తెలిసిన నీకు కూడా నన్ను పరిణయమాడటం ఇష్టమేననుకుంటాను?" ఇంకా నవ్వుతూ ఉండగానే, బుగ్గలు కెంపులైపోతున్న సుమతి తలదించుకుని మెల్లగా ముత్యాల్లాంటి ఆమె తెల్లని పలువరస తళుక్కుమంటూండగా అన్నది : "మీలాంటి భగవత్స్వరూపులు, మంచి మనస్సుతో మా అమ్మ ఆఖరి కోరికకు ఇట్టే అంగీకరించిన మిమ్మల్ని ఎలా ఒద్దనగలను?" అనేసి సిగ్గుతో లోపలికి పారిపోయింది. చిన్నగా నవ్వుకొని సోఫాలో కూర్చుని పైపు వెలిగించుకోగానే రాములు ఆనందంతో వచ్చి చెప్పాడు. "కిట్టిబాబూ! అన్నీ మీరు చెప్పిన ప్రకారమే చేశాను"

అంటూండగానే నిముషాలమీద చక్కగా ముస్తాబై, పట్టుచీర, వాళ్లమ్మ తనకై వదలివెళ్లిన నగలూ పెట్టుకొని తలదించుకుని తన ఎదురుగా చిరునవ్వుతో సిగ్గులమొగ్గై నేలను చూస్తూ నిలబడిన సాక్షాత్తు లక్ష్మీదేవి విగ్రహంలా ఉన్న సుమతిని చూసి అవాక్కయిపోయాడు డా॥ కృష్ణమూర్తి. "పద రాములూ! నువ్వే మా వివాహానికి పూజారి, సాక్షి" అన్నాడు. భగవంతుడి సమక్షంలో రాములు- అక్కడి పురాతన విగ్రహాలకి హారతి ఇస్తుండగా దండలు మార్చుకున్నారు ఆ నవవధూవరులు. అక్కడే స్టాండ్‌పై అమర్చిన తన డిజిటల్ నికాన్ వీడియో కెమెరా దానంతట అదే టైమర్ సెట్ చేసిన ప్రకారం ఫోటోలు తీసేసింది. ఈ విషయం కూడా ఆర్మీ సిగ్నల్స్ హెడ్‌క్వార్టర్స్‌కి సాటిలైట్ ట్రాన్స్‌మిషన్‌ద్వారా రికార్డు చేయపడింది. తను ఎప్పటికప్పుడు ఇక్కడ జరిగే విషయాలు పంపిస్తూనే ఉన్నాడు. వచ్చేవారం ఆర్మీవాళ్లు న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన సదస్సుకోసం పత్రికా విలేఖరులందరినీ దేశవిదేశాలనుంచి, టీ.వీ. సరంజామాతో తయారుగా ఉంచమని ఆదేశాలిచ్చాడు సెల్‌ఫోనులో డా॥ కృష్ణమూర్తి. కనీవినీ ఎరగని ఈ వింతను చూడటానికి వివిధ రంగాలనుంచి శాస్త్రజ్ఞులకు ఆహ్వానాలు అందాయి. ఆర్మీహెడ్‌క్వార్టర్స్ నుంచి ఢిల్లీ కంటోన్‌మెంట్ ఉన్న ఆర్మీవారి బ్రహ్మాండమైన ఆడిటోరియంలో పకడ్బందీ అయిన సెక్యూరిటీ ఏర్పాట్లతో వచ్చే బుధవారం పగలు పదిగంట్లకు సదస్సు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంకా వారం రోజులుంది కృష్ణమూర్తి వెళ్ళటానికి.

పెళ్ళైన రోజు రాత్రి సరిగ్గా 9 గం॥కు నవదంపతులు డా॥ కృష్ణమూర్తి, సుమతి, రాములు జీపులో బయలుదేరారు 'దెయ్యాలదీవి'కి. చింతచెట్టు క్రింద సరిగ్గా రాత్రి పదిగంటలకు జీపు మెల్లగా ఆపాడు డాక్టరు మూర్తి. తల్లి ఆత్మహత్య చేసుకుని ప్రేతాత్మ అయిందన్న విషయం సుమతికి తెలిసినాకూడా, రాములు ఎన్నడూ ఆ పిల్లను తల్లి ప్రేతాత్మను చూడటానికి తీసుకెళ్లలేదు. అది కూడా తల్లి సుచిత్ర ప్రేతాత్మ చేసిన అభ్యర్థన ప్రకారం. కానీ ఈనాడు ప్రక్కనే భర్త, వాత్సల్యంతో పెంచి పెద్ద చేసిన రాములు ఉండటం మూలాన వాళ్లతో వెళ్లింది. అదీకాక పెళ్లైన పిమ్మట ఆ కొద్ది గంటలలోనే ఒక్క క్షణం కూడా ఆమెను ఇక ఒంటరిగా ఎన్నడూ వదలివెళ్లకూడదని ధృఢ నిర్ణయంతో ఉన్న డా॥ కృష్ణమూర్తి ఆలోచన కూడా అదే.

చల్లటిగాలి వీస్తోంది ఉన్నట్లుండి. ఎండుటాకులు వీచే గాలికి ఎగురుతూ చేస్తున్న చప్పుడూ, ఎక్కడో అరకు వేలీలో దూరంగా నక్కమెడుతున్న ఊళలు, నిండు పున్నమి వెన్నెలలో, మెల్లిమెల్లిగా చింతచెట్టు కొమ్మలమీద అలికిడీ. తెల్లటి రంగుగల ఒక ఆకారం తేలియాడుతూ, చడీచప్పుడు లేకుండా నేలమీదవాలి, క్రమక్రమంగా రూపం దాల్చసాగింది. పూర్తి రూపం 'సుచిత్ర' గా గుర్తించిన సుమతి, ఒక్కసారిగా

కన్నీళ్ళతో 'అమ్మా! వచ్చావా అమ్మా!' అని ఆమెవైపు ఉరకబోయింది యథార్థాన్ని ఒక్క నిముషం మరచిపోయి. డాక్టర్ కృష్ణమూర్తి వారిస్తూ గట్టిగా ఆమె చేయి పట్టుకుని ఆపాడు. వెళ్ళవద్దని సైగచేయగానే, అర్థం చేసుకున్న సుమతి కన్నీళ్లతో వెక్కివెక్కి ఏడ్వసాగింది. దగ్గరకు తీసుకుని సముదాయిస్తోన్న డా॥ కృష్ణమూర్తిని సంతోషంతో చూస్తూ సుచిత్ర ప్రేతాత్మ ఇలా పలికింది. "పిచ్చి పిల్ల! ఎప్పుడో పోయిన తల్లిరూపం చూడగానే చలించింది. కానీ నేనిప్పుడు తృప్తిగా మోక్షం పొంది, భగవద్సన్నిధికి చేరుకోగలను. డాక్టర్, అన్నమాట నిలబెట్టుకుని, నా చిట్టి తల్లికి చేయూతనిచ్చి, జీవితాంతం ఆమెను భర్తగా కాపాడతారని మీమీద పూర్తి నమ్మకంతో, నేనిక ఈ చెట్టుమీద నుంచి విముక్తియై తృప్తిగా వెళ్ళిపోతున్నాను. మీరు చేసిన ఈ గొప్పత్యాగానికి, సహాయానికి జన్మజన్మలకు మీకు ఋణపడి ఉంటాను డాక్టర్! ఇక శెలవు డాక్టర్! ఇక నా ఆత్మ ఎప్పుడూ ఎవరికీ ఎన్నటికీ కనుపించదు. ప్రజలకు నా ఆత్మ ఉనికి వల్ల ఏమైనా భయాందోళనలు కలిగి ఉండొచ్చు.

అందుకు ప్రజలకు నా క్షమాపణలు తెలుపుకుంటున్నాను" అంటూండగానే, సెగ, వేడి లేని నిర్మలమైన ఒక నీలం దీపం వెలిగి, క్రమంగా చిన్న చుక్కలా అయిపోయి గాలిలో కలిసిపోయిందా ఆత్మ. అంతవరకూ అన్నీ ఆర్మీ సిగ్నల్స్‌వారు న్యూఢిల్లీలో రికార్డు చేసుకున్నారు స్పష్టంగా.

ఆర్మీ. నేవీ, ఎయిర్‌ఫోర్స్ వారు విశాఖకు పంపిన స్పెషల్ విమానంలో, ప్రొద్దున్న 5 గం॥ బయలుదేరిన డా॥ కృష్ణమూర్తి అతని భార్య సుమతి, రాములు ముగ్గురూ ప్రయాణమై సరిగ్గా ఎనిమిది గంటలకు ఏర్‌పోర్ట్‌కి చేరుకున్నారు. ఈ రహస్యం పొక్కితే, సదస్సుకు మునుపే పత్రికా విలేఖరులూ, టీ.వీ. విలేఖరులూ గుమిగూడి చేసే ఆర్భాటం ఉండకూడదనే ఆర్మీవారి సూచన ప్రకారం ఇలా వాళ్ళని పకడ్బందీగా రిసీవ్ చేసుకున్నారు. డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజియాలజీ అండ్ అలైడ్ సైన్సెస్ డైరెక్టరూ, వారి పారానార్మల్ రిసెర్చి డివిజనూ, వివిధ రంగాల శాస్త్రజ్ఞులూ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లూ, ఇలా ఒకరేమిటి ఎందరో వచ్చి బ్రిగేడియర్ డాక్టర్ కృష్ణమూర్తిని సాదరంగా ఆహ్వానించి, వారికి కమాండ్ హాస్పిటల్ ప్రాంగణంలోనే ఉన్న ఆర్మీ మెస్‌లో విశాలమైన ప్రత్యేకమైన గెస్ట్‌హౌస్‌లో భోజనాది వసతులు, బస ఏర్పాటు చేశారు.

❖ ❖ ❖

సోమవారం సరిగ్గా పగలు పదిగంటలు. ఆడిటోరియం క్రిక్కిరిసిపోయింది. దేశవిదేశాలనుంచి విచ్చేసిన మెడిసిన్ నోబెల్ లారియేట్సు, ఫిజిక్సు, కెమిస్ట్రీల మాజీ నోబెల్ గ్రహీతలు, ఇంకా వివిధ రంగాల నుంచి ఆహ్వానం అందుకున్న శాస్త్రజ్ఞులు,

టీ.వీ. విలేఖరులూ, ఆంగ్ల పత్రికా విలేఖరులూ అన్ని భాషల పత్రికా విలేఖరులతో నిండిపోయింది ఆ హాలు.

గొంతు సవరించుకుని డా॥ కృష్ణమూర్తి ప్రతిభను టూకీగా విడమర్చి చెప్పి ఆనాటి సదస్సులో ఈ దేశవిదేశాలనే ఆశ్చర్యచకితుల్ని చేయబోతున్న ఈ కనీవినీ ఎరగని 'విజ్ఞానాన్ని' పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో డాక్టర్ కృష్ణమూర్తి వివరించబోతున్నాడని ఆఖరున ప్రశ్నావళికి సమయం కేటాయింపబడినదనీను, అంతవరకు దయచేసి నిశ్శబ్దంగా వినమనీ అర్థించి, తన సీట్లో కూర్చున్నాడు అన్నీ రికార్డు చేసిన సిగ్నల్స్ ఏరియా కమాండర్ కల్నల్ శ్రీవాత్సవ.

వేదికమీదకెక్కి అట్టే ఆలస్యం చేయకుండా పూసగ్రుచ్చినట్లు ఒక్కో స్లైడును అతిపెద్ద లిక్విడ్ క్రిస్టల్ టివిస్క్రీన్ మీద తన లాప్‌టాప్‌లో వరసగా వైర్‌లెస్ రిమోట్ కంట్రోల్ను చేత్తో నొక్కుతూ, గోడమీద పడ్డ ప్రతి సంఘటనా రికార్డింగ్ స్పష్టంగా అవటం మూలాన ఆంగ్లంలో మధ్యమధ్య 'లేసర్‌బొట్టు' ఎర్రగా కావల్సినచోట పడేట్లు రిమోట్ ఒత్తుతూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్స్‌తో తను చెప్పాల్సింది చెప్పాడు డా॥ కృష్ణమూర్తి. ఒక్కసారిగా అందరూ లేచి నిలబడి స్టాండింగ్ ఓవేషన్స్‌తో హాలు దద్దరిల్లిపోయేట్లు చప్పట్లు, వీడియో కెమెరాలు, తళుకు తళుకున ఓ పది నిమిషాల వరకు సందడి తగ్గలేదు.

అటుపిమ్మట ప్రశ్నలూ ప్రత్యుత్తరాలకి విజ్ఞానపరంగా అందరూ తృప్తి చెందేలా తనశక్తి మేరకు జవాబులిచ్చాడు బ్రిగెడియర్ డాక్టర్ కృష్ణమూర్తి. మర్నాడు అన్ని దినపత్రికలూ దేశవిదేశాలలో ఆయన ప్రతిభను పొగుడుతూ ఈ వింతనూ లోకానికి చాటిచెప్పాయి. అందరివద్దా శెలవు తీసుకుని సదస్సు ముగించేసరికి సాయంకాలం చీకట్లు అలముకున్నాయి. మర్నాడు ప్రొద్దున్న ఎయిర్‌ఫోర్స్‌వారి ఫ్లైట్‌లో విశాఖలో దిగి, పిమ్మట ముగ్గురూ తమ గమ్యమైన ఎంకిపాడు దగ్గర నర్సింగ్‌హోమ్ జేరుకున్నారు.

# 'తలమార్పిడి'

మద్రాసు త్యాగరాయనగర్‌లో, ఎన్నేళ్ళనుంచో పేరుమోసిన 'లలితా నర్సింగ్‌హోమ్' నడుపుతున్న డాక్టర్ దంపతులు డా॥ లక్ష్మీనారాయణ శర్మ, అతని సహచరిణి డా॥ నిర్మల. వారి వారి తల్లిదండ్రులు రెండువైపులా డాక్టర్లు అవటంమూలాని, డా॥ లక్ష్మీనారాయణ తండ్రి కీ॥శే॥ డాక్టర్ రామనాధశర్మ వారి సతీమణి కీ॥శే॥ డా॥ సుమిత్రలు తమ నర్సింగ్‌హోమ్ లక్ష్మీనారాయణకు సంక్రమించేటట్లు వీలునామా వదలివెళ్లారు. లక్ష్మీనారాయణ ఇద్దరు అన్నలూ కూడా మెడిసిన్ డిగ్రీ అవగానే అమెరికాకు వెళ్ళిపోయి అక్కడే పెద్దపెద్ద హాస్పిటల్స్‌లో పనులు చూసుకొని శాశ్వతవాస అనుమతి పత్రాలు తెచ్చుకుని స్థిరపడిపోయారు. అదే ప్రకారం డా॥ నిర్మల తల్లిదండ్రులు డాక్టర్లు కీ॥శే॥ విశ్వనాధశర్మ అతని సతీమణి డాక్టర్ కీ॥శే॥ విద్య వారి మద్రాసు మైలాపూర్‌లో ఉన్న నర్సింగ్‌హోమ్ వారబ్బాయి డా॥ గోపీనాథశర్మకి వీలునామాలలో వదలివెళ్లారు.

పెళ్ళైన మరు సంవత్సరం, డాక్టర్ లక్ష్మీనారాయణ శర్మ అతని సతీమణి డాక్టర్ నిర్మలలకు పండంటి నలుగురు పిల్లలు (రెండు జతల కవలలు) 'క్వాడ్రుప్లెట్స్' ఇద్దరు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ ఒకే కాన్పులో కలగటం మూలాన డా॥ నిర్మల గైనకాలజిష్టవటం వలన తన నర్సింగ్‌హోమ్‌లోనే తనకు పురుడుపోసిన తన ఒకప్పటి సహాధ్యాయిని డా॥ శరణ్యతో ముందుగానే చెప్పి ఇక పిల్లలు కలగకుండా 'బైలాటిరల్ ట్యూబెక్టమీ' చేయించుకుంది.

పుట్టినవాళ్లలో మొగపిల్లలు వరుసవారిగా ఐదైదు నిముషాల కొకరు చొప్పున మొదట, అటుపిమ్మట ఆడపిల్లలు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఐదు నిముషాలకొకరు పుట్టారు. అబ్బాయిల జత అచ్చుగుద్దినట్లు వాళ్ళమ్మ పోలికలు కొట్టొచ్చినట్లు ఐడెంటికల్ ట్విన్స్‌గానూ, అమ్మాయిల జత అచ్చుగుద్దినట్లు వాళ్ల తండ్రిపోలికలతోనూ, ఐడెంటికల్ ట్విన్స్‌గా పుట్టారు.

నామకరణం నలుగురికీ, ఇరువైపులా వాళ్ళ వాళ్ళ తాతగార్ల అమ్మమ్మ మామ్మగార్లపేర్లు పెట్టారు. ఆ ప్రకారం, మొదట పుట్టిన అబ్బాయిలిద్దరూ రామనాథశర్మ పెద్దవాడిపేరూ, విశ్వనాధశర్మగా రెండోవాడిపేరూ, ఇక ఆడపిల్లల్లో పెద్దమ్మాయిని సుమిత్రగానూ రెండో అమ్మాయిని విద్యగానూ ఒకే రోజున బ్రాహ్మణశాస్త్రం ప్రకారం పురోహితులతో ఆర్భాటంగా నామకరణం చేశారు. నగరంలో వాళ్లు బాగా పేరు

పరపతిగల డాక్టర్లవటం మూలాని సంఘంలో పేరు ప్రతిష్టలు గల జడ్జీలు, డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్సు పోలీసు అధికారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రముఖ దినపత్రికల సంపాదకులు, పత్రికా విలేఖరులూ, బంధుమిత్రులు, తదితరులు రాయపేట హైరోడ్‌లో ఉన్న నగరంలో అతిపెద్ద కళ్యాణమంటపం 'సత్యగృహ' లో చేరారు. ఒక పెళ్ళి చేసినంత ఘనంగా నామకరణం చేశారు.

కాలచక్రం ప్రశాంతంగా తిరుగుతూ ఉండగా కవలలు నలుగురూ అన్యోన్యమైన అన్నాచెల్లెంద్రుగా కాన్వెంట్ స్కూల్స్‌లో చదివి, సీనియర్ కేంబ్రిడ్జ్‌లో చాలా మంచి మార్కులతో, ప్రథమశ్రేణిలో ఒకేసారి పాసయ్యారు.

ఆడపిల్లలిద్దర్లో అక్క బి.డి.యస్‌కి మద్రాసు డెంటల్ కాలేజీలోనూ, చెల్లెలు మద్రాసు మెడికల్ కాలేజీలో ఎమ్.బి.బి.యస్‌లలో చేరగా, అన్నలిద్దరూ తమకి వెటర్నరీ మెడిసిన్‌లో (వెటర్నరీ సైన్స్ అని అంటారు మనదేశంలో) మద్రాసు వెటర్నరీ కాలేజీలో చేరారు, ఒకే రోజున ఒకే క్లాసులో. మెడికల్, డెంటల్‌లో ఇరువురికీ సీట్లు వచ్చినా వెటర్నరీ చేసిన తర్వాత ఎమ్.బి.బి.యస్ కూడా చదివి, అటుపిమ్మట పాశ్చాత్య దేశాలకివెళ్లి పి.హెచ్‌డి. దాకా విజ్ఞానం పొందాలని వారి ఆశ. అదే ప్రకారం ఎన్నడూ వారి 'ఆంబిషన్స్'కి ఎదురు చెప్పకపోగా ప్రోత్సహించారు వారి తల్లితండ్రులు.

గిర్రున ఇట్టే తిరిగిపోతుంది కాలచక్రం. అందులో అన్నీ ఉన్న ఐశ్వర్యవంతులకు ఎప్పుడూ 'నిత్యకల్యాణం, పచ్చతోరణం'గా లేక 'వడ్డించిన విస్తరిలా' చకచకా గడిచిపోతూంటాయి. కానీ అభాగ్యులకు, అవకాశాలు పొందలేని నిర్భాగ్యులు, అవకాశాలు ఉన్నా ధనంలేక బీదతనంతో చాలీచాలని జీతాలతో, 'దినదినగండం నూరేళ్ళాయుష్షు' అనో లేక తమతమ దౌర్భాగ్యానికి పరిస్థితులనూ, ఆఖరికి దైవాన్ని కూడా నిందిస్తూ, సరైన ఆహారం లేక, వైద్య సౌకర్యాలు అందక, ధనం ఐశ్వర్యం ప్రతిదానికి అడ్డొస్తూ మూలకారణమైన మన అవకాశవాదులు, నానాటికి లంచగొండితనం పెరిగిపోతున్నా మన సంఘంలో నిస్సహాయంగా బలైపోతున్న తెలివితేటలున్న అభాగ్యులు కొల్లలు. కానీ, 'ఏం చేస్తాం? వారి వారి తలరాత, ఎలా ఉంటే అలాగే జరుగుతాయని' పెదవి విరిచి చెప్పేస్తారు సంఘంలో పెద్దలూ, విజ్ఞులు అనబడేవారు 'కొందరికైనా చేయూత కాస్త ఇవ్వాలనిపించదు' మరి వారికి, ఇచ్చే స్తోమత ఉన్నా.

బి.వి.ఎస్.సి. అండ్ ఎ.హెచ్ డిగ్రీలు ఇద్దరూ ఒకేసారి తమిళనాడు వెటరినరీ యూనివర్సిటీలో మొదటి తరగతిలో యూనివర్సిటీ ఫస్ట్ రావటం మూలాని కవలలు రామనాథశర్మ, విశ్వనాథశర్మ, ఒక్కో సబ్జెక్టులో బంగారు పతకాలు గెలుచుకోవటమేకాక,

'ఫుల్‌బ్రైట్' స్కాలర్‌షిప్ పైచదువులకి న్యూజీలాండ్‌లో ఒటాగో యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌లో 'డ్యూన్‌డిన్' పట్టణంలో ఇద్దరికీ ఒకేసారి సీట్ ఇచ్చారు. మన ఎమ్.బి.బి.యస్ అక్కడ ఎమ్.డి.గా పరిగణిస్తారు. మునుపు ఎమ్.బి. అని మాత్రం అనేవారు కోర్సు ఒకటే అయినా. చెల్లెంద్రిద్దరూ కూడా అదే సంవత్సరం బిడియస్, ఎంబిబియస్ మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వటం వలన, ఆడపిల్లలిద్దరికీ, అమెరికాలో పుట్టిన మరో కవల పిల్లలిద్దరితో వాళ్ళూ డాక్టర్లవటం, సంబంధం, జాతకాలు కుదరటం వల్ల, పెండ్లిండ్లు ఆ వేసవిలోనే బ్రహ్మాండంగా జరిపాక, అచ్చుగుద్దినట్లుండే ఆ అమెరికాలో పుట్టి పెరిగిన కవల డాక్టర్లు పెళ్ళి పీటలమీదనే ఛలోక్తులు వేశారు. 'మరి పొరపాటున భార్యభర్తల మార్పిడి అయిపోతేనో?' అని. అందరూ హాయిగా నవ్వుకున్నాక పెద్దమ్మాయి వాళ్ళాయన ఆస్ట్రేలియాకి 'హనీమూన్'కి వెళ్ళిపోగా రెండో పిల్ల స్విట్జర్లాండ్‌కి హనీమూన్‌కి వెళ్ళి, అట్నుంచి అటే అమెరికా తిరిగి వెళ్ళిపోయేటట్లు ఏర్పాటు చేసుకున్నారు.

అన్నదమ్ములిద్దరూ, అంటే ఇప్పుడు వెటర్నరీ సర్జన్లయిన డా॥ రామనాథశర్మ డా॥ విశ్వనాథశర్మ తల్లిదండ్రులని విడువలేక విడిచి, న్యూజీలాండ్‌లో డ్యూనడిన్‌కి వెళ్ళి, పూర్తి స్కాలర్‌షిప్‌లు, డార్మిటరీ సౌకర్యాలు అన్నీ ముందే ఏర్పాటవ్వటం వలన, అతిసుందరమైన న్యూజీలాండ్ ఒటాగో మెడికల్ స్కూల్‌లో నిశ్చలంగా, ఏ చీకూ చింతాలేకుండా వయసిచ్చిన ఉత్సాహంతో ఎమ్.డి., మళ్లీ యూనివర్సిటీ ఫస్ట్‌గా ఉత్తీర్ణులై, ఇద్దరికీ ఒకేసారి పిహెచ్‌డి ఒకే అంశంపైన ఒకే గైడ్ క్రింద పనిచేయటానికి అవకాశం ఇచ్చారు. వాళ్ళ ప్రతిభను మెచ్చుకున్న యూనివర్సిటీ వైస్‌ఛాన్సలరూ, వీరి శ్రేయోభిలాషి అయిన డా॥ జాన్ ఓహరా ఆయన కూడా వెటర్నరీ సర్జరీ మొదటచేసి, తర్వాత డెంటల్, మెడికల్ డిగ్రీలు కూడా చదివి, పిహెచ్‌డి కూడా అక్కడే చేయటంతో, తన దగ్గరే ఈ అబ్బాయిలకు పిహెచ్‌డి., విజ్ఞాన పరిశోధనలు చేసేందుకు అవకాశం ఇచ్చాడు.

జీవితం అతి విచిత్రమైనది. మనం పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమో, పాపమో తెలీదుకానీ, వస్తే అవకాశాలన్నీ ఒకేసారి, ఒక్కళ్ళకే వస్తాయి. కొందరికి ప్రయత్నలోపం ఏమాత్రం లేకపోయినా 'విధి' మరోలా ఉంటుంది. అలాగే క్రమశిక్షణ, క్రమబద్ధంగా అన్ని పనులూ త్రికరణశుద్ధిగా చేస్తూ, ప్రయత్నలోపం ఏనాడూ లేకుండా కష్టపడి 'మెరిట్' మీదే అన్నీ పరీక్షలూ ఉత్తీర్ణులవటం, జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా, హాయిగా గడుస్తూ వర్ధించిన విస్తరయిన ఈ అన్నదమ్ములను చూస్తే వైస్‌ఛాన్సలర్, మరియు వీరికి డాక్టరేట్ చదువుకి గైడ్ అయిన డా॥ జాన్ ఓహారాకి చాలా ముచ్చట. దానికి మరో నిగూఢ కారణం కూడా ఉంది. అదేమిటంటే, అచ్చుగ్రుద్దినట్లు ఆయన

పోలికలతో ఉన్న ఆయన కూతుళ్ళు ఇద్దరూ అద్దంలో ప్రతిబింబాలులా ఉండటం. ఇద్దరూ ఈ అన్నదమ్ములకు మల్లే పదినిముషాల వ్యవధి మధ్య ఉండగా పుట్టారు.

ఓహారా భార్య డెంటల్‌సర్జన్. ఆమె ఇంట్లోనే ఉంటుంది వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని. ఇప్పుడు 23 ఏళ్ళ ఆ కవల ఆడపిల్లలిద్దరూ ఒకరు వెటర్నరీలో మరొకరు డెంటల్ సర్జరీలో ఉత్తీర్ణులై తన క్రిందనే పిహెచ్‌డి, స్కాలర్లయినప్పటికీ తండ్రికి ఎగ్జామినర్‌షిప్ మట్టుకు ఇవ్వరు యూనివర్సిటీవారు, వాళ్లు ఆయన కూతుళ్లవటం మూలాన. వెనుక తన క్రింద పనిచేసే మరో గైడ్ డా॥ రాబర్ట్ డగ్లస్‌కి వాళ్ళ పిహెచ్‌డి బాధ్యత అప్పగించాడు. డా॥ డగ్లస్ ఆ విభాగం, అంటే, 'న్యూరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ అండ్ స్టెమ్ సెల్ రిసెర్చి' అనే డిపార్టుమెంట్‌కి ప్రొఫెసర్ అండ్ హెడ్. ఈ రెండు జతల కవలలు, అనగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఓహారా కూతుళ్లు డాక్టర్స్ జూడీ, ఎలైన్లూను, మన భారతదేశపు కవల అన్నదమ్ములు రామనాథ, విశ్వనాథ శర్మలు ఒకే డిపార్టుమెంటులో ఒక అంశం కావటం వలన ఒకే పరిశోధనాశాలలో పనిచేసేందుకు యూనివర్శిటీవారు అవకాశం ఇచ్చేట్లు ఏర్పాటు చేశారు.

న్యూరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే కొంత ఇక్కడ చెప్పవలసివున్నది. మన మెదడులో, మరియు వెన్నెముకలో ఉన్న 'స్పైనల్ కార్డ్ (వెన్నుపూస) లో మూడు రకాల కణాలు ఉన్నాయి. ఒక్కోకణం వేర్వేరు రూపాలలో మనకి మైక్రోస్కోప్‌లో గోచరిస్తాయి. ఒక్కో రూపం గల కణాలు గుమిగూడి ఉన్నా అవి వాటి వాటి రూపాన్ని బట్టి వాటికి సంబంధించిన పనులు పుట్టినప్పట్నుంచి మనిషి, మరియు ఇతర జంతువులూ, బయటి ప్రపంచంలో ఎదుర్కొనే వైపరీత్యాలను శక్తి సామర్థ్యాలు సమయాన్ని బట్టి అపాయంలో ఉపాయం, ప్రాణాపాయంలో ఏం చేయాలో నిర్ణయింపగలిగిన ఆలోచనలు, ఇలా అనేక విధాలుగా 'బ్రతికిబట్టగట్టేందుకు వీలుగా నరాల ద్వారా తోడ్పడుతాయి.

ఏదో ఒక కారణంవల్లో, జబ్బుచేసో, లేక పోరాటంలో జరిగే విపరీతమైన గాయాలు ఏర్పడి రక్తస్రావం జరిగినప్పుడో, వీలైనంతమేరకు మళ్లీ వెంటనే, దెబ్బతిన్న కణాలు చితికిపోగానే, మళ్ళీ రెండింతలుగా వాటి తయారీ, రక్తంలో మరో రకం కణం మన 'నెర్వెస్‌సిస్టమ్' లోపల కాపలాదారుల్లా తిరుగుతూ, దెబ్బలవల్ల రక్తస్రావంలో మన దేహాన్ని ఆక్రమించుకున్నా హాని కలిగించే 'చెడ్డ బాక్టీరియా'లు వైరస్‌లను హతమార్చడమో లేక వాటికి హానికలిగించే శక్తి లేకుండా చుట్టుముట్టి, చివరకు మూత్రవిసర్జనలో లేక చీము రూపంలో 'చెత్త' పారేసినట్లు విసర్జించటానికి తోడ్పడుతాయి.

శిశువు పుట్టగానే దాంతోపాటు (గర్భసంచి) వచ్చే 'ప్లాసెంటా'కి తల్లి గర్భసంచిలో పుట్టేదాక ఆమె రక్తనాళాల్లో వచ్చే జీవింపబడిన ఆహారం 'గ్లూకోస్' రూపంలో అందాక బిడ్డకు అందించే గొట్టం పేరే 'అంబెలికల్ కార్డ్'. అటువంటి 'అంబెలికల్ కార్డ్' లేక 'అంబెలికస్' ఊడివచ్చినప్పటికీ అందులో అంతవరకు తల్లినుంచి బిడ్డకు పారిన రక్తంలో ఉన్న 'స్టెమ్‌సెల్స్' అనేవి కూడా మూడు రకాలవ్వటమేకాక బిడ్డకీ ఎటువంటి జబ్బూ రాకుండా కాపాడతాయి. అంతేకాక ఈ 'కార్డ్‌బ్లడ్' (అంటే ఈ 'అంబెలికల్ కార్డ్'లో ఉండే తల్లి రక్తం) లో ఉన్న స్టెమ్‌సెల్స్‌కి అవి చెయ్యగలిగిన పనులపై ఆధారపడి వేర్వేరు పేర్లు ఇవ్వబడ్డాయి. అట్టివాటిల్లో అతిముఖ్యమైన పేరుగల కణం 'టోటీపొటెంట్' సెల్.

ఈ మధ్యనే, అంటే ఇరవయ్యో శతాబ్దం మొదట్లో విజ్ఞాన పరిశోధనల్లో మనకు తెలిసిందేమంటే, ఈ 'టోటీపోటెంట్' స్టెమ్‌సెల్స్ భద్రపరచి పెడితే, ఎవరిదగ్గరనుంచి అవి వచ్చాయో వారి సంతతి పెరిగిపెద్దయి, ఏదైనా ఒక కిడ్నీయో, లేక లివరో పాడయితే, ఈ 'టోటీపోటెంట్' కణాలను 'లేపి' మళ్ళీ అతనికి ఏ ఆర్గన్ కావాలో ఈ కణాలనుంచి లాబ్‌లోనే తయారుచేసి అతనిలో, ఆమెలో అమర్చి ప్రాణాలు కాపాడవచ్చును.

ఈ రకం పరిశోధనలు ఇప్పుడిప్పుడే అందెలు వేస్తూ ఇంకా వికసించలేదు. ఎలుకలమీద, కోతులమీద ఇంకా పాశ్చాత్యదేశాలు 'క్లినికల్ ట్రయల్స్' దశలో ఉన్నాయి. కొంచెం కొంచంగా మనుష్యులమీదా ప్రయోగాలు చేస్తున్నారు. పూర్తిగా ఒక గుండెనుగానీ, కిడ్నీనిగానీ ఈసెల్స్ ద్వారా తయారు చెయ్యగలిగితే, బొత్తిగా ప్రాణాపాయం స్థితిలో ఉన్న పేషంట్స్ స్టెమ్‌సెల్స్ ఒకవేళ వాళ్ళు పుట్టినప్పుడు అన్నిదేశాల్లో ఇప్పుడున్న 'స్టెమ్‌సెల్ బ్యాంకు' లలో దాచబడి ఉంటే, వారికి ప్రాణదానం చెయ్యొచ్చు' అని. ప్రథమ స్థితిలో ఉన్న పరిశోధనలు కనుక 'స్టెమ్‌సెల్స్' కున్న ప్రత్యేకత ఇది.

ఇకపోతే రెండోరకం పరిశోధనలు అతికష్టమైనదీ, అతి సున్నితమైనది. ఎందుకంటే ఒకసారి మెదడు పూర్తిగా దెబ్బతిన్నాక, మెదడు ఇక పనిచేయకపోగా, గుండెను కరెంట్‌షాక్‌తో మళ్ళీ స్పందింపచేసినట్లు బొత్తిగా మెదడుని చేయలేము.

ఎన్నో దేశాలు, ఎన్నో రకాలుగా ప్రయత్నలోపమనేది లేకుండా శ్రమించి, ప్రయోగాలు చేశారు, చేస్తూనే ఉన్నారు. శాస్త్ర పరిశోధనలే తమ మతంగా తలిచే శాస్త్రజ్ఞులు, మెదడుని మళ్ళీ స్పందింపజేయగలరేమోనని.

ఒక తలుపు తెరుచుకోకపోతే మరో తలుపు తెరుచుకోగలిగిన మార్గం ఎక్కడో అక్కడ ఉంటుందని బలంగా నమ్మేదే విజ్ఞానశాస్త్ర పరిశోధన. కనుక మెదడును

స్పందింపలేక పోయినప్పటికీ, ఓ వేళ మొత్తం మెదడునే ఇంకో తలనుంచి వేరుచేసి, ఇప్పటి కిడ్నీలకు మల్లే మార్చగలమా? లేక మెదడు బాగా దెబ్బతిని, ఇక బతకలేదని ఆ మనిషి బంధువులు అంగీకారం వ్రాసి ఇస్తే అతని/ఆమె తలను మార్పిడి చేయగలిగితే, పూర్తిగా అప్పుడే చనిపోయి, హార్టు ఇంకా కొట్టుకుంటుండగా ఈ మంచి మెదడును, చితికిపోయిన మరో మనిషి యొక్క బాగున్న మెదడు గల తలను వేరుచేసి 'తలమార్పిడి' చేయగల్గితే మనిషికి మళ్ళీ ప్రాణదానం ఇచ్చినట్లే కదా?

ఇలాంటి అంశాన్నే తమ పరిశోధనగా ఎన్నుకున్నారు అన్నదమ్ములయిన కవల డాక్టర్లు మరియు అక్కచెల్లెండ్రు డాక్టర్స్ జూడీ ఆమె చెల్లెలు డాక్టర్ ఎలైన్. ఒకే లాబ్‌లో ఒకే అంశంపై మొదట ఎలుకలమీద తలమార్పిడితో మొదలైన అంశం, నాలుగేళ్లు అహర్నిశలూ శ్రమపడుతూ కోతులపై 'తలమార్పిడి' ఆఖరిదశకు చేరుకున్నది.

ఈ నాల్గేళ్ళలో చలాకి పిల్లలైన జూడీ, ఎలైన్‌లూ, రామనాధశర్మ, అతని తమ్ముడు విశ్వనాధ శర్మ వయస్సు ఇచ్చే ఉత్సాహం, యవ్వనపు పొంగు, సహజంగా ఉండే ఆడ, మగ ఆకర్షణ శక్తితో వారు నలుగుర్నీ ఒకర్నివిడిచి ఒకరు ఉండలేనంత దగ్గర చేశాయి. దానికి, శని ఆదివారాల్లో తమకందరికీ విడివిడి కార్లున్నా రామనాధశర్మ కారు 'ఆస్టిన్ మినీమైనర్'లో పొందికగా నలుగురు కూర్చోగలిగే చిన్నకారు. అతి సుందర పచ్చటి కొండల మలుపులూ విపరీతమైన రంగురంగుల పువ్వులూ, పళ్ళ చెట్ల బారులూ స్వచ్ఛమైన సముద్రపు నీళ్ళూ, అన్ని ప్రదేశాలు అతిశుభ్రంగా ఉండే వారి చిన్నదేశం న్యూజీలాండ్ భూతలస్వర్గం లాంటిది. ఆక్‌లాండ్, వెలింగ్‌టన్, క్రైస్ట్‌చర్చి ఇలాంటి ప్రదేశాలకు చక్కటి రోడ్లలో ఒకర్నిమార్చి ఒకరు 'ఆస్టిన్' కారును వంతులవారీగా డ్రైవ్ చేసుకుంటూ, మధ్య మధ్య రహదార్లలో ఉన్న డౌన్‌టౌన్ 'వేసైడ్ ఇన్'లలో, లేక కొన్నిచోట్ల ఉన్న 'ఇండియన్' రెస్టారెంట్లలో ఆగుతూ తుళ్ళుతూ, చప్పట్లతో కేరింతలతో చక్కటి ఉద్యానవనాలు, మరియు అక్కడక్కడ తారసపడే మెలనీషియన్స్ స్నేహశీలత్వం గమనిస్తూ! విజ్ఞానశాస్త్రపు పుటలు అన్నీ విడమర్చిచెప్పే మ్యూజియమ్‌లను దర్శిస్తూ ఒకటేమిటి, తమ దేశాన్నంతా త్రిప్పి చూపించేశారా అన్నదమ్ములకి. 'చక్కటి జంట' అనుకుంటూనే ఆశ్చర్యంగా చూసేవారు వాళ్ళని. ఎక్కడైనా త్రోవలో అల్పాహారానికై కారు ఆపినప్పుడు రెండు జతల ఆడ, మొగ అచ్చు అద్దంలో ప్రతిబింబాల్లా ఉండేవారి వర్చస్సు ఎవరికైనా ఆశ్చర్యమే మరి వాళ్ళు కలసిమెలసి వెళ్తోంటే.

ఆ రోజు పెద్ద సదస్సు డ్యూన్‌డిన్ ఒటాగో యూనివర్సిటీలో. ఇకవాళ్ళ పరిశోధనలూ కాస్త మార్పులతో వేర్వేరు విజ్ఞాన పుటలపై, ఇంచుమించు ఒకే అంశంపై నాల్గు పిహెచ్‌డిలు, ఆరోజు సదస్సులోనే వాళ్ల 'పబ్లిక్‌వైవా'లు ముగిశాక ఇవ్వాలని పరీక్షాధికారుల సూచన వైస్ ఛాన్సలర్స్‌కి. అప్పటికే నల్గురూ కలసి మూడువందల రిసెర్చి పేపర్లు ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురితమవ్వటం వలన అతిక్లిష్టమైన ఆ పరిశోధనల సఫలీకృతమైన ఫలితాలు చూడాలని దేశవిదేశాలనుంచి శాస్త్రజ్ఞులు, పత్రికా విలేఖరులూ రావటమేకాక, రామనాధశర్మ విశ్వనాధశర్మలు ఇక ఆ దేశంలోనే ఉండదల్చుకున్నట్లు, (శాశ్వత వీసా పత్రాలు, అర్హతలు సంపాదించుకోవటం వలన) వృద్ధులైన తమ తల్లిదండ్రులను ఇక నర్సింగ్‌హోమ్ అమ్మేసి భారతదేశంనుంచి తమతో శాశ్వతంగా వచ్చి ఉండేటట్లు అర్థించారు. వాళ్ళు అలాగే చేసి, 'డిపెండెంట్ వీసా'లో భారతదేశం వదలి పిల్లల దగ్గరికి సదస్సు ఆరంభం అయ్యే ఓ రెండ్రోజులు ముందే పెట్టేబేడా సర్దుకుని వచ్చేశారు. సాదరంతో తమ కొడుకులతోపాటు ఏర్‌పోర్ట్‌లో వాళ్ళని రిసీవ్ చేసుకున్న అందాల కవల జవ్వనులు, బంగారు మేలిమితో జుట్టు ఎగతోసుకుంటూ, యవ్వనపు తారళ్యం ఉట్టిపడే అంగసౌష్ఠవంతో, తెలివైన చురుకైన పెద్దపెద్ద కళ్ళతో తమ కుమారులను అంటి పెట్టుకునీ, నవ్వుతూ తుళ్ళుతూ వస్తున్న అక్క చెల్లెండ్రు జూడీ, ఎలైన్‌లను దూరం నించి చూడగానే అర్థం చేసుకున్న ఆ దంపతులకు ఎక్కువసేపు పట్టలేదు వారే తమకు కాబోయే 'పాశ్చాత్య' కోడళ్ళని. అయినా, తమ కుమారులు తల్లిదండ్రులను గౌరవిస్తారు, వారి అంగీకారం లేనిదే గీచిన గీత దాటరు. కొడుకుల మనస్సులను గాయపరిచే విధంగా ఆ తల్లిదండ్రులూ ఎన్నడూవారికి అడ్డు చెప్పలేదు. వారిచ్చిన స్వేచ్ఛా, క్రమశిక్షణ వల్ల ఎన్నడూ మితిమీరలేదు. కుమారులే చెప్తారు ఎలాగూ ఈ విషయం అని ఊర్కున్నారు ఆ దంపతులు.

ఒటాగో యూనివర్సిటీ డ్యూన్‌డిన్‌లో ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఆడిటోరియం. చక్కటి సౌండ్‌ప్రూవ్ సిస్టమ్, ఏర్ కండిషనర్సు, ఆడియో వీడియో వైర్‌లెస్, కంప్యూటర్ పవర్ పాయింట్ అన్ని వసతులూ ఉన్న ఆ ఆడిటోరియంలో ఆ సోమవారం రామనాధశర్మ, విశ్వనాధశర్మ, జూడీ, ఎలైన్‌లకూ అతి ముఖ్యమైన ఘట్టం. అయితే, మరోవైపు పరస్పర పరిచయాలైన తర్వాత మొదటి వరుసలో ఆసీనులైన వారివారి తల్లిదండ్రుల మనస్సులో ఒకటే ఒక్క తీపి ఆలోచన. త్వరలో తమ సంతానాలు వారివారి జీవిత భాగస్వాములని ఎన్నుకోవటం వలన, తమ తమ కర్తవ్యాలకి వారు పూర్తిగా న్యాయం చేకూర్చటమేకాక అందరూ ఒకేచోట రిటైర్డ్ లైఫ్ ఆరంభింప పోతున్నామని భారంగా, సంతోషంగా నిట్టూర్చారు.

ఆ పరీక్షాధికారులు నలుగురూ, ఇద్దరు అమెరికానుంచి రాగా మరిద్దరు ప్రక్కనే ఉన్న ఆస్ట్రేలియానుంచి వచ్చారు. ఇద్దరు స్త్రీలు ఆస్ట్రేలియానించి వస్తే ఇద్దరు పురుషులు అమెరికానుంచి వచ్చారు. చీమచిటుక్కుమంటే వినబడే నిశ్శబ్దం అలముకుంది ఆ ఆడిటోరియంలో. 'నౌ, యూమే స్టార్ట్ డిఫెండింగ్ యువర్ థీసిస్, వన్ బై వన్. వీవిల్ బిగిన్ విత్ విమెన్ కాండిడేట్స్ జూడీ అండ్ ఎలైన్ టు స్టార్ట్ విత్. ప్లీజ్ కమ్ వన్ బై వన్!' అన్నాడు అమెరికన్ పరీక్షాధికారి ఒప్పుకున్నట్లు మిగతా ముగ్గురూ తల ఊపగా. అందరి కోట్లకీ చిన్నచిన్న వైర్‌లెస్ షర్టుగుండీ సైజ్‌లో ఉన్న మైకులు బిగించి ఉండటంవలన పదివేలమందికి పైగా ఉన్న ఆ ఆడిటోరియంలో స్పష్టంగా వినపడుతున్నాయి ఆయన అన్నమాటలు.

మొదట జూడీ తన అంశంలోని భాగం, ఎందుకు, ఇలా మొదలైందో మెదడు మార్పిడి, న్యూరల్ ట్రాన్స్‌ప్లాంట్స్ వల్ల కలిగే లాభనష్టాలు, మిగతావాళ్లు ఏ రకంగా ఈ రిసెర్చి తనకన్నాముందు చేశారో, చేస్తున్నారో, తను కనుగొన్న విషయాలు ఎలా మిగతావారు అందాక చేసిన పరిశోధనలు ఇంకా ముందుకు తెచ్చాయో! అన్నీ వివరంగా చెప్పి ముగించగానే, పరీక్షాధికారులు ఓ అరగంటసేపు వేసిన ప్రశ్నలన్నింటికీ తన శక్తి మేరకు జవాబులిచ్చింది. మధ్య మధ్యన స్లైడ్‌లన్నీ వరసవారీగా ప్రొజెక్ట్ చేయబడ్డాయి ఆమె వివరిస్తూండగానే.

ఆమె తర్వాత ఆమె చెల్లెలైన ఎలైన్ అక్క ఎక్కడ ఆపిందో అక్కడ్నుంచి రిసెర్చిని ఇంకా ఎలా ముందుకు తను తీసికెళ్ళిందో వివరించాక, అన్ని స్లైడ్‌లూ, అంటే ఆమె అక్క చూపినవికాక, తనవి కంప్యూటర్ లాప్‌టాప్‌నుంచి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు చేసి, వారు వేసిన ప్రశ్నలకు తను కూడా ఇంచుమించు అక్కలాగే జవాబులు చెప్పివారిని తృప్తిపరిచింది. ఆ తర్వాత అన్నదమ్ములలో మొదట తమ్ముడు ఎలుకలపై చేసిన తలమార్పిడి, కానీ ఎక్కువకాలం అవి క్రొత్తతలతో జీవించలేకపోవటం వలన ఇంకా పెద్ద పాలిచ్చే జంతువుల్లో కనుక్కోవలసినవి, చేయవలసిన ప్రయోగాలు ఏకరువు పెడ్తూ ముగించాడు. పరీక్షాధికారులు అతన్ని కూడా అనేక చిక్కు ప్రశ్నలు వేసి ఆడియన్స్ కూడా సందేహాలు అడిగిన తర్వాత తృప్తి చెందారు. ఆఖర్న అన్న రామనాథ శర్మ చేసిన రిసెర్చి పైన చెప్పిన అందరి పరిశోధనలకన్నా క్లిష్టమైనదీ, అందులో మనిషికి అతి దగ్గర సంతతికి చెందిన కోతులపైన చేసిన తలమార్పిడి ప్రయోగాలు. కోతి సంతతినుంచి వచ్చిన మనిషిపై ఈ ప్రయోగాలు ఒకవేళ సఫలీకృతమైన పక్షంలో మనిషికి మరోతల తగిలించి, మరి కొన్నాళ్ళు జీవింపగలిగేటట్లు చేయొచ్చు. కానీ మిగిలిపోయే ఒకే ఒక్క భయభ్రాంతుల్ని చేసే ఒక్క ప్రశ్నకి జవాబు దొరకాలంటే, ఇంకో వంద సంవత్సరాలు పరిశోధనలతో శ్రమించవలసినది చాలా ఉన్నది.

ఓ వేళ తలమార్పిడే సక్సెస్‌ఫుల్‌గా మనిషిలో చేసి బ్రతికించగలిగినా, ఉదాహరణకు, ఓ వడ్రంగి పని జీవితాంతం చేసిన మనిషి తలను తీసి, ఒక డాక్టరు దేహానికిగానీ, ఇంజనీర్ తలకిగానీ అతికించి అతన్ని బతికించగలిగితే, వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయి? ఎప్పట్లా వడ్రంగి బుద్ధిగల తన కర్ర సామాన్ల పనిముట్లతో అతను బరబరా ఆపరేషను చేసేస్తాడా, లేక ఇంజనీరు దేహానికి అతికిస్తే (తలను) వడ్రంగిలా చెక్కలతో సిమెంటు లేకుండా ఇళ్ళు కడతాడా! కొంత కలకలం చెలరేగి, మెత్తమెత్తగా నిశ్శబ్దంగా కొంతమంది ఆశీనులైన శాస్త్రజ్ఞులు ముసిముసిగా నవ్వుకోకపోలేదు.

మళ్ళీ అందుకున్నాడు రామనాథ శర్మ : 'అందుకే మేము కోతులపై అతిజాగ్రత్తగా ఒక ఐదువేల కోతులపై చేసిన తర్వాత కడసారిగా ఓ కోతి లేచి కూర్చోవటమేకాక పదిరోజుల్లో సహజంగా వాటిల్లో చెట్టు ఎక్కగలిగిన గుణం ఉండటం వల్ల మెడమీద కుట్లు వేసినచోట బాగా ఆరాక చెట్టు ఎక్కగలిగింది! ఇపుడు ఆ కోతి ఇంకా బ్రతికే ఉంది ఆర్నెల్ల తర్వాత కూడా!

'దీన్నుంచి నిరూపింపబడినదేమంటే మనిషి తలమార్పిడి కూడా సాధ్యమే! కానీ మనిషి తెలివితేటల్లో విపరీతంగా ఎదగడంవల్ల, విచక్షణాజ్ఞానం, పైన చెప్పిన ఉదాహరణలు మనిషికి అన్వయమవుతాయి. కనుక, మన విజ్ఞాన శాస్త్రజ్ఞులు మనిషి తలమార్పిడి విషయంలో ఏమాత్రం తొందరపడ్డా, మనకి మిగిలేది మోన్‌స్టర్స్, ఫ్రాంకెన్‌స్టీన్‌లు!' అనగానే హాలు దద్దరిల్లిపోయింది. అతను వరసగా చూపిన కోతికి చేసి అతికష్టమైన 'తలమార్పిడి' ఆపరేషన్లు, తన సహచరుల సహాయంతో చేసినవి చూశాక అందరూ మ్రాన్పడిపోయి, నిలబడి 'స్టాండింగ్ ఓకేషన్లు' ఇచ్చాక, పరీక్షాధికారులు వేసిన ప్రశ్నలన్నిటికి చక్కగా జవాబిచ్చాడు రామనాథ శర్మ.

ఓ అరగంట నిశ్శబ్దంగా పరీక్షాధికారులు వారు తెచ్చుకున్న కాగితాల్లో ఏమేమో రాసుకుని, ఒకరితో ఒకరు గుసగుసలాడుకున్నాక, వేదిక ఎక్కి ఒకరి తర్వాత ఒకరు చెప్పారు వివిధ రకాలుగా ఒకే అంశంపై. దాని సారాంశం 'రీసెర్చ్' అనే దెప్పుడు మనుష్యజాతికీనూ జంతుజాతికీను వాటి జబ్బులని పోగొట్టి, నయం చేయగలిగేట్టు చేయటం వలనే ఈ శతాబ్దంలో మనం అన్ని విషయాల్లో ఎంతో ముందుకొచ్చాము, రాబోతున్నాము. కనుక ఎప్పుడైతే రిసెర్చి తప్పుదుమార్గంపడి, ఓ వేళ చెడు విషయాలను ప్రోత్సహిస్తే, అటువంటివి అంతం చేయవలసిన బాధ్యత కూడా శాస్త్రజ్ఞులదే. ఇక ఆలస్యం చేయకుండా, మేము ప్రతిభావంతులైన ఈ నలుగురికీ డాక్టరేటు డిగ్రీలు 'న్యూరోసైన్స్'లో 'హైలీ కమెండెడ్!' అని రెకమెండ్ చేస్తూ యూనివర్సిటీ ఆఫ్ ఒటాగోవారిని పిహెచ్‌డీలు అవార్డ్ చెయ్యమని ప్రోత్సహిస్తున్నాము అని ఆ నలుగురూ

అన్నదమ్ములిద్దరికీ, అక్క చెల్లెండ్రిద్దరికీ విడివిడిగా కరచాలనం చేసి 'డాక్టర్స్ అవర్ హార్టీ కంగ్రాట్యులేషన్స్ ఫర్ దిస్ గ్రేట్ మోమెంట్ అండ్ అఛీవ్‌మెంట్' అనగానే మళ్ళీ అందరూ వినయంగా లేచి నిలబడి ఒక ఇరవై నిముషాలు విరామం లేకుండా హాలు దద్దరిల్లి పోయేట్లు చప్పట్లు కొట్టారు. మళ్ళీ నిశ్శబ్దం పేరుకోగానే వైస్‌ఛాన్సలర్ జోన్‌ఓహారా వేదిక మీదకొచ్చి, వారితో విడివిడిగా కరచాలనం చేశాక, రామనాథం విశ్వనాథంగారి తల్లిదండ్రులని వేదిక మీదకి రమ్మనట్లు సైగచేశాడు. 'ఎందుకనా?!' అని ఆశ్చర్యపోతూ మెల్లిగా వేదిక ఎక్కి నిలబడ్డారు డాక్టర్ డగ్లస్ ప్రక్కనే ఆ డాక్టర్ దంపతులు.

'హియర్ ఆర్ డాక్టర్స్ అని వాళ్ళ పేర్లతో రామనాథం, విశ్వనాథం శర్మల తల్లిదండ్రులుగా మొదట పరిచయం చేసి, అటుపిమ్మట "వీ ద పేరెంట్స్ ఆఫ్ అవర్ రెస్పెక్టివ్ ట్విన్స్' ఆఫ్‌స్ప్రింగ్స్ అనౌన్స్ ది వెడ్డింగ్ సెరిమోనీ టు బీ హెల్డ్ టుమారో ఇన్ ది యూనివర్సిటీ ఛాపెల్ ఎట్ షార్ప్ టెనో క్లాక్! ఆల్ ఆర్ రిక్వెస్టెడ్ టు అటెండ్!" అన్నాడు. అనగానే విస్మయంతో మళ్ళీ ఆడియన్సు చప్పట్లతో లేచి నిలబడి ఒక్కుమ్మడిగా 'కంగ్రాట్యులేషన్స్' అని పాత హాలివుడ్ సినిమాపాట ఓ ఐదు నిముషాలు పాడారు.

మర్నాడు, ఏర్పాటు చేసుకున్న ప్రకారం ఫుల్ సూట్స్‌లో ఇద్దరు అన్నదమ్ములూ వేర్వేరు కలర్లు కల అదే రకం హేట్లు ధరించి, 'బోటై' కట్టుకోగా దివినుంచి భువికి దిగి వచ్చిన రంభ, ఊర్వసులకు మల్లే తెల్లటి లోనెక్ గౌన్లతో జూడి ఎలైన్ వచ్చారు. వాళ్ళ వెనకనే వస్తున్న డా॥ ఓహారా దంపతులూ, ఆ ఛాపెల్ బిషప్ మరియు ఆహ్వానింపబడిన అందరూ వచ్చి ఛాపెల్‌లో వరసగా పేర్చిన బెంచీల్లో కూర్చున్నారు. సదస్సులో ఆహ్వానింపబడిన శాస్త్రజ్ఞులందరూ సరిపడే ఆ ఛాపెల్ హాల్లో ఆసీనులయ్యారు. మొదట వారి క్రిష్టియన్ సాంప్రదాయం ప్రకారం రింగులు మార్చుకుని, నవదంపతులు ముద్దులిచ్చుకున్నారు. వాళ్ళ బిషప్ బైబిలు చదివి వాళ్ళను దంపతులు చేశాక, దగ్గరలోనే ఉన్న చిన్న హిందువులగుడిలో ఎప్పట్నుంచో ఆ గుడిలో పనిచేస్తున్న కృష్ణశాస్త్రులు మన భగవద్గీత అన్నీ తయారుగా ఉంచుకుని, హిందువుల శాస్త్రం ప్రకారం మళ్ళీ యథావిధిగా నవవధూవరులు, పురోహితుడు శ్రీకృష్ణశాస్త్రిగారు అక్కడ ఆజ్యం పోస్తూ మంత్రాలు వల్లె వేస్తుండగా, దండలు మార్చుకుని, నిప్పుచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేశారు. ఈ తతంగం ముగియకముందే, వరులిద్దరూ పంచె చాపులు ధరించగా వధువులూ పసుపు చీరలు ధరించారు.

పెళ్ళికిముందే అక్కా చెల్లెండ్రు ఇద్దరూ కలిసికట్టుగా ఒక నిర్ణయాన్ని తీసుకుని వారి తల్లిదండ్రులకి స్పష్టంగా చెప్పారు. అది ఏమిటంటే, వారి సాంప్రదాయాల ప్రకారం మొదట క్రిస్టియన్‌ల పెండ్లి జరిగినా, తామిద్దరూ హిందూ మతస్తులు కాదలుచుకున్నారనీ, వారిపై ఇందుకై ఎటువంటి ప్రోద్భలం లేదని వారికి అర్జీ పెట్టుకుని రాసి సంతకం పెట్టి ఇచ్చారు. డా॥ఓహారా అతని భార్య ఎటువంటి అభ్యంతరం చెప్పకపోగా, వాళ్ళని హర్షించారు.

హనీమూన్‌కని ఓ నెలరోజులకై 'స్విట్జర్‌లాండ్' కి బయలుదేరిన డా॥ రామనాధం, అతని తమ్ముడు డా॥ విశ్వనాధశర్మలు తమ తమ సహధర్మచారిణులకు ఒకరివెనకే ఒకరికి సీట్లిచ్చారు. 'స్విస్ ఎయిర్' వాళ్ళ ఫస్ట్‌క్లాస్‌లో. విశాలంగా సోఫాల్లా ఉండే ఆ సీట్లలో దంపతులు పడుకునేంత చోటుండటంతో హాయిగా పవళించారు. జూరిక్‌కి విమానం చేరేదాక ఆ నవదంపతుల ప్రణయ తరంగాలను చూడలేక విమానం సిగ్గుపడుతూ లాండ్ అయింది జూరిక్‌లో.

❀ ❀ ❀

# రూపం దాల్చిన కలలు

డాక్టర్ సుందరమూర్తి బ్రహ్మచారి. సుప్రసిద్ధమైన న్యూరో సైంటిష్టు. ప్రస్తుతం దర్బన్‌లో జరిగే మరునాటి సదస్సుకి తన హిల్‌మన్ ఎస్టేట్‌వాగన్‌లో గంటకు నూట యాభై మైళ్ళ వేగంతో జోహాన్సబర్గ్ నుంచి రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరిన సుందరమూర్తి విశాలమైన రహదారిలో తాచుపాములా హెడ్‌లైట్ల కాంతిలో గీత గీచినట్లుగా ఉన్న అతి మెత్తటి దక్షిణ ఆఫ్రికాలోని హైవేలో వెళ్తున్న అతనికి, ఒక్కసారిగా ప్రక్కన లేన్ నుంచి ఏమైందో ఏమో గానీ ఒక అతి పెద్ద కార్గోలారీ (సామాన్లు చేరవేసే ట్రక్కు) పల్టీలు కొడుతూ, కన్నుమూసి తెరిచేలోగా సుందరమూర్తి కారుని ఢీ కొనగానే, హిల్‌మన్ ఆరు పల్టీలు కొడుతూ ప్రక్కనే ఉన్న చిన్న లోయలో పడగానే, అతను కూర్చున్న వైపు ఉన్న తలుపు ఆ ఢీకొన్న ఉధృతానికి తెరచుకొని, సుందరమూర్తి లోయలో ఒక చెట్టు కొమ్మకి ఆయన కోటు ఇరుక్కుని వేలాడేలోపున మరో కొమ్మ బలంగా ఆయన తల వెనక వైపుగా గుచ్చుకుని కాస్త రక్తం కారసాగింది. విచిత్రంగా అతని స్పృహపోలేదు కానీ కటిక చీకటిలో రాత్రి పన్నెండు గంటలకి ఆ లోయలో దట్టమైన చెట్ల మధ్య ఒక కొమ్మకి వేలాడసాగాడు. అంతటి విపరీతం జరిగినా మస్తిష్కం చకాచకా పనిచేయసాగింది. ఏం చెయ్యాలిప్పుడు? మర్నాడు తొమ్మిదింటికల్లా సదస్సుకి గంట ముందుగానే హాజరవ్వాలి. తన కారు లోయలో ఎక్కడో పడిపోయింది కనుక దాన్ని బయటికి తీసే ప్రశ్న లేనే లేదు.

ఇలా ఆలోచిస్తూండగానే ఒక విచిత్రమైన సంఘటన అంతటి వైజ్ఞానికుడైన సుందరమూర్తినే ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. అదేమిటంటే, ఇంకేదన్నా కారు పైన ఉన్న రహదారిలో నాకు దొరకగలిగితే, నేను ఈ ఊబి నుంచి బయటపడగలిగితే, సదస్సుకి చేరగలనేమో? అని అనుకోగానే మరుక్షణం అతను రహదారి మీద నిలబడి ఉండటమే కాక, ఒక సరిక్రొత్త టొయోటా ఎస్టేట్ వాగన్ అతని కోసమే అన్నట్లు నిలిచి ఉన్నది. ఎవరైనా అందులో ఉంటే తనను దర్బన్ దాకా చేర్చగలిగితే తను ఋణపడి ఉండగలను అని అనుకోగానే, కారు డ్రైవర్ సీటువైపు తలుపు తానుగా మెల్లమెల్లగా తెరుచుకుంది!

ఆశ్చర్యాన్నుంచి తేరుకుని సుందరమూర్తి లోపలికి చూస్తే ఎవ్వరూ లేరు!

ఏమైతే అయ్యిందని, డ్రైవింగ్ సీట్‌లో కూర్చుని ముట్టుకోగానే స్టార్ట్ అవ్వటం మూలాన అది సరికొత్త కారని తేలింది. అక్కడికెళ్ళగానే కారెవరిదో పోలీస్ వారికి

అప్పచెపితే కనుక్కోగలరనుకుంటూ వేగంగా దర్బన్ వైపు దూసుకుపోయాడు సుందరమూర్తి.

❖ ❖ ❖

దర్బన్ చేరేసరికి రాత్రి ఒంటిగంటైంది. ముందుగా ఏర్పాటైన తన గెస్ట్‌హౌస్ బసలో తన గది నెంబర్‌ని అక్కడ రిసెప్షన్‌లో ఉన్న ఒక ఇరవై ఏళ్ళ ఆఫ్రికన్ యువకుడు కంప్యూటర్‌లో తన పేరు, చిరునామా ఓసారి మళ్ళీ చెక్ చేసుకున్నాడు, సుందరమూర్తి ఆన్‌లైన్ బుక్ చేసుకోవటం మూలాన. అతను వెంటనే తన సూట్‌కేసు, ఏర్‌బ్యాగూ అందుకుని మొదటి అంతస్తులోనే ఉన్న తన గది తలుపు అట్ట తాళం చెవి (కన్నాలున్నది) దూర్చగ్గానే తలుపు తెరుచుకుంది. వెంటనే తన సూట్‌కేసూ, ఏర్‌బ్యాగ్ పెట్టి, 'ఇఫ్ [illegible] ఎనీ థింగ్ ఎల్స్ సర్, ప్లీజ్ రింగ్ ది బెల్!' అని మంచం ప్రక్కనే ఉన్న కాలింగ్‌బెల్ బటన్ చూపించి తలుపు వేసుకుని వెళ్ళిపోయాడు.

డా॥ సుందరమూర్తి అలసటతో, వేణ్ణీళ్ళ స్నానం అయ్యాక హేర్ డ్రయర్‌తో వేడిగాలితో తలబాగా ఎండాక తనతో తెచ్చుకున్న ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో నుంచి చకచకా టించర్ ఐడిన్‌ని ఓ దూది పింజకు అద్ది, దెబ్బ తగిలిన చోట, తల వెనుక భాగంలో అద్దగానే, విపరీతంగా మండినా అటు పిమ్మట హాయిగా ఉంటుందని తెలిసి ఓర్చుకున్నాడు. ఒక టెటెనస్ టాక్సాయిడ్ గాజు వయల్ తెగ్గొట్టి, రెండు మిల్లీ సిరింజిలో ఎక్కించి, భుజం మీద ఉండే డెల్టాయిడ్ కండరంలోకి చప్పున ఇంకో చేత్తో సూది గుచ్చి తనకు తనే ఇంజెక్షన్ ఇచ్చుకున్నాడు. టెటెనస్ ఇంజక్షన్ ఇలా కొన్ని గంటలలోపున ఇచ్చుకోకపోతే 'కోతిపుండు బ్రహ్మరాక్షసి'లా అయి, ఇంకా విషమ పరిస్థితులు ఎక్కువై హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యే ప్రమాదమున్నది. తను వచ్చింది సదస్సు కోసం, ముందాపని అయ్యేలోపున ఈ వైపరీత్యం జరిగింది. దైవాధీనం, తన అదృష్టం రెండూ కలిసి, తను బ్రతికి బయటపడటమే కాక, ఆట్టే దెబ్బలు తగలకపోగా, తన మెదడులో ఏదో ఒక అద్భుతమైన మార్పు వచ్చి, ఏదైనా మనస్సులో కోరీకోరక ముందే అంతలో కళ్ళెదుట రూపుదాల్చుకున్నాయి. రేపటి సదస్సులో తక్కిన వైజ్ఞానికులకు కూడా ఈ విపరీత అతీత పరిస్థితులని వివరించి చెప్పాల్సిన బాధ్యత తనపై ఎంతైనా ఉంది' అనుకుంటుండగానే అలిసి, డస్సి ఉన్న అతని మేను ఇట్టే, నిద్రాదేవి ఒడిలోకి జారుకుంది.

❖ ❖ ❖

వెచ్చటి సూర్యకిరణాలు కిటికీకున్న పల్చటి తెరలోనుంచి దూసుకుని బాణాల్లా వెల్లకిలా పడుకుని ఉన్న సుందరమూర్తిని నిద్ర లేపాయి. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని తన చేతి గడియారంలో టైము చూసుకున్నాడు. ఏడున్నరయింది. అమ్మయ్యా!

ఫర్వాలేదు. పదింటిలోపున వెళ్ళాలి, డర్బన్ మెడికల్ స్కూల్ ఆవరణలో ఉన్న అతిపెద్ద కాన్ఫరెన్స్ హాల్‌లోనే పదిగంటలకు సదస్సు. కారులో వెళ్ళితే రెండు నిముషాలు. గెస్ట్‌హౌస్ మెడికల్‌స్కూల్ వారి ప్రాంగణంలోనే ఆడిటోరియం ఐదు నిముషాలు నడిచేంత దూరంలో ఉన్నది. చకచకా లేచి బాత్‌రూంలో దూరి మొహం కడుక్కుని, టబ్‌లో వేణ్ణీళ్ళతో తృప్తిగా స్నానాదులు ముగించుకుని వచ్చేసరికి నిన్న రాత్రి వచ్చిన ఆఫ్రికన్ యువకుడు వినయంగా చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు తలుపు దగ్గరగా. అంటే అతను డూప్లికేట్ అట్ట తాళం చెవితో తలుపులు తెరుచుకుని, సరిగ్గా ఎనిమిది గంటలకు తనకు కావల్సిన అల్పాహారం ఏమిటని అడగటానికి సిద్ధంగా ఉన్నాడు. 'తెలివైన కుర్రాడే!' అని మనస్సులోనే నవ్వుకుని 'ఐ నీడ్ ఓన్లీ సౌత్ ఇండియన్ బ్రేక్ ఫాస్ట్ విత్ బ్లాక్ టీ!' అనగానే, వంగి నమస్కరిస్తూ సరే నన్నట్లు తల ఆడించి వెళ్ళిపోయాడు ఆ యువకుడు. సరిగ్గా తను తయారయ్యేసరికి, ఒక ప్లేటులో వేడివేడి రెండు ఇడ్లీలు, ఒక వడ, ఉప్మా, అద్దుకోడానికి కొబ్బరి పచ్చడి, సాంబారు, తను కోరినట్లు బ్లాక్‌టీ ట్రేలో తెచ్చి వెళ్ళిపోయాడు. భారతీయులు ప్రతి మారుమూలల్లో అన్ని దేశాల్లో ఇప్పుడు విరివిగా ఉండటం మూలాన, చాలామంది ఉడిపి బ్రాహ్మళ్ళు, కేరళ నాయర్లు, ఏనాడో మూలమూలల్లో ఇండియన్స్‌కి కావల్సిన రీతిలో వంటకాలు తదితర వస్తువులూ అన్నీ దొరికేటట్లు చిన్న చిన్న 'డెలీ'లు (కాంటిన్లు) మొదట పెట్టి ఎన్నో ఏళ్ళయి, ఇప్పుడు బాగా వృద్ధి చెంది, వారి వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలైనాయి. అలాగే డర్బన్ మెడికల్ స్కూల్‌లో మాధవన్ నాయర్ అనే కేరళ వ్యాపారి ఓ ముప్ఫయ్యేళ్ళ క్రితమే, వారి కాంపస్‌లో ఒక చిన్న టీ షాపులా తెరచి బాగా వృద్ధి చెందటమే కాక, అతని నిజాయితీ పనితనానికి మెచ్చి బాగా విశాలంగా ఉన్న ఒక విడి బ్లాక్ మెడికల్‌స్కూల్ వారు కట్టిచ్చి, బాడుగకిచ్చారు. మరి ఇతర కారణాలు కూడా లేకపోలేదు. నాయర్ అదృష్టమే అనండీ, లేక విరివిగా వందల లెఖ్ఖలో వచ్చిపోయే భారతీయుల సంఖ్య నానాటికీ పెరిగిపోవటంతో మెడికల్ స్కూల్ వారికి కూడా ఈ కాంటీన్ మూలంగా వచ్చే లాభంలో ఆదాయం కొంత భాగం వాళ్ళకి ప్రతినెల కట్టాల్సిన ఒప్పందం ముందే రాసి తీసుకోవటం మూలాన, మంచి బాడుగ కూడా వస్తూండటం లాభసాటిగానే ఉన్నది. స్టాఫ్ క్వార్టర్స్‌లోనే నాయర్, అతని భార్య విజయ, కూతురు కుంజిమణికి ఉంటారు. కూతురు మంచి మార్కులతో సీనియర్ కేంబ్రిడ్జిలో ఉత్తీర్ణురాలవటం వలన వెంటనే అక్కడే మెడికల్ సీటు మెరిట్‌లో వచ్చింది. ఇప్పుడా పిల్ల కుంజిమణి ఆఖరి సంవత్సరంలో ఉన్నది. ఎంతో కష్టపడి, ఒక మామూలు బీడీల కొట్టుతో కేరళలో కొట్టాయంలో ఏనాడో పదహారేళ్ళ పిల్లాడుగా నెలసరి నూరు రూపాయల జీతంతో ప్రారంభించిన మాధవన్ నాయర్‌కి ఇది పెద్ద మలుపే మరి. కొచ్చిన్ నుంచి ఆఫ్రికా వెళ్ళే స్టీమర్‌లో నేలలు తుడిచే పనివాడుగా పదేళ్ళు పనిచేసిన నాయర్ పనితనం మెచ్చి తరచూ వ్యాపార రీత్యా వెళ్ళే ప్రయాణికుడు మరో కేరళ

వ్యాపారస్తుడు ఒకాయన, డర్బన్ మెడికల్ స్కూల్ వారికి కావలసిన సరకులు స్టీమర్‌లో తరచూ సరఫరా చేస్తూండటం మూలాన, నాయర్‌ని అక్కడ మరో చిన్నవ్యాపారి వృద్ధుడైన మీనన్ అనే ఆయన తన చిన్న హొటల్‌లో సహాయానికి ఎవర్నయిన కేరళ కుర్రాణ్ణి చూడగమని లోగడ చెప్పి ఉండటం వలన, నాయర్‌ని అతని దగ్గర పనికి కుదిర్చాడు. మరో ఏడేళ్ళు కష్టపడి పనిచేసిన నాయర్ పనితనం, నిజాయితీ చూసిన మీనన్, నాయర్‌కి తన ఒక్కగానొక్క కూతుర్నిచ్చి పెళ్ళి చేయటమేకాక, బాగా వృద్ధి చెందిన తన హొటల్‌ని అల్లుడికిచ్చి తను విశ్రాంతికై తప్పుకున్నాడు. ఇదంతా ఎందుకు చెప్పాల్సొచ్చిందో, పరిణామాలు ఎలా దారితీశాయో ముందు ముందు తెలుస్తాయి.

❖ ❖ ❖

సరిగ్గా తొమ్మిదిగంటలు. సదస్సు టంచనుగా పదింటికి ఆరంభమవుతుంది గానీ ముందుగా రిసెప్షన్‌లో 9 గం॥కు హాజరవ్వాలి. అప్పుడు అక్కడ ఉన్న రిసెప్షనిష్టు ప్రతివారు రిజిస్టరు చేసుకున్న ప్రకారం, కంప్యూటర్‌లో చూసి, నిముషాల మీద ప్రింటర్‌లో వారి పేరు, చిరునామా, రిజిస్ట్రేషన్ నెంబరూ ప్రింట్ చేసి, ఒక ఐడెంటిటీ కార్డు వెలుపలికి ఇస్తుంది. అది జబ్బకి తగిలించుకున్నాక గానీ సదస్సు జరిగే ఆడిటోరియంలోకి వదలరు. దీనివల్ల సెక్యూరిటీ ఉండటమే కాక, సదస్సులో పాల్గొనని వారు అనవసరంగా లోపలికి దూరే అవకాశాలు చాలా తక్కువ. విలేఖరులకి విడిగా గాలరీలో వెళ్ళేందుకు ఇంకో ద్వారం ఉన్నది.

డా॥ సుందరమూర్తి ఈ తంతు ముగియగానే నేరుగా రెండో వరసలో తన పేరు అతికించి ఉన్న సీట్ (కుర్చీలో)లో నిశ్చలంగా కూర్చున్నాడు. తెలిసిన మొహాలు నిశ్శబ్దంగా చిరునవ్వుతో చేయి ఊపారు అక్కడా, ఇక్కడా డా॥ సుందరమూర్తి ఉనికి గమనించగానే. బదులుగా తనూ మెల్లగా వారికి చేయి గుర్తించినట్లు సూచనగా ఊపాడు డా॥ మూర్తి.

❖ ❖ ❖

వివిధ దేశాల్నుంచి వచ్చిన వైజ్ఞానికులతో, పత్రికా విలేఖరులతో టెలివిజన్ వారి విభాగంలో వారి సిబ్బందులతో ఆ విశాలమైన ఆడిటోరియం చక్కటి సౌండ్ ప్రూఫింగ్, ఏర్‌కండిషనర్స్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కై ఉంచిన సరంజామా, పెద్ద తెల్లటి స్క్రీను. అన్నీ ఉన్నా భరించలేనంత నిశ్శబ్దం అలుముకున్నది. ఆ విజ్ఞాన సెషన్ను రెండు భాగాలుగా విభజించారు. ప్రొద్దుట ఒంటిగంట దాక ప్రీలంచ్ సెషన్ అనీ, మళ్ళీ మధ్యాహ్నం 2 గం॥ నుంచి 6 గం॥ దాకా 'పోస్ట్‌లంచ్ సెషన్' అని పేర్కొన్నారు డా॥ సుందరమూర్తికి. ప్రొద్దున్న సెషన్‌లో లంచికి ముందు ఒక్కొక్కరికీ

45 నిముషాల గడువిచ్చారు. అలా సదస్సు మొత్తం ఆరు రోజులు జరుగుతుంది. గెస్ట్‌హౌస్‌లో కనీసం పదివేల మందికి సరిపడే గదులూ, అన్ని వసతులూ ఉన్నాయి. డా॥ సుందరమూర్తి వేదిక ఎక్కి తన పేపర్లు చదివే సమయం సమీపించగానే, అతని పేరు అక్కడ వేదికపై ఉన్న అధ్యక్షుడు పిలవగానే వెళ్ళి గొంతు సర్దుకుని తను మెదడు పై అంతదాక చేసిన పరిశోధనల ఫలితాలు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్స్‌తో నలభై అయిదు నిముషాల టైము ఇచ్చినా అర్ధగంటలోనే ముగించి, మరో పదిహేను నిముషాలు తనకు మెదడులో ఆక్సిడెంట్ వలన జరిగిన వైపరీత్యం గురించి చెప్పగానే ఒకుమ్మడిగా గుసగుసలు ఆరంభమయ్యి, మళ్ళీ చీమచిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం అలుముకుంది. మళ్ళీ ఇంకా ఏం చెప్తాడో అనే కుతూహలం. అక్కడున్న వారంతా అంతర్జాతీయ ఖ్యాతిగల నోబెల్ లారియేట్స్ మరియు వారివారి ఫీల్డ్స్‌లో అమోఘమైన విజయాలు సాధించిన వైజ్ఞానికులు. ఆడ, మగా ఇలా లింగభేదాలు, మత భేదాలు లేనిది విజ్ఞానం. మళ్ళీ అందుకున్నాడు డా॥ సుందరమూర్తి. "కొన్ని సంఘటనలలో మెదడుకు దెబ్బ తగిలి బ్రతికినా, ఉన్నట్లుండి ఎన్నడూ తెలియని వేరే దేశపు భాషలు మాట్లాడగలగటం లెక్కలలో ఉన్నట్లుండి ప్రావీణ్యత, సంగీతం రానివాడికి సంగీతం పొందగలగటం సహజంగా జరుగుతాయి.

పాలిచ్చే జంతువులను 'మామల్స్' అంటారని మనకి విదితమే. ఇవన్నీ వాటికి ఉన్న వెన్నెముక, లోపల ఉన్న మెదడు వాటిపై పకడ్బందిగా చుట్టూచేరి ఉండే వెన్నుపూసలు, కపాలం మెత్తగా ఉండే మెదడుని, వెన్నుపూసని కోటగోడలకు మల్లే కాపాడతాయి. మూడురకాల కణాలు కల్గిన మన మెదడు, వెన్నుపూస మిగతా పాలిచ్చే జంతువులు, వెన్నెముకలు కల బల్లుల సంతతి తక్కువ స్థితిలో ఉన్నా, మనిషికి మట్టుకు ఆలోచించే శక్తి కలిగి ఉండటం వలన మనిషి మెదడులో కణాలకు విపరీతమైన పనులు ఉండటమేకాక, ఒకదానితో ఒకటి (Neurons) సంభాషించే విధంగా 'వైరింగ్' లేక రహదారుల మల్లే ఒక కణం నుంచి మరో కణానికి ఒక సెకనులో లక్షల వంతుకి ఎలక్ట్రిసిటీతో హార్మోనులతో సమాచారం అందించగల వేగం కలిగి ఉన్నవి. కనుకనే ఈ కణాలన్నీ ఒకదానితో ఒకటి సమాచారాల్ని అందజేసుకుంటూ, పరిసరాల పరిస్థితులని అప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ ఐకమత్యంతో పని చేయటం వలన, మనిషి మిగతా జంతువులకన్నా బాగా ఉన్నతస్థితిలో బ్రతికి బట్ట కట్టడానికి దారితీశాయి. ఇలా ఉన్న కణాలకి ఏమాత్రం జబ్బు చేసినా, లేక ఉన్నట్లుండి దెబ్బ తగిలినా, రక్త సరఫరా తగ్గినా, విపరీతమైన పరిణామాలకి దారితీస్తాయి. రక్తస్రావం విపరీతంగా మెదడుకి తగ్గిపోతే పక్షవాతం లేదా మరణం తప్పదు. అదే గట్టి దెబ్బ తగలటం వలన ఈ కణాలకు స్థానభ్రంశం మెదడులోనే కల్గటం వలన పైన ఉదాహరపరచినట్టు పర్సనాలిటీ డిసార్డర్స్ (Personality Disorder) 'స్పిట్ పర్సనాలిటీ' లాంటివి కలగవచ్చును.

వీటిలో ఒకరకం 'సైకోసోమాటిక్ (Personality Disorder) ఇల్‌నెసిస్ 'సైకోసిస్' (Psychosis) ఇలా వివిధ రకాలుగా ఆ రోగ పరిస్థితులను బట్టి డాక్టర్లు పరిగణించారు.

ఇప్పుడు నాకు జరిగిన ఆక్సిడెంట్ విచిత్రమైన పరిస్థితులకు దారితీసింది. అదేమిటంటే కణాలు స్థాన భ్రంశం కావటమే కాక మనిషికి తెలియని కొన్ని అతీత శక్తులని ప్రసాదించాయి. కనుక నేను ఏదైనా గాఢంగా కావాలని కోరుకుంటే అది నా ఎదురు గుండా తక్షణం రూపుదాల్చుకుంటుంది. ఈ వైపరీత్యం, భౌతిక, రసాయనిక జీవశాస్త్రాల చట్టాలన్నింటినీ పటా పంచలం చేసి సంచలనం కలిగిస్తున్నాయి." అని ఒక నిముషం ఆగి, "సభాసదులు అంగీకరిస్తే, సదస్సు అధ్యక్షులు నాకు అనుమతినిస్తే, నాకు జరిగిన ఈ వైపరీత్యాన్ని ఇప్పటికిప్పుడే ఇక్కడ ఓసారి నిరూపించడానికి అనుమతి కోరుతున్నాను" అని అధ్యక్షుని వేపు చూశాడు. 'గో ఎ హెడ్! వి ఆర్ ఆల్ వెరీ క్యూరియస్‌టు విట్‌నెస్ దిస్ పారానార్మల్ ఫెనామెనా యు ఆర్ టాకింగ్ అబౌట్!' అనగానే డా॥ సుందరమూర్తి కళ్ళు మూసుకుని ఒక్క క్షణం దైవ ప్రార్థన చేసి "నా ఎదురు గుండా ఇప్పటికిప్పుడే వెలకట్టలేనంత ఖరీదుగల రత్నాలు పొదిగిన ఈ లోకంలో ఎక్కడా దొరకని మేలిమి బంగారపు పూలసజ్జె ఉంటే ఎంత బాగుణ్ణు!" అనుకోగానే కళ్ళు మిరుమిట్లుగొలిపే కాంతితో ఒక మెరిసిపోయే బంగారపు పూలసజ్జ అధ్యక్షుడి బల్లపై రూపుదాల్చుకుంది! ఈ హఠాత్పరిణామానికి అంతటి వైజ్ఞానికుడైన డా॥ మండేలా ఒక్కసారి అదిరిపడి, నుదిటిమీద పట్టిన చెమటను అతికష్టంతో రుమాలుతో తుడుచుకుని, అవాక్కయి చేష్టలుడిగిపోయి ఆ ధగధగ మెరిసే వజ్రాలు పొదిగిన బంగారపు గిన్నెవైపు నోరు తెరుచుకుని చూస్తుండిపోయాడు. ఇదేమైనా ఇంద్రజాలమా? మాయనా? కెమెరాలు తళుకుమన్నాయి. చప్పట్లు దద్దరిల్లిపోయాయి. ప్రశ్నావళి ముగించాక, ఆనాటి సదస్సు ముగించారు.

❖ ❖ ❖

గెస్ట్‌హౌస్‌కి వెళ్ళిపోయాడు డా॥ సుందరమూర్తి. మర్నాడు టి.వి.లో దినపత్రికలలో లోకమంతా ఈ విషయం మారుమ్రోగిపోయి పై హెడ్‌లైన్స్ వచ్చాయి. కొన్ని విమర్శాత్మక దినపత్రికలు విజ్ఞానమా లేక ఇంద్రజాలమా? అని వెక్కిరిస్తూ సంపాదకీయాలు రాసినవి కూడా మెండుగాలేకపోలేదు!

❖ ❖ ❖

ఇవన్నీ ఇలా జరుగుతూండగా, మరో విచిత్రం జరిగింది. ఎప్పుడూ, ఎక్కడా అస్సలు డా॥ సుందరమూర్తిని చూడను కూడా చూడని మాధవన్ నాయర్ కూతురు కుంజిమణి ఆఖరి సంవత్సరం ఎమ్‌బిబియస్ చదువుతున్న కుమార్తెకి కలలో స్పష్టంగా తాను డా॥ సుందరమూర్తి మెదడును ఆపరేషన్ చేస్తున్నట్లు కల! అంతేకాదు. ఆ

కలలో సుందరమూర్తి అన్ని వివరాలు, ఆయన ఉన్న గెస్ట్‌హౌస్, పాల్గొంటున్న సదస్సు వివరాలు అన్నీ స్పష్టంగా కనుపించాయి సుందరమూర్తి వర్చస్సుతో సహా. అదే సమయంలో డా॥ సుందరమూర్తి కెందుకో అనిపించింది. తన మెదడు ఆపరేషన్ చేయించుకుని మళ్ళీ యథాస్థితికి రావాలని. కనుక సదస్సులో తారసపడిన తన మిత్రుడు చాలా పేరు మోసిన న్యూరోసర్జన్ డా॥ డానీ ఎల్డన్, ఎఫ్.ఆర్.సి.యస్., పి.హెచ్.డిని అర్థించాడు. విషయం తెలిసినవాడైనందు వలన, అపారమైన ప్రతిభగలవాడైన డా॥ డానీ వెంటనే ఒప్పుకోవటమే కాక, అన్ని ఏర్పాట్లు మెదడుకి కావల్సిన అత్యాధునికమైన ఆపరేషన్ థియేటర్‌లో అక్కడే మెడికల్ స్కూల్‌కి ఆనుకుని ఉన్న విక్టోరియా మెమోరియల్ హాస్పిటల్‌లో సదస్సు ముగియగానే చేసేటట్లు సుందరమూర్తితో చెప్పాడు. అంతేకాక మరో విషయం కూడా సుందరమూర్తికి చెప్పాడు. ఓ ఇండియన్ ఆఫ్రికన్ మెడికల్ స్టూడెంట్ తనకు సహాయపడాలని కోరుకుంటోందనీను. మొదట కొంత విస్మయం చెందినా, 'సరేఁ' నన్నాడు.

❖ ❖ ❖

అనుకున్న ప్రకారమే ఆపరేషన్ చేశాడు డా॥ డానీ ఎల్టన్. ఆపరేషన్ తర్వాత 'పోస్ట్ ఆపరేటివ్ కేర్' తనే చేస్తానని కుమారి కుంజిమణి (మాధవన్ నాయర్ కూతురు) రాత్రింబవళ్ళు కంటికి రెప్పలా చూసుకుంది సుందరమూర్తిని. ఆమె చూపిన ఆదరణ రాత్రింబవళ్ళు చేసిన సేవ, కలుపుగోరుతనం, ఇవన్నీ సుందరమూర్తిని త్వరలోనే కోలుకునేటట్లు చేశాయి. అందాల జవ్వని, ముగ్ధ, నవ్వినప్పుడు సొట్టలు పడే బుగ్గలు, చక్కటి ముత్యాల వంటి తెల్లని పలువరస, పాశ్చాత్యుల దగ్గర నేర్చుకున్న వినయవిధేయతలు, అపారమైన తెలివితేటలు, అన్నిటినీ మించి ఆమె చూపిన ఆదుర్దా ఇతరుల పట్ల దయ ఆ ఇద్దరినీ ఆకర్షితులను చేయటమే కాక గాఢప్రేమలో పడేశాయి. విషయం తెలిసిన మాధవన్ నాయర్ అతని సతీమణులు హాస్పిటల్‌లో సుందరమూర్తిని చూడటానికొచ్చినప్పుడే కూతుర్ని చూస్తూనే పసిగట్టారు. తమ ఒక్కగానొక్క కూతురు స్వల్పకాలంలోనే ఈ ప్రతిభావంతుడైన డా॥ సుందరమూర్తితో పిచ్చి ప్రేమలో పడిందని. మరో వారానికి వాళ్ళ ఇరువైపులా తల్లిదండ్రులు రావటం తాంబూలాలు మార్చుకోవటం, మరో నెలరోజులలో డర్బన్‌లోనే ఉన్న ఒక దేవాలయంలో పెళ్ళి సింపుల్‌గా జరిపించారు. మర్నాడు నవ దంపతులైన సుందరమూర్తి అతని భార్య కుంజిమణి 'హనీమూన్'కై ఎయిర్ ఫ్రాన్స్‌లో పారిస్‌కి ప్రయాణం కట్టారు.

❀ ❀ ❀

# పొలాల్లో కత్తిరింపు వృత్తాకారాలు (Cropcircles)

అది వాలెంషియా (Valencia) అనే ఒక చిన్నగ్రామం. 'స్పెయిన్'లో 'బార్సెలోనా' నుంచి ఒక అయిదు వందల కిలోమీటర్ల దూరంలో వున్నది. ఆ ఊరు పరిసరాల్లో పచ్చటిపైర్లు, బియ్యం, వరి, జొన్న, తదితర ఆహారంలో వాడే పప్పుదినుసులు, వివిధ రకాల కూరగాయలు, కొన్నిచోట్ల బయోటెక్నాలజీతో పండించిన "జెనెటికలీ మాడిఫైడ్' కూరలు, పండ్లు ఇలాంటివి కేవలం పరిశోధనాత్మకమైన కారు సైజులో ఉన్న గుమ్మడికాయలు, మూడడుగులు పొడవైన అరటిపండ్లు పండించి, వాటిని తిరిగి పరిశోధనలకై జేరవేసే ఒక అధునాతనమైన పరిశోధనశాల, అక్కడ పనిచేసే శాస్త్రజ్ఞులు, వారికి చక్కగా చిన్న చిన్న అందమైన ఇళ్ళు ఒక ఇరవైకి పైగా కట్టిచ్చిన 'మాడ్‌రిడ్' రాజధానిలో ఉన్న వారి దేశ ప్రభుత్వం. ఇప్పుడీ "జెనెటికలీ మాడిఫైడ్" క్రాప్స్ (పంటలను) 'జి ఎమ్' క్రాప్స్ అని దేశవిదేశాలలో పేర్కొన్నారు. కానీ ప్రపంచంలో పలు దేశాల్లో ఈ 'జిఎమ్ క్రాప్స్'ని నిషేధించారు భారతదేశంతో సహా. కొన్ని సంవత్సరాల క్రితం, అమెరికా, యూరప్‌లో అన్ని దేశాలు అప్పుడే క్రొత్తగా పండించిన, ఈ విపరీతపు పరిణామాలు కల పండ్లు కాయగూరలు విరివిగా వాడేవారు. రుచి పచీ లేని ఈ కాయగూరలు మొదట్లో చౌకగా దొరికినా, వాటిలో ఉన్న సహజంగా ఉండే విటమినులు, మాంసకృత్తులూ అన్నీ తగ్గిపోవటం వలన మన శరీరాలకు మామూలు ఎరువుతో పండించిన కాయగూరలకన్నా రానురాను హాని కలిగించేవిగా కానరావటంతో అన్ని దేశాలు ఈ 'జి ఎమ్' క్రాప్స్‌ని నిషేధించటం మొదలెట్టాయి. అందులో భారతదేశం కూడా ఉంది. కనుక ఇప్పుడీ GM Crops కేవలం పరిశోధనలకు మాత్రమే పరిమితమై, అవి ఎందుకిలా మనిషికి నిరుపయోగమైన స్థితిలో ఉన్నాయో కనుగొనాలని విజ్ఞానులు ముఖ్యంగా వృక్ష శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేయసాగారు.

విజ్ఞాన పరిశోధనలలో ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు సరికదా, శాస్త్రజ్ఞులు ఆశించిన రీతిలో రానేరావు. అలా రావాలనుకున్నప్పుడు వివిధ రకాల ప్రయోగాలు అహర్నిశలు శ్రమించినప్పుడు ఎప్పటికో ఒకప్పుడు రాకమానవు, తప్పక వస్తాయి అని నమ్ముకున్న వారే శాస్త్ర పఠనపు పుటలు తిరగేసి శాస్త్రజ్ఞులవుతారు. అందుకు విపరీతమైన ఓపిక, పట్టుదల, కార్యదీక్ష తప్పక ఉండాలి.

ఎత్తుపల్లాల్లో, కొండల చివర్లో ఉన్న పచ్చటి అందమైన 'వాలెంషియా'లో గ్రామస్థులు స్పానియార్డ్స్ (Spaniards) స్పెయిన్ దేశస్థులు స్నేహశీలులు,

ఐశ్వర్యవంతులైన రైతులు. వాళ్ళ దేశ సంస్కృతిని, దేశాభివృద్ధిని విపరీతంగా గౌరవిస్తారు. రైతు కుటుంబాలు కొండల అంచుల్లో ప్రక్కగా వరసవారిగా ఇళ్ళు. వారి సంతానం, ఆ సంతానం వెళ్ళేందుకో చక్కటి స్కూలు, వారివారి పొలాలు, ఎకరాల కొద్దీ పచ్చగా కనపడతాయి. విమానంలో ప్రయాణికులకు పర్వతాలు, వాటి అంచులలో బొమ్మరిళ్ళలా అగ్గిపెట్టెల్లా అందంగా పచ్చటి తివాచి మధ్య ఉన్న వీరి ఇళ్ళు కనబడతాయి. ముఖ్యంగా 'బార్సెలోనా' వైపు వెళ్ళే విమానాలలోనుంచి.

ఈ రైతు కుటుంబాలలో ముఖ్యుడు డా॥ మార్క్‌జుక్కర్‌మన్. అతను రైతైనా, పిహెచ్.డి., అగ్రికల్చర్‌లో చేసిన, తల్లితండ్రుల నుంచి సంక్రమించిన పొలాలు ట్రాక్టర్‌తో దున్నుకుంటూ, చక్కటి భార్య అందాల రాశి సోఫియా, పదేళ్ళ కొడుకు ఎడ్వర్డ్‌తో ఒడిదుడుకులు లేని స్వంత ఇంట్లో ఉంటూ, చేదోడు వాదోడుగా ఉన్న సోఫియా సాయంతో నెలకోసారి తన ఫోర్డ్ పికప్‌వాన్‌లో పండించిన కూరగాయలు, వరి గోధుమలు బార్సలోనాకి తనే డ్రైవ్ చేసుకుని వెళ్ళి సరుకుని హోల్‌సేల్ మార్కెట్‌లో అమ్మి వచ్చేవాడు. అప్పుడప్పుడు ఇంటి ప్రక్కనే ఉన్న వృక్షశాస్త్ర ప్రయోగశాలలో తక్కిన శాస్త్రజ్ఞులతో వారి పరిశోధనలలో తనూ పాలు పంచుకునేవాడు.

❖ ❖ ❖

ఇలా సాఫీగా జీవనం జరుగుతున్న రోజులలో ఒక విచిత్రమైన సంఘటన ఆ చిన్న గ్రామం వాలెంషియానూ, అక్కడి శాస్త్రజ్ఞులనూ ఆ పిమ్మట టి.వి. వార్తల మూలంగా లోకం మొత్తం సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తి వేశాయి. అదేమిటో చూద్దామా?

❖ ❖ ❖

ఆ రోజు రాత్రి అమావాస్య చీకట్లు అలముకున్న వేళ ఆకాశంలో మెరిసే నక్షత్రాలు చుక్కలు పొదిగిన విస్తారమైన నల్లటి తివాచీలా అగుపడుతోంది. చల్లటిగాలి అప్పుడప్పుడు వీస్తోంది. కాళరాత్రిలో పన్నెండున్నర ప్రాంతం. ఎక్కడో దూరంగా కారణం తెలిసో తెలికో కుక్కలు ఉండి ఉండి అరుస్తున్నాయి. అప్పుడు జరిగిందో వింత. ఆకాశం నుండి అతివేగంతో ఒక వెలుగు చుక్క తారాజువ్వలా భూమివైపు అంతకంతకు ఓ పసుపు పచ్చదీపం విస్తారంగా పొలాలపై కేంద్రీకరిస్తూ, చడీచప్పుడూ లేని ఆ అంతరిక్షం నుంచి అంతు తెలియని ఒక నౌక గాలిలో కొన్ని సెకండ్లు మాత్రం తేలియాడింది. ఎంత వేగంగా వచ్చిందో, అంతే వేగంతో మరలా మరో దిక్కుగా ఆకాశపు గగన వీధుల్లోకి కొన్ని సెకన్లలో దూసుకుపోతూ, ఓ చుక్కలా మారేంత దూరం వెళ్ళిపోయి అదృశ్యమైపోయింది. సరిగా వాలెంషియాలో, రైతుల వాడలో, ఏ చోట ఎకరాల కొద్దీ పచ్చటి పైర్లున్నాయో, వాటిపై కొన్ని సెకన్లు మాత్రమే

తాండవమాడి మళ్ళీ దూసుకెళ్ళిపోయింది. ఒక నూరు మీటర్లకు పైన చుట్టుకొలత కల్గి వృత్తాకారంలో ఉన్న ఆ నౌక క్రింద భాగం నుంచి, ఓ పసుపు పచ్చటి వెలుతురు కొన్ని సెకన్లపాటు, మన కెమెరా ఫ్లాష్‌లకి మల్లే వెలిగి వెలిగి ఆరిపోయాయి. అవి అలా ఎందుకు వెలిగాయో, అటు పిమ్మట నౌక అంతరిక్షంలోకి ఎలా మాయమైనదో రోజంతా పొలాల్లో పనిచేసి, కాసింత సారాయి (విస్కీ)తో సేద దీర్చుకున్నాక, గాఢ నిద్రలు పోతున్న ఎవ్వరికీ తెలియరాలేదు మరి!

మర్నాడు ప్రొద్దునే డా॥ జుక్కర్‌మాన్ తన ట్రాక్టరు కడుక్కోవడానికి బయటికొచ్చినప్పుడు, ఏదో ఒక మాదిరి వెలితిగా అనిపించింది. ఎప్పుడూ లేని నిశా రాణి (Night Queen) వాసన పగలు వస్తోంది. విచిత్రమేమంటే ఎవ్వరిళ్ళలోనూ రాత్రి రాణీ ఒక చిన్న మొలక కూడా లేదు. మరి ఘాటుగా ఈ వాసన ఏమిటి? ఎక్కణ్ణుంచో కాదు, ప్రక్కనే ఉన్న విస్తారమైన పొలాల్లోంచే! అయినా పగలు ఎప్పుడూ రాదు సువాసన! ఇలా ఆలోచిస్తూ, పొలాలవైపు సాలోచనగా వెళ్ళాడు డా॥ జుక్కర్‌మాన్. ప్రక్కనే వెదురు బొంగులతో, మన దిష్టిబొమ్మ ప్రక్కనే ఉండే కంచెలకు మల్లే ఓ పది అడుగుల ఎత్తుకి చెక్కమెట్లతో ప్రక్క పొలం సరిహద్దులలో వరసగా ఒకేరీతిలో కట్టారు. పొలాల పంటలు పండాక అక్కడ ఈ కంచెలాటి వెదురు ఇంటి పైకి ప్రక్కనే వేళ్ళాడుతున్న తాడు నిచ్చెన ఎక్కి చూస్తే, పంటలు సక్రమంగా పండాయా లేదా, అని ఒక ఉజ్జాయింపు ఉంటుంది. మనకి దిష్టి బొమ్మకి మల్లే పక్షులు రాకుండా బెదరగొట్టేందుకు వారు కూడా 'స్కేర్‌క్రో' (Scare Crow) రెండు బొంగులను క్రిస్టియన్ క్రాస్‌కి మల్లే ఒక కుండకి కళ్ళు ముక్కు వచ్చేట్లు దిద్ది, ఎండుగడ్డిని చుట్టూరా కుక్కి ఒక పాత టోపీని కుండకు పెట్టి, ఒక పాత ప్యాంటు చొక్కా లేక కోటు తొడిగిపెడతారు. దానితో కాకులు, ఇతరత్రా పక్షులు పంటలు పాడు చేయటానికి సాధారణంగా రావు కోతలయిన తర్వాత, మళ్ళీ విత్తనాలు జల్లి, ట్రాక్టర్‌తో పొలాలు దున్నుకునేదాక.

డా॥ జుక్కర్‌మాన్ అలాంటి ఒక కంచె పది అడుగుల ఎత్తుకి ఎక్కి, సమతలంగా ఉన్నచోట నిలబడి, ఎప్పుడూ తన సరంజామాసంచిలో తెచ్చుకునే 'బైనాక్యులర్స్'లో చూసి, తను చూసిన దృశ్యానికి ఒక్కసారిగా అవాక్కయిపోయాడు అలాగే నోరు తెరుచుకుపోయి. కొన్ని సెకన్లు అతని మెదడు మొద్దుబారిపోయింది. ఏమిటీ వైపరీత్యం? ఎలా జరిగిందిది? మనుష్యమాత్రుడు చేయలేని పని ఎవ్వరో ఒక్కరాత్రిలోనే చేసి వెళ్ళిపోయారు. అతను చూసిన దృశ్యం ఏమిటంటే, కొన్ని వందల ఎకరాల వరకూ వృత్తాకారంలో, చక్కటి మన దేశంలో వేసే చిక్కు ముగ్గులలా పచ్చటి పైర్లు వివిధ రూపాల్లో కత్తెరతో కత్తిరించి నట్టున్నాయి! ఎక్కడా పొలాలను నిప్పుతో కాల్చినట్లో,

లేక మరే విధమైన విధ్వంసం చేసిన సూచన లెక్కడా లేవు. ఆ కత్తిరించిన మేరవరకు, ముగ్గుల రూపంలో మిగిలిన పచ్చటి పైర్లు, మధ్య భాగంలో అక్కడక్కడ నేల. నుదిటిమీద వచ్చిన చెమట అతికష్టం మీద తుడుచుకుంటూండగా అతనిలో మేధస్సు, వైజ్ఞానికుడు మేల్కొన్నాడు. మెదడు చకచకా ఆలోచింపసాగింది. ఇలా చేయటం చూస్తే ఎవరో కావాలని తమ ఉనికి తెలిపేందుకు చేశారనిపిస్తుంది తప్ప తమకు ఏవిధంగానూ నష్టం రావాలని చేసినట్లు అనిపించడం లేదు! ఎందుకంటే పంటలు పూర్తిగా నాశనం కాలేదు. కత్తిరించిన మేరకు, అంటే ఎక్కడ నేల కనిపిస్తోందో, అంతమేరకు గడ్డి/వరి కత్తిరించేశారు. పోనీ, అలా అనుకున్నా ఆ కత్తిరించాక మిగిలిన ఆకులేవీ? చీపురుతోనో, లేక 'వాక్యూమ్ క్లీనర్' తోనో శుభ్రం చేయాలన్నా ఎకరాలెకరాల కొద్దీ చెయ్యాలంటే కనీసం రెండు మూడు రోజులన్నా పడుతుంది! ఆకులు రాలనూ లేదు, కత్తిరించిన చెత్త లేనూ లేదు! ఏమైనట్లు? ఇది ఎలా సాధ్యమైంది? ఎవరికింత అవసరం వచ్చింది ఇలాంటి గమ్మత్తులు చేయటానికి? మహా అయితే ఒక పావు శాతం మొత్తం పొలాల్లో కత్తిరింపగా పోయిన వరి ఆకులు ఉంటాయి. తమకు ప్రతి సంవత్సరం మామూలుగా వచ్చే విపరీతమైన లాభాల్లో ఇది ఒక లెఖ్ఖ కాదు. దీన్ని విడమర్చి, మిగతా రైతులకి వెంటనే చెప్పాలనుకుంటూ ఇంటివైపు దారి తీశాడు డా॥ జుక్కర్‌మాన్.

❖ ❖ ❖

ఇది జరిగిన ప్రొద్దున్నే 10 గం॥ కల్లా, అక్కడ పరిశోధనాశాలలో పనిజేసే శాస్త్రజ్ఞులతోపాటూ, రైతులందరూ గుమిగూడారు. సమాచారం అందరికీ సెల్‌ఫోన్‌లో ఒకేసారి 'ఎస్సెమ్మెస్' ద్వారా అందటం వలన, అందరూ ఒకే సమయానికి డా॥ జుక్కర్‌మాన్ ఉన్న వెదురు సమతలం మీదికి ఎక్కి డా॥ జుక్కరమాన్ ప్రక్కనే గుమిగూడారు. అప్పుడు ఆ ఉదయం తను చూసిన అసమానమైన దృశ్యాన్ని మళ్ళీ ఓసారి వివరించి, పొలం వైపు తన చూపుడు వేలును చూపాడు. అందరూ ఆ వైపు తలత్రిప్పి దృష్టి సారించి చూసి, అలాగే శిలా ప్రతిమల్లా అయిపోయారు. అందరూ కలిసి పొలాల మధ్యకి వెళ్ళి నిశితంగా జరిగిన వైపరీత్యాన్ని పరిశీలించి చూడాలని నిశ్చయించుకుని, అది వెంటనే అమలు పరిచారు. మనిషికన్నా రెండడుగులు పొడవు ఉన్న వరిపైర్లు పచ్చగా ఏపుగా పెరిగి ఉన్నాయి. కానీ మధ్యలో త్రోవలా ఒక పద్ధతిలో ఒక్క ఆకుముక్క క్రింద పడకుండా, ఎక్కడా కాల్చినట్లుగానీ, మరే విధంగా నాశనం చేసినట్లు గానీ ఏమాత్రం సూచనలు లేవు. ఎకరాలకొద్దీ ఈ కత్తిరింపులు వివిధ రకాల మన దేశంలోని ముగ్గులకి మల్లే ఉన్నాయి. వాళ్ళందరి ఆలోచన ఒక్కటే. అది జరిగిన స్వల్పమాత్రం నష్టం గురించి కాదు. ఇలా ఒక్కరాత్రిలో వందలకొద్దీ ఎకరాలలో ఒకేసారి ఇన్ని రకాల డిజైనులతో మానవమాత్రునికి సాధ్యం కాని విధంగా ఎవరూ,

ఎలా చెయ్యగలిగారు? అసలు ఇలా చెయ్యటానికి కారణం ఏమైయ్యుంటుంది? తమ పొలాల్లో ఇలా మొట్టమొదటిసారి అయింది.

❖ ❖ ❖

ఆనాడు మధ్యాన్నమే అందరూ 'భోజనాదులు' ముగించుకుని విశాలమైన ప్రయోగశాలలో ఒక ప్రక్కగా ఉన్న ఓ 'మినీ ఆడిటోరియం'లో సమావేశమై ఆసీనులైనారు. రెండు వేలమందిని సునాయాసంగా ఇనుమడించుకోగలిగిన సౌండ్‌ప్రూఫ్, ఏర్ కండిషన్డ్ ఆడిటోరియంలో పవర్ పాయింట్, వైర్‌లెస్ వసతులూ ఉన్నాయి. ఓవేళ కరెంట్ ఫెయిలయినా (సాధారణంగా ఏ ఐదేళ్ళకో ఓసారి కొన్ని సెకన్లు మాత్రమే కరెంటు పోతుంది) బాకప్‌కి చాలా శక్తివంతమైన 'ఇన్వర్టర్లు' ఓ డజనుకుపైగా ఉన్నాయి. వేదికపైన డా॥ జుక్కర్‌మాన్ ఎక్కి ఆశీనులైన వైజ్ఞానికులనుద్దేశ్శించి ఇలా మాట్లాడాడు. "ఇది ఎన్నడూ జరగని ఒక వైపరీత్యం. మన పొలాల్లో మొట్టమొదటిసారిగా జరిగింది. దీన్ని చూసి విస్తుపోయినా, విజ్ఞానం మనకి దీని అంతు తేల్చమని పదేపదే హెచ్చరిస్తోంది. మన చుట్టుపక్కల ఉన్న ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లండు, ఇంకా యూరోపియన్ యూనియన్‌లో ఉన్న ఇతరత్రా దేశాల్లో ఎక్కడా ఈనాటి వరకు ఇలాంటి కత్తిరింపులు జరగలేదని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను" అని ఓసారి చిన్నగా దగ్గి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"ఇప్పుడు మనమందరం శాస్త్రజ్ఞులుగా ఆలోచింపవలసినవి రెండు విషయాలు. మొట్టమొదట హెలికాప్టర్‌లతో పొలాల మీదుగా వెళ్ళి, ఈ విచిత్రమైన కత్తిరింపులు కనుగొనాలి. రెండోది, ఈరోజు నుండి రోజుకు ఇద్దరు చొప్పున వంతులవారిగా, మనదగ్గర ఉన్న అధునాతన ఫోటోగ్రాఫీ ఎక్విప్‌మెంట్‌తో కొద్ది దూరంలోనే ఉన్న చిన్నగుట్టపై ఒక దేరా వేసుకుని చీకటిలో, అన్ని కోణాలనుంచి, ఎటువంటి చీకట్లలోనైనా తీయగలిగిన ఇన్ఫ్రారెడ్, డార్క్‌ఫీల్డ్ లెన్సెస్‌గల ఫోటోగ్రఫీ ఎక్విప్‌మెంటుతో కాపలా కాయాలి. ఉదాహరణకు లాప్‌టాప్‌లతో రెడీగా ఉంచుకుని, అందరి లాప్‌టాప్‌లు ఒకేసారిగా రిమోట్ కంట్రోల్ ద్వారా మీట నొక్కితే సాటిలైట్ ద్వారా 'ఈమైల్'కి మల్లే తర్జుమా అయి, గట్టుపైనున్న కెమేరాలు చడీచప్పుడు కాకుండా, వైడ్ ఆంగిల్ లెన్సెస్‌తో ఈ పొలాల్లో జరుగుతున్న అసమానమైన వింతను ఒకేసారి రికార్డ్ అయేటట్లు ఏర్పాట్లు చేసుకోవాలి. ఇలా వరసవారిగా నెలల తరబడి, రోజుకి ఇద్దరిద్దరు చొప్పున సాయంకాలం సాయంసంధ్య చీకట్లు అలుముకునే లోపల గుట్టపై తమ దేరాలో సిద్ధంగా ఉండి, చీకట్లోనే ఓపిగ్గా రాత్రంతా కాపు కాయాలి. ఈ ఏర్పాటు మనకి ఈ వింత పరిణామాలకు వైజ్ఞానికపరంగా, తృప్తిమేరకు జవాబు దొరికేదాకా ఇదొక క్రొత్తరకమైన రిసెర్చి ప్రాజెక్టుగా భావించి త్రికరణశుద్ధిగా శ్రద్ధగా, పరిశోధనలు

చేస్తూపోతే ఏదో ఒకరోజు తప్పక ఎవరు, ఎందుకు ఇలా చేస్తున్నారో మనకి బోధపడుతుంది. ఇదీ ఒకరకమైన శాస్త్ర పరిశోధనే మరి, చెప్పనారంభించాడు డా॥ జుక్కర్‌మాన్. "ఈ క్లిష్ట పరిస్థితిలో మన ఓపిక ఏమాత్రం సడలినా, పనిలో అశ్రద్ధ చూపినా, మన ధ్యేయం చెడటమే కాక, మనం పడుతున్న శ్రమ వృధా అయి మట్టిన కలిసిపోతుంది. మనకి శాస్త్రపరిశోధనలలోకి మల్లే సరైన, తృప్తికరమైన జవాబు దొరికేందుకు రోజులు, నెలలు, సంవత్సరాలు కూడ పట్టొచ్చు. లేదా, ఒక్క రాత్రికే దొరకచ్చు. ఏది ఏమైనా, ఈ నా సూచనకి అంగీకరించి, సహకరించదలుచుకున్న వారు చేతులెత్తండి! బలవంతం ఏమాత్రం లేదు" అని అనగానే అక్కడున్న అందరూ, ఒకేసారి చేతులెత్తారు. 'గుడ్! ఐటూయామ్ వెరీ ఎన్‌థ్యూస్ట్ ఎట్ యువర్ కో ఆపరేషన్!' అని, తానుకూడా ఉన్నట్లు తన చేయి కూడా ఎత్తాడు డా॥ జుక్కర్‌మాన్.

అటు పిమ్మట ఆరోజు జరిగిన ఈ సమావేశం 'మినిట్స్' అన్నీ అప్పటికే వారితో బాటు కూర్చున్న లాబ్ సెక్రెటరీ మార్గరేట్ లాప్‌టాప్‌లో ఎక్కించి, నిముషాల మీద ప్రింటర్‌లో అరవై కాపీలు తీసి, అందరికీ ఇవ్వటమూ జరిగిపోయింది. పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి ఐకమత్యం, ఏకాగ్రత, పట్టుదల, నిజాయితీ ఉండబట్టే చకచకా ఏ శాస్త్రపు ప్రాజెక్టు ఆరంభించినా ఫలితాలు చక్కగా వస్తాయి. ఏమాత్రం కల్మషం, రాజకీయాలు శాస్త్రజ్ఞుల మధ్య ఉండవు. అందరూ ఒక కుటుంబంలా మెలుగుతూ, ఒకరికొకరు సాయపడుతూ, సాధించాలనే ఒకే ధ్యేయంతో రాత్రింబవళ్ళూ తమకి కేటాయించిన పనులు అతిశ్రద్ధగా, నిజాయితీతో చేస్తారు. అందుకే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. మనదేశం ఈ విషయాలలో ఇంకా చాలానే శ్రద్ధ వహించాల్సి ఉన్నది వారందరితో పోటీ చేయాలనే కుతూహలం ఉంటే!

❖ ❖ ❖

అనుకున్న ప్రకారమే, ఆరోజు సాయంకాలం గుట్టపై డా॥ జుక్కర్‌మాన్ సూచించిన పద్ధతిలో అన్నీ అమలు చేయబడటమేకాక, ఒక టైమ్‌టేబుల్ కూడా తమ మధ్య. రోజుకిద్దరు శాస్త్రజ్ఞులు తమ తమ సప్పర్లు (suppers) చిన్న హాట్‌ప్యాక్(Hot Pack) లో సర్దుకుని, అప్పటికే శుభ్రం చేయబడ్డ గుట్ట సమతలంపై నైలాన్ డేరాలు లోపల గుడ్డిగా ఉన్నా, బాగా వెలుతురిచ్చే బ్యాటరీతో పనిచేసే లైట్ ఎమిటింగ్ డయోడ్ (LED) బల్బులు కల దీపాలు అమర్చుకున్నారు. ఆ దీపాలు ఎక్కడ కేంద్రీకృత మవుతాయో అక్కడ మట్టుకే వెలుతురు వస్తుంది. డేరా బయటకి ఒక్క కిరణం కూడా రాదు కటిక చీకట్లో కూడా. అవి 'మోనోఫోకస్' ఎల్.ఇ.డి. (LED) (లైట్ ఎమిటింగ్ డైయోడ్) బల్బులుండే దీపాలు. డేరాలు రెండు వేశారు. ఒక దాంట్లో వంతుల వారీగా ఒకరు మార్చి ఒకరు రెండుగంటలకోసారి నిద్రకుపక్రమించాలి. అప్పుడు రెండో

మనిషి దూరంగా వెన్నెలలో కాన వచ్చే పచ్చటి పైర్లపై కెమెరా సరంజామా ఫోకస్‌లో ఉంచుకుని వైర్‌లెస్ రిమోట్‌తో కళ్ళు వత్తులు చేసుకుని దృష్టి సారించి కాపు కాయాలి.

❖ ❖ ❖

ఇలా వంతులవారిగా ఒకరాత్రికి నలుగురు వైజ్ఞానికులు, వారికి సహాయతగా ఇద్దరు టెక్నీషియన్లు మొత్తం ఆరుమంది మగవారు ఈ కార్యక్రమానికి నడుము కట్టుకున్నారు. మొదటిరాత్రి సాయంకాలం ఆరుగంటల నుంచి నడిరాత్రి పన్నెండు గంటల దాక ఇద్దరు వైజ్ఞానికులు కటిక చీకట్లో తమతమ రిమోట్ కంట్రోల్‌ను చేతిలో పెట్టుకుని ఇన్ఫ్రారెడ్ కెమెరాల పరిమితిలో మడత కాన్‌వాస్ 'నైట్ బైనాక్యులర్స్' చెరోటి రెండు చేతులతో కంటి దగ్గరగా పెట్టుకుని దూరంగా లోతులో స్పష్టంగా గుడ్డి వెన్నెలలో కనుపించే పచ్చటి పైర్లు, గాలికి సుతారంగా అటు, ఇటూ ఊగుతున్న పొలాల్ని తదేక దృష్టితో చూపు దృష్టి మరల్చకుండా నిముషాల కొద్దీ గమనిస్తూ అప్పుడప్పుడు వాటి పరిసరాలని, చుక్కలు పొడిచిన విస్తారమైన ఆకాశం వైపు మార్చిమార్చి చూడసాగారు. ఓపిక, ధ్యాస తప్పాయన్నా, ఏమాత్రం అశ్రద్ధ చూపినా మొదటికే మోసం రావచ్చు. తాము వెతుకుతున్న ఈ అద్భుతమైన వింత పరిణామం చేయిజారిపోవచ్చు. ఇలా అనుకుంటూండగానే చాలా దూరంలో ఉన్న చర్చి టవర్ పన్నెండు గంటలు కొట్టటం చల్ల గాలిలో తేలుతూ సుతారంగా వినబడ్డాయి. సరిగ్గా ఐదు నిముషాలకి ముందే వచ్చి వాళ్ళ ప్రక్కనే నిలబడ్డ వైజ్ఞానికులిద్దరూ తమ వంతు వచ్చిందని తెలియజేస్తూ వారి సరంజామా సర్దుకుని వారు ఖాళీ చేసిన రెండు కుర్చీలలో ఆసీనులై తమ కూడ తెచ్చుకున్న వారివారి 'నైట్ బైనాక్యులర్స్'తో మొదటి ఇద్దరూ చేసిన రీతిగానే తదేక దృష్టితో పరిసరాలని కళ్ళు వత్తులు చేసుకుని చూడసాగారు. సాయంకాలం ఆరు గంటల నుంచి పన్నెండు గంటల దాక నిద్రపోవటం వలన శరీరం విరామం నుంచి మేల్కొని చురుకుగా పనిజేయసాగారు మర్నాడు ఉదయం ఆరుగంటల దాక.

❖ ❖ ❖

ఇలా సరిగ్గా ఆరురోజులు, రాత్రిళ్ళు డా॥ జుక్కర్‌మాన్ ఇతర వైజ్ఞానికులు వేసుకున్న ప్రణాళిక ప్రకారం తు.చ. తప్పకుండా వంతులవారీగా ఆరారు గంటలు ఇద్దరిద్దరు చొప్పున కాపుకాసి పరిశోధనలు కొనసాగించారు. అయినా, ఓర్పు, పట్టుదల ఏ మాత్రం సడలని ఆ వైజ్ఞానికులు, ఎన్ని నెలలు, సంవత్సరాలైనా, ఈ ఒప్పందం ఇలాగే కొనసాగించదలిచారు, ఈ పొలాల కత్తిరింపుల రహస్యం బయటపడేదాక. సరిగ్గా ఎనిమిదోరోజు, ఆ రాత్రి మళ్ళా ఎక్కడో కుక్కలు ఊళపెడుతున్నాయి. అతి

దూరంగా ఉన్న కాథలిక్ చర్చి లీలగా పన్నెండు గంటలు కొట్టిన ఇరవై నిముషాలకు చలిలో వేడివేడి 'టీ' మధ్యమధ్య చప్పరిస్తూ ఆకాశంలో తిలకిస్తున్న రెండవ జత వచ్చి ఇరవై నిముషాలయ్యుంటుంది. వారిద్దరిలో ఒకరు డా॥ గేబ్రియల్, ఉన్నట్లుండి మరో దిక్కుగా ఆకాశాన్ని పరిశీలిస్తున్న డా॥ ఏబెల్‌ని తట్టి మరో దిక్కుగా చూడమన్నట్లు సైగ చేశాడు. ఇద్దరూ 'నైట్ బైనాక్యులర్స్' తమ తమ చేతుల్లో ఉన్నవి, ఆ దిక్కుగా 'ఫోకస్' చేయసాగారు. కళ్ళు మిరుమిట్లు గొలిపే పసుపు పచ్చటి చుక్కలాంటి వెలుతురు, అంతకంతకూ పెద్దదవుతూ, ఊహకందని వేగంతో పొలాలవైపు చడీచప్పుడూ, వేడి, సెగ లేకుండా దూసుకు రాసాగింది. రోమాలు నిక్కపొడుచుకున్న ఆ ఇద్దరు యువ వైజ్ఞానికులు అలాగే శిలాప్రతిమల్లా అయిపోయి, తమ తమ 'బైనాక్యులర్స్'తో మరింత దీక్షగా చూడసాగారు. మనిషి మెదడు ఒక్కసారిగా అనుకోని విచిత్రం చూసి క్షణికంగా మొద్దుబారినా, విజ్ఞానం నేర్పిన పాఠాలు, క్రమశిక్షణ వల్ల పదునుపెట్టిన చాకులా, చకచకా పనిచేస్తుంది. ఇప్పుడు వారిద్దరికీ సంభ్రమాశ్చర్యాలకు బదులు కర్తవ్యం, కుతూహలం ఒక్కసారిగా మెదడులో ఆక్రమించుకున్నాయి. దాంతో చేతుల్లో ఉన్న రిమోట్ కంట్రోల్స్ స్విచ్‌ని వారి వారి బటన్ వేళ్ళు గబుక్కున ఒత్తగానే క్రింద అందరిళ్ళల్లోనూ ఏర్పాటు చేసుకున్న ఇన్ఫ్రారెడ్ కెమెరాలకి గుట్టపై శాటిలైట్ ద్వారా సందేశాల రాకపోకలు ఆరంభమవ్వగానే అంతకంతకు పెద్దదవుతూ వచ్చిన ఆ పసుపు పచ్చటి చుక్క ఇప్పుడు ఒక పెద్ద ఫుట్‌బాల్ పరిణామానికి పెరిగి,ముందు ఒక నారింజ రంగుకి మారి, విస్తారమైన పరిమితికి పొలాలపై విస్తరించగానే ఒక యాభై మీటర్ల ఎత్తులో అలాగే నిలిచిపోయి చడీచప్పుడు లేకుండా తాండవమాడసాగింది. అంతా కొన్ని సెకన్లలో జరిగిన వింత ఇది. వెంటనే ఆ నారింజ రంగులో ఉన్న వృత్తాకారంలో ఉన్న నౌకలాంటిదేదో (గుర్తు తెలియనిది) క్రింది భాగం తెరుచుకోగానే ఒక పొడుగాటి గొట్టం, దాని చివర్న ఉన్న ఒక విష్ణుచక్రం లాంటిది ఊహించలేనంత వేగంతో చప్పుడు లేకుండా మెత్తగా పొలాల్లో వాటికి చాలా దగ్గరగా తాకీ తాకనట్లు పైకి, క్రిందకీ, వేరు వేరు చోట్ల ఆ నౌక కాస్త అటూ ఇటూ చదరపు మీటర్ల దూరానికి ఒక పద్ధతిలో, ఒక క్రమబద్ధంగా, ఏదో లెక్కలు వేసి కొలతలు జరిపినట్లు, ఒక్క ఐదు నిమిషాలల్లో జరిగిన తదనంతరం చటుక్కుమని ఆ విచిత్ర పరికరం గొట్టాన్ని నౌకలోపలకి లాక్కోగానే, ఆ తాండవమాడుతున్న నౌక మెల్లమెల్లగా నారింజ రంగు నుంచి, కంటికి ఇంపుగా చల్లదనమిచ్చే నీలం రంగుకు మారసాగింది. నీలం రంగు వచ్చీరాగానే ఒక్కసారిగా మళ్ళీ కళ్ళు మిరుమిట్లు గొలిపే పసుపు పచ్చరంగుకి మారి, ఆకాశంలోకి రెండే రెండు సెకన్లలో వచ్చిన దిక్కుగా కాక మరో దిక్కుగా దూసుకుపోవటమేమిటి, ఓ చుక్కగా మారటమేమిటి, అంతకంతకు సెకన్లలో ఆ

చుక్క నక్షత్రాల మధ్య కనుమరుగయిపోవటమేమిటి, ఇలా జరగటం, అన్నీ రికార్డ్ అయిపోవటం జరిగింది. ఒక్కసారిగా ఆ ఇద్దరు యువ శాస్త్రజ్ఞులు, డా॥ గే(బ్రియల్, డా॥ ఏబెల్ నిట్టూర్చి, అంత చలిలోనూ నుదుటి మీద పట్టిన చెమటను అతికష్టంతో చేత్తో తుడుచుకుని ఒకరి ముఖం ఒకరు చూసుకుని, మళ్ళీ కర్తవ్యం గుర్తుకొచ్చి, పగలు ఆరుగంటల దాక ఆకాశాన్ని తిలకిస్తూ కూర్చున్నారు. కానీ మళ్ళీ పగలు దాకా ఏ విచిత్రం జరగలేదు.

❖ ❖ ❖

మర్నాడు ప్రొద్దున్న నలుగురు వైజ్ఞానికులూ, అనగా విచిత్రాన్ని కళ్ళారా చూసిన డా॥ గే(బ్రియల్, డా॥ ఏబెల్ కాక వారి సహచరులు మరో ఇద్దరు డా॥ సామ్సన్, డా॥ నోవిన్స్ కైలకి తాము రాత్రి చూసిన వివరాలు చెప్పారు. వారిద్దరూ అంతా విన్న తర్వాత ఒక నిర్ణయానికొచ్చారు. అందరి మనస్సులోనూ ఒకటే తీర్పు. ఇది ఖచ్చితంగా మరో గోళం నుంచి వచ్చిన వారు ఏదో రకంగా ఓ సందేశాన్ని వారి ఉనికి మనకి తెలియజేసేటట్లు చేస్తున్న గందరగోళమే. ఈ అంతరీక్షవాసులు చేస్తున్న ప్రయత్నం. ఇది తప్పక సందేశపూర్వకంగా కాన వస్తున్నది తప్ప ఏరకంగానూ, భూగోళానికి గానీ, మానవ మాత్రులకుగానీ, హాని (ప్రస్తుతం) కలుగజేయదల్చుకోలేదని తెలుస్తోంది. (హేతువాదం) కానీ శాస్త్రపు పుటల ప్రకారం, ఒకరిద్దరూ ఊహాగానం చేయవలసిన విషయం కాదిది. యాభైమంది అపారమైన తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు, బుద్ధిబలం కలిగిన తమ సహచరులందరితో చర్చించిన తర్వాతనే ఒక నిర్ణయానికి రాగలరు. ఇలా అనుకుంటూ, పరిశోధనాశాలలో ఉన్న ఆడిటోరియం వైపు దారితీశారు ఆ నలుగురూ.

❖ ❖ ❖

ఈ విచిత్ర ఘటనను వివరించటానికి వారు అన్ని ఏర్పాట్లు చేసి కాన్ఫరెన్స్ హాల్‌లో సరిగ్గా పదిగంటలకు యాభై మంది వైజ్ఞానికులందరూ ఆసీనులైనారు. క్రిందటి రాత్రి కంప్యూటరులో రికార్డ్ అయిన అద్భుతమైన వీడియోగ్రాసింగ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో ఆ అద్భుతాన్ని కళ్ళారా వీక్షించిన యువ శాస్త్రజ్ఞులు డా॥ గే(బ్రియల్, డా॥ ఏబెల్ ఒకరి తర్వాత ఒకరు లేసర్ ఎర్రటి బొట్టుతో చూపిస్తూ పెద్ద స్క్రీన్‌పైన వస్తున్న వీడియోగ్రాఫ్‌లో రికార్డ్ అయిన కలర్ పిక్చర్లు ప్రొజెక్ట్ చేసి చూపిస్తున్నారు. కూర్చున్న అందరూ ఊపిరిబిగపట్టి, తదేక దృష్టితో, ఆశ్చర్యంతో వీక్షించసాగారు. వారి ప్రసంగాలు ముగియగానే, ఈ పద్ధతిని మొదట సూచించిన డా॥ జుక్కర్‌మాన్ వేదికపైకి ఎక్కి "ఇప్పుడు ప్రశ్నావళి, ఏమైనా సందేహాలుంటే ఎవరైనా అడగవచ్చును." అని ఓ పది నిముషాల వరకు సభాసదుల ప్రశ్నావళికై ఎదురు చూశాడు. నిశ్శబ్దం

అలుముకుందేకానీ, ఎవ్వరూ నోరెత్తలేదు. దీన్ని పట్టి డా॥ జుక్కర్‌మాన్ గ్రహించినదొక్కటే. అందరూ మేధావులే. కానీ అందరూ ఈ విషయాన్ని చాలా లోతుగా వారివారి తెలివితేటలతో ఆలోచిస్తున్నట్లునూ, ప్రశ్నలు అడిగే ప్రసక్తే లేదని తెలియవచ్చిందతనికి.

ప్రశ్నలు ఎవ్వరూ వేసే ప్రసక్తి లేదని గ్రహించిన డా॥ జుక్కర్‌మాన్ అక్కడ సమావేశమైన అందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు. "మనం ఇప్పుడు మొదటి మెట్టు ఎక్కాం. దీనితో ఈ విచిత్రం ఇక్కడితో ఆగిపోతుందని మనం భావిస్తే అది పెద్ద పొరపాటే కాకుండా, ఏమైనా విపరీత పరిణామాలకు గానీ అనర్థాలకుగానీ తప్పక దారి తీయటానికి బలమైన అవకాశాలు మనంగా ఇలా గమ్మత్తులు చేస్తున్నవారికిచ్చినట్టవుతుంది" అని ఓ క్షణం ఆగి, "మీరందరూ ఏమంటారు?" అని అక్కడ సమావేశమైన వైజ్ఞానికులను ఉద్దేశించి అన్నాడు. ఏక కంఠంతో అందరూ గట్టిగా 'వీ అగ్రీ విత్ యూ డాక్టర్॥ జుక్కర్‌మాన్, యువర్ థింకింగ్ ఈజ్ ఇన్‌క్రెడిబ్లీ కరెక్ట్!' అన్నారు ఏకగ్రీవంగా వారి ఆమోదం తెలియపరుస్తూ. మళ్ళీ గొంతు సవరించుకుని చెప్పసాగాడు. "ఊర్కున్న కొద్దీ పొలాలు ఇలా కత్తిరింపు ముగ్గులతో రానురాను తగ్గిపోయి మన రైతులకి అపారమైన ధన నష్టాలు జరిగే ప్రమాదం కూడా లేకపోలేదు!" ఇలా చర్చిస్తూ ఆఖరికందరూ కలిసి ఒక ధృఢ నిర్ణయానికొచ్చారు. ఈ రాత్రిపూట గుట్టపై పరిశోధనలు చేసేదెవ్వరో పూర్తిగా బోధపడేదాక, కొంత నష్టం పొలాలకి కలిగినా, అంతుతేల్చి తీరాలని.

❖ ❖ ❖

ఈ గుట్టపై రాత్రిళ్ళ పరిశోధనల ఫలితాలు జాగ్రత్తగా కంప్యూటర్లలో 'ప్రింట్ అవుట్' తీస్తూ ఒక్కొక్క వర్ణ చిత్రంలో ఏమైనా 'క్లూ' (Clue) దొరుకుతుందేమో అని ఓపిగ్గా అందరూ ఇదే తమ ధ్యేయంగా పెట్టుకుని ఈ విచిత్ర చిత్రాలను పదేపదే చదువసాగారు. అలా చేస్తున్నప్పుడు, సరిగ్గా ఒక నెలకాగానే ఉన్నట్లుండి మరో అద్భుతం జరిగింది. తెలతెలవారుతూండగా పదిహేనో రోజు ఇన్ఫ్రారెడ్ కెమెరాలు తీసిన ఫోటోలు సాటిలైట్ ట్రాన్స్మిషన్ ద్వారా తమ తమ కంప్యూటర్లలో ఒకేసారి రికార్డవుతూండటం వలన, ఆనాడు ప్రొద్దున్నే వచ్చిన మొదటి ప్రింట్ అవుట్‌లో వారు చూసిన అద్భుతమే వారి ఆశ్చర్యానికి కారణమే కాకుండా, వారికి కావల్సిన జవాబు ఆ కాగితంలో ఉన్నవి. అంతవరకూ వచ్చిన 'ప్రింట్ అవుట్లు' అన్నీ ఒక ఎత్తు. ఆవేళ నెల రోజులు సరిగ్గా కాగానే వచ్చిన కలర్‌ప్రింట్ అవుట్ ఒక ఎత్తూను. అందరూ ఒకేసారి సంభ్రమాశ్చర్యాలతో 'యురేకా!' అని సంతోషంతో అరిచి, ఎగిరి గంతేసి, సంతోషం

పట్టలేక, ఏం చేయాలో తోచక, ఒకర్నొకరు కౌగలించుకున్నారు. వారి ఈ ఆనందానికి కారణం ఏమైయుంటుంది?!

❖ ❖ ❖

డా॥ జుక్కర్‌మాన్ కూడా తన కంప్యూటర్‌లో వచ్చిన ఈ సందేశాన్ని చూడగానే ఆనందంతో వెలిగిపోతున్న అతను అక్కడే ఉన్న కాన్ఫరెన్స్ హాలులోకి అందరినీ రమ్మని సైగ చేసి పరుగులాంటి నడకతో వేదికపైకి వడివడిగా ఎక్కి, మైకు చేతిలో తీసుకుని ఆ వచ్చిన ప్రింట్ అవుట్‌లోని విచిత్రాన్ని మిగతావారందరితో చర్చించ సాగాడు.

"ఇన్నాళ్ళు రాత్రింబవళ్ళు శ్రమించినదానికి ఫలితమే ఇవ్వాళ్ళ జరిగిన ఈ అద్భుతం. మామూలుగా, ఇంతవరకు సాటిలైట్ ద్వారా పంపిణీ అయిన వర్ణచిత్రాలు మనకి, పొలాల్లో రకరకాల వైవిధ్యమైన ఒక పద్ధతితో వచ్చిన కత్తిరింపు పైర్లు, మన ముగ్గులకి మల్లే ఉన్నా, విపరీతమైన క్లిష్టమైన డిజైన్లుగా వచ్చాయి. కానీ ఇవ్వాళ్ళ వచ్చిన చిత్రం పొలాల్లో ఇంతవరకూ వచ్చిన అన్నీ వివిధ ముగ్గులకి మల్లే వచ్చిన వాటి చోట్లో మళ్ళీ యథాస్థితిలో ఎకరాల కొద్దీ పచ్చటి పైర్లు ఉండటమేకాక, ఈసారి ఆంగ్లభాషలో చక్కగా అక్షరాల రూపంలో కత్తిరింపబడి, ఈ సందేశం మనకివ్వబడినది, అని ఆ సందేశాన్ని చదువసాగాడు. 'ఫ్రెండ్స్! మీ అందరి మనోఃస్థితిని, మీ అందరిలో జరుగుతున్న అలజడిని, మేము నెల రోజులుగా గమనిస్తూనే ఉన్నాము. ఇంతవరకూ కత్తిరింపబడిన పైర్లు, అలజడి కొన్ని కోట్ల లైట్ ఇయర్స్ దూరంలో ఉన్న 'ఫ్లూటాన్', (అదీ మీరు పెట్టిన పేరే,) నుంచి వచ్చిన పరగ్రహవాసులము. మీకన్నా కొన్ని కోట్ల యుగాల ముందున్నది మా విజ్ఞానం. ఏ భాషలో నన్నా మేము రాయగలం. మా యంత్రాలు మీ భూలోక టైమైన సెకన్లలో పని ఎకరాల కొద్దీ ముగించగలవు. మీకు అదే పని ఆరు, ఏడు నెలలు పట్టొచ్చు. అదే మోస్తరుగా, మీరు గుట్టమీద చీకట్లో ఏర్పాటు చేసుకున్న ఏర్పాట్లన్నీ మా అంతరిక్ష నౌకల్లో మా యంత్రాలు, మీ కంప్యూటర్‌ల కన్నా ఎన్నో కోట్ల రెట్లు ఆధునిక పరికరాల్లో స్క్రీన్ మీద స్పష్టంగా కనిపిస్తాయి.

ఇక మిమ్మల్ని ఆట్టే ఆదుర్దా పరచదల్చుకోలేదు మేము. మూడే అడుగులు ఎత్తుండే మేము మీ గుమ్మడికాయ కన్నా పెద్ద తలలు కలవాళ్ళం. పచ్చటి వర్ణంకల వంటిమీద రోమాలు లేవు మాకు. ఆకలి దప్పులులేని మేము, పుట్టగానే ఒకే ఒక 'న్యూక్లియాన్' అనే అణుశక్తి ఇముడ్చుకున్న మాత్ర మింగుతాము. మీ మునక్కాడలమల్లే ఒక్కో చేతికి ఒక్కో కాలికి రెండే రెండు వేళ్ళు మాకు. లింగభేధాలు లేవు. మా మధ్య సంతానం కావల్సినప్పుడు ఒకే ఒక వేపకాయంత పరిమాణంలో పిండం మా నోట్లోంచి

క్రింద పడగానే మా పరిమాణానికి వెంటనే ఎదిగిపోతుంది. చదువంతా మా యంత్రాలు కేవలం పది రోజుల్లో చెప్పిస్తుంది. ఆ తర్వాత అది కూడా మాకు మల్లే పరిశోధనలు జరుపుతుంది. జీవితకాలం మీకు మల్లే వంద సంవత్సరాలు కాదు. మాకు ఇష్టం వచ్చినన్నాళ్ళు బ్రతకచ్చు. మేము కావాలనుకున్న విజ్ఞాన పరిశోధనలు ముగియగానే, ఒక భస్మపు పెట్టెలో పడుకుంటాము. సెగ, వేడి లేని జ్వాల. మేము లోపల ఉన్న ఒక మీటనొక్కగానే భస్మం అయిపోతాము. మీకు మల్లే చెట్లూ, చేమలు, నీళ్ళు లేవు. నీళ్ళకు మల్లే ఉన్న హైడ్రోజెన్ పెరాక్సయిడ్ కలర్‌బాటిల్ దాచబడినది, దాహం లాటిది వేసినప్పుడు త్రాగుతాము. ఇలా చెబుతూ పోతే, ఇంకా చాలా ఉన్నది. మీ గోళం మీద గత కోటి సంవత్సరాలుగా మేము పరిశోధనలు చేస్తూనే వున్నాము. ఎంతో వెనుకబడి వున్న మీ విజ్ఞానం, మా పరిణతి చెందాలంటే ఇంకా కొన్ని కోట్ల యుగాలు పట్టొచ్చు. మీకు మల్లే మాకు దేవుళ్ళు లేకపోయినా ఒక అజ్ఞాతశక్తి, 'డార్క్‌మ్యాటల్' మన గోళాలు కొట్టుకోకుండా, ఒక రీతిలో ఉంచటం వల్ల మనకెవరికీ ప్రాణహాని కలుగటం లేదు. ఈ అజ్ఞాతశక్తినే మీరు దేవుడుగా పరిగణిస్తారు, మేము కూడా ఒక విధంగా ఈ ఒక్క విషయంలో మీతో పూర్తిగా ఏకీభవించటమే కాకుండా, ఇంత అభివృద్ధి కల విజ్ఞానం మాకు ఉన్నా కూడా ఈ ఒక్క 'అజ్ఞాతశక్తి'ని మట్టుకు మేమే కాదు ఇతర పరగ్రహవాసులు కూడా కనుక్కోలేకపోతున్నారని అంగీకరిస్తాము.

మేము ఏ రూపమైనా దాల్చగలం. ఏ భాష అయినా మాట్లాడగలం. మనుష్యుల మధ్య కలిసిపోయి మా ఉనికి కూడా తెలియనివ్వకుండా మీ మధ్యనే తిరుగుతూ, ఎవ్వరికీ హాని తలపెట్టకుండా మా పరిశోధనలు సాగిస్తూనే ఉన్నాము. అవే మీకు అప్పుడప్పుడు ఎదురయ్యే 'గుర్తు తెలియని ఎగిరే పళ్ళాలలో' మా వాళ్ళు భూగోళం మీద ఏ కొండల మీదో దిగి, మీలో ఒకడుగా కలసిపోయి, మీ గోళం మీద పరిశోధనలు చేస్తూంటే ఆటోమాటిక్‌గా చొక్కా గుండీలో ఒకటిగా ఉన్న మా కంప్యూటర్లు అన్ని సమాచారాలు అందజేస్తూనే ఉంటాయి. మేము మీకు ఏ హాని తలపెట్టం. ఇతర పరగ్రహవాసులు సైతం యుద్ధాలు చేయరు. అందరూ తమ తమ పరిశోధనలు త్రికరణశుద్ధిగా చేస్తూ, మాకు మల్లే జీవిస్తున్నారు. అందుకే మాకు మీ భూగోళంలో జరుగుతున్న గందరగోళం, దేశ విదేశాల్లో శాంతి భద్రతలు క్షీణించిపోతూ, యుద్ధాలు, కక్షలు పెరిగిపోవటం చాలా విచిత్రంగా అనిపిస్తుంది. మీరు కాలం వృథా చేస్తున్నారేమో అని మా అభిప్రాయం.

మాకు చెట్లూ చేమలు, పైర్లు, సెకన్లూ, క్షణాల మీద మళ్ళీ యథాప్రకారం వాటిని ముందున్న స్థితికి పెంచగల యంత్రాలున్నాయి. అందుకే మొదట మా ఉనికిని తెలిపేవిగా కత్తిరింపులు విస్తారమైన మీ పొలాల్లో చేసి, మళ్ళీ వాటిని యథాస్థితికి

తెచ్చి, ఇప్పుడు ఈ సందేశం వచ్చేటట్లు, ఆంగ్ల అక్షరాల రూపంలో పొలాలని కత్తిరించి, ఆ సందేశం మీకు మీ కంప్యూటర్ ప్రింట్స్‌లో మీ చేతుల్లో పడగానే మీ మీ పొలాలన్నీ మళ్ళీ యథాస్థితికి, ఎప్పటిలా పచ్చటి పైర్లుగా మార్చేశాము.

మీలో కుతూహలం, ధైర్యసాహసాలున్న వారు మేము మళ్ళీ వచ్చినప్పుడు, మమ్మల్ని తాకితే మా రూపానికి మారతారు. మా రూపులో ఉంటేగానీ మా నౌక గుర్తించగలదు. అలా లేని పక్షంలో 'సెక్యూరిటీ'కై భస్మం చేసేస్తుంది. కనుక అలా, ముందుకీ వెనక్కీ ఎన్నిసార్లైనా మనిషి మా రూపానికి మారి, మాతో మా గోళానికి వచ్చి అన్నీ చూశాక మళ్ళీ మేమే మిమ్మల్నిక్కడ దింపగలము. (ఈ విషయాలు నా కథా 'పున్నమి నాటికి...లో ఇదే విధంగా వివరించబడినది) మీకు నమ్మకం, ధైర్యం ఉంటేనే మాలా మీరూ వైజ్ఞానికులు కావున తప్పక వచ్చి మా ఆతిథ్యం స్వీకరిస్తారని ఆశిస్తున్నాము. ఇలా మిమ్మల్ని భయాందోళనలతో ఓ నెలపాటు సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తినందుకు మా హృదయపూర్వక క్షమాపణలు, ఇక వెళ్ళి మీ పొలాలు యథాస్థితిలో ఉన్నాయో లేవో చూసుకోండి. మీకు మమ్మల్ని ఎప్పుడు 'కాంటాక్ట్' చేయాలన్నా మీ కంప్యూటర్లో 'UFO'-COME అని 'గూగుల్'లో టైపు చేసి మీటనొక్కితే మూడే నిముషాల్లో మా నౌక మీ పొలాల్లో సమతలమైన ప్రదేశాల్లో దిగుతుంది. మా గోళానికి కేవలం మూడు నిముసాల్లో చేరగలదు. ఎటు పడితే అటు ఎగరగల శబ్దం లేని మా అంతరిక్షనౌక గుడిగంట ఆకారంలో లేక పళ్ళెం ఆకారంలోనో ఉన్నవి ప్రీప్రోగ్రామ్ అవటం వలన మీ గోళానికి చేరగలదు."

అని గట్టిగా నిట్టూర్చి చదవటం ముగించాడు డా॥ జుక్కర్‌మ్యాన్. అందరూ నోటమాట పెగలక, నిశ్శబ్దంగా ఆ వచ్చిన సందేశాన్ని ఏకాగ్రతతో విన్నారు.

మళ్లా అందరూ వారి వారి కంప్యూటర్లకేసి తిరగగానే పొలంలోని అక్షరాల రూపంలో కనిపిస్తున్న పైర్లు మెల్ల మెల్లగా తామంతట తామే పెరుగుతూ మళ్ళీ యథాస్థితికి పచ్చటి పైర్లుగా మారిపోయాయి.

ఎక్కడో కోడి సంతోషంగా ఆరు గంటలకు తొలి ఉదయం అయిందని స్పందిస్తూ కూసింది. అలసిపోయిన వైజ్ఞానికులు తమ తమ కుర్చీల్లోనే మనశ్శాంతితో కళ్ళు మూసుకుని వెనక్కి వాలారు.

❀ ❀ ❀

# నీళ్ళ మీద నడిచిన మనిషి

'అమ్మదొంగా! శెలవే కదా అని నా దుప్పటిలోపల దూరి, మీరు చేస్తున్న అల్లరి ఇదా! వదలండి, ఇంక చాలును సరసాలు! రోజురోజుకీ చంటిపిల్లాడై పోతున్నారు మరీను! ప్రొద్దుపోయింది ఇక లేవండి శ్రీవారు!' అంటూ గోముగా భర్త డా॥ చక్రపాణి దుప్పటి తొలగించింది డా॥ వాణి. అసమానమైన సౌందర్యం, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే కళ్ళు చెదిరిపోయే యవ్వనపు పొంగు, అడుగడుగునా చలాకిగా రెపరెపలాడే చారెడేసి కళ్ళు, ఎర్రటి నిండైన పెదవులు, సన్నని నడుముకల డా॥వాణి దగ్గర దగ్గర ఐదడుగుల పదంగుళాల పొడవుతో, నిలబడితే ఒక అపురూపమైన అజంతా శిల్పమే ప్రత్యక్షమైనట్లుంటుంది. ఆమెకు పోటీగా అన్నట్లు, ఆరడుగుల రెండంగుళాల పొడవు, కసరత్తుతో జాగ్రత్తగా పెంచిన కండలు తిరిగిన శరీరం, మగతనం ఉట్టిపడే ఆమె భర్త ముప్పై ఎనిమిదేళ్ళ న్యూక్లియర్ ఫిజిసిష్టు, ఏరోస్పేస్ ఇంజనీరైన డా॥ చక్రపాణి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేచి, మళ్ళీ గబుక్కున తన భార్యను కౌగిలిలో బిగించి మాట్లాడనివ్వలేదు ఆమెను. సిగ్గుతో ఎర్రబడిన ముఖాన్ని నెమ్మదిగా తప్పించుకుని, ఏ.సీ. రిమోట్‌తో ఆర్పేసి, దాదాపు ఇరవై చదరపు అడుగులున్న బెడ్‌రూమ్ కిటికీ తెరలు తెరవటానికి పరిగెత్తింది. కర్టెన్లు లాగి కిందికి చూసింది. అప్పటికే తమ పిల్లలిద్దరూ లాన్‌లో ఆటలాడుతున్నారు. పెద్దవాడు సుమంతశర్మకి ఆరేళ్ళు. రెండోది ఆడపిల్ల, మూడేళ్ళపాప ముద్దొస్తున్న అరుంధతి. పిల్లలిద్దరికీ ఒకరంటే ఒకరికి పంచప్రాణాలు. ఆరోజు శనివారం కావున, హూస్టన్‌లో ఉన్న వారి స్కూలికి శెలవు. తమకీ శెలవే!

న్యూక్లియర్ ఫిజిసిస్ట్, ఏరోస్పేస్ ఇంజనీర్ డా॥ చక్రపాణి, డా॥ వాణి భార్యాభర్తలు. వీరిద్దరూ తమ తమ స్పెషాలిటీస్‌లో మాస్టర్స్ డిగ్రీలు కాగానే ముందు టెక్సాస్‌లో ఉన్న డల్లస్‌కి వెళ్ళి ఇద్దరూ తమ తమ పిహెచ్.డి.లు ముగించగానే డా॥ చక్రపాణికి ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అండ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పి. హెచ్‌డి. చేయటం వలన 'నాసా'లో హ్యూస్టన్‌లో సైంటిస్ట్‌గానూ, డా॥ వాణి వెటర్నరీ మెడిసిన్, డెంటల్ సర్జరీలు రెండు డిగ్రీలు చేశాక పిహెచ్.డి. స్టెమ్‌సెల్ రీసెర్చి చేయటం, పి. హెచ్‌డి. రాగానే హ్యూస్టన్‌లో ఉన్న వెటర్నరీ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఈ మధ్యనే మొదలు పెట్టిన క్రొత్త విభాగం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనిమల్ డెంటల్ సర్జరీలో ప్రొఫెసర్ అండ్ హెడ్ ఉద్యోగం లభించింది. తాను ముఖ్యంగా 'స్టెమ్‌సెల్స్'ని లాబొరేటరీలో ఉత్తేజపరిచి, వాటి నుంచి ఎలా జంతువుల పళ్ళకు (దంతవైద్యం) సంబంధించిన

వ్యాధులను అవలీలగా బాగుపరిచే పద్ధతులను రిసెర్చి చేసి కనుక్కున్న విషయాలు, ఇప్పుడిప్పుడే మనుష్యులకు మల్లే వాటికి కూడా దంతవైద్యం చేయటానికి క్రొత్తక్రొత్త అత్యాధునిక పరికరాలు, పద్ధతులు అవలంబించడానికి డా॥ వాణికి ఓ మంచి సదావకాశం దొరికింది.

❖ ❖ ❖

వారి పిల్లలిద్దరూ అమెరికాలో పుట్టి పెరిగినా పిల్లలిద్దరితో స్వచ్ఛమైన తెలుగు భాషలోనే మాట్లాడతారు. అక్షరాలు తెలుగులో వారిచేత రోజూ దిద్దించి, తెలుగు కూడా వ్రాయటం చదవటం మేరకు నేర్పించారు. విపరీతమైన దేశభక్తి, తెలుగు సంస్కృతిపై అమితమైన గౌరవం, ఆసక్తి కల ఆ యువ దంపతులు.

ఆ రోజు శనివారం కావున, పిల్లలిద్దరికి కాస్త ఆట పాటలకు స్వేచ్ఛనిస్తారు ఆ దంపతులు. బయట ఆటలన్నీ ముగిసి, అన్నాచెల్లెండ్రిద్దరూ నేరుగా ఎక్కడికొస్తారో వాళ్ళమ్మ వాణికి బాగా తెలుసు. నేరుగా డైనింగ్ టేబిల్ దగ్గర కెళ్ళి అప్పటికే వాళ్ళమ్మ రెండు ప్లేట్లలో ఉంచిన పాలల్లో కలిపిన పారిడ్జి, కార్న్‌ఫ్లేక్స్ మరో ప్లేట్లో, అటు పిమ్మట బోర్న్‌విటా రెండు గాజుగ్లాసుల్లో పోసి సిద్ధంగా ఉంచటం వలన, పిల్లలు ఆవురావురుమని ఆరగించటమేమిటి, వెంటనే టివి రిమోట్ తోటి గోడనంతా పరచుకున్న 'సోనీ' హోమ్ థియేటర్ పెట్టటమేమిటి, టంచనుగా 8 గంటలకు వచ్చే తమ ఫేవరెట్ ఇంద్రజాలికుల 'డైనమో' (అస్సలు పేరు స్టీవెన్ ఫ్రైన్) చేస్తున్న వింతనూ అత్యాసక్తితో అతని అద్భుతమైన ఇంద్రజాలం చూడసాగారు. డైనింగ్ టేబిల్ దగ్గర ఆనాటి పేపర్ డా॥ చక్రపాణి చదువుతూ, మధ్య మధ్య పారిడ్జి తింటూ ఆరింజ్ జూస్ చప్పరిస్తున్నాడు. అతని భార్య అన్నీ అందిస్తూ తానూ తినసాగింది.

ఉన్నట్లుండి "డాడీ అండ్ మామ్! ఇటు చూడండి! అద్భుతం! డైనమో ఇంగ్లండులో ఉన్న థేమ్సు రివర్ లండన్‌లో, నీళ్ళపై నడుస్తున్నాడు!" అని పిల్లలు నోరు తెరుచుకుని చూడసాగారు. చక్రవర్తి, వాణి సాలోచనగా మెగా టి.వి. స్క్రీన్ వైపు చూసి, ఏకాగ్రతతో తినటం ఆపి చూడసాగారు. నిజంగానే తమ పిల్లలు చెప్పినట్లు 'థేమ్జ్' నది పై ఓ సన్నటి మనిషి, రెండు చేతులు బార్లా (జీసస్ క్రైస్టుకు మల్లే) చాపి నీటి నడి మధ్య దిక్కుగా, నీటిపై నడుస్తున్నాడు. ఇది ఇంద్రజాలం అనటానికి వీలు లేదు. వేల కొద్దీ మనుష్యులు పిట్టగోడ వారగా నిలబడి అవాక్కయి, 'డైనమో' చేస్తున్న ఈ విపరీతపు వింతను ఆశ్చర్య చకితులై నోట మాటరాక చూస్తున్నారు. 'థేమ్సు రివర్' అనబడే నది, లండన్ నగరం నడిమధ్యన ఎప్పుడూ ఉధృతం లేని, శాంతంగా నిలచి ఉన్న మహానదిలో ఒక భాగం. 'డైనమో' ఇంద్రజాలికుడే అయి

ఉండవచ్చు. 'మాస్ హిప్నటిజం' చేస్తున్నాడని కొందరనుకుంటే 'మెస్మరిజం' అని మరికొందరన్నారు. కానీ అతను చేసే అన్ని గమ్మత్తులను అలా కొట్టిపారేయలేము కదా! ఇలా ఆలోచిస్తున్న డా॥ వాణి భర్తతో ఇలా అన్నది. "నేను ఈ ఛానెల్ (History Channel) లో ఈ అపురూప వ్యక్తి చేస్తున్న గమ్మత్తులు చూస్తున్నాను. కొన్ని కొన్ని భూమ్యాకర్షణ శక్తినే ధిక్కరిస్తూ ప్రాణాపాయం కలిగించేవి కూడ ఉన్నవి. ఉదాహరణకు, దక్షిణ అమెరికాలో ఉన్న 'బ్రెజిల్'కి రాజధాని అయిన రియోడిజనీరోలో అతను చేసిన అద్భుతమైన వింత మానవాతీతమైనది. సముద్రపు ఒడ్డున ఉన్న ఒక వెయ్యి మీటర్ల ఎత్తులో ఉన్న జీసస్ క్రైస్టు శిలాప్రతిమకి ఒడ్డున, తను కూడా శిలలో క్రైస్టుజాపినట్లు చేతులు జాపుకుని కొన్ని వేలమంది టూరిస్టులు తమ తమ సెల్‌ఫోనులలో ఫోటో తీస్తూండగా మెల్లమెల్లగా వెయ్యి మీటర్లు ఎత్తుకి లేచి ఒక పరిధిలో పది నిముషాల పాటు గాలిలో తేలియాడుతూ ఉండిపోయిన పిమ్మట, మెల్లిమెల్లిగా క్రిందకు నేల మీదకు హెలికాప్టర్ దిగే విధంగా దిగిపోయాడు. దీని మీద అనేక 'గూగుల్' చర్చలు. కొంతమంది అనుకోవటం సన్నటి తీగలతో ఎక్కణ్ణుంచో ఒక యంత్రం కంటికి కనపడని విధంగా భూమి క్రింద దాచి, మాగ్నెట్‌కి మల్లే పైకి ఆ తీగలకు అతని వీపులో కొక్కేలు తగిలించి ఉండటం మూలాని పైకి గాలిలోకి లేవగలిగాడని. అలాంటి చర్చలు ఉన్నా ఎవ్వరూ ఇదమిద్ధంగా తేల్చలేకపోతున్నారు" అని చెంచాతో పారిడ్జి నోట్లో పెట్టుకుంటూ భర్త వైపు తిరిగిన ఆమె, డా॥ చక్రపాణి తనవంతు పారిడ్జి అప్పుడే తినటం ముగించి ఆరంజి రసం సిప్ చేస్తూ అన్నాడు. "ఏది ఎలా ఉన్నా, ఇంద్రజాలం కూడ ఒక విద్యే. కోటివిద్యలు కూటి కొరకే అని మన పెద్దలు ఎప్పుడో అన్నారు కదా!" అని ఒక ఆపిల్ ముక్క ఫోర్క్‌తో గుచ్చి నోట్లో పెట్టుకుని తింటూనే మాట్లాడసాగాడు.' "డైనమో' అసాధారణమైన మానవాతీతమైన శక్తులు కలవాడు. అఫ్‌కోర్స్! మామూలు ఇంద్రజాలం పిల్లలకై వేడుకనిచ్చేవి కూడా ఎన్నో చేస్తున్నాడు. ఎక్కడా వేదికపై ఇంద్రజాలపు ప్రదర్శనలు ససేమీరా ఇవ్వటానికి ఇష్టపడని అతనికి మరో ప్రత్యేకత ఉన్నది. అదేమిటంటే, ఎందరో వ్యాపారవేత్తలు అడగవలసిన అవసరం లేకుండానే (అతని ఏకాగ్రత, ప్రతిభా లోకమంతటా టెలివిజన్ ద్వారా తెలియటం వలన) ధన సహాయం, స్పాన్సర్‌షిప్ అతని ప్రయాణఖర్చులు, భోజనం బస ఏర్పాట్లు' ఏ దేశానికేగాలన్నా విమాన ఖర్చులతో సహా పెట్టగా, అతను ఇంగ్లండు వాసి కావటం మూలాని, అక్కణ్ణుంచి అన్ని దేశాలకు పయనమయి, అలా పట్నాల తర్వాత పట్నాలలో కేవలం కాలినడక, లేక కొన్ని చోట్లలో తానే కారు (బాడుగ కారు) నడుపుకుంటూ ఒక పట్నం నుంచి మరో చోటికి పయనిస్తూ చిన్న చిన్న ఇంద్రజాలపు గమ్మత్తుల నుంచి ప్రాణాంతకమైనవి కూడా చూపించాడు. ప్రతిసారి ఒక క్రొత్త ప్రయోగం

క్రొత్త క్రొత్త ప్రదేశాలకి పయనిస్తూ, చూపించాడు, ఇంకా చూపిస్తూనే ఉన్నాడు!" అన్నాడు. 'అవును!' అంటూ డా॥ వాణి మళ్ళీ అందుకుంది. "నేను చూసినంతవరకూ, భారతదేశం కూడ పయనించిన డైనమో, 'ధరావి' అనే స్లమ్ ప్రదేశం బాంబేలో అతి విచిత్రమైన, అసాధారణమైన గమ్మత్తులు కొన్ని పిల్లల గుంపులకి చేసి చూపించాడు. ఒక చిన్న కర్చీఫుని ఒకసారి దులపగానే అది మనకంటి ఎదుటనే ఎనిమిది గజాల చీర అయింది! అతడు గుమిగూడినా ఆడపిల్లలకి ఆ క్రొత్త చీర ఇచ్చేసి మరో చోటికి కాలినడకనే వెళ్ళి, మరో పిల్లల గుంపులో ఒక పదేళ్ళ కుర్రాణ్ణి చూపుడు వేలు ఆ అబ్బాయి ఛాతి మీద ఉంచి అలా అలా గాలిలోకి సునాయసంగా వేలు ఆ పిల్లాడికి అతుక్కున్నట్లు కనిపిస్తూ పది అడుగుల ఎత్తుకు మెల్లిమెల్లిగా లేవనెత్తాడు."

అంతవరకు తలిదండ్రుల మాటలు టివి ఆఫ్‌చేసి వింటున్న పిల్లలిద్దరూ ఒక్కమ్మడిగా "అవును అమ్మా! అతను అమెరికాలో ఒక నూరు అంతస్తుల డాబా నుంచి నిటారుగా నడుస్తూ, కిటికీల మీదుగా ఒక బల్లికిమల్లే సునాయాసంగా క్రింద నేలమీద వరకు నడిచి వచ్చి మామూలుగా ఏం ఎరగనట్లు పెడస్ట్రియన్ సైడ్‌వాక్‌లో నడిచిపోవటం మేం చూశాం" అని ఏక కంఠంతో చెప్పారు తల్లిదండ్రులకి.

"ఇటువంటి వ్యక్తిని కేవలం ఒక ఇంద్రజాలికుడిగా కొట్టిపారేయలేము. షోరూంలో అద్దంలోనుంచి ఆవిరిలా నడిచి బయట రోడ్డు మీదకి పోవటం, బయట నడుస్తూండగా అందరూ చూస్తూండగా గబుక్కుమని అతను వేసుకున్న దుస్తులు కుప్పగా కూలి అదృశ్యమయిపోవటం, షోరూం అద్దంపై అరచేయి ఒత్తగానే విపరీతంగా చేయి వేడెక్కి ఎర్రటి కణకణలాడే నిప్పు రూపంలో అతని అయిదు వేళ్ళు షోరూం అద్దంపై అచ్చుపడిపోవటం, ఇలా చెప్తూపోవచ్చు" అని వాణి తన భర్తవైపు తిరిగి మళ్ళీ ఇలా అన్నది.

"మా పరిశోధనాశాలలో కొందరూ మా చర్చా సమయంలో దీన్ని విజ్ఞానపరంగా చర్చించి చూస్తే ఎన్నో విషయాలు హేతువాదంగా, 'పాసిబిలిటీస్'గా బయటపడ్డాయి. మనకి ఆట్టే తెలియని విషయాలెన్నో యోగాభ్యాసంలో బాగా ఆరితేరిన ఈ మధ్యనే 95 ఏళ్ళకు కీర్తిశేషులైన శ్రీ బి.వి.కె. అయ్యంగారు వారి ఎన్నో ప్రసంగాలు, దేశవిదేశాలలో చెప్పిన విషయాలు కొన్ని ఉన్నాయి. ప్రాణయామ కుండలిని, అధ్యాయనం చేసిన మన పురాణాల్లో ఋషులు, మహానుభావులు, సునాయాసంగా గాలిలోకి భూమ్యాకర్షణ శక్తిని ధిక్కరిస్తూ గాలిలో లేవగలిగారనీ, పీనియల్ గ్లాండ్ మన మెదడులో నిమ్మగింజంత పరిణామంలో ఉన్న చిన్న భాగంలో ఎన్నో రహస్యాలు ఇంకా దాగి ఉన్నవి, అనీను.

'ఇవన్నీ విపరీతమైన ఏకాగ్రత, పట్టుదలతో అదేపనిగా సాధన చేసేవారు, అంటే యోగాభ్యాసం చేసేవారు చాలా మందే ఉన్నారు. యోగాభ్యాసాన్ని మన ఆధునిక విజ్ఞానం (Modern Science) ఫిజియాలజీలో ఒక భాగంగా ఆమోదించింది, ఎన్నో ప్రయోగాలు చేసి యోగా వల్ల ఆశించిన ఫలితాలు లభించిన తర్వాత అన్నది.

'మన భారతదేశం 'యోగా' పుట్టిన దేశం. పలువురు యోగాభ్యాసం లోతుగా, త్రికరణ శుద్ధిగా అభ్యసించి లోకంలో ఎన్నోచోట్ల 'యోగాసెంటర్లు' నెలకొల్పిన అతికొందరిలో మొన్నమొన్ననే 95 ఏండ్లకి పరిపూర్ణమైన ఆరోగ్యంతో ఉండగానే సాధారణంగా వయస్సు మళ్ళిన వారికి మల్లే దివంగతులైనారు, పెద్దగా ఏమీ జబ్బులు లేనప్పటికీ. ఆయన పేరే శ్రీ బి.వి.కె. అయ్యంగార్!" అని నారింజ రసం టెట్రాప్యాక్‌లోనుంచి మరికొంత గ్లాసులోకి ఒంపుకుని సిప్ చేయసాగింది డా॥ వాణి.

"సో డియర్! యోగా గురువుల వద్ద అభ్యాసం పొందేక అనేకమంది మెడికల్ ఫిజియాలజీ ప్రొఫెసర్లు ఎందరో అమెరికాలో, ఇంకా తదితర అగ్రశ్రేణి స్థాయిలో ఉన్న యూరోపియన్ దేశాల వంటి చోట, ముందు 'యోగ' ఆరోగ్యానికి నిజంగా ఎంతవరకు దోహదపడుతుందో చూద్దాం అని మొదలెట్టిన ప్రయోగాలు, పోగా పోగా 'యోగ' మనకి పరిపూర్ణమైన ఆరోగ్యం, జీవితకాలం పొడిగింపు, అనేక జబ్బుల నివారణకు అద్భుతంగా పనిచేస్తుందని ఇప్పుడు డాక్టర్లు, శాస్త్రజ్ఞులు నిరూపించి, నమ్మటమేకాక 'యోగా' ఇప్పుడు మెడికల్ కరిక్యులమ్‌లో ఒక చిన్న అధ్యాయనంగా మారింది. కనుక మనం, ఏదైనా సరే, అన్ని కోణాల నుంచి విజ్ఞానపరంగా ఒక విషయాన్ని పరిశోధిస్తే తప్ప ఒక నిర్ణయానికి ఎప్పుడూ రాకూడదు. అలాటిదే ఈ యువ ఇంద్రజాలికుడైన స్టీవెన్ ఫ్రైన్ (డైనమో) చేస్తూ ఉన్న కొన్ని మానవాతీతమైన గమ్మత్తులు అని, 'పిల్లలు మన మాటలు వింటూ వింటూ అలా జోకొట్టినట్లు సోఫాలోనే నిద్రపోయారు. మనకీ శెలవేగా!" అంటూ నిద్రకుపక్రమించాడు డా॥ చక్రపాణి.

# తెలివిగల వృక్షాలు

స్విజ్జర్‌లాండ్ చిన్న అతిసుందర దేశం. చుట్టూరా మంచుకొండలు త్రాచుపాములా మెలికలు తిరిగిన చక్కటి రహదారులు చిన్న చిన్న గ్రామాలను కలుపుతూ. అతి సుందరమైన ప్రకృతి దృశ్యాలతో కార్లలో వెళ్ళే యాత్రికులకు కన్నుల పండువగా అనిపిస్తుంది. అటువంటి బుల్లి ఊర్లో కొండల మధ్యనున్నదొక ఊరు 'బెర్న్'. ఆ ఊరి నడి మధ్య ఉన్నది ఒక చక్కటి అధునాతన సౌకర్యాలతో కూడిన ప్రయోగశాల/పరిశోధనశాల. బోర్డు మీద బంగారు వర్ణం కల పెద్ద పెద్ద ఇత్తడి అక్షరాలు బాగా పాలిష్ చేయటం వలన కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. దాని మీద ఆంగ్లంలో 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ ఇన్ అగ్రికల్చరల్ బాటనీ" అని వ్రాసి ఉన్నది. అనగా "వ్యవసాయ శాస్త్రమునకు సంబంధించిన వృక్షశాస్త్రపు పరిశోధనశాల" అని అర్థం. అందులో పట్టుమని పదిహేను మంది శాస్త్రజ్ఞులు, టెక్నీషియన్లు లాబ్ అసిస్టెంట్లు, పిహెచ్.డి. చేస్తున్న విద్యార్థులు, విద్యార్థినులు. వారందరికీ ఆ రెండెకరాల చోట్లో చుట్టూరా ప్రహరీగోడ, వారికోసం అంటే అక్కడ పనిచేస్తున్న వారందరికి బసకు చక్కటి క్వార్టర్స్ 'డ్యూప్లే' అపార్ట్‌మెంటులు, చిన్న సూపర్‌మార్కెట్, నీళ్ళ సౌకర్యం, 24 గంటల సెక్యూరిటీ స్విస్‌ప్రభుత్వం చక్కగా అమర్చి కట్టిపెట్టారు.

❖ ❖ ❖

ఇప్పుడా ప్రయోగశాల డైరెక్టరూ ఆయన సతీమణీ ఇద్దరూ తమ పరిశోధనలు ఇరవై ఏండ్లగా అక్కడే పిహెచ్.డి.లో ఇంచుమించు ఒకే అంశంలో చేశారు. భర్త పేరు డా॥ రోలాండ్ జెన్నర్, మెడిసిన్ చదివాక అగ్రికల్చర్‌లో ఒక పిహెచ్.డి. మరో పిహెచ్.డి., మైకాలజీలో చేశాడు. మొదట ఒక మామూలు శాస్త్రజ్ఞుడుగా అతనూ, పిహెచ్‌డిలో సహాధ్యాయురాలైన డా॥ జూలీ ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. ఇంచుమించు ఒకేసారి పిహెచ్.డి, పట్టం పుచ్చుకోవటం మూలాని ఇద్దరికీ శాస్త్రజ్ఞుల ఉద్యోగాలు అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఇచ్చారు. పదిహేనేళ్ళు చాలా చక్కగా రాత్రిం బవళ్ళు పనిచేసి, వాళ్ళ పనితనం, ప్రచురించిన రిసెర్చి పేపర్లు అంతర్జాతీయ ఖ్యాతి చెందటం వలన గబగబా ఇద్దరికీ ప్రమోషన్లు వరసవారిగా ఇస్తూ పోయారు వారి యాజమాన్యం. ఇలా పదిహేనేండ్లలో ఎదుగుకుపోయిన వారిద్దరిలో భర్త డా॥ రోలాండ్ ఇన్‌స్టిట్యూట్ డైరక్టరుగాను, అతని సతీమణి డా॥ జూలీ వెటర్నరీ డిగ్రీ పొందిన

పిమ్మట భర్తకి మల్లే రెండు పిహెచ్.డి.,లు అతను చేసిన సబ్జెక్టులలో చేయటం మూలాన, ఆమె పనితనం కూడా చూసి ఆమెకు డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రమోషనిచ్చారు వారి అధికారులు. అప్పుడు వారు చేస్తున్న ప్రయోగాల్లో ఒక అద్భుతం కనుగోనటం జరిగింది.

❖ ❖ ❖

ఆరోజు శుక్రవారం ప్రొద్దున్నే ఎనిమిది గంటలకల్లా డైరెక్టరు డా॥ రోలాండ్, అతని భార్య డెప్యూటీ డైరెక్టర్ డా॥ జూలీ తమతమ ఆఫీసుల్లోనే ఒక భాగం లాబొరేటరీగా ఉండేట్లు ఏర్పాటు చేసుకోవటం వలన, వారి వారి పరిశోధనాశాల్లోకి వెళ్ళి తమ పరిశోధనలు ముందురోజు వదిలివెళ్ళిన భాగం కొనసాగించసాగారు. మైక్రోస్కోపులోనికి చూస్తున్న డా॥ జూలీ ఉన్నట్లుండి ఒకచోట కేంద్రీకరించి దీక్షగా చూడసాగింది. మైక్రోస్కోపులో ఒకరకం కుక్కగొడుగు (ఫంగస్) మరియు మైటోకాండ్రియల్ డి.ఎన్.ఎ., మనిషి తాలూకు రెండూ మిళితం చేస్తే, (కొన్ని రసాయనాలు ఉపయోగించి) ఏ రకం ఫలితాలు వస్తాయో చూడసాగారు భార్యాభర్తలిద్దరూ. కుక్కగొడుగు (ఫంగస్) వృక్షజాతికి చెందినది. వేరే వేరే లాబొరేటరీల్లో మొదట వేర్వేరు విధాలైన కనుగోలులున్నా, ఒక కొలిక్కి ఆఖరున వస్తే, అలా ఎంతవరకూ, ఎన్ని ప్రయోగశాలల్లో వివిధ దేశాల్లో ఒకే విధమైన ఫలితాలు వస్తే, విజ్ఞానం వాటి ఫలితాలు ఆమోదిస్తుంది. కనుక భార్యాభర్తలు వేర్వేరు పరిశోధనాశాలల్లో చేస్తున్న పరిశోధనలు మొదట వివిధ రకాల ఫలితాలు రూపొందించినా, ఎప్పటికప్పుడు డా॥ రోలాండ్, డా॥ జూలీలు తమ తమ ఫలితాలు రోజూ పోల్చుకుంటూ ఉంటారు. అలా చేస్తున్న ఈ ప్రయోగాల్లో ఆనాడు డా॥ జూలీ మైక్రోస్కోపులో చూసిన జంతు జాలంలో అగ్రశ్రేణిలో వున్నవాడు మనిషి. మైటోకాండ్రియా ప్రాణవాయువు పీల్చేటపుడు తగిన పరిస్థితులు కల్పిస్తుంది. బొగ్గుపులుసును వదిలేటపుడు మైటోకాండ్రియా తనలో దాచుకున్న శక్తిని ఉత్పత్తి చేస్తుంది/ లేక ఆ శక్తి ఉపయోగపడేట్లు చేస్తుంది. అట్టి 'మెట్రోకాండ్రియాలోని సూక్ష్మమైన బ్రహ్మముడి డిఎన్ఏ జంతుజాలలోని డిఎన్ఏలు, వృక్షజాలంలో డిఎన్ఏ లో కలిపితే ఏం అవుతుంది చూద్దాం అని విజ్ఞానం పరిశీలిస్తోంది?

వెంట వెంటనే ప్రక్క రూములో ఉన్న భర్తను పిలిచి చూపించింది. అతను కూడా సంభ్రమాశ్చర్యాలతో చూడసాగాడు. తాము ఆశించిన ఫలితాలకన్నా హెచ్చు మోతాదులోనే కనబడ్డాయి, అందులోని వింత. ఏమా వింత అంటే, ఫంగస్ (కుక్క గొడుగులోని) 'స్పోర్స్' (అనగా విభజనలో క్రొత్త మొలక ఎత్తగలిగిన పదార్థం, కానీ

పెద్ద వృక్షాల గింజతో పోల్చలేము) మనిషి డిఎన్ఏతో కలవటమే కాక, ఒక పద్ధతిలో, 'అమైనో ఆసిడ్స్' ఏర్పాటు అయి శాస్త్రజ్ఞులకు అర్థమైన భాషలో, అవి తెలివైన 'మెసేజ్'లను (వర్తమానం)లు, ప్రతిరూపించ సాగాయి ((ప్రొజెక్ట్ అయినాయి)

"అంటే జూలీ మనకిప్పుడు కావల్సిన రూపంలో వివిధ రకాలైన ప్రోటీనులు, (మాంసకృత్తులు) ప్రయోగశాలలో తయారు చేసుకోవటమేగాక, వృక్షాలే మనకిప్పుడు వైవిధ్యమైన ఆలోచనలు అందిస్తూ, పోగా పోగా మనుష్యులు, జంతువుల జబ్బులను నివారణ గలిగింపజేయు మందుల తయారీ చాల దగ్గరలోనే అందుబాటులో సాధించగలము. ఇలా భార్యనుద్దేశించి అంటూ, డా॥ రోలాండ్ జెన్నార్ ఎగిరి గంతేసి, ప్రయోగశాల అనే విషయం కూడ మర్చిపోయి, భార్య జూలీని గాఢాలింగనం చేసుకున్నాడు.

❖ ❖ ❖

ఇలా మరో నాలుగేళ్ళు గడిచిపోయాయి. పైన చెప్పిన విషయాల్లో పరిశోధనలు విపరీతమైన అంగలు వేయటమే కాక అంతర్జాతీయ జర్నల్స్‌లో ఒక మూడు వందల రీసెర్చి పేపర్లు అచ్చయినాయి. ఈ ఫలితాలు డా॥ రోలాండ్ జెన్నార్, అతని సతీమణి డా॥ జూలీలకు 'నోబెల్ ప్రైజ్ ఇన్ ఫిజియాలజీ అండ్ మెడిసిన్' తెచ్చిపెట్టాయి. ప్రపంచఖ్యాతి గాంచిన ఆ ఇద్దరూ స్విస్ టెలివిజన్ బ్రాడ్‌కాస్ట్‌లో ఇలా ప్రసంగించారు.

"మనిషి అన్ని జంతువులూ, వృక్షాలకన్నా అగ్రశ్రేణి స్థాయిలోకి ఎదగటం ముఖ్యంగా తెలివితేటలు వృద్ధి చెందటం, మెదడు విపరీతంగా పరిణతిచెంది ఆలోచించగలగటం, కోట్ల సంవత్సరాల కొద్దీ కాలచక్రంలో వికాసం చెందాయన్న విషయం మనకు విదితమే. అలాగే వృక్షజాతి కూడా కొన్ని కోట్ల సంవత్సరాల కాలచక్రంలో వికాసం చెంది, వెయ్యి మీటర్ల పొడవుగల మహావృక్షాలు అడవులలో కొండలలో వికాసం చెందాయి. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం బాక్టీరియా ఫంగస్‌లు, ఆ తర్వాత ఆకులలో పచ్చటి 'క్లోరోఫిల్' అనే రసాయనోత్పత్తిలో 'ఆల్గే'లు తయారవటమేకాక, తామంతట తామే సూర్యరశ్మి సాయంతో తమకు కావల్సిన ఆహారోత్పత్తి చేసుకోగలిగాయి. ఆ పచ్చని 'క్లోరోఫిల్' ఈనాటి మహావృక్షాల వరకు చూడొచ్చు" అని ప్రక్కనే పెట్టిన గ్లాసులో నీళ్ళు త్రాగి భార్య వైపు చూశాడు చిరునవ్వుతో. ఇప్పుడు మాట్లాడటం తన వంతు అని గ్రహించిన డా॥ జూలీ అందుకుంది.

"అసలు బాక్టీరియా, ఫంగస్‌లలో ఇలాంటి పచ్చటి 'క్లోరోఫిల్' అనే రసాయనం లేకపోగా, బాక్టీరియా అనబడే సూక్ష్మజీవులు మిగతా జీవరాసులపై ఆధారపడటం

లాంటిది జరిగేది. అందులో 'పారసైట్స్' అనబడేవి ఆ ఆధారపడినపుడు ఆ జీవరాసికి హాని కలిగించే రకంగానూ, లేక చనిపోయి కుళ్ళిపోతున్న మృతకళేబరాలను తమ రసాయనాలతో ఛేదించి, వాటివల్ల తమ ఆహారం ఏర్పాటు చేసుకోవటం లాంటివి జరిగేది, ఇంకా ఈనాటి వరకూ జరుగుతూనే ఉంది. (Saprophytes) ఇలాటి ఒక ఫంగస్ నుంచే 'పెనిసిలిన్' అనే మందు తీయగలిగాడు సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ అనే శాస్త్రజ్ఞుడు. ఇలా 'బూజు' (Fungus) నించి మందుల తయారీ సాధ్యమని ఆ ప్రజ్ఞాశాలి కనుకున్నాడు. ఈనాటికీ 'పెన్సిలిన్' ఒక ముఖ్యమైన 'ఆంటీబయోటిక్' (Anti Biotic) అంటే పలురకాల జబ్బులు 'పెన్సిలిన్' ఇంజెక్షన్‌తో పోగొట్టుకోగలుగు తున్నాము.

ఇలా చేస్తూపోతున్న పరిశోధనలలో, కొన్ని కొన్ని మందులు 'పెన్సిలిన్'కి మల్లే బయటపడుతూ, కాకతాళీయంగా ఎన్నో మందులు ఆంటీబయాటిక్స్ కొన్ని వందల సంవత్సరాలుగా కనుక్కోబడటం వలన మనుష్యజాతికి జంతుజాలాల జబ్బులు విపరీతంగా తగ్గటమేకాక ఆరోగ్యం వృద్ధి చెందింది (అలాగే మన ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నంలో మెడిసిన్ చదివిన డా॥ ఎల్లా ప్రగడ సుబ్బారావుగారు మొట్టమొదటిసారిగా చెవిలో నెప్పి తెచ్చే బాక్టీరియాని (స్టాఫ్ ఆరియస్) అంతం చేసేందుకు కనుగొన్న బాక్టీరియా పేరు 'సుబ్బామైసిన్' అన్నా, అటు పిమ్మట అమెరికా వారు 'క్లోరాంఫెనికాల్' అని అదే మందుని 'క్లోరోమెసిటిన్'గా ఫైజరువారు మెడికల్ షాపులలో అమ్మసాగారు లోకమంతటా! (మన ఎల్లా ప్రగడ వారికి దక్కవలసిన ఖ్యాతి చేయిజారిపోయింది ఈ విధంగా)

ఒక్కసారి ఆగి, మళ్ళీ ప్రారంభించింది డా॥ జూలీ. ఇప్పుడు మనం ఎక్కింది మొదటిమెట్టు. త్వరలోనే, అంటే ఇంకో యాభై సంవత్సరాలలోపు వృక్షాల డి.ఎన్.ఏలు, (ఇలా జంతు జాలంలోని డిఎన్‌ఏలను వృక్షజాలం కలిపితే, అట్టి జంతువులను 'ట్రాన్స్‌జెనిక్' అని పేర్కొంటారు) మనుష్యుల జంతుజాలాల డి.ఎన్.ఏలు ప్రయోగశాలలో అవలీలగా కలపబడి, వృక్షాలు చెప్పగలిగే సీక్వెన్స్‌లో మనకు తెలీని ఎన్నో మందు మాకులు, నిగూఢంగా వృక్షాలలో దాగి ఉన్నవి, మరియు ప్రాణాలు కాపాడ గలిగిన ఔషధాలు ఇలా ఉత్పత్తి చేయటం వలన మనుష్య జాతి అవలీలగా 150 సం॥ లేక 200 సం॥ దాకా నవయౌవ్వనుడుగా మిగలగలిగిన పరిస్థితులు కూడా ఉన్నాయి. అవెలాగంటే క్రోమోజోములలో ఒక చివరి భాగం 'టీలోమెరేస్' అనబడే అతిసూక్ష్మమైన కోసాన ఉండే ఓ చుక్కకన్నా చిన్నభాగంలో మనిషి లేక మిగతా జంతుజాలం సరిగ్గా ఎన్ని సంవత్సరాలు బ్రతకగలదో క్షుణ్ణంగా ఆ భాగాన్ని

'డీకోడ్' చేసి శాస్త్రజ్ఞులు మనిషి/జీవరాసులు ఎన్నాళ్ళు బ్రతకగలవో సరిగ్గా అంచనా వేస్తున్నారు. అంటే ఒక బిడ్డకి ఒక సంవత్సరం వయస్సుండగానే ఈ 'టీలోమెరేన్'ని ఛేదించి, ఆ బిడ్డ ఎన్నాళ్ళు బ్రతకగలదో చెప్పొచ్చన్నమాట.

కానీ నేను పైన చెప్పిన విధానంలో విజ్ఞానాభివృద్ధి వృక్షాలలోని నిగూఢమైన మందులు ప్రాణాలను కాపాడడమే కాకుండా అసలు జబ్బులే రాకుండా ఉండే పరిస్థితులు వైజ్ఞానికులు తేవటానికి విపరీతంగా అమెరికాలో, యూరప్ అంతటా కృషి చేస్తున్నారు. అంతటితో ఆగక, 'టీలోమెరేస్'ని కెలికి జీవితకాలం సుధీర్ఘకాలంగా పొడిగిస్తున్నారు" అని తాము కనుగొన్న మొదటి అంశం ముగించి, డా॥ జూలీ: "కనుక ఇకమీద వృక్షాలు తెలివైనవిగానూ, మనకు జీవిత మార్గం చూపేవిగానూ, ఒక చక్కటి స్నేహితుడుగా, స్నేహితురాలుగాను రాబోతున్నాయి. సో, వృక్షాలకు నోరు లేదని ఏనాడు అనుకోవద్దు!" అనగానే టెలివిజన్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ చెవులు దద్దరిల్లే చప్పట్లతో ముగిసింది.

❀ ❀ ❀

# లెవిటేషన్ (Levitation)

డా॥ మారీస్ టైలర్ ప్రపంచ ఖ్యాతి చెందిన ఫిజిసిస్టు. అతని పేరు చెబితే 'కార్లు సైతం – తామంతట తామే స్టార్ట్ అయి కదిలి వచ్చేస్తాయి' అని అతని సహచరులు తమలో తాము ఛలోక్తులు విసురుతుంటారు. కొండ మీద ఉన్న ఆ అతి సుందర పల్లె ఐర్‌లాండ్ రాజధాని 'బెల్‌ఫాస్ట్' నుంచి ఐదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నది. అంతవరకూ మూడు నోబెల్ ప్రైజులు గెలుచుకున్న డా॥ మారీస్ టైలర్‌కి ప్రత్యేకంగా శాంతియుతమైన ప్రదేశంలో ఏరకమైన అంతరాయం కలగకుండా ఉండే ఆ చిన్ని పల్లె పేరు 'బేసిలా! అటువంటి చోటైతే ప్రశాంతంగా విజ్ఞాన పరిశోధనలు చేయవచ్చని, ఒక చక్కటి అన్ని వసతులున్న ప్రయోగశాల (Lab) ఐర్‌లాండ్ ప్రభుత్వం కట్టి 'లైఫ్‌లాంగ్' (జీవితాంతం) ఆనరోరియం కొన్ని వేల పౌండ్లు నెలసరిగా ఆయన గౌరవార్థం వచ్చేటట్లు ఏర్పాటు చేసింది. ఆజన్మ బ్రహ్మచారైన డా॥ మారీస్ టేలర్‌కి అప్పటికే యాభై ఎనిమిదో ఏడు. డా॥ టేలర్ లాబోరేటరినే కోవెలగా తలిచే జ్ఞాని కనుక పెళ్ళిపెటాకులు ఇక తలపెట్టలేదు. విజ్ఞాన పరిశోధనలకే తన జీవితం అంకితం చేసుకున్నాడు.

స్విట్జర్‌లాండ్‌లో భూమికి 27 మైళ్ళ అడుగున జరుగుతున్న అతి ముఖ్యమైన పరిశోధనలలో ఒక విభాగం. భూమ్యాకర్షణ శక్తికీ, అణుశక్తికీ వున్న భేదాలపై శాస్త్రపరంగా జరిగే ఈ ప్రయోగశాలలో కొన్ని వేల శాస్త్రజ్ఞులు వివిధ దేశ విదేశాల నుంచి విచ్చేసి, అందరూ ఒక్కుమ్మడిగా 'డార్క్‌మ్యాటర్' (కంటికి కనబడని నల్లటి అదృశ్యశక్తి) మన భూలోకాలు, ఇతర గ్రహాలు, కొట్టుకోకుండా కాపాడుతున్న ఆ ఆకర్షణ శక్తిని ఛేదించేందుకు రాత్రింబవళ్ళు ఆ 'సెర్న్ హెడ్రాన్ కొలైడర్ రియాక్టర్స్‌లో ప్రయోగాలు చేస్తూ ఉంటారు. అప్పుడప్పుడు వెళ్ళి వస్తాడు డా॥ మారీస్ టేలర్.

ఈ కనుగోలులో ముఖ్య ఘటన 'డార్క్‌మ్యాటరే' భగవంతుడని చాలావరకు విజ్ఞానికులు ఇప్పుడిప్పుడే నమ్మసాగారు. అందుకే ఎన్నో ఏళ్ళగా పరిశోధిస్తున్నా ఈ 'డార్క్‌మ్యాటర్'ని ఒక 'ఎల్యూసివ్ గాడేమ్డ్ పార్టికల్' (టూకీగా 'గాడ్ పార్టికల్'గా మారి) యాదృశ్చికంగా, ఆంగ్లం నుంచి తర్జుమా చేస్తే 'దేవుడి వస్తువు'గా పేర్కొన బడసాగింది.

అతి విచిత్రమైనది విజ్ఞాన పరిశోధన. మామూలుగా మనం ఒక అంశం మీద రిసెర్చి (పరిశోధన) మొదలెట్టాక, అది మనం అనుకున్న రీతిగా రాకపోగా,

అనుకోని రీతిగా ఎన్నో క్రొత్త విషయాలు కాకతాళీయంగా బయటపడతాయి. కొన్ని అందులో మనిషికి ఉపయోగపడేవిగానూ, ముందెన్నడూ చూడని ఆశ్చర్యంలో ముంచెత్తేసేవిగానూ, మరియు కొన్ని హానికరంగాను ఉద్భవిస్తాయి. ఉదాహరణకు కాకతాళీయంగా మేడమ్ క్యూరీ చేస్తున్న కాథోడ్ రేస్‌ని అడ్డుకుంటే, 'ఎక్స్‌రేలు' అనుకోని విధంగా బయటపడ్డాయి. అంతరిక్షం నిండా ఎక్స్‌రేలు మెండు. ఎక్స్‌రే ఎన్నో విధాల వైద్య విధానంలో సహాయపడుతున్నా, అతిగా మన దేహాలు 'ఎక్స్‌రేలకు' ఎదుర్కొంటే 'కాన్సర్' వ్యాధికి గురి అయే ప్రమాదమున్నది. కాన్సర్ ముదిరితే ఇక మరణం తథ్యం, కానీ తొలిదశలో 'క్యాన్సర్'ని గుణపరచవచ్చును.

ఆరోజు డా॥ మారిస్ టేలర్ తన స్వంత 'పైపర్' చిట్టి విమానంలో (నల్గురు ప్రయాణికులు కూర్చొవచ్చు) దగ్గర్లోనే ఉన్న స్విస్టర్‌లాండ్‌కి ప్రయాణమై వెళ్ళాడు. అక్కడకూడా ఆయనకి ప్రత్యేక బస వసతులు స్విస్ ప్రభుత్వం ఏర్పాట్లు శాశ్వతంగా చేసి ఉంచింది. అతని ప్రతిభ, ప్రఖ్యాతిని గుర్తించటం వలన.

ఆనాడు తనకు కేటాయించిన గదికి వెళ్ళి 'ఏప్రెన్' (తెల్లటికోటు – సాధారణంగా, వైజ్ఞానికులు, డాక్టర్లు తమ తమ వృత్తిలో వేసుకోవలసిన కోటు) ధరించి దీర్ఘాలోచనతో పైపు ముట్టించి, 'స్విస్ జర్నల్ ఆఫ్ సాలిడ్ స్టేట్ ఫిజిక్స్'లో అచ్చుయిన తన రిసెర్చి పేపరు చదవసాగాడు. ఆఖరి పంక్తిలో తను పదే పదే వాదించిన పాయింట్‌ని మననం చేసుకోసాగాడు. 'ఎ నానో పార్టికల్ ఆఫ్ ఇంటర్ స్టెల్లార్ ఇన్ఫ్లూయన్స్ హేవ్ అయిదర్ నో ఇఫెక్ట్ వాట్సో ఎవర్ టు మైక్రోగ్రావిటేషనల్ పుల్ ఆర్ నెగ్లిజిబ్లీ సో అండ్ హేన్స్ ఫార్మ్ ది బేసిస్ ఫర్ సపోసెడ్ లెవిటేషన్!' (అనువాదం :– ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన 'నానోపార్టికల్'పై కలుగు ఆకర్షణశక్తి అంతరీక్షంలో అన్ని గోళాల నుంచి ప్రభావితమైనా, దానికై ఎటువంటి ప్రభావమూ ఉండొచ్చు లేదా లేకపోవచ్చు. అట్టి పరిస్థితులలో అది సునాయాసంగా తేలగలదు) అని అదే పాయింటు గురించి పదేపదే మననం చేసుకోసాగాడు.

❖ ❖ ❖

'సెర్న్ హెడ్రాన్ కొలైడర్'లో ఒక విభాగంలో డా॥ మారిస్ టేలర్ చేస్తున్న రిసెర్చికి ఆయన హెడ్. ఆయన క్రింద ముగ్గురు పిహెచ్.డిలకి రిజిస్టరు చేసుకున్నారు. ఇద్దరు మగ, ఒక వనిత. వారి పరిశోధనలలో అతి ముఖ్యమైన ఘట్టం సూక్ష్మాతి సూక్ష్మమైన కణిక ఈ మధ్యనే కనుగొన్న 'నానోపార్టికల్' అని పేరుపెట్టారు. ఈ కంటికి గానీ మామూలు మైక్రొస్కోపులోగాని కానరాని కణిక లేక 'నానోపార్టికల్' బరువు ఉన్నదా లేదా ఓ వేళ ఉంటే ఏమాత్రం మిల్లీ మైక్రోగాములుంటుంది? బరువు

ఉన్నదంటే తప్పక భూమి అయస్కాంతపు శక్తికి లోబడాల్సిందే. కానీ అంతరిక్షంలో ఉండే ఈ చీకటి సూక్ష్మాతి సూక్ష్మమైన ఈ నానోపార్టికల్‌కి అసలు ఏవైపు నుంచైనా అయస్కాంతపు శక్తి వాటిమీద ఎటువంటి రకమైన ప్రభావము ఉంటుందా? అలా ప్రభావితం కాని నానోలన్నీ ఒకటైతే స్వతంత్రంగా ఎటుపడితే అటు పయనించగలవా? ఈ అంశాలను వెతుకుతున్నారు డా॥ మారిస్ టేలర్ క్రింద పనిచేస్తున్న ఆ యువ వైజ్ఞానికులు ముగ్గురును. ఆరోజు టైలర్‌తో వారికి ఒక గంటన్నర విజ్ఞానం మీద చర్చ ఉంది.

❖ ❖ ❖

స్విట్జర్‌లాండ్ బెర్న్ అనే చోట జరుగుతున్న ఈ ప్రపంచ విఖ్యాతియైన రిసెర్చికై ప్రపంచంలో దాదాపు అన్ని ముఖ్యమైన దేశాలు, అభివృద్ధి/పురోగతి చెందినవి సైతం పాల్గొంటున్నవి. అందులో భారతదేశం ఒకటి. భారతదేశం నుంచి, మద్రాసులో ఉన్న అన్నా యూనివర్శిటీ సైతం తమ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ హెడ్ అయిన డా॥ రామగోపాలశర్మగారిని ఈ 'హెడ్రాన్ కొలైడర్' రిసెర్చిలో పాల్గొనటానికి ప్రత్యేకంగా పంపించారు. దానికి కారణం ఆయన అమోఘమైన తెలివితేటలే కాక, ఐదు వందల రిసెర్చి పబ్లికేషన్లు, పదిమంది పిహెచ్.డి., డిగ్రీలకు ఆయన ఇచ్చిన తర్ఫీదు, గెల్చుకున్న భారతదేశపు అతిగొప్ప అవార్డు 'భారతరత్న' ఇక రావలసినదొక్కటే, నోబెల్ ప్రైజు ఫిజిక్స్‌లో అని అనుకుంటారు వారి బంధుమిత్రులు.

డా॥ రామగోపాలశర్మగారు కూడా డా॥మారీస్ టేలర్‌గారిచే ప్రత్యేకంగా ఈ చర్చకి ఆహ్వానింపబడ్డారు. ఆయన అనుభవం, నానో పార్టికల్స్‌పై ఆయన చేసిన విపరీతమైన, అంతర్జాతీయ మెప్పు పొందిన కృషివలన చర్చ మొదలవగానే డా॥ మారీస్ టేలర్‌గారి ముగ్గురు విద్యార్థులు, తమ తమ పిహెచ్.డి.లో ఒక భాగమైన నానో రిసెర్చిపేపర్లు ముగియగానే, డా॥ రామగోపాలశర్మగారిని వేదికపైకి పిలిచి సాదరంగా మైకు వేపు చూపించారు. ఆనాటి ఛైర్‌కి అధిపతియైన డా॥ మారిస్ టేలర్‌కి చిరునవ్వుతో తల ఆడించి బటన్ సైజు మైకు గుండీకి తగిలించుకుని అక్కడ ఉన్న తక్కిన ఐదుగురినీ ఉద్దేశ్యించి గుండ్రటి టేబిలుకు ఒక వైపున ఉన్న ఒక చిన్న వేదికపై ఆసీనుడై గొంతుసవరించుకుని చెప్పసాగాడు. "మొదట, నేను హృదయపూర్వకంగా డా॥ మారిస్ టేలర్‌గార్ని నన్ను గౌరవిస్తూ, ఈ సదవకాశం ఇచ్చిన నా మీద ఆయనకున్న నమ్మకానికి నా జోహార్లు. ఇది మా భారతదేశానికి ఒక చక్కటి అవకాశమేకాక, భారతదేశపు శాస్త్ర పరనాన్ని విజ్ఞానాభివృద్ధినీ, దేశవిదేశాలు

గుర్తించటం ఒక శోచనీయమైన మైలురాయి. తక్కిన అభివృద్ధి చెందిన రష్యా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యూరప్‌లో పలుదేశాలు, ఇంటర్నెట్ ప్రపంచంలో మారుమూలకి సైతం సాటిలైట్ టెక్నాలజీ వల్ల శాస్త్రజ్ఞులు వీడియో కాన్ఫరెన్సులు, టెలీమెడిసిన్ ఇలాటివి క్షణాలలో అందుబాటయి, శాస్త్ర పరిజ్ఞానం విపరీతంగా విస్తరించటమేకాక, 'గూగుల్' లాంటి సెర్చి ఇంజన్ల మూలాన మామూలు జనానికి అందుబాటులోకి వచ్చాయి. మా ప్రభుత్వం చిన్న చిన్న పల్లెలు, గ్రామాలలో కూడా ఐదేండ్ల బాలబాలికలకి కూడా కంప్యూటర్లు, 'టాబ్లెట్లు' (మన పాతకాలం పలకలమల్లే వున్న కంప్యూటరు) అందుబాటులో ఉండేటట్లు విపరీతమైన కృషి చేసింది. ఇంకా చేస్తూనే ఉంది' అని గ్లాసు మంచినీళ్ళు త్రాగి మళ్ళీ అందుకున్నాడు. 'ఇరవయ్యో శతాబ్దం మొదట్లోనే ఈ 'నాన్' అనే పదం గణిత శాస్త్రజ్ఞులు వాడకం మొదలెట్టినా రానురాను 'నానో'కి పలురకాల శబ్దాలు తక్కిన విజ్ఞానపు పరిధిలోకి చోటు చేసుకున్నాయి. అవి సూక్ష్మమైన, లేక సూక్ష్మాతిసూక్ష్మమైన 'నానో' కంటికి కానరాకపోయినా, రానురాను ఈ 'నానో' శక్తి ఫిజిక్సు, కెమిస్ట్రీలలోనే కాక, మెడికల్ అప్లికేషన్సు, బయాలాజికల్ అప్లికేషన్స్‌లోకి తమ ఉనికిని తెలియజేయసాగాయి. పలుదేశాల్లో పలురకాల విజ్ఞాన చర్చలు, అంతర్జాతీయ సదస్సులు ప్రారంభమయ్యాయి. 'నానో' అస్సలు ఉన్నదా లేదా అని ప్రారంభమైన వైజ్ఞానిక చర్చ, ఒకవేళ ఉంటే, 'నానో పదార్థం' అనబడే దానికి, బరువు ఉంటుందా, ఉంటే అది భూమ్యాకర్షణ శక్తికి లోబడుతుందా అనే విషయంపై డా॥ మారిస్ టేలర్‌గారు, వారి విద్యార్థులు అపారమైన కృషి కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారు, ఇంకా కొనసాగిస్తున్నారు. దానికి ఇక్కడి విజ్ఞాన పరిశోధనలైన 'హెడ్రాన్ కొలైడర్'కి ఎంతైనా సంబంధం ఉందనీ, మాలాటి అనేక వైజ్ఞానికులు, డా॥ మారీస్ టేలర్‌గారి టీము నమ్మటం వలన, ఇక్కడ జరిగే 'బిగ్ బ్యాంగ్ థియరీ'లో ఒక భాగంగా అంగీకరిస్తూ, స్విస్ ప్రభుత్వం ఈ వసతులున్న విభాగం డా॥ మారీస్‌గారికి ప్రత్యేకంగా కలుగజేసింది వారి ప్రతిభను గుర్తించి.

కొన్ని కోట్ల యుగాల మునుపు విపరీతమైన 'మిథేన్' గ్యాసుతో నిండి ఉన్న భూగోళం ఒకప్పుడు ఏరకమైన జీవరాసులు లేకపోవటమే కాక, వేడిగా, 'మిథేన్' ఆవిరితో సెగలు క్రక్కుతూ ఉండేదన్నమాట నిరూపించబడింది. అప్పుడు అంతరిక్షం నుంచి పడిన ఒక 'మీటెయోర్' రాయి : (కోట్ల టన్నుల బరువు కలది) కొన్ని కోట్ల ఇప్పటి హైడ్రోజన్ బాంబుల శక్తికి సమానంగా ఉండే వేగంతో వచ్చి మన భూగోళాన్ని ఢీకొన్నప్పుడు లేచిన రాళ్ళు, దుమ్ము ఎంతెత్తుకి లేచాయంటే అవి నెమ్మదిగా తిరిగి భూమ్యాకర్షణశక్తి వలన భూమి మీద పడినదానికినూ, కొండలుగా చల్లబడటానికి కారణం లేచిన దుమ్ము భూమ్యాకాశాలు సైతం చీకటి మయం చేయగా, సూర్యరశ్మి

కొన్ని వేల కొట్ల సంవత్సరాల భూమి మీద పడకపోవటం వలన ఉష్ణోగ్రత విపరీతంగా చల్లబడిపోయి మొత్తం మంచు పేరుకుపోయింది. దీన్నే 'ఐస్ ఏజ్'గా పేర్కొనబడింది. అదే ప్రకారం, క్రొద్ది క్రొద్దిగా వేడెక్కుతున్న భూమిలో మొట్టమొదటిసారిగా మంచినీళ్లగా మారి, కొండలపైనుంచి, పల్లాలు పడి భూమిలో ఆక్రమించుకుని నదులు అన్నీ పారి సముద్రాలుగా మారాయి. ఈ మంచినీళ్ళలో పారుతూ వచ్చిన లవణాలలో ఒకటి ఉప్పు, సోడియం, క్లోరైడులు. వీటిల్ని సముద్రపు నీటిలో జతలుగా మారి ఉప్పు రూపంలో సముద్రపు నీళ్ళల్లో చోటు చేసుకున్నాయి. ఇలా మొదలైన చైతన్యం, సూర్యరశ్మి తగలగానే రాళ్ళపై తడిగా ఉన్న నాచు పచ్చటి క్లోరోఫిల్'గా మారి, సూర్యరశ్మి సహాయంతో 'ఫోటోసింథెసిస్' వలన ఆహారం తామంతట తామే తయారీ చేసుకోసాగాయి. చార్ల్స్ డార్విన్ ఈ మొత్తం చైతన్యాన్ని పుస్తక రూపంలో 'ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్' అని ఈనాటి మానవుడి వరకూ, రెండు రకాలైన ప్రాణులు, అంటే జంతువులూ, వృక్ష సంతతి పైన చెప్పిన విధంగా ప్రారంభించి ఎలా పరిణతి చెందాయో క్షుణ్ణంగా వివరించాడు డార్విన్.' అని మరోసారి చెప్పటం ఆపి, 'ఇప్పుడు విజ్ఞానాభివృద్ధిలో 'నానో పార్టికల్' పాత్ర ఎలాంటిదో డా॥ మారిస్ టైలర్ వివరిస్తారు అని కూర్చున్నాడు డా॥ రామగోపాలశర్మ.

❖ ❖ ❖

డా॥ మారీస్ టేలర్ మిగతా ఐదుగురిని ఉద్దేశించి ఇలా చెప్పి, ఆనాటి సమావేశం ముగించాడు. 'పైన మన మిత్రులు, అపారమైన ప్రతిభ గల శాస్త్రజ్ఞులైన డా॥ రామగోపాల శర్మ చేసిన విషయాలకీ, ప్రస్తుతః మనం చేసిన/చేస్తున్న 'నానో పార్టికల్' యొక్క భవిష్య ప్రయోజనాలకి ఉన్న సంబంధం క్షుణ్ణంగా వివరించారు. ఇప్పుడు నా ప్రశ్న ఒక్కటే అన్ని 'నానోపార్టికల్స్'వి ఒక్కుమ్మడిగా ద్రావకరూపంలో, అనగా ఒక పరిశుద్ధమైన నీళ్ళలో 'ఫ్రీజ్‌డ్రైయింగ్ టెక్నిక్'తో కరిగేటట్లు చేసి, ఆ నీటిని ఒక పరిమితిలో, మనిషిగానీ, జంతువుగానీ గాలిలో భూమ్యాకర్షణ శక్తిని ధిక్కరించి, గాలిలో ఎటుపడితే అటు తేలగలదని నేను, నా విద్యార్థులు, వంతులవారిగా నిరూపించి, ఒక వీడియో ఫిలిమ్ సదస్సులలో చూపటానికి తయారు చేసుకున్నాము. అని, తన లాప్‌టాప్‌లో దాచుకున్న పెన్‌డ్రైవ్ ఆన్ చేసి ప్రొజెక్ట్ చేశాడు గోడపై తగిలించి ఉన్న తెల్లటి స్క్రీన్‌పై.

అందరూ నిశ్శబ్దంగా ఆ వీడియోగ్రాఫ్ చూడసాగారు. అందులో మొదటి ఫ్రేమ్‌లో లాబ్‌లో నానో పార్టికల్స్ తయారీ, వాటిని ఏ మోస్తరుగా డబుల్ డిస్టిల్డ్ నీళ్ళలో ఒత్తిడి ఉపయోగించి, 'ఫ్రీజ్‌డ్రై' టెక్నిక్స్‌తో ఎక్కించడం, అటు పిమ్మట ఆ

నీళ్ళని బీకర్‌లో నింపి, తమ ముందు కొంచెం కొంచెంగా, 250 మిల్లీలీటర్లు మెల్లమెల్లగా త్రాగటం, నెమ్మదిగా (పిల్లలకు బెలూన్‌లో హైడ్రోజన్ నింపితే ఎలా గాలిలోకి తేలుతూ లేస్తుందో, అలా) అలా అలా తేలుతూ లేవటం, ఏ ప్రక్కకు పడితే ఆ ప్రక్కకు తమ బరువును వంచితే ఆ పక్కగా అతి నెమ్మదిగా కదలటం, ఒక్కక్కరూ ఒక్కో విధంగా చూపించారు.

ఎంత నీరు త్రాగితే ఎంతసేపు అలా గాలిలో ఎంత ఎత్తుకి లేవగలమో, ఇవన్నీ లెక్కలు వేసి ఒక టాబులర్ ఫారమ్ (చార్ట్) వేసి చూపించారు. అలాగే ఆ నీటి ప్రభావం తగ్గుతూ వస్తే ఎలా మెల్లి మెల్లిగా భూమి మీదకు దిగవచ్చునో చూపించారు. (ఒక్కసారిగా క్రిందకు పడదని హామీ ఇస్తూ!)

డా॥ మారిస్ టేలర్ ఇలా వివరించారు. 'దీన్నిబట్టి మనకి తెలిసిందేమిటంటే భవిష్యత్తులో ఈ నానో టెక్నాలజీలు గుండ్రటి రూపంగల విమానాలలో ఉపయోగిస్తే చడీచప్పుడు లేకుండా ఎటుపడితే అటు ఎగరగల శక్తి నుపయోగించటమే కాక అంతరిక్ష ప్రయాణాలకి, అతి సులభంగా ఒక గోళం నుంచి మరో గోళానికి, గోళాలకి మధ్య భాగంలో ఏ రకమైన అయస్కాంతపు శక్తి లేనందున, అతి వేగంతో ప్రయాణించగలమని త్వరలోనే సాధ్యమవుతుంది. దీన్నే మనం 'లెవిటేషన్' అనీను, బహుశ పరగ్రహవాసులు మనకన్నా ఎన్నో యుగాల ముందే ఈ రకం విజ్ఞానం ఉపయోగించి అప్పుడప్పుడు మన గోళం మీద కనుపించే ఎగిరే పళ్ళాలు (UFOలు) ఇలాటి శక్తినే ఉపయోగిస్తారేమో అని అనుకుందాం!

❀ ❀ ❀

# మృత్యుంజయుడు

'ప్రాణికోటికి జన్మ ఎలాగో మృత్యువు కూడా అలాగే అన్న నిజం యుగయుగాలుగా తెలిసిన సత్యం. ప్రతి ప్రాణికి, అంటే జంతుజాతులు (మనుష్యులు కూడ జంతు జాతికి చెందిన వాళ్ళే) లేక వృక్షజాలాలు, సూక్ష్మాతిసూక్ష్మజీవులు ఇతరత్రాలన్నీ చిరకాలం జీవించటానికే ఈ జీవిత పోరాటాన్ని ఎదుర్కొంటూ పోతాయి కానీ ఎన్నటికీ మృత్యువుని కోరవు. ఈ నిజాన్నే చార్లెస్ డార్విన్ 'గాలపాగోస్' దీవులలో ప్రతి ఒక రకమైన జీవి ఎలా జీవిస్తుందో పరిశోధనలు చేసి, పుస్తక రూపంలో 'ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్' రూపొందించాడు. ఆయన చెప్పిన అతి ముఖ్య విషయాలు ఇలా రాసి వున్నాయి. 1) ప్రతి యొక్క ప్రాణి పుట్టిన దగ్గర్నుంచి, మరణించేంత వరకు జీవించటానికి పోరాటం సాగించాలి. 2) ఈ జీవిత పోరాటంలో గెలవటానికి శాయశక్తులా ప్రయత్నిస్తాయి. 3) ఆ ప్రయత్నాలు తిండికై వేటాడటం, ఆ వేటాడటంలో మళ్ళీ తదితర ప్రాణులతో ఓటమి, గెలుపుల నిర్ణయాలు బలాబలాలు తేల్చుకోవటం మీద ఆధారపడి ఉంటాయి. చిన్న పరిణామం గల ప్రాణులు, విపరీత పరిమాణం గల జీవులకు తల వంచక తప్పదు. అంతేగాక, ఈ యుద్ధాల్లో వాటికి బలైపోయి ఆహార నిధిగా మారవలసి వస్తుంది. 4) కనుక బలంగల ప్రాణులకి జీవించటానికి అవకాశం బలం తక్కువలో చిన్న ప్రాణులు ఓడవలసిన పరిస్థితులను ప్రకృతి కల్పిస్తుంది. అందువలన చిన్న పరిమాణం గల జంతువులు ఎక్కువగా తమ సంతతిని పెంపొందించవలసి ఉన్నది. కనుక దాన్నే చార్ల్స్ డార్విన్ 'దేరీస్ ఎ స్ట్రగల్ ఫర్ ఎగ్జిస్టెన్స్... ది ఫిట్టెస్ట్ సర్వైవ్స్... సో ఇటీజ్ ఎ సర్వైవల్ ఆఫ్ ది ఫిటెస్ట్! 'నేచర్ సెలెక్ట్స్ ది బెస్ట్ అడాప్టెడ్ ఇండివిడ్యుల్స్.... హెన్స్ ది స్ట్రాంగర్ వన్స్ సర్వైవ్, వైల్ ది వీకర్ వన్స్ ఆర్ ఎలిమినేటెడ్ బైది నేచర్.'

అంటే, ఈ జీవన పోరాటంలో ప్రాణికోటిలో ఎవరైతే బలాబలాలు తేల్చుకోవటంలో బ్రతుకుతాయో, అలాటివే బ్రతుకు తెరువు సాగించటానికి ప్రకృతి ఇచ్చే అవకాశాల అర్హతలు పొంది, జీవిత శేషకాలం సక్రమంగా ముగింపగలవు. తక్కిన బలం లేక ఓటమి దాల్చిన ప్రాణికోటి ఈ ప్రకృతి ఇచ్చే అవకాశాలలో నెగ్గలేక ఓటమి పొంది, త్వరలోనే మృత్యువు వాత పొంది, విసర్జింపబడతాయి' అని అనువదించవచ్చు.

అని మొదట ఆంగ్లంలో ప్రసంగించి అటు పిమ్మట తెలుగులో అనువాదం ఇంకో డాక్టరు చేసాక, కాస్త నీళ్ళు త్రాగి మళ్ళీ ప్రారంభించాడు నోబెల్ గ్రహీత ప్రముఖ విఖ్యాతి గల డా॥ బెన్ లూయిస్, మెడికల్, వెటర్నరి డెంటల్, జూవాలజీలలో మాస్టర్స్ డిగ్రీల దాకా చదివి ఆ పిమ్మట రెండు పిహెచ్.డీలు ఒక సబ్జెక్టు చైల్డ్ లైఫ్ బయాలజీలోనూ, మరో సబ్జెక్టు ఎన్విరాన్‌మెంటల్ ఇవల్యూషనరీ బయాలజీలోను చేసి, ప్రస్తుతం ప్రొఫెసర్ అండ్ హెడ్, డివిజన్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్, స్టాక్‌హోమ్ స్వీడన్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మెడికల్ అండ్ అలైడ్ హెల్త్‌సైన్సెస్‌లో పర్మనెంట్ లైఫ్ లాంగ్ చేర్‌మన్‌గా ఉంటూ, ఆంధ్రా యూనివర్శిటీలో వాల్తేరు లోగల ఆంధ్రా మెడికల్ కాలేజీవారు ఏటా నిర్వహించే "డా॥ ఎల్లా ప్రగడ సుబ్బారావ్ ఎండోమెంట్" లెక్చర్‌కి గౌరవనీయంగా ఆహ్వానింపబడిన తలపండిన డెబ్బై అయిదేళ్ళ ఆజానుబాహువు అతను. భార్యా సమేతంగా విచ్చేసిన ఆయన భార్య కూడా వెటర్నరీ, ఆ పిమ్మట మెడిసిన్ డిగ్రీలు చదివి, ఆయన వద్దనే ముందు పిహెచ్.డి విద్యార్థినిగా చేరి, అటుపిమ్మట అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరి మరో ఐదేళ్ళలో అసోసియేట్ ప్రొఫెసరైనాక ఆయనను ప్రేమ వివాహం చేసుకున్నది. వారికి ఇద్దరు ఆడపిల్లలు, ఒకరు డెంటల్ సర్జనూ, మరో అమ్మాయి వెటర్నరీ మెడిసిన్ చదివాక, అమెరికాలో అక్కాచెల్లెండ్రిద్దరూ చెరో పిహెచ్‌డిలు పొంది జార్జియాలో అట్లాంటా నగరంలో ఇమెరీ యూనివర్శిటీ మెడికల్ స్కూల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లయ్యాక తమ సహచరులను పెండ్లాడి, అక్కడే స్థిరపడ్డారు.

❖ ❖ ❖

'ప్రస్తుతం నేను, నా భార్య డా॥ లారా లూయిస్ ఉద్దేశ్యం ఏమిటంటే, మనిషికి, నోరులేని ఇతర జంతువులకూ, వృక్షజాలానికి చిరకాలంగా ఒకటే కోరిక. మృత్యువు బారి నుండి తప్పించుకుని ఎల్లకాలం చిరంజీవులుగా బ్రతకాలని, మరి అందరికీ ఆశే. కానీ ఎవ్వరూ మరణించకపోతే భూభారం ఎక్కువకావటమే కాకుండా తినటానికి తిండి, ఉండటానికి చోటు దొరక్క, పండే పంటలు చాలక, మళ్ళీ యుద్ధాలు ప్రారంభమై దేశదేశాలు విధ్వంసం అవటానికి అవకాశం ఉన్నది. 'దేర్‌ఫోర్, మళ్ళీ చార్ల్స్ డార్విన్ చెప్పిన రీత్యా, జీవన పోరాటం ఆరంభమవుతుంది.

కనుక, ప్రయోగాత్మకంగా మేము ఒక ద్రావకం తయారు చేశాం. (మన దేవతల అమృతం లాటిది) అవి ఎలుకలచే నీళ్ళకు మల్లే త్రాగించాం. మా ప్రయోగం సక్సెస్ అయిందనే చెప్పొచ్చు, ఎందుకంటే ఆ ఎలుకలకిప్పుడు ముప్పయి సంవత్సరాల

వయస్సు! అనగా సరిగ్గా ముప్ఫయి ఏళ్ళ క్రితం మేము కనుగొన్న ఈ ద్రావకం వలననే మాకు నోబెల్ ప్రైజ్ ఇచ్చినప్పుడే ఈ ఎలుకలకు ఈ మృత్యువును జయించి చిరకాలం జీవించదగిన ద్రావకం ఇంజెక్ట్ చేశాము.

మామూలుగా ఎలుకల ఆవెరేజ్ బ్రతుకు ఒకటి, రెండేళ్ళకు మించదు అందాక ఏ రకమైన జబ్బు ఉపద్రవం రాకుంటే.

ఇక్కడ మనం మనుష్య జాతిలో గమనించవలసిన దొక్కటున్నది. మనలో ఒకరు ఈ ద్రావకం సేవించి ఒక మూడు వేల సంవత్సరాలు జీవించినా, అప్పటి పరిస్థితులు అప్పటి మన సంతతి మనతో ఏకీభవించకపోగా మనం ఒంటరివాళ్ళమై పోగలము. మనిషి ఇతర జంతువులకు మల్లే కాక సామాజిక స్పృహ, సమూహ సాంప్రదాయాలకు జీవించటం అలవాటు పడ్డాక, చిరంజీవులుగా జీవించటం అనేది ఒక దుర్భరంగా మిగులుతుంది. ఎన్ని కోట్ల సంవత్సరాలు బ్రతికినా, ఎలా జీవించగలరు? ఏం సంపాదన చేయగలదు? తిండీ తిప్పలు ఎలా సంపాయించగలదు? కనుక, కాన్సర్ లాంటి వ్యాధి వల్ల మృత్యువాత పడకుండా, మరికొన్నాళ్ళు జీవించేందుకు అవకాశం కల్పించటానికి, ఈ ద్రావకం తక్కువ మోతాదులో ఇస్తే, అలాంటి వారికి ప్రాణం పోసినట్లవుతుందని మా ఆశ'' అని ముగించగానే సభ చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

# పున్నమినాటికి మళ్ళీ వస్తా

చీకటిలో నక్షత్రాల మిణుకు మిణుకు, గాలి హోరు, మిరుమిట్లు గొలిపే నియాన్ లైట్ల కాంతి గంటకు నూట ముప్ఫై మైళ్ల వేగంతో వెళ్ళే కారు అవే నాకు సహచరులు. డాష్ బోర్డులో గడియారం రాత్రి పదిన్నర సూచిస్తోంది. పడవలాంటి నా లెఫ్ట్ హాండ్ డ్రైవ్ ఓల్డ్స్ మొబైల్ కారు అంత వేగంలోనూ అతి మెత్తగా తోచింది. అది నెవేడా నుంచి కనెక్టికట్‌కు వెళ్లే హైవే. ఆరు లేన్‌లు ఉన్న రాచమార్గం లాటి బాట.

మన దేశంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి ఇక్కడ ఎంతో విపరీతమైన గౌరవం, మర్యాద. అక్కడ ఎమ్.టెక్., చదివి, అక్కడే ఆస్ట్రో ఫిజిక్స్‌లో ఇంటర్ డిసిప్లినరీ పిహెచ్.డి., చేశాక మరో పిహెచ్.డి.,కి ఇక్కడి ఆస్ట్రో ఫిజిక్స్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ నెవేడాలో రెండేళ్లు చేసి డిగ్రీ సంపాదించి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఈ మధ్యనే చేరాను. ఇక్కడ స్థిరపడే ఉద్దేశ్యం ఎట్టి పరిస్థితుల్లోనూ లేని అతి కొద్ది మంది భారతీయులలో ఒకడినని ఈ రోజుల్లో చెప్పుకోవడానికి కాస్త గర్వపడతాను. కానీ నాతో వచ్చిన నా సహచరులంతా పిహెచ్.డి., అనే కుంటి సాకుతో ఇక్కడ స్థిరపడాలనే అంతర్లీనమైన ప్రగాఢమైన ఉద్దేశ్యంతో వున్నవాళ్లే. అందులో పాతిక శాతం ఇక్కడ తెల్ల తోలు నారీమణులను 'లవ్ మారేజ్' అనే అధునాతనమైన వివాహం, శాశ్వతావాస అనుమతి వచ్చాక విడాకులు తీసుకున్న వారు కొందరైతే, స్వచ్ఛమైన, నిష్కల్మషమైన వారి ప్రేమను పర పురుషునితో వారికి లేని సంబంధం అంటగట్టి, ఛీత్కారం చేయించుకుని వదిలివేసిన పురుషోత్తములు మరికొందరు.

ఇవన్నీ చూశాక అస్సలు పెళ్లి మాటే తలపెట్టక కొంతకాల ఇక్కడి విజ్ఞానపరమైన పద్ధతులు బాగా నేర్చుకుని, నాకు ఎప్పుడైనా ఉద్యోగం ఇస్తానన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి వచ్చి స్థిరపడాలని నా సంకల్పం. మర్నాటి నుంచి ఆరు రోజులు, కనెక్టికట్‌లో జరుగనున్న అంతర్జాతీయ సదస్సులో నా పేపర్లు చదవడానికే ఈ ప్రయాణం. 'ఇంటర్ స్టెల్లార్ ఇన్ఫ్లుయన్సెస్ ఆన్ ఆబ్జెక్ట్స్ ఆఫ్ 'మీటియోరిస్టిక్' అండ్ అదర్ అనైడెంటిఫైడ్ నేచర్' అనే నా పిహెచ్‌డి చాలా మంచి ఆదరణ. ఫ్రాన్స్ నుంచి పరీక్షాధికారులు నాకు డాక్టరేట్ ఇచ్చిన అమెరికన్ ప్రొఫెసర్ ఒకప్పటి నొబెల్ డాక్టర్ రిచర్డ్ డగ్లస్ ప్రోత్సాహం, నా ఉత్సాహమే ఈ ప్రయాణానికి మూల కారణం.

❖ ❖ ❖

సాఫీగా మెత్తగా వెళ్తున్న నా కారు ఇంజన్ నుంచి గురగుర శబ్దం. సమయం రాత్రి పదకొండున్నర, చలిగాలి హెూరు, ఇంకా ఐదు వందల యాభై మైళ్ళు (అమెరికాలో 'మైళ్ళు', మన దేశంలో కి.మీ. వాడతారు) పోవాలి. శబ్దం ఎక్కువ కాసాగింది. కారు కొని ఇంకా నెల కూడా కాలేదు. అన్ని వసతులున్న కారది. ఉన్నట్టుండి గడగడ కారంతా ఊగసాగింది. ఏమైందబ్బా? భూకంపం కాదు కదా? హెడ్ లైట్ల కాంతిలో కనపడే వీధి దీపాల గొట్టం కూడా ఊగి ఉండేది, ఒకవేళ నిజంగా భూకంపం లాంటిదైతే. ఏ రకమైన రిపేరు నా కార్లో రావడానికి ఆస్కారం లేదు. పెట్రోలు ఇంకా సగం పైనే ఉన్నట్లు మీటరు చూపిస్తూనే వుంది. రేడియేటర్లలో కూలంట్ ఆర్నెల్ల దాకా మార్చఖ్ఖరలేదు.

ఇలా ఆలోచనల్లో మునిగి తేలుతూ ఉండగానే అతి పచ్చటి వెలుతురు నెత్తి మీద నుంచి, కారు పై భాగం నుంచి.... నా లేన్‌లో నిర్మానుష్యం... ఏ అరగంటకో ఓ కారు నన్ను దాటుకునో లేక నా వెనకనో పోతోంది. అది కూడా ఇవ్వాళ ఇంతసేపటి ప్రయాణంలో రెండుకార్లే చూశాను. ఆలోచనల్లో మునిగి తేలుతుండగానే కారు గురగుర శబ్దం ఎక్కువై ఆగిపోయింది. శబ్దం ప్రారంభం కాగానే ఒక ప్రక్కకి కారు పోనివ్వడం వల్ల వారగా ఆగిపోయింది. నెత్తి మీద పచ్చటి కళ్లు మిరుమిట్లు గొలిపే ఈ కాంతి ఏమిటి? ముందు కారు సంగతి చూసి తర్వాత కాంతి సంగతి చూడాలి. తలుపు తెరవబోతే రాలేదు! ఆశ్చర్యం! నేను లోపలి వైపు కూడా లాక్ చేయలేదే? మిగతా మూడు తలుపులు లాగి చూశాను. రాలేదు! దిసీస్ టూ మచ్! తాళాలు నా దగ్గరే ఉన్నాయి కదా? మరి ఎలా ఇరుక్కుపోయాయి తలుపులు? ఒకవేళ ఇరుక్కున్నా బయలుదేరినప్పటి నుంచి అదే స్థితిలో ఉండి ఉండాలే? అలా లేవే? మధ్యన ఒక డౌన్ టౌన్ రెస్టారెంట్‌లో ఆగి హాంబర్గర్లు తిని టీ తాగినప్పుడు బాగానే ఉన్నాయే? కల కాదు కదా?

అంతదాకా ఎప్పుడో గంట క్రితం నేను ఆఫ్ చేసిన టేప్ రికార్డర్‌లో... ఘంటసాల కేసెట్ 'జగమే మాయ... బ్రతుకే మాయ'... ఉన్నట్టుండి తనంతట తనే పాడడం మొదలెట్టింది! సందేహం లేదు.... టేప్ రికార్డర్ ఆన్ చేసినట్లు తెలిపే ఎర్ర దీపం ఉన్నట్లుండి వెలిగాక ఈ పాట!

ఇది వింత కాదు....

కల కాదు...

అక్షరాలా ఈ క్షణం నాకు జరుగుతున్న అనుభవం! నాలోని ఆస్ట్రోఫిజిసిస్టు మేలుకున్నాడు. మనుష్య సహజమైన గుణం ముందు నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసినా, నా మెదడు చకచకా చురుకుగా పనిచేయసాగింది. పచ్చ దీపం ఆరలేదు... మరేదైనా

కారు వస్తే లైట్ల కాంతిలో సహాయం కోరవచ్చు. కానీ నా కారు ఆగి దగ్గర దగ్గర అరగంటైనా ఆశ్చర్యం - ఒక్క కారూ ఈ పక్క పోదేం? అన్ని కార్లూ ఆగిపోలేదు కదా!

మెదడు ఇలా తర్జనభర్జన పడుతూండగానే కారు అతి మెల్లగా చల్లగా అలా అలా గాల్లోకి దాదాపు ఐదడుగుల ఎత్తుకి లేస్తోంది!

లేచి గాల్లోనే తేలియాడుతోంది!!

పాట ఆగిపోయింది.

టక్‌మని టేప్ శబ్దం!

రెండు గజాలు ముందుకి సాగి నెమ్మదిగా విమానంలా మెత్తగా రోడ్డువారకి మళ్ళీ తనంతటతనే దిగింది కారు.

ఇప్పటికే ఈ వింత సంగతి తెలుసుకోవాలనే నాలోని విజ్ఞానం కుతూహలపడుతూండడం వల్ల శాంతంగా అన్నీ గమనించసాగాను.

'క్లిక్'మని నా వైపు తలుపు ఎవరో తాళం దూర్చి తీసినట్లు శబ్దం...

అస్సలు నేను తాళం లోపల్నుంచిగానీ, బయట నుంచిగానీ వేస్తే కదా తీసే ప్రశ్న?

మెల్లిగా కారు తలుపు శబ్దం చేయకుండా తెరిచాను....

ఎంత మెల్లిగా తెరిచానో అంత మెల్లిగా బయటికొచ్చి తల ఎత్తి చూశాను...

పచ్చటి దీపం....

అంతే మెల్లిగా నారింజ రంగుకి మారసాగింది. నాలో మేలుకున్న విజ్ఞానం, ఇన్నాళ్లు నేను అర్థాలు వెతుకుతున్నా ఆ అర్థం కాని ఫినామెనా, నా థీసిస్‌లో రాసిన ఎన్నో విషయాలకు కొంత వరకు ప్రత్యక్ష సాక్ష్యం!

నా కారు పైన పదడుగుల ఎత్తులో గుడి గంట ఆకారంలో ముప్పై మీటర్ల విస్తారం కల అనేక రకాల రంగులు కలిగిన లైట్లు ఉన్న ఒక నౌక తాండవం చేస్తోంది! గాల్లో అలానే నిలిచి ఉంది! చడీచప్పుడూ లేదు!

ఈ మధ్యనే నేను టి.వి.లో చూసిన స్టీవెన్ స్పీల్‌బర్గ్ తీసిన అద్భుత చిత్రం. 'క్లోస్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్'లో చూపిన విధానంగానే....

స్టీవెన్ స్పీల్‌బర్గ్ మేధను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను...

ఎంత మేధావి అతను?

సరిగ్గా ఇదే సన్నివేశం ఊహించి చూపాడతను!

దేశ విదేశాలలో అప్పుడప్పుడు కనపడీ కనపడకపోయే చప్పుడు లేని ఈ అంతరిక్ష నౌక లెక్కడ్నుంచి వస్తున్నాయి?

ఖచ్చితంగా మరో గోళం మన మెన్నడూ ఊహించని విధంగా మనకెన్నో ఎన్నో రెట్లు పరిణతి చెందిన లోకాల నుంచే!

చకితుడనై చూస్తుండగానే మరో వింత....

ఆ అద్భుత (అంతరిక్ష నౌక అనొచ్చునేమో?!) ఎగిరే పళ్లెం, లేక గుడిగంటలాంటి వస్తువు మెల్లి మెల్లిగా క్రిందకు మైదానం వైపు దిగసాగింది.

ఆశ్చర్యం!

చడీచప్పుడూ లేదు!

పొగ, వేడి, సెగ ఏమీ లేవు!

ఇక్కడ నేను కొంత వరకు ఈ ఎగిరే పళ్లేల వృత్తాంతం కొద్దిగా చెప్పవలసి వస్తుంది.

నేను ఆంగ్ల దిన పత్రికలలో చదివిన క్లిప్పింగ్స్ ఈ విషయం మీద అచ్చయినవి అప్పుడప్పుడు సేకరిస్తూనే ఉన్నాను...

క్లుప్తంగా చెప్పాలంటే... మొట్ట మొదటిసారి మానవ మాత్రులు సందర్శించిన 'ఎగిరే పళ్లే'ల వార్తలను బట్టి, ఆంగ్లంలో వీటిని 'ఫ్లయింగ్ సాసర్లు' గానూ లేక 'అన్ ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్' (యు.ఎఫ్.ఓ.) గానూ పేర్కొన్నారు. మొట్టమొదటిసారిగా కనపడిన ఈ 'గుర్తు తెలియని ఎగిరే వస్తువులు' పళ్లెం ఆకారంలో ఉన్నా ఆ తరువాత భూప్రపంచంలో అక్కడక్కడ కనిపించి మాయమైనవి 'గుడి గంటల' ఆకారంలోనూ, చుట్ట ఆకారంలోనూ పేర్కొనబడ్డాయి.

మొట్టమొదటి ఎగిరే పళ్లెం చూసిన వార్త అమెరికా విమానదళం 1947లో వివరించింది. భారతదేశం అలహాబాద్‌లో 1979లో పొలంలో పనిచేసే రైతులు చప్పుడులేని ఎగిరే పళ్లెం సాయంసంధ్య చీకటిపడే వేళ ఇంటికి తిరిగొచ్చే రైతుల కంటపడినట్లు వార్తా పత్రికల వార్తలు నిదర్శనం.

'అంతరిక్ష నౌకలోని అతిథులు' అనే పేరిట వార్త 'హిందూ' ఆంగ్ల దిన పత్రిక జూలై 18, 1983న ప్రచురితమైనది. అందులోని వార్తలను బట్టి, కేవలం మూడు అడుగులు ఎత్తుగల ఆకుపచ్చటి ఆకారాలు, మన గుమ్మడికాయంత తలమాదిరి ఆకారం, కళ్లు ఉండవలసిన చోట ఖాళీ స్థలం, జుట్టు ఎక్కడా లేని ఆకారాలతో ముగ్గురు దిగిన వృత్తాంతం వ్రాశారు. ఇంకా జూలై 19, 1983 'హిందూ' ఆంగ్ల దినపత్రికలో ఈ ఎగిరే పళ్లేలపై వ్రాసిన 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ యు.ఎఫ్.ఓ.' అనే పేరిట రోనాల్డ్ డి. స్టోరే అనే అమెరికన్ వ్రాసినట్లు పేర్కొనబడినది.

ఇందులో నేను చదివిన దాన్ని బట్టి మనుష్యులకు, ఈ గుర్తు తెలియని మానవాతీతులకు మధ్య మూడు రకాల 'కలుసుకోవడాలు' జరుగుతున్నట్లుగానూ యథార్థ వృత్తాంతం వివరించబడింది.

అందులో మొదటిరకమైన 'కలుసుకోవడం' దగ్గరగా వాళ్ళని చూడడమే తప్ప ఎటువంటి పరస్పర పరిచయాలు లేనివిగాను, రెండవ రకమైన 'కలుసుకోవడం' అంటే మన అంతరిక్ష అతిథులకి మన చుట్టూ ఉండే వాతావరణంతో వాళ్లు చేసిన గందరగోళం వాళ్ల ఉనికి తెలిపేవిగానూ, మనకు గమ్మత్తుగానూ, ఊహకందని నిజాలుగానూ కనపడే మార్పులూనూ.

మూడవ రకమైన 'కలుసుకోవడం' నిజమైన పరస్పర పరిచయాలుగానూ రోనాల్డ్ స్టోరే పేర్కొన్నాడు.

ఈ మూడో రకమైన పరిచయాల ఇతివృత్తాంతాన్నే అద్భుత చలన చిత్ర రూపంగా తయారు చేశాడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ తన "క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్" అనే చిత్రంలో. ఇద్దరు అమెరికన్ పరిశోధకులు చార్ల్స్ బెర్లిట్జ్, విలియమ్ మూర్ చేసిన పరిశోధనలలో జానీ మెకబాయిల్ అనే పౌరుడి స్వానుభవం కూడా నేను ఇటీవలే చదివిన వార్తను బట్టి జ్ఞాపకం రాసాగింది.

ఇది జూలై 7, 1947లో ఒక అంతరిక్ష నౌక అమెరికాలో ఒక పొల్లాలో కూలినట్లుగానూ, అమెరికా విమాన దళానికి చెందిన వారు మనుష్యులను పోలిన వారిని 'మనుష్యాధికులు'గా పేర్కొన్నట్లు తెలుస్తోంది.

వారి చప్పుడు లేని నౌకలు, ఎటుపడితే అటు ఎగరగలిగి ఉన్నట్లు వార్తలున్నాయ్. కొందరు భారత పరిశోధకులు వీటిని పురాణాలలో ఎప్పుడో పేర్కొన్న 'పుష్పక విమానాల'తో పోల్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. దగ్గరగా వాటిని చూసిన వృత్తాంతాలన్నీ ఒకే మాదిరిగా ఉండడం వల్ల ఇవి కట్టుకథలుగా కొట్టిపారేయలేము. "ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ యు.ఎఫ్.ఓ"లలో పళ్లేల ఫొటోలు స్పష్టమైనవి ప్రచురితమై ఉన్నాయి. (ఈ పుస్తకం మద్రాసు బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీలో ఇప్పటికీ ఉన్నది.)

నే నీ జ్ఞాపకాలు నెమరువేస్తుండగానే మరో అద్భుతం జరిగి క్రిందికి దిగిన గుడి గంట ఆకారాన్ని పోలిన నౌక అడుగు భాగం తెరుచుకున్నట్లుంది. పసుపు పచ్చటి కాంతి నేలపై పడింది.

ఆ కాంతిలో నెమ్మది నెమ్మదిగా తొలి ఉదయం పడే మంచులా ఓ పొగ.

పొగ నెమ్మదిగా మాయమై పచ్చటి మనుష్యులని పోలిన జుట్టు అస్సలు లేని మూడడుగుల ఎత్తులో ఒక ఆకారం.

పెద్ద గుమ్మడికాయంత తల.

చేతులూ, కాళ్లూ, కానీ వేళ్లుండవలసిన చోట రెండే వేళ్లలా మునక్కాడల్లాంటి మొలకలు.

గాలిలో తేలుతున్నట్లు ఒక నెమ్మది నడకతో నా వైపు రాసాగింది. సంభ్రమాశ్చర్యాలతో నుదుటి మీద పట్టిన చెమటను అతి కష్టం మీద చెయ్యి ఎత్తి తుడుచుకున్నాను.

అతి దగ్గరగా వచ్చేసిందా ఆకారం. నాకూ, దానికీ రెండడుగులు దూరం.

బావిలోంచి వచ్చినట్లు, కప్ప బెకబెక లాడినట్లు ఒక శబ్దం.

నోరు ఉండవలసిన చోట గుండ్రటి ఖాళీ.

కళ్లు లేవు - రెండు ఖాళీలు. ఆ కన్నాల్లోంచి మన ఊహకందని పచ్చటి వెలుతురు. (మిణుగురు పురుగుల వెలుతురుని పోలినది)

నెమ్మదిగా ఆ పచ్చటి ఆకారం... మంచు కరిగినట్లు కరుగుతూ మానవాకారం దాల్చసాగింది.

అంతా ఒక అర సెకండు మాత్రమే!

అత్యద్భుతమైన అందంతో, వర్ణించనలవిగాని అంగ సౌష్ఠవంతో దివి నుండి భువికి దిగిన ఆ సుందరాంగి....

మొట్టమొదటిసారిగా...

ఆంగ్లంలో 'హౌ డూ యూ డూ' అని వెంటనే స్వచ్ఛమైన తెలుగులో 'నమస్కారమండీ! అలా చూస్తారేం? నాకు మీ మాతృ భాష తెలుసు సుమా! అలా ఆశ్చర్యపోకండి! నేను మీకు ఎలాంటి హానీ చేయని అంగారక గ్రహానికి వెయ్యి కోట్ల మైళ్ల దూరంలో ఉన్న మా గోళం 'ప్లూటాన్' - అదీ మీరు పెట్టిన పేరే, నా సహచరులు ఈ భూమిపైకి చాలామార్లు వచ్చారు! మేము భూలోకంపై కొన్ని ఏళ్ళుగా చేస్తున్న వైజ్ఞానిక పరిశోధనలో ఒక భాగమే నా రాకకు కారణం. మాకు మగ, ఆడ లింగ భేదాలు లేవు. మీ భూలోకవాసులకన్నా విజ్ఞానంలో కొన్ని కోట్ల యుగాలు ముందు మేము ఉన్నాం. మేము ఏ ఆకారమైనా దాల్చగలం. ఏ భాషనైనా వ్రాయగలం, మాట్లాడగలం.

మేము గోళం మీద లేనప్పుడు మా పనులు మేము తయారు చేసిన యంత్రాలే చేస్తాయి. పుట్టగానే అన్ని పనులూ చేయగలదు మా సంతతి. మాకు సంతతి కావలసినప్పుడు నోట్లోంచి మీ వేపకాయ పరిమాణంతో అర చేతిలో మా సంతతి రాగలదు. దాన్ని నేల మీద వదిలితే మా అంతటి పరిమితి చెందుతుంది. తన పనులు

తానే చేయగలదు. సరిగ్గా పది (మీ భూలోక) రోజుల్లో చదువంతా మా యంత్రమే చెప్పిస్తుంది. ఆ తరువాత మాకుమల్లే తనూ పరిశోధనలు చేపడుతుంది.

మీలాంటి తిండి మా కక్కర్లేదు. 'న్యూక్లియర్ ఎనర్జీ' (అణుశక్తి ఇముడ్చుకుని ఉన్న నిగూఢ మాత్రలు) పుట్టగానే ఒక్కటే ఒక్కటి మింగుతాము. మాకు చావు లేదు. గోళంపై మా పరిశోధనలు పూర్తవగానే భస్మపు పెట్టెలో మా అంతట మేమే పడుకుంటాము. అందులో అరగంటలో సెగ, వేడి లేని జ్వాలలో భస్మం అవుతాము.

చెట్లు, చేమలు లేని మా గోళం మీరు చూడదల్చుకుంటే నన్ను ఓ మారు తాకితే మీరు మా ఆకారంలోకి మారుతారు. కానీ మీ జ్ఞాపకశక్తి పోదు. ఎర్రటి రంగు మీకు అబ్బుతుంది. మేమంతా పచ్చటి రంగు గల వారమే. మీకు, మా మధ్య భేదం కానరాదు. కానీ మా మధ్య మాకు భేదాలు గుర్తు.

"మరి మా లోకాని కొస్తారా?"

నవ్వితే చక్కటి పలు వరస. తెల్లటి చీర. నన్ను నేను తమాయించుకుని, నేనూ నవ్వి – "ఈసారికి రాలేను. కానీ, మీ నౌక ఉన్నది. ఒకవేళ నేను మీ నౌకను చూడాలన్నా మీ ఆకారం నాకు రాదుగా?" అనడిగాను.

"వస్తుంది. ఎందుకంటే, మా నౌకలోని యంత్రాలన్నీ ప్రీ ప్రోగ్రామ్డ్... కంప్యూటర్లలాంటివి... కానీ ఎన్నో రెట్లు మీ కంప్యూటర్ల కన్న అభివృద్ధి చెందినవి. మా ఆకారంలో లేనివి నౌకలో కెళ్లిన తక్షణం భస్మం అయిపోతాయి వాటి 'ప్రోగ్రామ్' ప్రకారం. వాటిని 'డీ కోడ్' చేయలేము. అంచేత నన్ను తాకితే మీరు మా ఆకారానికి మారతారు. నేను నా ఆకారానికి మారినా, మీ కంటికి ఇప్పుడున్నట్లుగా సరిగానే కనపడతాను.

ఈసారి ఈ నౌకలో నేనొక్కదాన్ని వచ్చాను. మా నౌక మా గోళానికి ఒక్క నిముషంలో ప్రయాణించగలదు. దాని వేగం అలాంటిది. మీట నొక్కితే దానంతట అదే 'ప్రీ ప్రోగ్రామ్డ్' అవడం వల్ల మా లోకం చేరగలదు. మీకు నమ్మకం, ధైర్యం ఉంటేనే రండి. బలవంతం లేదు.

ఇది మీ కొక అనుభవం. ఎవరికీ దొరకని అపురూపమై, అరుదైన అనుభవం. ఎందుకో మిమ్మల్ని కలవానిపించింది. అందుకే కావాలని మిమ్మల్ని 'ఫాలో అయ్యాను".

"ఐతే అలాగే మీ ఆకారం దాలుస్తాను. కానీ, మళ్లీ నా ఆకారం రావాలంటే?" అని ప్రశ్నించాను.

ఒక నవ్వు నవ్వి "అంత అపనమ్మకమా!? నన్ను మళ్లీ తాకితే మీరు మామూలు మనిషవుతారు. ఇలా ఎన్నిసార్లయినా వెనక్కీ ముందుకీ మారవచ్చును. ప్రయత్నించరాదూ?" కవ్వింపుగా నవ్వుతూ అంది.

ఏమైతే అయిందనే 'కుతూహలం'తో నవ్వుతూ చేయిజాపి కరచాలనం చేయించడాని కన్నట్లు నిలబడ్డాను. చల్లటి కరిగే మంచును తాకిన భావం, విపరీతమైన మన ఊహకందని, మైకం కలుగజేసేటటువంటి శక్తి నాలో ప్రవేశించినట్లనిపించింది.

నన్ను నేను చూసుకుంటే ఎర్రటి శరీరం. తల తడుముకుంటే జుట్టు లేదు. సందేహం లేదు. నేను మారిపోయాను. కానీ ఆమె నాకు మానవ రూపంలోనే కనపడసాగింది. అన్న మాట ప్రకారం నా చేతిని తన చేతిలోకి తీసుకోగానే నడవ నవసరం లేకుండానే గాలిలో తేలుతున్నట్లు వాళ్ల నౌక అడుగు భాగాన చేరాము.

నౌక అడుగు నుంచి పైకి అలా తేలుతూ లోపలికి వెళ్లిపోయాము. విశాలమైన గుండ్రటి లోపలి భాగం, చల్లని వెన్నెల లాంటి వాతావరణం. అనేక రకాల కనీవినీ ఎరగని పరికరాలు... అబ్బ!... భూతల స్వర్గం!.... ఒక్కో పరికరాన్ని గురించి ఆమె చెప్పసాగింది.... అలా ఓ గంట గడిచాక...

❖ ❖ ❖

ఆరు బయటకొచ్చేశాము మళ్లీ. అన్నమాట తప్పకుండా నా చేతిని ఆమె ముట్టుకోగానే మళ్లీ నా రూపం నాకు తిరిగి వచ్చేసింది.

"ఇక నేను వెళ్లిరానా?..." నవ్వుతూ అడిగింది. ఉన్నట్లుండి ఆమె నాకు ఒక అతిలోక సుందరిగా, నిజాయితీ నిండిన ముగ్ధగా, ప్రేమమూర్తిగా అనిపించసాగింది.

"గుడ్ బై...!" నా మనస్సులో ఆలోచనలు చదివినట్లుంది.

నేను "గుడ్ బై..." అనగానే నన్ను గాఢంగా ఆలింగనం చేసుకుని ఆమె పెదిమలు నా పెదిమలని గాఢంగా, నేను ఊహించని విధంగా హాయి కొలిపే అనుభూతిగా నన్ను అదిమాయి. ఆ అనుభవం మళ్లీ మళ్లీ కావాలనిపిస్తుండగా - "మళ్లీ నన్ను మీ లోకానికి తీసుకుపోవడానికి రావూ?" అన్నాను.

గోముగా నన్ను విడిపించుకుని...

"తప్పక వస్తాను.. డాక్టర్... తప్పక... పున్నమి నాటికి మళ్లీ వస్తా" అంటూ చడీచప్పుడు లేని తన నౌకలోకి అంతర్ధానమై అలా అలా నక్షత్రాల మధ్యకి కనుమరుగవుతూ దూసుకుపోయింది.

❀ ❀ ❀

# చకితుల్ని చేసిన శస్త్ర చికిత్స

ఇతర దేశాలకు ఏమాత్రం తీసిపోనివీ, ఎన్నో యుగాలుగా మన భారతదేశంలో ఆయుర్వేదాలలో పురాణ ఇతిహాసాలలో శస్త్రచికిత్సలెన్నో మనకి తెలీనివీ, ఆంగ్ల వైద్య శస్త్రచికిత్సల పుస్తకాలలో వర్ణించినవాటికి అతిదగ్గరగా ఉన్న శస్త్ర చికిత్సలెన్నో మన పురాణ ఇతిహాసాలలో వర్ణించి ఉన్నవని, కొన్ని సదస్సులలో కొందరు వైద్య నిపుణులైన మహాత్ములు వివరించినా, వాటిని తేలిగ్గా కొట్టిపారేసి, ఎద్దేవా చేసిన మన వైజ్ఞానికులే కొందరు ఉన్నారని దినపత్రికలలో ఈ మధ్యనే పలుమార్లు ప్రచురించారు.

అటువంటి ఒకానొక సదస్సు, అమెరికాలో ఉన్న 'తానా' వారు నిర్వహిస్తూ పేరు ప్రతిష్ఠలు, నిజాయితీతో ప్రపంచ ఖ్యాతి పొందిన కొందరు వైజ్ఞానికులని వాషింగ్టన్ డి.సిలో జరుగుతున్న 'వీక్‌లాంగ్' 'ఆన్యూల్ కన్వెన్షన్' (సదస్సు) అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ వారితో చేతులు కలిపి నిర్వహించారు.

ఆ నిర్వహణకి పిలువబడిన శాస్త్రజ్ఞులు దేశవిదేశాల నుంచి వచ్చిన అగ్రశ్రేణి స్థాయిలో ఉన్న శాస్త్రజ్ఞులు. అందులో ఫిలిపీన్స్ దేశాన్నుంచి విచ్చేసిన డా॥ యాంగ్ చాక్, ఒక సర్జను. అతను ఎంతో కాలం మెడిసిన్, ఆ పిమ్మట వెటర్నరీ రెండును అమెరికాలో చదివి, సర్జరీలో (మానవ శస్త్ర చికిత్స) పిహెచ్‌డి సంపాయించి మరల తమ దేశానికి తిరిగి వెళ్ళిపోయి అక్కడి బీదసాదలకు ఒక నర్సింగ్ హోమ్ తెరచి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తూ ప్రపంచఖ్యాతి పొందడమే కాక అగ్రశ్రేణి జనరల్ సర్జన్‌గా పేరు ప్రతిష్ఠలు సంపాయించాడు.

అతడు బౌద్ధమతస్థుడవటం వలన తరచూ టిబెట్, జపాన్‌లకు దైవభక్తితో వెళ్ళి బౌద్ధమత పరమైన ప్రసంగాలకు, బుద్ధదేవుని మోనాస్ట్రీలకి అప్పుడప్పుడు విరాళాలివ్వటమే కాక భారతదేశంలోని బుద్ధగయకు కూడ వెళ్ళి బోధి వృక్షం క్రింద తిన్నె మీద ఓ గంట కళ్ళు మూసుకుని కూర్చుని దీర్ఘంగా మెడిటేట్ చేసి వస్తాడు. ప్రస్తుతం వాషింగ్టన్ డిసిలో మరియేట్ హొటల్‌లో వారి కన్వెషన్ హాల్‌లో ఇసక వేస్తే రాలనంత జనం దేశవిదేశాల నుంచి విచ్చేశారు. పూర్తిగా చీమచిటుక్కుమన్నా వినబడే ఆ విశాలమైన హాలులో ఆనాటి సదస్సులో మార్నింగ్ సెషన్‌లో (ప్రొద్దుటి కార్యక్రమం) డా॥ యాంగ్ చాక్ మొదటి శాస్త్రజ్ఞుడు. అతి విచిత్రమైన విజ్ఞానికులనే చకితులను చేసిన ఒక శస్త్ర చికిత్స వివరాలు పవర్ పాయింట్ ఉపయోగంతో ఆ

రిసెర్చి వివరాలను కోటుకి తగిలించుకుని ఉన్న బటన్ సైజులో ఉన్న 'వైర్‌లెస్' మైకుని మరోసారి సర్దుకుని తన లాప్‌టాప్‌లో ఎక్కించిన విషయాలను గోడ మీద చూపిస్తూ తెరపై ఒక్కో బొమ్మగా వివరించసాగాడు.

'నేను సంవత్సరానికొకసారి విశ్రాంతికై జపాన్‌లోని 'కణసావా' అనే పట్టణానికి ఒక రెండు వందల కిలోమీటర్ల దూరంలో కొండల అంచులో ప్రకృతి అందం వెదజల్లే అతి చిన్న సుందరపల్లె, 'జెంసో' అనే చోట గెస్ట్‌హౌస్‌లో ఓ నెలరోజులుండి, ప్రొద్దున్నే కాలినడకన బయలుదేరి, కొండల మధ్యన సన్నటి కాలిబాటైన రహదారిలో నడుస్తూ ఒక ఐదారు కిలోమీటర్లు రోజూ వెళ్లేవాడిని.

క్రూరమృగాలు లేని ఈ సుందర ప్రదేశంలో చిన్న చిన్న కుందేళ్ళు గెంతుతూ కాలిబాటలో పరిగెట్టటం, ఏపుగా కాలిబాటకు ఇరువైపులా ప్రకృతిలో సహజంగా పెరిగిన ఎర్రటి చెర్రీస్, ఆపిల్స్ కోసుకు తింటూ, కోయిలల 'కుహూలు' వింటూ, పిల్లగాలులు ఒళ్ళు గగుర్పొడుస్తూండగా, ఆకాశంలో వలయాకారంలో, స్వేచ్ఛగా ఎగురుతూ ఉన్న కొంగల బారులను బైనాకులర్స్‌తో అప్పుడప్పుడు, ఎక్కడైనా కాస్సేపు ఓ బండపై కూర్చుని తిలకిస్తూ, ఇలా చెప్తూ .......

ఓ నిముషం ఆగి, ఓ మారు అతి శ్రద్ధగా వింటున్న సభాసదులను చూసి మళ్ళీ ఆరంభించారు. మామూలుగా శాస్త్రజ్ఞుల ప్రసంగాలకు శాస్త్రపరమైన ప్రసంగాలు తప్ప ఇలాటి 'ముందుమాటగా' ఎటువంటి ఉపోద్ఘాతాలను అంగీకరించరు. కాని, డా॥ యంగ్ చాక్ ప్రపంచ విఖ్యాతి గాంచిన మెడిసిన్ నోబెల్ ప్రైజు ఈ మధ్యనే ఆయన ప్రతిభను గుర్తించి ఇచ్చారు. అందుకని, ఇంకా ఏం చెప్తాడో, అని చెవులు రిక్కించుకుని, అక్కడ ఆసీనులైన తదితర శాస్త్రజ్ఞులు కిక్కురుమనకుండా వినసాగారు.

డా॥ యాంగ్ చాక్ మళ్ళీ ప్రసంగించసాగాడు. అలా ఓనాడు ప్రొద్దున్నే కాలిబాట వెంబడి నడుస్తూండగా, ఓ మగ కుందేలు గిలగిల కొట్టుకుంటూ దారిలో కనుపించింది. వెంటనే ముందు నా కర్థమైనది అది నెప్పితో ఉన్నదని. నాలుగేళ్ళు వెటర్నరీ మెడిసిన్ మొదట చదివి అటు పిమ్మట మరో నాలుగేళ్ళు ఇంచుమించు ఒకే వైద్య విధానం గల మెడిసిన్ డిగ్రీలు కూడ చదవబట్టి, కళ్ళకు కొట్టొచ్చినట్లు అర్థమైంది. ఈ రకం గిలగిల కొట్టుకోవటం అంటే ఏదో ఒక రకమైన గడ్డ పెరుగుదల ఎక్కడో ఉండాలి. దానిని వెంటనే పరీక్షించి గడ్డ ఎక్కడో దేనికో అడ్డంపడి ఒత్తుకోవడం వలన ఆ మగ కుందేలు గిలగిల లాడుతోందని గ్రహించాను, ప్రథమ పరీక్ష చేశాక. కానీ అప్పటికప్పుడు ఆ గడ్డని సర్జరీ చేసి తీయకపోతే, ఆ కుందేలుకి ప్రాణాలు దక్కవు. క్షణాల మీద నా

మస్తిష్కంలో గౌతమబుద్ధుని అభయహస్తం కానవచ్చింది. 'కలా నిజమా' అనుకునేందుకు కూడా తీరుబాటు లేని నా సర్జరీలో తర్ఫీదైన చేతులు, తామంతట తామే చకాచకా, కత్తులు, చాకుల మల్లే సుతారంగా వేళ్ళతో ఆ 'డ్యుయోడినమ్' ఉన్న ప్రాంతాన్ని తాకగానే, ఒక్క చుక్క నెత్తురు లేకుండానే అరటిపండు ఒలచినట్లు తోలు తెరుచుకుని రెండు ప్రక్కలకి తొలగి, లోన ఉన్న గుండ్రటి, ఎర్రటి గడ్డ పూర్తిగా కనపడింది. ఒక టెన్నిస్ బంతి పరిణామంలో కనపడిన ఆ గడ్డను చూడగానే అర్థమైంది నాకు అది 'డ్యూయోడినల్ కాన్సర్' గడ్డ అని! మళ్ళీ నా వేళ్ళు సుతారంగా ఆ గడ్డ క్రిందకి దూర్చగానే గడ్డ విడిగా బయటికి వచ్చేసింది! ఆశ్చర్యంతో చకితుణ్ణయి, నోటమాట రాలేదు నాకు! ఒక్క చుక్క నెత్తురు కారలేదు కదా! మత్తుమందు ఇవ్వకుండానే ఆ మగకుందేలు కళ్ళు తెరుచుకునే, సర్జరీ చేసేందుకు వీలుగా అన్నట్లు ప్రక్కకి తిరిగి బుద్ధిగా, మెదలక కదలక పడుకుని ఉంది. మళ్ళీ నా చేత్తో కుట్లు వేసే రీతిలో నా వేళ్ళు, తోలుపై రాయగానే, చక్కగా తోలు ఏదో ఒక జిగురు (GLUE)తో అంటించినట్లు అంటుకుపోయింది! నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను! అని, అంతవరకూ తను చెప్పిన విషయాలన్నీ తను సెల్‌ఫోన్ కెమెరాతో వీడియోగ్రాఫ్ తీసినవి చూపించాడు. కుందేలు సర్జరీ ముగించిన తక్షణం ఓసారి నావేపు చూసి, గెంతుకుంటూ చలాకీగా ఆ చిట్టడవిలోకి పారిపోయింది.

నేను ఎప్పుడూ నాతో పళ్ళు కోసుకెళ్ళటానికి తెచ్చుకునే ప్లాస్టిక్ సంచులూ, కొంత ఉప్పూ ఉండబట్టి, ఆ గడ్డకి కొంత ఉప్పు (సోడియం క్లోరైడ్) తడిగా పైన రాసి, నాతో కూడా గెస్ట్‌హౌస్‌కి తీస్కెళ్ళి, తక్షణం 'కణసావా' మెడికల్ స్కూల్కెళ్ళి (కారులో) అక్కడ వారి వెటర్నరీ పెథాలజీ లాబ్‌లో అందరూ పరియస్థులవటం మూలాన బయాప్సి చేయించి, అది 'డ్యూయోడినల్ కాన్సర్' గడ్డేనని 'హిస్టోపెథాలజీ' స్లైడ్స్‌లో మైక్రోస్కోపులో చూసి నేనే నిర్ధారించుకున్నాను. వాళ్ళ దగ్గర శెలవు తీసుకున్నాక వెంటనే ఫిలిపీన్స్‌కి తిరుగు ప్రయాణం కట్టాను. ఎందుకంటే, ఇదే రీతిలో బీదప్రజలకు వైద్యం చేయాలని ఇలాటి జబ్బే వచ్చిన వాళ్ళు కొల్లలు. వారికి సర్జరీ మామూలు పద్ధతిలో చేయటానికి కనీసం గంట పడుతుంది, థియేటర్‌లో సర్జికల్ పనిముట్లతో.

కానీ, ఈసారి ఇదే విధంగా ఇదే రీతిలో పది నిముషాల్లో చేయగలనేమో? అనుకున్న పదిరోజులకే అదే జబ్బుతో ఒకామె, చాలా బీద స్థితిలో ఉండటం వలన, ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్న నా వద్దకు వచ్చింది. థియేటర్‌లో ఒక ప్రక్క అన్ని పనిముట్లు తయారు చేసుకున్నా కూడ, నా వద్ద పనిచేస్తున్న నర్సులు, పారామెడిక్స్

అందరినీ థియేటర్‌లో నాతోబాటు ఉండి ఈ విచిత్రం చూడవలసినదని ఆదేశించాను. అదే రీతిలో బుద్ధదేవుణ్ణి తల్చుకోగానే ఆయన నా మస్తిష్కంలో ప్రత్యక్షం కాగానే, చక చకా మగ కుందేటికి చేసిన రీతిలోనే ఆమెకు పది నిముషాల్లో వట్టి చేతులతో ముగించాను. నా వద్ద పనిచేస్తున్న సర్జరీ సిబ్బంది, అవాక్కయి నావైపు ఏదో దెయ్యాన్ని చూసినట్టు గుడ్లప్పగించి చూడసాగారు. వారందరికీ జపాన్‌లో నాకు గల్గిన ఈ దైవీకపు శక్తిని వర్ణించి చెప్పాక కాస్త ఊపిరి పీల్చుకున్నారు ధైర్యంగా. అంతవరకు నెప్పితో వచ్చిన ఆమె పది నిముషాల్లో లేచి కూర్చోవటమే కాక నావైపు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ 'మీరు డాక్టరు కారు, దేవుళ్ళు!' అని నాకు భక్తితో నమస్కరిస్తే నేను వారించానామెను. నేను మామూలు మనిషినేనని, దేవుణ్ణి కానని ధైర్యం చెప్పి ఇంటికి పంపించేశాను," అంటూ అంతవరకూ చెప్పిన విషయాలు, తిరిగి ఆమె మీద చేసిన శస్త్రచికిత్స అన్నీ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్స్‌తో అక్కడి సభాసదులకు ఇతర శాస్త్రజ్ఞులకు చూపగానే, అందరూ ఆశ్చర్యచకితులై గౌరవసూచకంగా నిలబడి 'స్టాండింగ్ ఓవేషన్' చప్పట్లతో ఓ అరగంట దద్దరిల్లిపోయేట్లు చప్పట్లు కొట్టాక సదస్సు ముగిసింది. మర్నాటి 'న్యూయార్క్ టైమ్స్'లో ఫోటోలతో సహా డా॥ యాంగ్ చాక్‌ని మెచ్చుకుంటూ మొదటి పేజీలతో పెద్దపెద్ద అక్షరాలతో లోకానికి చాటి చెప్పటమే కాక, అన్ని టి.వీ. న్యూస్ ఛానెల్స్‌లో అమెరికాలో ఈ విషయం మారుమ్రోగిపోయింది.

# దేవుడు ఉన్నాడా?

మనుష్య జాతి ఒకప్పుడు కోతి సంతతినుంచి పురోగమించి, మెదడు విపరీతంగా అభివృద్ధి ఎలా చెందింది? చెట్లలో కోతుల తిండికి (పళ్ళు, ఫలాలు) పోటీగా మిగతా రకాల కోతులు, ఇతర జంతువులూ ఉడతలూ, చిలుకలూ, పక్షి సంతతి ఎక్కువైపోవటంతో, చెట్లపై నుంచి, నేలపై దిగటం తప్పలేదు. చెట్లపై ఉన్న శాంతి భద్రతలు కోల్పోవటమేకాక, మరో క్రొత్త రకం ఉపద్రవం ఎదురైంది. పులులూ, ఎలుగుబంట్లు, ఇతరత్రా క్రూర జంతువులు ఆకలితో తరిమి తరిమి కొట్టగా మళ్ళీ చెట్లెక్కడమో, లేక వాటికి బలై ఆహారమవటమో తప్పలేదు. కనుక కోతులు క్రమంగా రానురాను అంతకంత పరిణతిలో పెద్దవై బలమైన చాలా పెద్ద 'గోరిల్లా' సంతతి ఉద్భవించింది. ఇవి నేలకి దగ్గర్లోనే ఒక కొమ్మపై ఆకులతో పరుపు ఏర్పరచుకుని వెల్లకిలా పడుకోవటం ఆపద వచ్చినప్పుడు పై కొమ్మలకి ఎగబాకటం, మిగతాప్పుడు రోజంతా కందమూలాలు వెతుక్కుని చేతితో లాగి తినటం, ఇలాటివి చేయటం. ఈ రకం 'గొరిల్లా'లు దగ్గర దగ్గర నూరు టన్నులు బరువుతో, భయంకర నల్లటి రూపంతో, ఆపద వచ్చినప్పుడు భయానక దృశ్యంతో గుండెలు బాదుకుని మిగతా తమ సంతతి వారిని హెచ్చరించటం లాటివి చేయటం మూలాన పులులు సైతం, వాటికి దూరంగానే మెలగసాగాయి. ఆ రూపం చూసి భయాందోళనలతో ఓ రకం కాస్త చిన్న పరిణతిలో ఉన్న కోతులు, గొరిల్లాలకి మల్లే తోకకోల్పోయి, ఎర్రటి ఒరంగూటాన్‌లగానూ, నల్లటి పొడుగాటి చేతులుగల 'గిబ్బన్ల'గాను అప్పటికింకా లేని నరుడి రూపం గల 'చింపాంజీల'గాను విభజన జరిగాయి. అవసరాన్ని బట్టి వాన, మెరుపులు, ఉరుములు, పిడుగుల చప్పుళ్ళకి దగ్గర్లో ఉన్న గుహల్లో మొదట తలదాల్చుకున్నా, గుహల్లో ఉన్న భద్రత, చలి వానల నుండి తమను రక్షించుకోవటం సులువని గ్రహించాయి. కానీ ఈ ఇతర క్రూర మృగాల నుంచి తప్పించుకోవటంలో మొట్టమొదట గొరిల్లాలు, చింపాంజీలు, చేతికి ఏది బడితే అది దొరకగానే, అంటే పెద్ద దుంగలు, రాళ్ళూ రప్పలూ విసరటం, తమని రక్షించుకోవటానికి అనువైన ఆయుధాలని గ్రహించాయి.

అలా కోట్ల సంవత్సరాల కొద్దీ తమను తాము రక్షించుకొనేటప్పుడు సానపెడితే, దాని వల్ల కొన్ని పదును కొనలు ఉన్న రాళ్ళను విసిరినప్పుడు కొన్ని జంతువులకు తగిలి చావటం ఆ పిమ్మట చింపాంజీలు వాటిని చీల్చి మాంసం పీక్కు తినటం కూడా అలవాటు చేసుకున్నాయి. ఇలా రాయి, మెదడు, కాళ్ళు, ఒకదానికొకటి ఉపాయాలు చెప్పుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకసారి సానపెడుతూండగా కాకతాళీయంగా, ఒకరాయికింకోరాయి తగలగానే నిప్పు కణికలు రేగి, దగ్గర్లోనే ఉన్న ఎండు గడ్డికి తగలగానే, ఆ గడ్డి అంటుకుని నిప్పుగా మారగానే, చేతిలో ఉన్న

మాంసం ముక్కలు ఆ నిప్పులోపడి బాగా ఉడక సాగాయి. మొదట నిప్పుకి భయపడి పారిపోయినా నిప్పులో పడిన మాంసం ఉడికిన వాసన ముక్కు పుటాలకి తగలగానే, చల్లారగానే వాటిని వాసన చూసి నోటిలో పెట్టుకుని కొద్దిగా నమలగానే నోటికి రుచిగా, మెత్తగా అనిపించింది వాటికి. ఈసారి కావాల్సి మళ్ళీ రెండు చెకుముకి రాళ్ళు మళ్ళీ, ఒకదాన్నొకటి వేడెక్కి కణికలు వచ్చినప్పుడు ఎండుగడ్డిని తామే వాటి మధ్య పెట్టగానే రేగిన మంటను, వేటాడి తెచ్చిన మాంసం ముక్కలను ఓ కర్రకి గుచ్చి నిప్పులో కాస్సేపు అటూ, ఇటూ త్రిప్పి, మంచి ఉడికిన వాసన రాగానే, తీసి, చల్లార్చి త్రినటం వలన, జబ్బులు రావటం మానటమే కాక, సులభంగా జీర్ణమై, ఆరోగ్యంగా తయారవసాగాయి చింపాంజీలు. మిగతా కోతి వైవిధ్యాలు శాకాహారులు. కానీ నిప్పు వల్ల తమకు గుహల్లో రాత్రిపూట చలికి కాయటమే కాక, నిప్పును చూస్తే వణికిపోయే పులులు, సింహాలు, చిరుతలు, భల్లుకాలు, ఈ గుహల దరిదాపులకి వెళ్ళవు. ఈ రకంగా మెదడు పరిణతి అభివృద్ధి చెందుతూ వచ్చిన కోతులు మెదడు పెరుగుదలతో మానవుడుగా మారాయి. క్రమక్రమంగా చనిపోయిన జంతువుల ఎండిన తోలు దుస్తులుగా ధరిస్తే మరింత చలి నుంచి రక్షణ అని నేర్చుకున్నాయి. అంతే కాదు. గుంపుగా ఒక కుటుంబంలా మెలిగితే శత్రువులను సునాయాసంగా ఎదుర్కోవచ్చును. సైగలతో, అరుపులతో, కూతలతో తిండి ఎక్కడ ఉందో కనుక్కున్న నరుడుగా మారుతున్న కోతులు, మిగతా కుటుంబ సభ్యులకు చెప్పటం నేర్చుకున్నాయి. అంతేకాక ఈ అరుపులు, గొణుక్కోవటం ముఖ కవళికలతో వెక్కిరింతలు, ఒక్కో కోతి సంతతికి ఒక్కో రూపంలో గుర్తులు తెలిసేటట్లు ఏర్పడ్డాయి. డా॥ జేన్ గుడాల్ అనే అమెరికన్ యువతి (ఇప్పుడామెకి 80 ఏళ్ళు) ఆఫ్రికన్ చింపాంజీలతోనే కలిసిపోయి వాళ్ళలో ఒకరుగా ఉంటూ వాటికి కూడా మనుష్యులకి మల్లే ప్రత్యేకమైన 'భాషలు' ఉన్నాయనీను, ఆమె కూడా వాటికి మల్లే ఆ 'భాషని' చప్పుళ్ళ రూపంలో క్షుణ్ణంగా నేర్చుకుని, వాటిని స్పందింపచేయగలిగి ఆమె వ్రాసిన పుస్తకం 'ఇన్ ది షాడో ఆఫ్ మాన్'లో ఇవన్నీ వివరింపబడ్డాయి.

ఇలా కోతి సంతతి నుంచి క్రమక్రమంగా ఉద్భవించిన మనుష్యజాతి, పురాతన గుహల్లో గీసిన/వేసిన బొమ్మలు తిండి ఏ చోట ఉన్నదో లేక శత్రువు ఎటువంటి రూపం గలదో తెలియజేసేవిగా ఉన్నాయి, ఇప్పటికీ! అంతేకాదు పనిముట్లు తయారీ, భాషా పరిజ్ఞానం విపరీతంగా పెరగటంతో విజ్ఞానం, బొమ్మలతో మొదలైన పిచ్చి గీతలు అక్షరాలుగానూ, అరుపులూ, కూతలు, భాషగానూ తయారు కావటం, మనిషి మెదడులో ఒక ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకున్నాయి. ఈ స్థానాన్ని కనుక్కున్న విజ్ఞాని పేరు డా॥ బ్రోకా. కనుక మెదడులో ఆ భాగానికి 'ఏరియాబ్రోకా'గా ఇతర శాస్త్రజ్ఞులు నామకరణం చేశారు.

మరి, విజ్ఞానం పెరిగి, రాళ్ళు, పనిముట్లు, లోహం ఆయుధాలుగా తయారు కావటం, అటు పిమ్మట తలదాచుకోవటానికి గుహలు, చెట్ల తొఱ్ఱలలో చోటు ఎవ్వరు ముందు ఆక్రమించుకున్నారో చూద్దాం అని బలబలాలు తేల్చుకోవటానికి ఈ లోహాలతో చేసిన ఆయుధాలతో హెూరాహెూరీ మారణ హెూమాలు, యుద్ధాలు, గెలిచిన వారిదే చోటు, తక్కిన వాళ్ళు తోక ముడుచుకుని మరో చోటు వెతుక్కుని పారిపోవడాలు... ఇలా నడుస్తూ ఈ నాటి వరకూ అణుశక్తి ఆయుధాలుగా ఉపయోగించుకునేటంతటి విజ్ఞానం పురోగమనం చెందటం... ఇలా మనిషిలో చైతన్యం యుగాల బట్టీ జరుగుతోంది అని కాస్త దగ్గి, ఓ గ్లాసు మంచినీళ్ళు త్రాగి ఓసారి సభాసదులవైపు చూశాడు. (ఇక్కడ మనం కాస్త పరిచయాలని తెలుసుకోవాలి) "మద్రాసు నగరంలో ప్రఖ్యాతి గాంచిన టి.వి. సంతానమయ్యంగార్ వారి టి.ఎస్. రంగనాథన్ ఎండోమెంట్ లెక్చర్‌కి, ఆనాడు పిలవబడిన శాస్త్రవేత్త మాస్కో రష్యా నుండి పిలవబడిన ప్రపంచ ఖ్యాతిగల 'నోబెల్‌ప్రైజ్ ఇన్ కెమిస్ట్రీ' గ్రహీత డా॥ విన్సెటా సోక్రశ్చేవ్, రెండు పిహెచ్.డిలు ఒక్కో ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీలలో హార్వర్డ్ యూనివర్శిటీలో చదివాక అక్కడే ఒక ఇరవై ఏండ్లు ప్రొఫెసర్‌గా పనిచేశారు. అటు పిమ్మట నోబెల్‌ప్రైజ్ వచ్చాక, ఆ డబ్బుతో తన స్వదేశమైన రష్యాకి వెళ్ళి, రష్యా పొలిమేర్లలో, వారి ప్రభుత్వం అనుమతితో అతిపెద్ద ప్రయోగశాల నిర్మించి రష్యన్ యువతకు పిహెచ్.డిలకు ట్రెయినింగ్ (తర్ఫీదు) ఇవ్వసాగాడు. ఆయన రెండు మాస్టర్స్ డిగ్రీలలో ఒకటి 'సైన్స్ అండ్ రెలిజన్'నూ రెండోది 'కెమికల్ బయాలజీ'లో చేయటం మూలాన ఈనాటి మద్రాసులో ఎండోమెంట్ లెక్చర్‌కి, 'విజ్ఞానం, మతం, మనిషి' అనే టాపిక్‌పై ఆయన్ని ఆహ్వానించారు. మద్రాసులో అతి పెద్ద ఫైస్టార్ హెూటల్ తాజ్‌లో కన్వెన్షన్ హాలులో దేశవిదేశాల నుంచి ఆయన ప్రత్యేకమైన ఈ లెక్చర్ వినటానికి విచ్చేశారు.

❖ ❖ ❖

తాజ్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్ కండిషనర్స్ 'హమ్మింగ్' చప్పుడు తప్ప చీమ చిటుక్కుమన్నా శబ్దం వినపడేంత నిశ్శబ్దం అలముకుంది. ఇప్పుడు కోటుకే తగుల్చుకున్న బటన్ సైజు మైక్‌తో చక్కటి సౌండ్ ప్రూఫింగ్ వల్ల వెయ్యిమందికి పైగా హాజరయిన ఆ హాలులో మొదట డా॥ కృష్ణమూర్తి శ్రీనివాస్, ఎఫ్.ఆర్.సి.పి (లండన్) ఎఫ్.ఆర్.సి.పి (ఎడిన్‌బ్రో) ఎఫ్.ఆర్.సి.పి. (గ్లాస్కో) పి.హెచ్.డి. (ఐర్‌లాండ్) ప్రపంచ ఖ్యాతి గాంచిన న్యూరో సైంటిస్టు, టివిఎస్ గ్రూప్ సైన్స్ ఛేర్‌కి పర్మనెంట్ ప్రొఫెసరైన ఆయన మైకు సరిచేసుకుని, డా॥ విన్సెట్ సోక్రశ్చేవ్‌గారిని ఆయన ప్రతిభను ఆహ్వానితులకు పరిచయం చేశాడు, ఆ తంతు ముగియగానే ఎండోమెంట్ గురించి, ఏటా జరిగే ఇలాంటి లెక్చర్ల గురించి, క్లుప్తంగా చెప్పారు టి.వి.ఎస్. గ్రూప్ అధిపతి పారిశ్రామికవేత్త శ్రీ టివి స్వామినాథన్. మన దేశపు పేరు ప్రతిష్ఠలు ప్రపంచ ఖ్యాతికి తేవటమే కాక, టివిఎస్ తయారిలో ఉన్న అనేక స్కూటర్లు, మోటారు సైకిల్సు అనేక దేశాలు పోటీపడి

కొనుక్కుంటున్నాయి. అంతేకాక, తక్కిన దేశాల్లో విభాగాలు నెలకొల్పి అక్కడ కూడా టివిఎస్ బ్రాండ్ నేమ్ చాలా గొప్పదిగా పాశ్చాత్యులు మెచ్చుకొనేంత దూరం తెచ్చాడు వారి అధిపతి, మెకానికల్ ఇంజనీరైన శ్రీ టివి స్వామినాథన్, వారి తండ్రిగారి జ్ఞాపకార్థం ఈ ఎండోమెంట్ ఫండ్/ట్రస్ట్ నెలకొల్పారు వారు.

డా॥ విన్సెటా సోక్రశ్చేన్, భారతదేశపు ఆచారం ప్రకారం అందరికి నమస్కరించి 'నమస్తే ఫ్రెండ్స్!' అంటూ ఆరంభించాడు. డా॥సోక్రశ్చేవ్ ఈనాటి నా ప్రసంగంలో 'సైన్స్' రెలిజన్ అండ్ మ్యాన్'లో అతిముఖ్యమైన అంశం రెలిజన్ (మతం) మతం లేనిదే దేవుని ప్రశక్తి రాదు. కనుక నేను మీకు నా నిజజీవితంలో జరిగిన ఒకే ఒక ఘట్టం వివరిస్తాను. ఆ ఘట్టం నా జీవిత చరిత్ర పూర్తిగా మార్చేసింది. దీన్ని బట్టే ఒకప్పుడు ఒక నాస్తికుడిగా చెలామణీ అవ్వబడిన నేను, మతం పట్ల విపరీతమైన విశ్వాసం కలగటమే కాక, రోమన్ కాథలిక్‌గా మారిన నేను, చర్చికి వెళ్ళని రోజులేదు. కానీ ఎన్నడూ ఒక నాస్తికుడిగా దైవాన్నో లేక దైవభక్తులనో నేను ఎగతాళి చేయలేదు.

ఓసారి ప్రపంచంలో అతిముఖ్యమైన సదస్సులో నా రిసెర్చి పేపరు చదవటానికని మాస్కో నుంచి పారీస్‌కి అప్పటి అతిపెద్ద విమానం 'కాన్‌కార్డ్' గంటకు 3000 మైళ్ళ వేగంతో సౌండ్ వేగం కన్నా పదింతల వేగంతో ఎగిరే కాన్‌కార్ట్ 'ఏర్‌ఫ్రాన్స్' వారి విమానంలోనైతే మాస్కో నుంచి పారీస్‌కి కేవలం నలభై ఐదు నిముషాల్లో పయనించగలదు. ఇప్పుడు ఆ విమానం పూర్తిగా నిషేధించారు. బ్రిటిష్ వారు తయారు చేసిన ఆ 'కాన్‌కార్డ్' ఇప్పుడు విప్పబడి, ముక్కలు ముక్కలుగా ఇంగ్లండులో ఒక 'ఏర్ మ్యూజియమ్'కి 'రిటైర్' చేయబడింది. దానికి కారణం ఫ్రాన్స్ నుంచి తిరిగొస్తున్నప్పుడు గాలిలో ప్రేలి ముక్కలు ముక్కలై, సముద్రంలో కూలిపోయాక ఇంగ్లండు, తదితర దేశాలు, ఆ విమానాన్ని నిషేధించారు. ఐదువేల మందికి పైగా ఎక్కించుకోగలిగిన ఆ విమానం కూలినప్పుడు అందరూ మరణించటం, దానికి కారణభూతమైనది.

అదే ప్రమాదం జరిగిన విమానంలో నేను మాస్కోకి తిరిగి వస్తున్నాను. నా ప్రక్క సీట్లో ఒక తెల్లటి జుత్తు, ఎర్రటి వర్ణం గల రోమన్ కాథలిక్ బిషప్ చిరునవ్వుతో ఆయనను ఫాదర్ సుపీరియర్ ఫ్రాన్సిస్‌గా పరిచయం చేసుకున్నాడు. కేవలం నలభై ఐదు నిముషాల ప్రయాణమే కనుక ఒకర్నొకరు పరిచయాలయ్యాక ఇద్దరం ఏర్‌హొస్టెస్ తెచ్చిన ఫ్రెంచి వారి రెడ్ వైన్ సిప్ చేస్తూ మతపరమైన విషయాలు ఆయన చెప్తూంటే ఆసక్తి లేకపోయినా నాస్తికుడైన నేను శ్రద్ధగా వినసాగాను. ఆయన చెప్పిన విషయాల సారాంశం ఒక్కటే. 'దేవుణ్ణి నమ్ముకో. మీకు ఎన్నడూ మంచే జరుగుతుంది..." ఇంతలో ఒక విపరీతమైన పేలుడు... అబ్బా! కాలిపోతున్నాము! ఏం జరిగిందో తెలుసు... విమానం పేలిపోయింది. క్రింద నీళ్ళు... ఓ... మైగాడ్! నేను అన్న ఆఖరి మాట. శరీరం కాలిపోయింది. స్పృహలేదు. ప్రాణం లేదా!

కళ్ళు తెరిచేసరికి మాస్కోలో అతిపెద్ద హాస్పిటల్‌లో చెక్కుచెదరని నేను... స్పృహ వచ్చాక కళ్ళు తెరచి చూస్తే ప్రక్కనే చిరునవ్వుతో ఫాదర్ ఫ్రాన్సిస్! నా సతీమణి డా॥ లైడా, మా పిల్లాడు ఆరేళ్ళ రాబర్ట్. ఓసారి నవ్వి, పొడుగాటి ఆయన తెల్లటి కోటు లోంచి తళతళ మెరుస్తూన్న 'క్రాస్' తీసి, నా తలమీద తాకి, టీ తేవటానికి నా భార్యా, కుమారుడు పది నిముషాల్లో వస్తానని చెప్పి వెళ్ళటం వల్ల, ఆయన, నేను మట్టుకే మిగిలాము. 'ఇక వస్తాను! అన్నట్లు చేయూపి, అలా తేలుతున్నట్లు నడుస్తూ... అదేమిటి! అలా ఇరవైయో అంతస్తులో ఉన్న నా రూము పెద్ద కిటికీ వేపు అలా అలా వెళ్ళి పల్చగా మారి అదృశ్యమైపోయాడు? అవాక్కయి శాస్త్రజ్ఞుడినైన నేను, నాస్తికుడిననుకున్న నేను, నోట మాట రాక అలాగే గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను. ఇంతలో తిరిగి వచ్చిన నా సతీమణికి, నా కుమారుడికీ అన్నీ వివరించాను. ఆమె ఆశ్చర్యంగా "ఫాథరా? ఎవ్వరూ లేరే! మిమ్మల్ని రెడ్ క్రాస్ వారి వ్యాన్‌లో స్పృహ తప్పి ఏమాత్రం దెబ్బలు తగలని మిమ్మల్ని ఇక్కడ చేర్చి, నాకు ఫోన్ చేసి నేను రాగానే వెళ్ళిపోయారు. అంతదాకా చనిపోయిన వారి జాబితాలో మీపేరు, మీరు వేసుకున్న సూటూ, మీ పర్సు, ఐడెంటిటీ కార్డు అన్నీ చూపారు. ముక్కలైన మీ శరీర భాగాలు, వాచీ కూడా అలాగే ఉన్నా మీ ముంజేతి భాగాలు, మీరు ప్రఖ్యాతులవటం వల్ల టివిలో చూపారు. డిఎన్ఏలు మన కుమారుడి రక్తం సాంపిలడిగి పోల్చి చూసి అవి మీ శరీర భాగాలే అని స్పష్టంగా నిరూపించబడ్డాయి. ఇచ్చిన సర్టిఫికెట్ కూడ ఇంట్లో ఉన్నది. అంతవరకూ ఏడుస్తూ కూర్చున్న నాకు, రెడ్‌క్రాస్ వారి ఫోన్ రాగానే, ఎక్కడలేని సంభ్రమాశ్చర్యాలతో ఇక్కడికి వెంటనే పరిగెట్టుకొచ్చాను. మరి మీరేమో ఫాదర్ ఫ్రాన్సిస్ గురించి చెప్పారు. ఆయన పేరు ప్రఖ్యాతలున్న రోమన్ కాథలిక్ చర్చి వాటికన్ నుంచి ఫ్రాన్స్‌కి వచ్చి, మతరీత్యా మాస్కోకి పయనిస్తూండగా ఆయన, మీరు వస్తున్న విమానం పేలిపోయి కూలటంతో, ఆయన శరీరం భాగాలు ఆయన వేసుకున్న తెల్లటి కోటూ, వాచీ, క్రిస్టియన్ క్రాసూ అన్నీ చర్చి వారికి అప్పగించినట్లు, అన్ని దినపత్రికలలో, టివిలోనూ పదే పదే చూపారు. మరి మీరు చెపుతున్న ఫాదర్ ఫ్రాన్సిస్..." అని విపరీతమైన దైవభక్తిగల రోమన్ కాథలిక్ నా భార్య. అర్థం చేసుకుని కన్నీళ్ళతో ఆమె మెడలో ఎప్పుడూ వేళ్ళాడే క్రిస్టియన్ క్రాస్ తీసి కళ్ళ కద్దుకుంది.

ఇంటికి తిరిగి వెళ్లగానే, ఆమె భద్రంగా బీరువాలో తాళం వేసి పెట్టిన నా 'డెత్ సర్టిఫికెట్' లేదు! వేసిన తాళం వేసినట్లుగానే ఉన్నది.

ఆనాటి నుంచి ఈనాటి వరకూ నాలో పూర్తి నమ్మకం ఏర్పడింది. దేవుడు ఉన్నాడనీ! ఆపదల్లో ముఖ్యంగా నాస్తికులకు కూడ చేయూతనిస్తాడనీ అన్ని మతాల్లో దేవుడు భక్తులకెప్పుడూ అండగా నిలుస్తాడనీ గాఢంగా నమ్ముతాను" అని ముగించాడు. చప్పట్లతో సభ ముగిసింది.

# ప్రపంచాన్నాక్రమించిన సూపర్ కంప్యూటర్లు

అది జపాన్ రాజధాని టోకియో. సంవత్సరం 4050. జపాన్‌లో ఐదువందల యాభైయో అంతస్తులో ఒక పెద్ద ఫుట్‌బాల్ ఫీల్డంతటి హాలు. అందులో పరికరాలన్నీ సూపర్ కంప్యూటర్లకి చెందినవే. అంతపెద్ద హాలుకి నలుగురే నలుగురు, నరరూపంలో వున్న మరబొమ్మలకి మల్లే నలుగురు. వాళ్ళని చూడగానే తెలుస్తుంది, నరులు కారనీ, ఒకప్పుడు నరుడే సృష్టించిన నడిచే, నవ్వే బొమ్మలైన విపరీతమైన తెలివితేటలతో ఉన్న సూపర్ కంప్యూటర్లనీను.

2014 సంవత్సరంలో డా॥ స్టీఫెన్ హాకిన్స్ అనే ఆస్ట్రోఫిజిసిష్టు అమెరికా హార్వర్డ్ యూనివర్శిటీలు ఉండగానే, ఒక విచిత్రమైన విషయం లోకానికంతటికి టెలివిజన్‌లో చెప్పాడు. అదేమిటంటే, మనిషి తయారు చేస్తున్న రోబోలు ఎప్పటికో ఓనాటికి మనిషికి మించిన తెలివితేటలు గలవిగా మారి, భూలోకాన్నంతటినీ ఆక్రమించుకుని జాతిమత భేదాల్లాంటివి లేకపోయినా, మానవ జాతిని పూర్తిగా నాశనం చేసి 'తామే లోకాన్నంతటినీ పరిపాలిస్తాయనీ, దయాదాక్షిణ్యాలు, పాపపుణ్యాలకి తావు ఉండదనీ, చెట్ల అవసరం, నీళ్ళ అవసరం నశించిపోయి వాటి స్థానంలో మార్స్ (అంగారక గ్రహం) నుంచి ప్రతిరోజూ కార్లలో బజారుకెళ్ళి వచ్చిన రీతిలో గంటకో 'షటిల్ సర్వీసు' ఆయిల్ సరఫరా, కంప్యూటర్ల రిపేరుకి కావల్సిన పరికరాలు, అరిగిపోయిన వాటిని మార్చేందుకు స్పేర్‌పార్ట్సు అన్నీ పకడ్బందిగా ఆ సూపర్ కంప్యూటర్సు ఏర్పరచుకొని, మిగతా గోళాల మీదుండే 'జీవుల'తో స్నేహపూర్వక రాకపోకలు వీనస్, నెప్ట్యూన్ ఇతరత్రా రాకపోకలు, వ్యాపారపరంగా ఇచ్చి పుచ్చుకోవడాలు జరిగేందుకు అవకాశాలు ఏర్పడతాయనీ కనుక జాగ్రత్త పడమని, విపరీతంగా హెచ్చరించాడు. ఆనాడాయనన్న విధంగానే ఇప్పుడు ఆ నలుగురూ, 'హ్యూమనాయిడ్'గా పిలువబడి సూపర్ కంప్యూటర్లు ప్రపంచం మొత్తం తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ఒక కంప్యూటర్/రోబో పేరు జెఎస్సీ50 మరో ముగ్గురి పేర్లు అలాగే వరసగా జెఎస్సీ 51, జెఎస్సీ-52, జెఎస్సీ-53 ఇంకా జెఎస్సీ-54, జెఎస్‌సీ, అంటే "జపాన్ సూపర్ కంప్యూటర్" ఇలా వరస వారీగా నెంబర్లు, ఆ పిమ్మట, అనగా ప్రతి ఐదు వందల కంప్యూటర్ల నెంబర్లవగానే, చివర్న 'A' సీరీస్, 'B' సీరీస్ ఇలా 'Z' వరకును, మళ్ళీ A, సీరీస్, అయిపోగానే B, సీరీస్ మళ్ళీ Z, సీరీస్ వరకూ నెంబర్లే పేర్లు.

మానవులకి మల్లే మరణం లేకపోయినా, ప్రతి నూరు సంవత్సరాలకి, అరిగిపోయిన, పాత "సూపర్ కంప్యూటర్లు" వాటిని 'డిస్‌మాంటిల్' చేసి, కంప్యూటర్ల తయారీ అయే "ఆటోమాటిక్ అసెంబ్లీలతో" సెకనుకు మరో వెయ్యి కంప్యూటర్లు అత్యాధునికమైనవి, తగిన మార్పులతో తయారి అవుతాయి. కనుక వర్క్‌షాపులు,

రిపేరు షాపులు ఇవి తప్ప, శ్మశానాలు, హాస్పిటల్సు గట్రా ఏనాడో పోయాయి. మనిషి సంతతి, తక్కిన జంతుజాల సంతతి ఏనాడో నశించిపోయి వాటి మృతకళేబరాలు, శిలాజాలు మట్టుకే "మ్యూజియమ్ స్పెసిమన్స్"గా కనపడతాయి.

కార్లన్నీ ఎగిరేకార్లు. డ్రైవర్లు లేరు. అన్నీ ప్రీప్రోగ్రాము (ముందరే వెళ్ళాల్సిన చోటు, అడ్రసు వీధి) అన్నీ ఒత్తిన బటన్లతో సెకన్లలో ఆ చోటికి నేలమీద, గాలిలో చేరగలవు చెట్లూ, సముద్రాలు లేవు, వాటికి బదులు విస్తారమైన లోహాలతో ముఖ్యంగా తేలికగా ఉండే 'ప్రీ ఫాబ్రికేటెడ్' హిండాలియం ఇళ్ళు. అందులో నివసించేవన్నీ సూపర్ కంప్యూటర్లే. మార్స్‌కి, నెప్ట్యూన్ తదితర ఎన్నో గోళాలకి రాకపోకలు క్షణాలమీద వెళ్ళివచ్చే 'ప్రీప్రోగ్రామ్డ్' శబ్దం, సెగలు లేని ఎటుపడితే అటు ఎగరగలిగిన 'అంతరీక్ష నౌకాయానాలు'. తక్కిన గోళాల నుంచి ఇంతకన్నా కొన్ని కోట్ల రెట్లు రీసెర్చిలో పురోగమనం ప్రగతి చెందిన పచ్చటి మూడడుగుల ఎత్తున్న పరగ్రహవాసులు రావటం, వారిని ఆహ్వానించి ఆదరించి క్రొత్త రిసెర్చి, టెక్నాలజీ నేర్చుకోవటం ఇది దినచర్యలలో ఒక భాగం సూపర్ కంప్యూటర్లకి. ప్రతి దేశానికి అక్షరాల సంఖ్యల పేర్లుండటం వలన సూపర్ కంప్యూటర్లు సెల్‌ఫోన్‌లు పోయి, గాలిలోనే 'వర్చువల్ ఇమేజ్'లోనే సంభాషణలు, అంతా కంప్యూటర్ భాషలే. (ప్రోగ్రామ్ చేసే రీతిలో) ఇక దేశాలతో, ఇతర పరగ్రహ వాసులతో అడ్వాన్స్‌డ్ సాటిలైట్ టెక్నాలజీతో కలర్ బొమ్మ 'వర్చువల్'గానే వాటి 'చేతులు'గాలిలో ఊపగానే కనపడతాయి. వాతావరణం అంతా గాలి బదులు ఓజోన్‌లు, కార్బన్‌డై ఆక్సైడ్‌ని పూర్తిగా మింగేసే కంప్యూటర్లు. 'పొల్యూషన్ రిమూవర్లూ' యధావిధిగా తమ తమ పనులు చేస్తూపోతాయి.

3000 సంవత్సరంలోనే, మూడవ, నాల్గవ ప్రపంచ యుద్ధాల వల్ల మనుష్యజాతి, జంతుజాతి, వృక్షజాతి నశించిపోవటంతో చావులేని మిగిలిన కొద్ది సూపర్ కంప్యూటర్లు విపరీతంగా వృద్ధి చెందాయి. ఇలా ప్రారంభమైన ఈ వృత్తాంతం, అలా అలా సంవత్సరాల కొద్దీ జరుగుతూ పోయింది. యుద్ధాలు లేవు. పరస్పర సహాయాలతో, ఇతర గోళం వాసులు కొన్ని కోట్ల యుగాలు అన్ని రంగాల్లో విజ్ఞానాభివృద్ధి చెందటం వలన, శాంతిభద్రతలూ, విజ్ఞానం అభివృద్ధి, సూపర్ కంప్యూటర్లు మట్టుకే ప్రశాంతంగా అంతకంతా వృద్ధి చెందుతూ, కక్షలు, జాతిమత బేధాలు, చంపుకోవడాలు లేకుండా కేవలం విపరీతమైన విజ్ఞానాభివృద్ధికి తోడ్పడసాగాయి. 4050, 6050, 7050, ఇలా యుగయుగాలు గడిచిపోతూ... చివరకు భగవంతుడే మళ్ళీ అవతరించి సృష్టించటం మొదలెట్టి, మళ్ళీ జీవరాసులకు మరో అవకాశం, మరో చిగుర్చిన ఆశ, దయ, జాలి, క్షమ, ప్రేమ, అభిమానం కల జీవరాసులను తయారు చేయటానికి మరో అవతారం ఎత్తాల్సి వస్తుందేమో? అది మళ్ళీ ఎప్పుడో, ఎన్నడో, ఎక్కడో!

('జాతస్య మరణం ధృవే' - శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడితో భగవద్గీతలో)

# నా గురించి

గొప్పగా చెప్పుకోదగ్గవిగా ఏమీలేవుగానీ, నేను ఒక్కటి మాత్రం అలవాటు చేసుకున్నాను, విజ్ఞానపఠనంతో. అందరిలో ఎంతోకొంత మంచి, చెడూ రెండూ ఉంటాయి. చెడును ఎత్తిచూపకుండా, వారిలో ఉండే మంచినే ప్రోత్సహిస్తూ, విమర్శలతో వారి మనస్సును తిరిగి వికలత్వం చెందేట్లు చేసి నిరాశ, నిస్పృహలతో వారిని మిగల్చకుండా, విజ్ఞానం నేర్పిన తెలివితో, విచక్షణతో వారిని తట్టి లేపి, ధైర్యసాహసాలు చెప్పి, ఎప్పుడూ ప్రోత్సహిస్తే, మనిషి సాధించనిదేమీ లేదు. ఈ లోకంలో పుట్టిన ప్రతివాడు ఆశావాది. ఏదో ఒకటి సాధించాలనే తపనతో, ఈ జీవిత నౌకాయానంలో పయనిస్తూ, జయాపజయాలు అందుకుంటూ, లక్ష్యం, పట్టుదల ఉంటే ఏమైనా సాధించవచ్చు.

| | | |
|---|---|---|
| జననం | : | 28 జూలై, 1948 మద్రాసు |
| విద్య | : | మద్రాసు, పూనా, బొంబాయి BSc (Zoology) నుంచి MSc వరకు (Univ. of Bombay)<br>మళ్ళీ మద్రాసులో PhD అనాటమీలో (Univ. of Madras) |
| చదివిన పేపర్లు, | : | 1982 అనాటమికల్ సొసైటీ ఆఫ్ ఇండియా |
| వెళ్ళిన సదస్సులు (రీసెర్చి పోస్టర్లు) | : | 1) లాస్ ఏంజెలిస్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు (1999 & 2000)<br>2) వాషింగ్‌టన్ DC (రెండో సదస్సుకి ఆర్థిక ఇబ్బందుల వలన in absentia రిసెర్చి Poster పంపాను)<br>3) బయాలజీ - టీచర్స్ వర్క్‌షాప్ : P.G. Inst. of Basic Medical Scs, University of Madras. పోర్టబుల్ క్రయోస్టాట్ ఒరిజినల్ తయారి, దాని Demonstration.<br>4) అసోసియేషన్ ఆఫ్ అనాటమిస్ట్, తమిళనాడు ఛాప్టర్ (1988) & (1989) రెండు విడివిడిగా రిసెర్చి పత్రాలు చదివాను. |

5) 10 ఏండ్ల Dedicated సర్వీస్ అనాటమీలో - Gold Medal + Certificate ఇచ్చారు (1996) రామచంద్ర మెడికల్ కాలేజి, మద్రాసులో.

6) కె.బి.తిలక్ దర్శకత్వంలో 'చిట్టి తమ్ముడు' (1962) ఆంగ్ల మూలం : OLIVER TWIST పూర్తి చలన చిత్రంలో హీరోగా చిట్టకమ్ముడి వేషం వేశాను. (Googleలో ఇప్పటికీ freeగా చూడొచ్చు)

7) 'సాహిత్య అకాడమీ' ఢిల్లీ వారు ఈ మధ్యనే నా విజ్ఞాన నేపథ్యం ఒకటి వారి సంకలనం కోసం ఎన్నుకున్నారు. (డా॥ నాగసూరి వేణుగోపాల్‌గారి సౌజన్యం)

8) 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రికలో (1991-1992) చాలా కార్టూన్లు నేను గీచినవి ప్రచురితమయ్యాయి. కథలను పాఠకులు ప్రశంసించారు. ఉత్తరాల శీర్షికలో.

9) ఇంజనీరింగ్ స్టూడెంట్లు నా వద్ద చేసిన ప్రాజెక్టులో రామచంద్ర మెడికల్‌లో 'Small Mammal Restrainer' అనే పరికరాన్ని original designతో చేసిచ్చాను.

10) బెంగుళూరులో స్థిరపడ్డాక, 5 ఏళ్లు BSc (Nursing)కు BSc (Allied Health Scs)కు అనాటమీ పాఠాలు Part time visiting professorగా Hill side college of nursing లోనూ, మరియు Wochard Hospital లోనూ పనిచేశాను. మరో రెండేళ్ళు B.Tech Biotechnology, స్టూడెంట్స్‌కి Applied Biology, Visiting Professorగా (CFAI University) బెంగుళూర్‌లో నేర్పాను.

11) స్కూలు, రామకృష్ణ మిషన్ హైస్కూలు త్యాగరాయనగర్ మద్రాసులో 1 నుంచి 9వ తరగతి వరకు, ఆరవ తరగతి మట్టుకు కేశవ్ మెమోరియల్ మల్టీపర్పస్ హైస్కూల్, నారాయణగూడ హైదరాబాదులో చదివాను (తెలుగు

మీడియం). ఎన్నో Elocutionsలో first prizes గెలుచుకున్నాను.

12) 1964లో ఆంధ్ర యూనివర్శిటీ వారి మెట్రిక్యులేషన్ పాసయ్యాను. (ఇంగ్లీషు మీడియము)

13) Wilson College Bombay లో BSc & MSc లో ఎన్నో ప్రైజులు, Vocal-Music & Oratoryలలో మొదటి ప్రైజులు గెలిచాను.

14) సరదాకి వేసిన Canvas పై Oil Paintings మా ఇంట్లో గోడలకి తగిలించాను.

ఉద్యోగం : అనాటమీ, రామచంద్ర మెడికల్ కాలేజీ, మద్రాసు. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్, డెవలప్‌మెంటల్ & గ్రాస్ హ్యూమన్ అనాటమీ, మెడికల్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికాస్, బెలీజ్ సెంట్రల్ అమెరికాలో.

వివాహం : మద్రాసులో.

శాశ్వత నివాసం : బెంగుళూరు, స్వంత ఇల్లు కట్టుకున్నాక

# తుదిమాట

## శ్రీకృష్ణశరణంమమ

## చిరుదీపం

నాకు సైన్స్- ఫిక్షన్ పేరుతో కాకపోయినా ఆ వస్తువుతో పరిచయం చేసింది "తింగ్స్ టు కమ్" అన్న బ్రిటిష్ సినిమా. 1936లో తయారయిన యీ చిత్రాన్ని నేను చూసింది ఏడేళ్ల వయసులో (1946), ఊటీలో ఆంగ్ల చిత్రాలే ప్రదర్శించే 'అసెంబ్లీ రూమ్స్' అన్న చిత్రప్రదర్శనశాలలో. ఎప్పుడో భవిష్యత్తులో జరుగబోయే కథను అట్టహాసంగా కనులకూ మనసుకూ మిరుమిట్లూ కొలిపేలాగ చిత్రీకరించారు.

అయితే ఆ వయసులో నాకు బోధపడింది చాలా తక్కువ. పదేళ్ల తరువాత నాన్న దగ్గరున్న హెచ్.జి. వెల్స్ సంపుటాల్లో దానినే కాదు ఎన్నో సినిమాలకు అధారభూతమైన 'ది టైమ్ మెషిన్' 'వార్ ఆఫ్ ది వరల్డ్స్' 'ది ఐలెండ్ ఆఫ్ డా॥ మోరో' 'ది ఇన్విసిబిల్ మాన్' 'ఫస్ట్ మెన్ యిన్ ది మూన్' నవలలను చదవటానికి ప్రయత్నించి కొరుకుడు పడక వదిలివేశాను. అయితే ఆ సినిమాలన్నీ యిష్టంతో చూశాను. అప్పటికి సైన్స్-ఫిక్షన్ అంటే ఏమిటో నాకు కాస్త తెలిసివచ్చింది.

నేను బొబ్బిలి వదలక ఉన్న రెండేళ్లలో (1958-60), గొప్ప రచయితల సైన్స్-ఫిక్షన్ ఒక వంద కథలూ, పదో పన్నెండో నవలలూ చదివాను. వీటిలో మూడు విభాగాలుండేవి. విజ్ఞాన శాస్త్రాన్ని ఆధారం చేసుకొని సాగించిన ఊహలు (యిదే సిసలైన సైన్స్-ఫిక్షన్ అని కొందరి వాదన) సూపర్ నాచురల్ కథలు, అంటే దయ్యాలు, ప్రేతాత్మలు ప్రముఖ పాత్ర వహించేవి. ఫాంటసీలు అంటే మన జానపద చిత్రాల కథల్లాంటివి. వీటిని వేరుపరచే లక్ష్మణరేఖ అన్నిటా స్పష్టంగా వుండేది కాదు. అయితేనేం యీ కోవకు చెందిన ఎందరివో రచనలు లక్షలాది పఠితలను ఆకర్షించాయి.

ఒక వింత: మొట్టమొదటి ప్రఖ్యాత రోబో కథ, ఒక స్త్రీ రచన మేరీ షెల్లీ (1797-1851) 'ఫ్రాంకెన్ స్టీన్' రెండువందల సంవత్సరాల పూర్వం వ్రాసినది.

ఆ తరువాత ఎందరో మహానుభావులు మామూలు సాహిత్య సేద్యం చేస్తూనే యిటువంటి రచనలు కావించారు. ఎడ్గర్ అలెన్ పో, ఆర్థర్ కానన్ డాయెల్ (ప్రఖ్యాత పత్తేదారు హోమ్స్ స్రష్ట) ఐసాక్ అసిమోవ్, ఎ.హైన్‌లైన్, రే బ్రాడ్‌బరీ, జార్జి ఆర్వెల్, ఎ.ఇ.వాన్ వాట్, పోల్ ఎండ్ కార్న్‌బ్లుత్ వారిలో కొందరు. మరొక వింత! యిలాంటి రచనలు చేసిన వారిలో స్త్రీలున్నట్లు నేనెరగను.

ఈపాటికి నాకు వారి ఆలోచనలు మరికాస్త అర్థమై ఒక విధమైన మత్తులోనికి దించేవి. వీరిలో ఆధ్యాత్మికతను ప్రస్ఫుటంగా కాకపోయినా, చాపకింద నీరులా ప్రవేశపెట్టింది అల్డస్ హక్స్‌లీ, 'ఆఫ్టర్ మెనీ ఎ సమ్మర్ డైస్ ది స్వాన్' (1894-1963), ఆర్థర్ సి. క్లార్క్ (1917-2008). స్టాన్లీ కుబ్రిక్ అన్న హాలివుడ్ దర్శక-నిర్మాతతో కలిసి క్లార్క్ కథనంతో నిర్మించిన "2001; ఎ స్పేస్ అడిస్సీ" (1968) పానావిజన్ దిగ్భ్రమ కల్గించిన చిత్రం. అయిదుమార్లు చూసినా అర్థం అయీ కానట్లుఉండే యీ చిత్రం అన్నివిధాల అపురూపమైనది. ఇందులో సైన్స్-ఫిక్షన్, సూపర్ నేచురల్, ఫాంటసీ మూడు త్రివేణీ సంగమమై చూసేవారిని పునీతులనూ పులకాంకితులనూ చేసింది. నేను మొదటిమారు మద్రాసు ఆనంద్ థియేటర్‌లో చూసి, కార్‌పార్క్‌లో వున్న కారెక్కి ఒక పదినిమిషాలు కదలకుండా ఉండిపోయాను. ఒక మహాత్ముడు, మేధావి అయిన వక్త భగవద్గీతనో, గీతగోవిందాన్నో, మీరా తత్త్వాన్నో విశదీకరించినట్లు అనిపించింది. ఈ కోవకు చెందినవే "ది ఇండిపెండెన్స్ డే" (1996), యిటీవల "అవతార్" (2009). ఈ చివరి చిత్రం ప్రకృతినీ, ప్రాణికోటినీ, పరమాత్మణ్ణీ, ఒకదానిపై ఒకటి ఆధారపడినట్లు సూచించింది. వీటిలో ఉన్న అన్ని అంశాలూ కొద్దిగానో, గొప్పగానో డా॥ పక్కలంక రమణ కథల్లో వున్నవి. కొన్నిచోట్ల యిచ్చిన వివరణ కుదించవచ్చుననిపించింది. ఇచ్చిన వివరణకూ రాబోయే కథాంశానికీ లంకె వుంటే అలా అనిపించదు. అయితే ప్రతికథలోను ఒక కొత్త విషయాన్ని చెప్పడమో, పాత విషయాన్నే కొత్తగా విప్పడమో ఉంది. ఒక విధంగా వాదించవచ్చు "ఇవన్నీ మన పురాణాలలోవే. ఎందరెక్కినా పట్టే పుష్పక విమానం, పగతురను చంపి తిరిగి వచ్చే శస్త్రాస్త్రాలు, నీడను పట్టి ఆకర్షించే రాక్షస శక్తులు యివన్నీ సైన్స్-ఫిక్షన్ కదా?" అంటే దానికి తార్కికమైన జవాబు లేదు.

అయితే యీ అంశాలనే వర్తమానంలోనో భవిష్యత్తులోనో ఉన్నట్లు కథ నడిపిస్తే అది ఆధునిక సైన్స్-ఫిక్షనే. ఆ దృష్టితో చూస్తే డా॥ రమణ కథలు చదవదగ్గవీ. నలుగురితో చెప్పి చదివించదగ్గవి.

అవి ఎలాంటివో మనం యిప్పుడే చెప్పుకోగలం. అవి ఎంతటివో కాలమే నిర్ణయించాలి. భవభూతి ఉత్తర రామచరితలో అన్నట్లు 'కాలోహ్యయం నిరవధిః విపులాచ పృథ్వీ!'

- వి.ఎ.కె. రంగారావు

13.6.2015

రామమహల్, 36 పైక్రాఫ్ట్సు గార్డెన్స్, మద్రాసు 600006
సెల్: 94447 34024(త.నా), 99511 68911(ఆం.ప్ర)

Blank page

162



## డా॥ వక్కలంక వెంకటరమణ

# విజ్ఞాన నేపథ్య గాథలు

నా గురించి చెప్పుకోదగ్గవిగా ఏమీలేవుగానీ, విజ్ఞాన పఠనంతో ఒక్కటి మాత్రం అలవాటు చేసుకున్నాను. అందరిలో ఎంతోకొంత మంచి, చెడూ రెండూ ఉంటాయి. చెడును ఎత్తిచూపకుండా, వారిలో ఉండే మంచినే ప్రోత్సహిస్తూ, విమర్శలతో వారి మనస్సును తిరిగి వికలత్వం చెందేట్లు చేసి నిరాశ, నిస్పృహలతో వారిని మిగల్చకుండా, విజ్ఞానం నేర్పిన తెలివితో, విచక్షణతో వారిని తట్టి లేపి, ధైర్యసాహసాలు చెప్పి, ఎప్పుడూ ప్రోత్సహిస్తే, మనిషి సాధించనిదేమీ లేదు. ఈ లోకంలో పుట్టిన ప్రతివాడు ఆశావాది. ఏదో ఒకటి సాధించాలనే తపనతో, ఈ జీవిత నౌకాయానంలో పయనిస్తూ, జయాపజయాలు అందుకుంటూ లక్ష్యం, పట్టుదల ఉంటే ఏమైనా సాధించవచ్చు.

₹ 60/-

SPO021